# అణచివేత - అణచివేత చట్టాలు

కె. బాలగోపాల్



# అణచివేత

## అణచివేత చట్టాలు



**కె. బాలగోపాల్**

**మానవహక్కుల వేదిక ప్రచురణ**

"రాజ్య యంత్రాంగం హింసా ప్రవృత్తిలో వస్తున్న ఈ మార్పులన్నీ స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో సంభవించిన ఒక్కొక్క సంక్షోభానికీ సంకేతాలు. ప్రతి సంక్షోభం ప్రజా ఉద్యమాలకూ తిరుగుబాట్లకూ దారితీస్తుంది. వాటిని అణచడానికి రాజ్య యంత్రాంగం అనేక అణచివేత చర్యలు చేపడుతుంది. వాటి ఫలితంగా త్వరలోనే 'శాంతి' నెలకొంటుంది. సమస్య పైకి పరిష్కారం అయినట్టే కనబడుతుంది. అయితే అంతా అయిపోయి అలలు వెనక్కి మళ్ళిన తరువాత ఉప్పెనకు గుర్తుగా రెండు విషయాలు మిగిలిపోతాయి. ఒకటి, సమస్యకు 'మూలకారణం' అయిన సంక్షోభం. ఈ సంక్షోభం సాధారణంగా అపరిష్కృతంగా ఉండిపోతుంది. రెండవది, పెరిగిన అణచివేత యంత్రాంగం. సమస్య వివరాలన్నీ అందరూ మరిచిపోయిన తరువాత చాలా కాలం దాకా కూడ ఈ సమస్యను పరిష్కరించే పేరుతో రాజ్య యంత్రాంగం అలవర్చుకున్న దురలవాట్లూ, దుష్ట శాసనాలూ మిగిలిపోతాయి. ఎమర్జెన్సీ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ సంవత్సరన్నర కాలంలో పోలీసులు నేర్చుకున్న కొత్త అణచివేత పద్ధతులూ, అణచివేత సంస్కృతీ ఎమర్జెన్సీని ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని 'పునరుద్ధరించిన' ఇన్నేళ్ళ తర్వాత కూడ కొనసాగుతూనే వున్నాయి. సామాజిక జీవితంలో పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున జోక్యం చేసుకోవడం ఆ కాలంలోనే మొదలయింది."

**– కె. బాలగోపాల్**

# అణచివేత - అణచివేత చట్టాలు

మానవహక్కుల వేదిక ప్రచురణ

**Human Rights Forum Publication**

ప్రచురణ సంఖ్య: 47

ప్రచురణ కాలం : డిసెంబర్ 2019

వెల : 130 రూపాయలు

కవర్ డిజైన్ : జుగాష్ విలి

**ముద్రణ :**

అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 233041941
Email: anupamaprinters@yahoo.co.in

**ప్రతులకు:**

ఎస్. జీవన్ కుమార్
సెల్ : 9848986286
Email: kumjeevan@gmail.com

వి. వసంతలక్ష్మి
ఫోన్ : 040-23537969
Email: vasantha.aj@gmail.com

**నవోదయ, నవ తెలంగాణ, ప్రజాశక్తి, అనేక బుక్‌హౌస్‌లు**

మా వెబ్‌సైట్: www.humanrightsforum.org

బాలగోపాల్ రచనల కోసం : www.balagopal.org

# మా మాట

**పో**లీసు యంత్రాంగం ప్రజల శాంతి భద్రతలను కాపాడడం కోసం ఏర్పాటయిందనే భ్రమలు ఇంకా ఎవరికైనా ఉంటే (దురదృష్టవశాత్తూ చాలామందికే ఉంటాయి) వాటిని పటాపంచలు చేస్తుంది ఈ పుస్తకం. సాధారణ పరిస్థితులలో ఈ భ్రమలకు కొంతైనా ఆస్కారం ఉందేమో గాని (పాలకుల) సంక్షోభ సమయాలలో మాత్రం వారు పూర్తిగా అవతలి పక్షం వైపే ఉంటారని తేటతెల్లం చేస్తుంది ఈ పుస్తకం. ఒక్క పోలీసు యంత్రాంగమే కాదు ఆ పరిస్థితి వచ్చినప్పుడు శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ కూడా వారికి తమ వంతు సహకారాన్ని ఎలా అందిస్తాయో వివరిస్తుందీ పుస్తకం. మొదటిది అణచివేత రూపంలో, రెండోది అణచివేత చట్టాల రూపంలో మన అనుభవంలోకి వస్తాయి. అందుకే రెండు రకాల అణచివేతలనూ కలిపి 'అణచివేత – అణచివేత చట్టాలు' పేరుతో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చాం.

బాలగోపాల్‌గారు చాలా విరివిగా రాసిన అంశాలలో పోలీసు అణచివేత కూడా ఒకటి. పోలీసు యంత్రాంగం 'స్వాభావికం'గా పాల్పడే అణచివేతతో పాటు ఆ అణచివేతకు ఎప్పటికప్పుడు కొత్త కొమ్ములు, కోరలు సమకూర్చి పెట్టే టాడా, పోటా, అఫ్సా వంటి చట్టాల గురించి ఆయన 1984–2009 మధ్య రాసిన వ్యాసాలివి. అంటే పాతికేళ్ళ కృషి. ఆ కాలంలో పౌర, మానవహక్కుల నేతగా ఆయన వేటినైతే నిత్యం చూస్తూ, పరిశీలిస్తూ, విశ్లేషిస్తూ వచ్చారో ఆ అనుభవ సారాన్ని ప్రతిఫలించే కృషి.

ఈ పుస్తకాన్ని మూడు భాగాలు చేసి పోలీసుల అణచివేత స్వభావాన్ని వివరించే వ్యాసాలను ఒక భాగంగా, నిర్బంధాలు, నిషేధాలపై రాసిన వ్యాసాలను రెండో భాగంగా, పోలీసులకు విచ్చలవిడి బలప్రయోగ అధికారాలను కట్టబెట్టే చట్టాలలోని 'అన్యాయమైన' నియమ నిబంధనల గురించి రాసిన వ్యాసాలను మూడో భాగంగా వర్గీకరించాం. ఈ మూడో భాగంలో మళ్ళీ టాడా, సంఘటిత నేరాల నియంత్రణ చట్టం, పోటో – పోటా, సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం, టెర్రరిస్టు చట్టాలకు సంబంధించిన వ్యాసాలను విడివిడిగా ఇచ్చాం. ఒక్క 'టాడా' గురించే ఇందులో ఐదు వ్యాసాలున్నా అన్నీ వేరు వేరు సందర్భాలలో రాసినవి. ఆ చట్టం ఇంకా మనుగడలో ఉందా

రూపంలో ఉన్నప్పుడు, చట్టం వచ్చాక, రద్దయి తిరిగి వచ్చాక, జీవన్‌రెడ్డి వంటి పేరున్న (రిటైర్డ్) న్యాయమూర్తి ఛైర్మన్‌గా ఉన్న లా కమిషన్ సైతం దానిలో మరింత కఠినమైన నిబంధనలు చేర్చినప్పుడు...ఇలా వివిధ సందర్భాలలో రాసినవి. 'టాడా' రద్దయినా దానిలోని నిబంధనలేవీ రద్దు కాకుండా ఎలా ఆ తర్వాత వచ్చిన అన్ని అణచివేత చట్టాలలోకీ అవి భద్రంగా మోసుకు పోబడ్డాయో ఆయన సవివరంగా తెలియజేశారు. ఈ చట్టాలను వ్యతిరేకించకపోతే, అడ్డుకోకపోతే ఎంత తీవ్ర నష్టం జరుగుతుందో కూడా ఆయన పలు చోట్ల హెచ్చరిస్తారు. "భూసారాన్ని ధ్వంసం చేస్తే తిరిగి పెంపొందించడం ఎంత కష్టమో నాగరికతాసారాన్ని నాశనం చేస్తే తిరిగి సాధించడం అంతకంటే కష్టం" అనే వాక్యం మనను ఎల్లప్పుడూ వెంటాడాల్సిన హెచ్చరిక.

ఇవ్వాళ 'దిశ' అత్యాచార హంతకుల ఎన్‌కౌంటర్ విషయంలో పోలీసులకు లభిస్తున్న ప్రశంసలు, సామాజిక ఆమోదం చూసినపుడు కూడా బాలగోపాల్‌గారు గుర్తుకు రాక మానరు. "ప్రభుత్వ హింసకొక సాధికారత స్వతహాగా ఉండడం అనేది ప్రభుత్వం లేక రాజ్యం అనే భావాన్ని అంటిపెట్టుకుని ఉండే భావజాలంలో ఒక ముఖ్యమైన అంశం. ఈ భావజాలం అన్ని సమాజాలలోనూ ఉంది గానీ హైందవ సంస్కృతిలో దీని పాలు కొంచెం ఎక్కువ. హింస క్షాత్ర ధర్మం అనే సంప్రదాయ భావన ఆధునిక కాలంలో ప్రభుత్వాల వైపు నుండి జరిగే విచ్చలవిడి హింసాకాండకు సహితం సమాజంలో ఆమోదం తెచ్చి పెడుతున్నది. అహింసనొక ముఖ్యమైన విలువగా స్వీకరించిన గాంధీ వంటి వ్యక్తి రాజ్యహింస పట్ల మెతక వైఖరి కలిగి ఉండటానికి వర్ణ ధర్మం ఆయన ప్రాపంచిక దృక్పథంలో ఒక ముఖ్యమైన భాగం కావడం కారణం" అంటారు ఆయనొక చోట. 'దిశ' ఉదంతంలో పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్‌కు అత్యధికుల ఆమోదం బహుశా ఆ వర్ణధర్మం నుండే వచ్చిందని మనం అర్థం చేసుకోవాలేమో!

ప్రజాస్వామ్యాన్ని బాలగోపాల్‌గారు ఉన్నత నాగరికతా విలువల సమాహారంగా చూశారు. అందుకే అలసత్వంతోనో, అవగాహనా లేమితోనో, సంకుచిత ప్రయోజనాల కోసమో దాన్ని మనం చేజేతులా ధ్వంసం చేసుకోకూడదని ఆయన అంతగా ఆరాటపడ్డారు. ఈ కృషి కొనసాగించాల్సిన బాధ్యత ఇప్పుడు మనందరి మీదా ఉంది.

**మానవహక్కుల వేదిక**
**7 డిసెంబరు 2019**

# ఇందులో...


1. పోలీసు రాజ్యంలో సామాజిక విలువలు ..................................... 9
2. భారతదేశంలో పోలీసు పాలన ..................................... 20
3. మిలిటెన్సీకి తప్పుడు భాష్యం ..................................... 32
4. పోలీసుమయమైన పాలనా సంస్కృతి ..................................... 43
5. టెర్రరిజం – దాని మూలం ..................................... 47
6. తుపాకీ రాజ్యం : నిర్బంధంపై నివేదిక ..................................... 52
7. రాజకీయ ఉద్యమాల నిషేధాన్ని వ్యతిరేకిద్దాం..................................... 69
8. పౌరహత్యలు – పోలీసుల సంస్కృతి ..................................... 77
9. పీపుల్స్‌వార్‌పై నిషేధాన్ని నిరసిద్దాం..................................... 84
10. ఈ నిషేధాల నుంచి విముక్తి ఎప్పుడు?..................................... 88
11. 'టాడా' రద్దు కోసం ఉద్యమిద్దాం రండి..................................... 92
12. టాడాను ఎందుకు వ్యతిరేకించాలి?..................................... 98
13. మళ్ళీ వస్తున్న 'టెర్రరిస్ట్' చట్టం ..................................... 112
14. కొత్త టాడా చట్టాన్ని కూడ వ్యతిరేకిద్దాం ..................................... 117

15. అన్యాయమైన లా కమిషన్ ఆలోచనలు ...................................... 122
16. 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టాన్ని
సంఘటితంగానే ఎదుర్కొందాం! .......................................... 142
17. ఆ 'నేరస్తుల' గురించి రాయడమూ నేరమే ................................ 146
18. సంఘటిత నేరాలు–సహజ న్యాయసూత్రాలు................................ 150
19. 'పోటో'ను ఇప్పుడే ఎందుకు జారీ చేశారు? ............................... 157
20. ప్రశ్నించే హక్కును కాపాడుకుందాం ........................................ 162
21. అభిప్రాయ స్వేచ్ఛపైన దాడి 'పోటో' ........................................ 166
22. రాజకీయ స్వేచ్ఛ పత్రికలకు వుంటే చాలునా?........................... 173
23. ఊహాత్మక ఆందోళన కాదు ................................................... 177
24. 'పోటా' రద్దు కోసం ఉద్యమిద్దాం రండి.................................... 180
25. 'పోటా' రద్దు ఉద్యమం – దాని కర్తవ్యాలు ................................ 184
26. సైనిక చట్టమే కాదు సైనిక పాలనా పోవాలి ............................. 189
27. అఫ్సా : జీవన్‌రెడ్డి కమిటీ నివేదికలో ఏముంది? ........................ 195
28. డా॥ హనీఫ్ ఉదంతం నుండి అయినా
టెర్రరిస్టు చట్టాల చేటును గుర్తిస్తామా? ....................................... 209
29. టెర్రరిజంకు చట్టాలే పరిష్కారమా? ........................................ 214

# I. పోలీసు సంస్కృతి

## పోలీసు రాజ్యంలో సామాజిక విలువలు

**మా**నవ సమాజం కాలక్రమంలో సంకీర్ణమవుతుంది. శ్రమలోనూ ఉత్పత్తిలోనూ వైవిధ్యం పెరిగే కొద్దీ కొత్త కొత్త విలువలూ, ఆదర్శాలూ, సంప్రదాయాలూ, ఆచారాలూ పుట్టుకొస్తాయి. కొత్త సామాజిక సంప్రదాయం ఏదయినా అప్పటి ఒక వర్గం అవసరాలను సాధించడానికే పుడుతుంది. కాని ఈ సంకుచితమైన ప్రయోజనంతో పాటు ఒక విలువనూ ఆదర్శాన్నీ కూడ అది చరిత్రలోకి తీసుకొస్తుంది. పశువులను చంపి తినడం కోసం పోషించిన దశను దాటి, పశువులను పాడి కోసం వ్యవసాయం కోసం పోషించిన దశ వచ్చేసరికి 'గొడ్లను చంపడం పాపం' అనే ఆచారం పుట్టుకొచ్చింది. ఇది వ్యవసాయదారుల అవసరాలను కాపాడే ఆచారమే, కాని దీనితోబాటు చరిత్రలోకి 'జీవహింస తప్పు' అనే అస్పష్టమైన విలువ పుట్టుకొచ్చింది. రాజుల నిరంకుశత్వం యూరప్‌లో వ్యాపార వర్గాల విస్తరణకు అవరోధమయి వాళ్ళ అవసరాలను తీర్చడం కోసం ఎన్నికలూ పార్లమెంటులూ పుట్టుకొచ్చాయి. అయితే వాటితోబాటు ప్రాతినిధ్యపాలన అనే విలువ చరిత్రలోకి వచ్చింది. పరిపాలన అనేది ఉన్నంతకాలం పరిపాలించే వాళ్ళను ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉండాలనే భావన వచ్చింది. కాలక్రమంలో సంకుచిత వర్గ ప్రయోజనానికి కాలం చెల్లిపోతుంది, ఎందుకంటే ఆ సంప్రదాయం ప్రగతికి ప్రతిబంధకం అవుతుంది. కాని ఆ విలువలు మాత్రం పరిణత రూపంలో నిలిచిపోయి కొత్త వ్యవస్థలో కొత్త అవసరాలను తీర్చగల సంప్రదాయాలను సృష్టిస్తాయి. వ్యవస్థలు నశిస్తాయి, సంప్రదాయాలు నశిస్తాయి కాని వాటితో పుట్టిన

మానవ విలువలు మాత్రం నిత్యం కొత్త సంప్రదాయాల రూపం తీసుకుంటాయేగాని ఒకంతట నాశనం కావు. ఉపరితలం మేరకు ఇదే నాగరికత ప్రగతిగా మనకు కనిపిస్తుంది. ఉత్పత్తి పద్ధతులు ఏ విధంగానయితే పాతను కొత్తలో నిక్షిప్తం చేసుకుంటూ శాఖోపశాఖలుగా చీలుతూ విస్తరిస్తాయో, దాని ప్రతిబింబమయిన విలువలు కూడ అంతే. ఐదు వేల సంవత్సరాల నాగరికతా చరిత్ర క్రమంలో పోగయిన విలువలు, వాటిని నిక్షిప్తం చేసుకున్న సంప్రదాయాల సంకీర్ణమయిన కలయికే ఆధునిక సంస్కృతి. ఆధునిక సంస్కృతిలోని ఈ విలువలూ, సాంప్రదాయాలూ మూలంలో ఎంత ప్రాచీనమైనవి అయినా వాటికి ఆధునిక వర్గ స్వభావం ఉంటుంది. అయితే ఈ సంకీర్ణతలోని ఒక అంశం ఏమిటంటే ఆ వర్గ స్వభావం అంతిమ విశ్లేషణలోని స్వభావం మాత్రమే. అంటే, అంతా బాగున్నప్పుడు ఎంతో విశ్లేషిస్తే తప్ప ఆ వర్గ స్వభావం పైకి కనిపించదు. ఆ విలువలకూ సాంప్రదాయాలకూ స్వయం ప్రతిపత్తి ఉన్నట్టు తోస్తుంది. శ్రమలోనూ ఉత్పత్తిలోనూ వినిమయంలోనూ వైవిధ్యం పెరిగేకొద్దీ ప్రతి విషయానికీ సాపేక్షిక స్వయం ప్రతిపత్తి పెరుగుతుంది. కాని సంక్షోభం తీవ్రమయి వర్గపోరాటం ప్రత్యక్షమయినప్పుడు ఆ స్వయం ప్రతిపత్తి నాశనమయి ఆ విలువలూ సంప్రదాయాలూ తమ ఆధునిక వర్గ స్వభావాన్ని కనబరుస్తాయి. పాలక వర్గాల అవసరాలను తీర్చగల రూపాన్ని తీసుకుంటాయి. అది సాధ్యం కానప్పుడు తాము నాశనమయిపోతాయి. సంక్షోభంలో అన్నీ కూడ ప్రజల వైపో ఫాసిజం వైపో నిలవాలి. లేకపోతే తమ్ము తాము అభావం చేసుకోవాలి. సంక్షోభాలు అనివార్యం అని మార్క్సిజం సైద్ధాంతికంగా రుజువు చేసినట్టే సంక్షోభాలు అనుభవాత్మకంగా మార్క్సిజాన్ని రుజువు చేస్తాయి. "నా వర్గ స్వభావం ఏమిటో చెప్పమ"ని సవాలు చేసినవన్నీ కూడ సంక్షోభ సమయంలో తమ వర్గ స్వభావాన్ని తామే చూపుతాయి. అవసరమయితే అందుకోసం తమ మానవీయ అంశను అభావం చేసుకొని మరీ చూపుతాయి.

'గురుసాక్షాత్ పరబ్రహ్మ' అని చిన్నప్పుడు అందరం వల్లెవేసాము. విద్య పవిత్రమయినది, విద్యాలయాలు పవిత్ర స్థలాలు అనే విలువలు ఫ్యూడల్ సంస్కృతిలో భాగం. చారిత్రకంగా అవి బ్రాహ్మణాధిక్యతను, ఫ్యూడల్ వ్యవస్థకు ఆవశ్యకమయిన అజ్ఞానాన్ని నిలబెట్టడానికి పనికివచ్చాయి. కాని ఆ వ్యవస్థ చాలావరకు నాశనమయిపోయిన తరువాత కూడ విజ్ఞానం ఆదరణీయమనే విలువ మిగిలిపోయింది.

అంతే కాదు, ఈ విలువ మహోన్నతంగాను తటస్థంగాను కనిపిస్తుంది. విజ్ఞానం కోసం జీవించే వాళ్ళు తమకు ఏ వర్గ స్వభావం లేదనీ, తాము సామాజిక సంక్షోభాలకు అతీతులమనీ, తమ జీవితం మార్క్సిజానికి అపవాదమనీ మిడిసిపడతారు. అవునేమోనని మనకు కూడ అనిపిస్తుంది సామాజిక సంక్షోభం తీవ్రమయ్యే వరకు. సంక్షోభం తీవ్రమయి వ్యవస్థను సమూలంగా నాశనం చేయగల రాజకీయం కళాశాలలలోకి ప్రవేశించి వ్యాపించడం మొదలుపెడితే 'విద్య పవిత్రం' అనే భావానికి అర్థమే మారిపోతుంది. విద్యాలయాలు పాఠ్యపుస్తకాల విజ్ఞానానికి మాత్రమే పరిమితం కావాలి తప్ప అక్కడికి రాజకీయాలు ప్రవేశించకూడదు అనే అర్థం పుట్టుకొస్తుంది. ఒక్కసారిగా ఆ మహోన్నతమయిన విలువ ఫాసిస్టు కంపు కొట్టటం మొదలుపెడుతుంది. పాఠ్యపుస్తకాలు మాత్రమే ఎందుకు పవిత్రం, రాజకీయాలు ఎందుకు అపవిత్రం అని ప్రశ్నించకండి. ఫాసిజానికి విశ్వాసమే తప్ప తర్కంతో పని లేదు. విజ్ఞానాన్ని గౌరవించడం అనే సార్వత్రికమయిన విలువ నిర్దిష్ట సమాజంలో నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్ట రూపం తీసుకోక తప్పదు. ఆ రూపాన్ని తర్కంతో ఎదుర్కోగలమని భావించడం హేతువాదుల భ్రమ.

అప్పుడిక పోలీసులు విద్యాలయాలలోకి ప్రవేశించి విద్యార్థులను చితకబాది పట్టుకుపోతుంటే 'సాక్షాత్ పరబ్రహ్మ' లయిన గురువులు నోరు మెదపరు. ఎందుకని అడగకండి. మీరు అంతవరకు విద్వత్సంపన్నులని ఎంతగానో గౌరవించిన వారి నోటి నుంచి వింతవాదనలు బయటికొస్తాయి. "తీవ్రవాద రాజకీయాలతో విద్యాలయాలను కలుషితం చేసిన తరువాత పోలీసులు రావడం అనివార్యం" అంటారు. తీవ్రవాదమో మితవాదమో అవి రాజకీయ విజ్ఞానంలో భాగమే గాని లాఠీలు కావని వాదించి ప్రయోజనం లేదు. మీరిప్పుడు తటస్థమయిన జిజ్ఞాసతో మాట్లాడడం లేదు. సంక్షోభం మందకొడిగా వున్నప్పుడు ఆకాశమార్గంలో అన్నిటికీ అతీతంగా వున్నట్టు కనబడుతూ విహరించిన జిజ్ఞాస ఇప్పుడు సంక్షోభం తాకిడికి నేలరాలింది. ఇప్పుడది రాజకీయాన్ని కూడ విద్యలో భాగంగా గుర్తించదు. ఇది దాని నిర్దిష్ట రూపం.

కళాశాల ఆవరణలో పోలీసుల దౌర్జన్యాన్ని ఉపేక్షించడం మాత్రమే కాదు. విద్య పవిత్రం అనే భావన తన్ను తాను అభావం చేసుకోవడం అంతకు ముందే ప్రారంభమవుతుంది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తన విద్యార్థులు

కళాశాల మేగజైన్ కోసం ఎంపిక చేసిన 20 వ్యాసాలూ, కవితలూ వగైరా అంశాలలో అయిదింటిని మాత్రమే ఆమోదించాడు. అవి మాత్రమే సాంకేతిక విజ్ఞానానికీ ఇతర ఆమోదనీయమయిన విషయాలకూ సంబంధించినవనీ, తక్కినవన్నీ 'రాజకీయ' విషయాలనీ ఆయన అభ్యంతరం తెలిపారు. విజ్ఞాన కాంక్షకు ఇంతకు మించిన అభాస రూపం మరొకటి ఉండదు. ఇంత పని చేసిన తరువాత ఆయన తన కాలేజీకి పోలీసులను పిలిపించి పిల్లలను పట్టించినా, క్యాంపు పెట్టించి కొట్టించినా, పోలీసులు తెల్లబట్టలతో రూము రూముకూ తిరిగి పిల్లలను బెదిరించినా, రాత్రిపూట మట్వాడ యస్.ఐ. హాస్టల్ బోర్డర్లందరినీ ఒక గదిలో కూర్చోబెట్టి వాళ్ళకు రాజకీయ పాఠాలు చెప్పినా, ఆశ్చర్యం ఏముంది? గురువులు పోలీసుల పనిచేస్తే పోలీసులు గురువులు కాకుండా ఏమవుతారు?

తానే పోలీసు భారం మీద వేసుకొని వ్యాసాలనూ కవితలనూ సెన్సార్ చేయడం మొదటిమెట్టు. ఆ పని పోలీసులకే అప్పజెప్పడం రెండవమెట్టు. కవితలూ వ్యాసాలూ మాత్రమే కాదు, ఉపన్యాసాలను కూడ పోలీసులు సెన్సార్ చేస్తారు. ఒక సంవత్సరంగా వరంగల్‌లో ఏ కళాశాలలో నయినా ఎవరు ఉపన్యాసం ఇవ్వాలన్నా దానికి పోలీసుల అనుమతి ఉండాలి. అనుమతి లేకుండా సమావేశం జరుపుకోదల్చుకుంటే సెక్షన్ 144 ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. కాలేజీ మేగజైన్‌లో 'అభ్యంతరకరమయిన' విషయాలున్నాయని టవున్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రకటిస్తే యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆ మేగజైన్ ముద్రణ ఆపిస్తాడు. సమావేశాలకు మీ అనుమతి ఎందుకనిగాని, 'అభ్యంతర కరమయిన' విషయాలంటే అర్థమేమిటనిగాని ఆయన ప్రశ్నించడు. విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని ఠాణాలలో తాకట్టుపెట్టి జమేదార్ పని చేస్తున్నారు, ప్రిన్సిపాల్స్ వి.సి.లు. ఇప్పుడు ఆ జమేదార్ హోదా నుండి ప్రమోషన్ కోరుతూ తమకే మేజిస్టేరియల్ అధికారాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారట. విద్యాలయాలను పోలీసులకయినా అప్పజెప్పాలి, లేదా తామే పోలీసులయినా కావాలి – 'విద్యాలయాలు పవిత్ర స్థలాలు' అనే విలువను వదిలి మనం ఇవ్వాళ చాలా దూరం వచ్చాము.

అయితే మనం తీసుకునే ఏ చర్యకయినా దాని తర్కం, గతితర్కం దానికుంటాయి. ఒక పని చేసేంత వరకే మన ఇష్టం. తరువాత పర్యవసానాలు మన ఇష్టాయిష్టాల మీద ఎంత ఆధారపడి ఉంటాయో వాటి స్వాభావిక (సామాజిక) క్రమం

మీద అంత ఆధారపడి ఉంటాయి. పంతుళ్లు పోలీసుల పనీ, పోలీసులు పంతుళ్ల పనీ చేయడం మొదలుపెట్టిన తరువాత ఈ పరకాయ ప్రవేశానికి (లేక పరస్పరకాయ ప్రవేశానికి) స్వాభావికమయిన గతితర్కం పనిచేయడం మొదలుపెడుతుంది. మామూలుగా మేధావులకు పోలీసు యంత్రాంగం అంటే ఎంత హీనభావం ఉంటుందో ఇప్పుడు ఈ తలక్రిందుల పరిస్థితిలో పోలీసులకు మేధావులంటే అంత హీనభావం పుడుతుంది. పోలీసు యంత్రాంగం మీద సెమినార్ నిర్వహించమని మేధావులను పురమాయించి మాజీ ఐజిపి రాంచంద్రారెడ్డి ఆ మేధావుల సమీక్షకు ముగింపు మాటలు పలుకుతాడు. హేయంగా మాట్లాడతాడు. మనసులో గింజుకోవడం, భుజాలు తడుముకోవడం తప్ప ఆ మేధావులు చేయగలిగింది ఏమీ లేదు. హనుమకొండ ఎస్.ఐ. తన ఠాణా పక్కనే వున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి నిత్యం నిరాటంకంగా జొరబడి ప్రిన్సిపాల్ గదిలోకి లాఠీ ఊపుకుంటూ పోయి, అటెండర్‌ను పంపి విద్యార్థి నాయకులను పిలిపించి ప్రిన్సిపాల్ సమక్షంలోనే వాళ్లను బూతులు తిడతాడు. 'శాంతిభద్రతలను' ఈ విధంగా కూడ కాపాడవచ్చునని ఆయనగారి నమ్మిక. చెవులు మూసుకోవడం, తల చేతులలో పట్టుకోవడం వినా ఆ ప్రిన్సిపాల్ దౌర్భాగ్యుడు చేయగలిగింది ఏమీలేదు. కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో ఎన్నికల ప్రచారం నిమిత్తం తిరుగుతున్న ఒక అమ్మాయిని పోలీసులు పట్టుకుపోతారు. అవుట్ పోస్టులో ఆమెను కొడతారు. బూటుకాలుతో పాదాలను తొక్కుతారు. ప్రిన్సిపాల్ ఫోన్ చేసి ఆ అమ్మాయి చేసిన నేరం ఏమిటని ప్రశ్నిస్తే "ఆమె సాయం కళాశాల విద్యార్థిని కాబట్టి నీకు అనవసరం పొమ్మం"టారు. అధికారానికి 'జూరిస్డిక్షన్' ఉంటుంది కాని మానవత్వానికీ ప్రజాస్వామ్యానికీ 'జూరిస్డిక్షన్' ఉండదు. అవి సార్వత్రికం, సార్వకాలికం, సార్వజనీనం. ఇది మామూలు పరిస్థితి. మానవత్వమూ ప్రజాస్వామ్యమూ అనేవి వర్గపోరాటానికి అతీతంగా ఉంటాయనుకునే పరిస్థితి. కాని సంక్షోభ సమయంలో పోలీసులకూ అధికారులకూ 'జూరిస్డిక్షన్' ఉండదు. జిల్లా కలెక్టర్ జిల్లా పాలనా వ్యవహారాల నిర్వహణ వదిలిపెట్టి నక్సలైట్లను అణిచేస్తానని పబ్లిగ్గా ఉపన్యసిస్తాడు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఇంటరాగేషన్ చేస్తాడు. రూరల్ డి.ఎస్.పి. టౌన్‌లో లాఠీచార్జి చేయిస్తాడు. పోలీసులు నీతి గురించి బోధిస్తారు. "వాళ్లకు ఆ హక్కు ఉన్నదట" అని పిహెచ్.డి పట్టభద్రులయిన మేధావులు విస్మయపోతారు. అదే సమయంలో మానవత్వానికి, ప్రజాస్వామ్యానికి 'జూరిస్డిక్షన్' ఏర్పడుతుంది. నన్ను నలుగురిలో

చావబాదుతుంటే ప్రశ్నించడానికి నీకు సాటి మానవుడివన్న అర్హత చాలదు. నువ్వు నా అన్నవా? తల్లివా? తండ్రివా? నేను చదువుకునే కాలేజి ప్రిన్సిపాల్‌వా? ఏదీ కాకపోతే "నీది నువ్వు కడుక్కోమ్మ"ని అమర్యాదగా సమాధానం వస్తుంది. మన్నించకుంటే "విధి నిర్వహణలో ఆటంకపరిచావు" అని కేసవుతుంది.

మరి నీతిని బోధించే వాళ్ళు పోలీసులయితే నీతిని బోధించవలసిన గురువులు ఏమవుతారు? పోలీసులకు ఇన్‌ఫార్మర్స్ అవుతారు. వరంగల్‌లో కాలేజీ ప్రిన్సిపాల్‌గానో యూనివర్సిటీ వి.సిగానో హాస్టల్ వార్డెన్‌గానో వుండి పోలీసులకు ఇన్‌ఫార్మర్స్ కాని వాళ్ళు చాలా కొద్దిమంది. వాళ్ళలో కొందరు బలవంతం మీద ఆ పాత్ర స్వీకరించే వాళ్ళుండవచ్చునుగాని, అత్యధికులు నిరభ్యంతరంగా గూఢచారులయ్యేవాళ్ళే. అధికార నిచ్చెన మీద పైకి పోవాలంటే 'పోలీస్ రిపోర్టు' ప్రతికూలంగా వుండకూడదు. ఇది సార్వత్రిక సత్యం. దీన్ని తలమీద నిలబెడితే, పోలీస్ రిపోర్టు ఎంత అనుకూలంగా వుంటే నిచ్చెన మీద అంత త్వరగా పైకిపోతారు. ఇది ఫాసిస్టు సత్యం. వరంగల్‌లో ఇవ్వాళ కళాశాలల అధికారులు, యూనివర్సిటీ అధికారులు, జిల్లా కలెక్టరు, కోర్టులలో న్యాయమూర్తులు, అన్ని రంగాల ప్రభుత్వ అధికారులు మినహాయింపు లేకుండ అత్యధిక భాగం పోలీసు ఏజెంట్లే. ఇవన్నీ కూడ ఆధునిక ప్రజాస్వామ్యాలలో స్వయం ప్రతిపత్తి గల హోదాలే. అయిదువేల సంవత్సరాల మానవ నాగరికత క్రమంలో సంతరించుకున్న మానవీయ విలువల నిక్షేపాలే. కాని ఈ విప్లవాల యుగంలో అన్నీ కూడ ఫాసిస్టు బూట్లకు నాడాలు కాక తప్పలేదు. 10-15 రోజులు లాకప్‌లో చిత్రహింసలు పెట్టి కోర్టుకు తీసుకొస్తే నిందితుడిని న్యాయమూర్తులు కళ్ళెత్తి కూడ చూడరు. చూస్తే ఏం కనబడుతుందోనని తలదించుకొని రిమాండ్ చేస్తారు. వ్యవసాయ కూలీలను పోలీసులు తప్పుడు కేసులలో ఇరికించి ప్రమాదకరమయిన నక్సలైట్లుగా చిత్రించి వారిని దీర్ఘకాలం జైల్లో పడేస్తే వాళ్ళ కుటుంబాల గతి ఏమిటన్న ఆలోచన కూడ లేకుండ వాళ్ళకు బెయిల్ ఇవ్వడానికి ముప్పుతిప్పలు పెడతారు. ఒకవేళ బెయిలు మంజూరయినా ష్యూరిటీలను కోర్టు ఆవరణలోనే పోలీసులు అరెస్టు చేస్తారు. లేకపోతే బెయిలుమీద బయటకు రాగానే జైలు బయట అరెస్టు చేసి ఇంకొక కేసులో కోర్టుకు తెస్తారు. నిన్ననే బెయిలిచ్చిన వాడిని మళ్ళీ ఇంకొక కేసులో తెచ్చారేమిటని జడ్జిగారు ఆలోచించరు. తలవంచుకొని మళ్ళీ రిమాండ్ చేయడం వారి పని. భగవద్గీతలో

చెప్పినట్టు మంచి చెడ్డల భారం నారాయణుడిది. మూర్తీభవించిన న్యాయం కదా న్యాయమూర్తి అంటే. అతను కనీసం అప్పటి చట్టాలనయినా నిష్పక్షపాతంగా అమలుచేసి వీలయినంత ప్రజాస్వామికంగా వాటిని వ్యాఖ్యానించాలి కదా! ఈ విధి, ఈ స్వయం ప్రతిపత్తి, ఇన్ని వేల సంవత్సరాల నాగరికత సాధించిన ఆదర్శం – సంక్షోభంలో ఇవన్నీ పోతాయి. న్యాయమూర్తులలో న్యాయం మూర్తీభవించదు, ఘనీభవిస్తుంది. వారి పంచేంద్రియాలలో ఏదీ పనిచేయదు. యండమూరి వీరేంద్రనాథ్ కల్పనలలో లాగ వారి మెదళ్లు 'స్పెషల్ బ్రాంచి'కి 'ట్యూన్' అయి వుంటాయి.

అన్నిటినీ ప్రశ్నించడం ఒక ఉన్నతమయిన నాగరికతా విలువ. ఇప్పుడు దానికిక స్థానం లేదు. ప్రశ్నించడం మానేసి పోలీసుల సమాధానాన్ని తమకు తామే చెప్పుకొని సంతృప్తి చెందడం ఫాసిస్టు నీతి. అర్ధరాత్రి వార్డెన్‌ను అడగకుండ, ప్రిన్సిపాల్‌కు చెప్పకుండ హాస్టళ్ళమీద దాడిచేసి విద్యార్థులను నిద్రలేపి బూతులు తిడుతూ రూములు సోదాచేసి పుస్తకాలూ కాగితాలూ తీసుకుపోతారు. గంటల తరబడి హాస్టల్ రూములోనే ఇంటరాగేట్ చేస్తారు. ఎందుకని ప్రశ్నించకండి. "ఎవరో వాంటెడ్ పర్సన్స్ హాస్టల్‌లో దాక్కున్నారట" అన్న సమాధానం వస్తుంది. వాంటెడ్ పర్సన్స్ అన్న మాటలు ఎట్లా పలుకుతారంటే హంతకులో బందిపోట్లో మాదర్‌చోద్‌లో అనుకోవాలి. ఒక వ్యక్తిమీద అరెస్టు వారెంటు ఉండాలంటే అతను భయంకరమయిన నేరస్తుడు కానవసరం లేదని, పోలీసులు ఎవరిమీదనయినా ఏ క్షణమయినా వారెంట్లు సంపాదించగలరనీ చెప్పండి ఒక్కసారిగా విచక్షణాద్వారాలు మూసుకుపోతాయి. ఆలోచన కుంచించుకుపోతుంది. "ఏమో నాకవన్నీ తెలీవు. నేనేదో నా ఉద్యోగమేదో..." అంటారు. విజ్ఞానతృష్ణ ఇప్పుడిక అఖండం కాదు. మెదడు చుట్టూ ఇప్పుడొక పరిధి ఏర్పడుతుంది. దాని వెలుపల చీకటి, శూన్యం. అందులోకి ఆలోచనా కిరణాలు ప్రసరింపవు. ఆలోచనకు జూరిస్డిక్షన్ ఏర్పడుతుంది. ఆలోచనకూ కుతూహలానికీ ప్రజాస్వామ్యానికీ మానవత్వానికీ అన్నిటికీ జూరిస్డిక్షన్ ఏర్పడుతుంది – ఒక్క అధికారం మాత్రమే పట్టపగ్గాలు లేకుండా వ్యవహరిస్తుంది. నాగరికతా విలువలన్నీ తలకిందులవుతాయి. అపరిమితం కావలసిన వాటికి శృంఖలాలు తగులుకుంటాయి. పరిమితం కావలసిన అధికారం మాత్రం విజృంభిస్తుంది.

ఈ సంకెళ్ళు చాలా వరకు తమకు తాము తగిలించుకున్నవే. తగిలించే భారం కూడ పోలీసులకు లేదు. పోలీసు అత్యాచారాల గురించి స్థానిక పత్రికా విలేఖరులు ఎందుకు రాయడం లేదని ఎవరో అమాయకంగా ప్రశ్నిస్తే, అది పోలీసుల 'మొరేల్'ను దెబ్బతీస్తుందని 'హిందు' పత్రికా విలేఖరి సమాధానం చెప్పాడట. దెబ్బతింటే ఏమవుతుంది? వాళ్ళు తీవ్రవాదులను అణచలేకపోతారు. అణచలేకపోతే ఏమవుతుంది? తమ పునాదులు కదిలిపోతాయి. కదిలిపోతున్న పునాదుల ముందర పత్రికా స్వాతంత్ర్యం అతి చిన్న విషయం. విమర్శనా స్వాతంత్ర్యం, అభిప్రాయస్వేచ్ఛ ఉన్నతమయిన బూర్జువా విలువలు. నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలొడ్డి సాధించుకున్న విలువలు. మామూలు సందర్భాలలో కూడ అవి తటస్థం కావు. కాని వర్గ పోరాటం ప్రత్యక్షమయినప్పుడు వాటికి మనుగడే లేదు.

ప్రభుత్వం ఇవ్వాళ ప్రజలమీద యుద్ధం ప్రకటించింది. యుద్ధ శిబిరాలుగా గ్రామాలలో పోలీసు క్యాంపులను నెలకొల్పింది. వరంగల్ జిల్లాలో ప్రస్తుతం కనీసం పది పదిహేను గ్రామాలలో పోలీసు క్యాంపులున్నాయి. క్యాంపులలో మగవాళ్ళను వారాల తరబడి కూర్చోబెట్టి నిత్యం చావగొడుతున్నారు. వాళ్ళను కూలిపనికి పోనివ్వరు, పంటలు కోసుకోనివ్వరు. వాళ్ళచేత వెట్టిచాకిరీ చేయించుకుంటారు. ఇళ్ళమీద దాడిచేసి ఆడవాళ్ళను కొడుతున్నారు. భట్టుపల్లిలో లచ్చమ్మ అనే యాభై సంవత్సరాల స్త్రీని స్పృహ తప్పేదాక కొట్టి ఇంటి ముందర పడేస్తే ఆమె కొడుకు ఆమెను ఆస్పత్రికి తీసుకుపోవలసి వచ్చింది. ఆ తరువాతే, అంతవరకు (45 రోజులుగా) గ్రామంలోని పోలీసు క్యాంపులో నిర్బంధించబడి ఉండిన ఆమె భర్త కుడయ్యను వదిలిపెట్టారు – భార్యను చూసుకొమ్మని. పూర్తిగా కోలుకోకముందే ఆసుపత్రి నుండి విడుదలయి లచ్చమ్మ ప్రస్తుతం కూతురి ఇంటిలో ఉంటోంది. కుడయ్య భట్టుపల్లికి పోతే మళ్ళీ క్యాంపులో పెడతారేమోనని భయపడి తాను పనిచేసే కాజీపేట రైల్వే ప్లాట్‌ఫారం మీదనే బతుకుతున్నాడు. బయటినుండి పత్రికా విలేఖరులు గాని, పౌరహక్కుల సంఘాల వాళ్ళు గాని గ్రామానికి పోతే వాళ్ళతో మాట్లాడినందుకు మళ్ళీ కొడుతున్నారు. మల్లారెడ్డిపల్లె, వెంకటాపురం, కృష్ణాజీగూడెం, దేవరుప్పల అన్ని వూళ్ళలోనూ ఇదే కథ. వెంకటాపురంలోనూ మల్లారెడ్డిపల్లెలోనూ ఇళ్ళలోని దూలాలనూ, పందిళ్ళనూ విరగ్గొట్టి ఆ కట్టెతో పోలీసులు క్యాంపులో చలికాచుకుంటున్నారు. మల్లారెడ్డిపల్లెలో

36 భూమిలేని కుటుంబాలు కలిసి దున్నుకున్న 20 ఎకరాల భూమిని పశువులకు మేపారు. క్యాంపులో నిర్బంధించిన వాళ్ళ చేలను కోసుకోనివ్వరు. ఒక్కొక్క గ్రామంలోనూ 40–50 ఎకరాలలో వరిపంటను కోయకుండ ఆపారు. క్యాంపులో కొట్టే దెబ్బలనయితే వర్ణించడానికి వీలు కాదు. అన్ని వూళ్ళలోనూ జనం గతంలో దెబ్బలు తిన్నవారే. కాని "ఇట్లాంటి దెబ్బలు ఎన్నడూ తినలేదన"ని ఇవ్వాళ అందరూ అంటున్నారు. బోర్లా పడుకోబెట్టి కాళ్ళు రెండూ వెనక్కి కట్టేసి వీపుమీద కూర్చొని అరగంట సేపు నిర్విరామంగా కొడతారు. ఒకరోజు కాదు, రెండురోజులు కాదు, వారాల తరబడి నిత్యం ఇలా కొడతారు. లేకపోతే అందరినీ గుండ్రంగా కూర్చోబెట్టి ఒకరినొకరు చెప్పులతో కొట్టుకొమ్మని బలవంతం చేస్తారు. చెప్పులలోని మేకుల వల్ల వీపుమీద గాయాలయిన వాళ్ళున్నారు.

ఈ క్యాంపులన్నీ ఒక ఎత్తయితే మడికొండ లాకప్ అనే చిత్రహింసల కేంద్రం మరొక ఎత్తు. ఎన్నడయినా ఏ సమయంలోనయినా మడికొండ లాకప్‌లో కనీసం 15 మంది అక్రమ నిర్బంధంలో ఉంటారు. వాళ్ళను ఎంత చలిలోనయినా నగ్నంగా వుంచుతారు. బోర్లా పడుకోబెట్టి రోకలిబండలు ఎక్కించి అరగంట, ముప్పావుగంట చితకగొడతారు. ఒకరి మూత్రం ఒకరిచేత తాగిస్తారు. అసభ్యకరమయిన లైంగిక చర్యలు చేయిస్తారు.

ఇవన్నీ 'శాంతి భద్రతల' సంరక్షణ కోసం జరుగుతున్నాయని ఎవరైనా అనుకుంటే పొరబాటే. రైతాంగ ఉద్యమ కార్యకర్తలను ఏరివేయడం కోసం ఇవన్నీ జరుగుతున్నాయి. ఏదో ఒక సంఘటన జరిగిందని పెట్టిన క్యాంపులు కావు ఇవి. గ్రామీణ ప్రాంతాలలో చైతన్యవంతమవుతున్న పేద ప్రజానీకాన్ని శాశ్వతంగా అణిచివేయాలని నాలుగయిదు జిల్లాలలో విస్తృతంగా అమలు చేస్తున్న నిర్బంధంలో భాగం యిది. ఏదో ఒక సాకు చెప్పి (ఏదీ దొరక్కపోతే అల్లరి సృష్టించి) గ్రామాలలోకి ప్రవేశించి క్యాంపులు పెట్టి స్థానిక కార్యకర్తలందరినీ పట్టుకోవడం కోసం వేటాడుతున్నారు. భూస్వాముల చేత హత్యలు చేయించి దానికి 'ఆత్మ రక్షణ' ముసుగు తొడిగి హత్య చేయబడ్డ వాళ్ల బంధుమిత్రులనే హింసిస్తున్నారు. భట్టుపల్లిలో క్యాంపు ఈ విధంగా వచ్చినదే. అక్టోబర్ 30 నాడు గ్రామంలో ఒక ప్రజాపంచాయితీ దగ్గర రవీందర్ అనే రాడికల్ యువకుడిని కొందరు రెడ్లు చంపారు. అతన్ని చంపడమే

కాక మరికొందరిని గాయపరిచారు. గాయపడ్డవాళ్లు ఆస్పత్రికి, అక్కడినుండి జైలుకు వెళ్ళారు. హంతకులు మాత్రం పోలీసుల సంరక్షణలో సురక్షితంగా వున్నారు. వాళ్ల దగ్గర అసలు ఆయుధాలే లేవనీ, రాడికల్స్ వాళ్లమీద దాడిచేస్తే ఆత్మరక్షణార్థం ఆ ఆయుధాలను లాక్కొని రవీందర్‌ను చంపవలసి వచ్చిందనీ పోలీసులు కథ సృష్టించారు. సృష్టించి గ్రామంలోని చర్చిలో పోలీసుక్యాంపు పెట్టి అప్పటినుండి ఇప్పటిదాకా గ్రామంలోని పేదలను విపరీతమయిన హింసకు గురి చేస్తున్నారు. దొరికిన యువకులందరినీ మడికొండకు తీసుకుపోయి తమ సంరక్షణలో వున్న రవీందర్ హంతకులకు చూపించి వాళ్లు 'రాడికల్స్' అని గుర్తించిన వాళ్ళను విపరీతమయిన చిత్రహింసలకు గురిచేసి హత్యా ప్రయత్నం కేసులో జైలుకు పంపుతున్నారు. యువకులు దొరకకపోతే తండ్రులను క్యాంపులో కూర్చోబెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. తమ చేతికి చిక్కకుండ యువకులెవరయినా నేరుగా కోర్టుకు సరండర్ అవుతారేమోనని కోర్టు దగ్గర మాటేసి అక్కడికి వచ్చినవాళ్ళను గేటు దగ్గరి నుండి తన్నుకు పోతున్నారు.


మల్లారెడ్డిపల్లెలో సీలింగ్ భూములను భూస్వాములు అమ్ముకునే ప్రయత్నం చేస్తే ప్రజలు నిరోధించారు. ఆ భూస్వాములు పోలీసులకు ఫిర్యాదు కూడ చేయలేదు. అయినా పోలీసులే కేసు నమోదు చేసుకొని ఊళ్ళో క్యాంపు పెట్టారు. వెంకటాపురంలో పేదలు చెరువుశికం, పోరంబోకులు దున్నుకున్నారు. చట్టరీత్యా ఎవరికి ఆ భూములు చెందాలో వాళ్ళే దున్నుకున్నారు. కాని వాళ్ళకు దక్కింది పట్టా కాదు. ఊరి బడిలో నెలకొల్పిన పోలీసు క్యాంపు.

ఇట్లా ఒక్కొక్క ఊళ్ళోను సందర్భం కల్పించుకొని క్యాంపులు పెట్టి పేదరైతు కుటుంబాలను చెట్టుకూ పుట్టకూ చేస్తున్నారు. యువకులు దొరికితే ఆత్మకూరులోనో, హసన్‌పర్తిలోనో, మడికొండలోనో పది పదిహేను రోజులు తోమి, తోచిన కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. వరంగల్ సెంట్రల్ జైలు నిండిపోయి గత రెండు నెలలుగా రాజమండ్రికి, విశాఖపట్నంకు పంపుతున్నారు. యువకులు దొరక్కపోతే తండ్రులను క్యాంపులో నిర్బంధించి అటు కూలికి పోనీక, ఇటు పంట కోసుకోనీయక హింసిస్తున్నారు. ఇట్లా ఎన్ని కుటుంబాలను నాశనం చేసారో ఎవరికీ తెలీదు. పేద రైతు కుటుంబాలలో కాళ్ళూ రెక్కలూ బాగున్న వాళ్ళు ఒక్కరూ గ్రామాలలో ఉండడం లేదు. క్యాంపులున్న గ్రామాలు పదయితే ఈ హింసను అనుభవిస్తున్న

గ్రామాలు పది నాలుగుల నలభై ఉంటాయి. మగవాళ్ళు జైలుకో గుట్టలలోకో పోగా ఆడవాళ్ళు ఈ చలి రాత్రులలో ఒంటరిగా పోలీసు జీపు కోసం నిరీక్షిస్తూ కాలం గడుపుతున్నారు. నిరుడు ఇవే చలిదినాల్లో ఎన్టీఆర్ కోసం ఎదురు చూసారట. అప్పుడు ఆయన ఖాకీ బట్టలలో వచ్చి "అమ్మా! అక్కా ! చెల్లె!" అని వోట్లడిగాడు. ఇప్పుడు ఖాకీ వదిలి కాషాయం ధరించాడుగాని అతగాడి ప్రేతం అవే ఖాకీ బట్టలలో వూళ్ళు తిరుగుతూ ఇంటి తలుపులు విరగ్గొట్టి "నీ కొడుకెక్కడే లంజా?" అని మీద పడుతోంది.

ఇవన్నీ వాస్తవాలే. కాని ఈ వాస్తవాల కోసం వరంగల్ పత్రికా విలేఖరులను అడగకండి. మేధావులను ఖండించమనకండి. పోలీసుల 'మొరేల్' దెబ్బతినగలదు. పత్రికలూ మేధావులూ సత్యాన్ని వెలికి తీయాలన్నది చాలా ఉన్నతమయిన విలువే. కాని పునాదులు కదులుతున్నప్పుడు ఈ విలువలేవీ పోలీసుల మొరేల్‌కు సాటిరావు. తుపాకులతో తూటాలతో పునాదులను పునఃస్థాపించిన తరువాత అంతా చక్కబడ్డాక మళ్ళీ సత్యాన్వేషణ చేసుకుందాం. అప్పుడు మళ్ళీ అన్ని విలువలకూ స్వయం ప్రతిపత్తి వస్తుంది. వర్గపోరాటానికి అతీతమయిన సార్వజనీనత వస్తుంది. అంతవరకు – హెయిల్ హిట్లర్ !

*సృజన మాసపత్రిక*
***జనవరి 1984***



# భారతదేశంలో పోలీసు పాలన

**హిం**సా ప్రవృత్తి భారత రాజ్య యంత్రాంగానికి ఎప్పుడూ వున్నదే గానీ హింస ప్రయోగించే అలవాటు, సామర్థ్యం ఈ మధ్య అత్యంత వేగంగా పెరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలలో భారత రాజ్యా యంత్రాంగం స్వభావంలోని హింసాత్మక అంశం 'గుణాత్మకంగా' మార్పు చెందింది. ఒకానొక కాలంలో పోలీసు యంత్రాంగానికి ప్రతీకగా పొట్ట పెంచుకొని తెలివితక్కువగా ప్రవర్తించే బడుద్దాయిలను చిత్రీకరించడం సాధ్యపడేది. హాస్య సన్నివేశాల కోసం మన సినిమాలు 'పోలీసు వెంకట స్వాముల'ను తరచుగా ఉపయోగించుకునేవి కూడ. ఇప్పుడిక ఆ అవకాశం ఎంత మాత్రం లేదు. ఇప్పుడు మిగిలింది హింసాత్మక అంశం మాత్రమే. అది కూడ మామూలు హింస కాదు, అత్యంత పాశవికమైన హింస. తుపాకి కంటే బడితగా బాగా ఉపయోగపడే 303 రైఫిల్ ఇంకెంత మాత్రం పోలీసు యంత్రాంగం బలానికి సంకేతం కాదు. దాని స్థానాన్ని రోజురోజుకూ మరింత ఆధునికమైన ఆటోమాటిక్ తుపాకులు ఆక్రమించుకున్నాయి.

ఈ సాంకేతిక ఆధునీకరణతో బాటు పోలీసులకూ, సమాజానికీ మధ్యనున్న సంబంధాలలో కూడ మార్పు వేగంగా వస్తోంది. ఒకటి, పోలీసుల జోక్యం పరిధి పెరుగుతోంది. గతంలో మనం పోలీసు యంత్రాంగం జోక్యానికి వదిలిపెట్టడానికి ఎంత మాత్రం ఇష్టపడని సామాజిక అంశాలు ఒక్కొక్కటిగా ఇవ్వాళ పోలీసుల చేతిలోకి పోతున్నాయి. పెద్ద నగరాలలో నివసించే విద్యావంతులకూ, మధ్యతరగతి బుద్ధి జీవులకూ ఈ మార్పు ఎంత దూరం పోయిందో తెలియకపోవచ్చును కాని మార్పు

మట్టుకు చాలా దూరం పోయింది. మత సంబంధమైన పండగలూ పబ్బాలూ ఆటపాటలూ సాంస్కృతిక కార్యకలాపాలూ రాజకీయ సభలూ ఊరేగింపులూ ప్రదర్శనలూ వీధి నాటకం వంటి బహిరంగ కళారూపాలూ మొదలయినవన్నీ కూడ 'మన సంస్కృతి' లేక 'మన హక్కులు' అనే జాబితా నుండి ప్రభుత్వం దయాదాక్షిణ్యాల మీద మనం అనుభవించే రాయితీల జాబితాలోకి పోయాయి. 'ప్రభుత్వం' అంటే చాలా సందర్భాలలో స్థానిక పోలీసు ఇన్‌స్పెక్టరేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ హక్కులూ ఆచారాలే కాకుండ సున్నితమయిన సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్యలు కూడ పోలీసుల చేతిలోకి పోయాయి. ఈ మార్పు ఎటువంటి ఆర్భాటమూ లేకుండా సాఫీగా జరిగిపోయింది. దీని కోసం ఏ కొత్త చట్టాలూ చేయలేదు. చట్టం ప్రసక్తి అంటూ వస్తే నేర విచారణ స్మృతి (సి.ఆర్.పి.సి) లోనూ, వివిధ పోలీసు చట్టాలలోనూ వున్న నిర్బంధ నిషేధ అధికారాలు సరిపోతాయి. కాని చట్టం ప్రసక్తి సాధారణంగా రాదు ఎవరయినా సమస్యను కోర్టుకు నివేదిస్తే తప్ప. అయినా కోర్టులు మట్టుకు మార్పుకు అతీతం అయితే కదా! మన సామాజిక జీవితాన్ని ఒక రకమయిన 'పోలీసు సంస్కృతి' ఆవరిస్తోంది. అది మన సామాజిక చైతన్యంలోకి మనకు తెలియకుండానే ప్రవేశిస్తోంది.

సమ్మె చేస్తున్న విద్యార్థులను పోలీసులు ఒకవైపు లాఠీలతో చితకబాదుతూ మరొకవైపు అధికారులతో బలవంతంగా ఒప్పందానికి వచ్చేలా చేస్తారు. సమ్మెకు కారణమయిన సమస్యలను చాలా మొరటుగా పరిష్కరిస్తారు. విద్యార్థుల 'హక్కుల'కు వేళాకోళంగా భాష్యాలు చెప్తారు. పోలీసు యంత్రాంగానికి వుండే మూర్ఖమయిన రాజకీయ అవగాహనతోనూ సామాజిక సిద్ధాంతాలతోనూ వాళ్ల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా పరీక్షించే పద్ధతిలో లెక్చర్లు ఇస్తారు. ఒక్క విద్యార్థులే కాదు, కార్మికులయినా, వేరే ఏ యితర బడుగు వర్గమయినా అందరి గతీ ఇవ్వాళ ఇంతే.

సంఘటిత ఉద్యమాలనే కాదు, పొలంగట్ల తగాదాలనూ, సేద్యపు కాలవల వివాదాలనూ, పొలాల గురించి, ఇంటి స్థలాల గురించి, పశువుల గురించి వచ్చే వివాదాలనూ, దళితులు, స్త్రీలు, గిరిజనులు తదితర బడుగు ప్రజానీకం అతికష్టం మీద సాధించుకున్న సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్యలన్నింటినీ ఇవ్వాళే ఇదే మొరటు పద్ధతిలో పరిష్కరించడం జరుగుతోంది. అంటరానితనానికి వ్యతిరేకంగా

పోరాడే దళితులు న్యాయం పొందేది కోర్టులలో కాదు. సామాజిక న్యాయం అంటే ఏమిటో అర్థం చేసుకోలేని మొరటు సాయుధ శక్తి ముందు వాళ్లు న్యాయం కోసం మొరపెట్టుకోవాలి. ఒక్క దళితులే కాదు, కార్మికులయినా గిరిజనులయినా స్త్రీలయినా – పోలీసు యంత్రాంగం తన సిబ్బందికి ఇచ్చే సామాజిక అవగాహనకు ఛాయామాత్రంగా కూడ అందని న్యాయం ఏ ప్రజానీకం మనుగడకు అత్యవసరమో వారందరి పరిస్థితీ ఇదే. ఒకవైపు ఉన్నత న్యాయస్థానాల ఆలోచనలు 'న్యాయం' అనే దానికి మరింత విస్తృతమయిన వ్యాఖ్యానం ఇస్తుండగా మరోవైపు ఆ సున్నితమయిన ఆలోచనలకు ఆవగింజంతయినా తావులేని పోలీసు ఠాణాలే ఆచరణలో ప్రజల పాలిట న్యాయస్థానాలవుతూ వున్నాయి.

ఈ విధంగా పోలీసుల జోక్యం పరిధి పెరగడంతో బాటు పోలీసు యంత్రాంగానికి ఇతర పరిపాలనా విభాగాలతో వున్న సంబంధం కూడ మారుతోంది. పరిపాలనలో పోలీసుల పాత్రను ఈ మార్పు ప్రతిఫలిస్తోంది. సంక్షేమ రాజ్యం అనే భావన, భారత రాజ్యాంగంలోని రెండవ, మూడవ అధ్యాయాలు మన ముందు ఒక ఆదర్శాన్ని ఉంచుతాయి. రాజ్యాంగ యంత్రంలోని సంక్షేమం, ప్రగతి అనే అంశాలకు ఆ రాజ్యాంగ యంత్రం యొక్క హింసా ప్రవృత్తి లోబడి వుండడమనేదే ఆ ఆదర్శం. ఈ ఆదర్శం ఏనాడయినా ఏ మాత్రం అమలయిందో చెప్పలేము గానీ ఇప్పుడు మట్టుకు పూర్తిగా తలకిందులయింది. సంక్షేమ రాజ్యం అనే భావనకు కొత్త అర్థం ఇవ్వలేదు, రాజ్యాంగం స్వభావాన్ని సవరించలేదు. అయినా ఈ మార్పు మట్టుకు సంపూర్ణం అయింది. పోలీసు యంత్రాంగం ఇవ్వాళ పరిపాలనా యంత్రాంగంలోని పౌర విభాగం పట్ల ప్రదర్శించే తిరస్కార వైఖరి ఈ మార్పుకి సంకేతం. పోలీసు విభాగం పౌర విభాగానికి లోబడి వుండాలని బ్రిటిష్ కాలం నుండి వస్తున్న సూత్రాన్నే కాక, అదే పౌర విభాగం చేతిలో పెట్టబడిన ప్రగతి, సంక్షేమం అనే బాధ్యతలకు పోలీసుల విధి నిర్వహణ లోబడి వుండాలన్న స్వతంత్ర భారత రాజ్యాంగ సూత్రాన్ని కూడ వారి ఈ తిరస్కారభావం తలకిందులు చేస్తుంది.

ఈ పరిణామానికి బలమైన ఉదాహరణ మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా. సంక్షేమ చర్యలకూ గిరిజనుల హక్కులకూ అనుకూలంగా వున్న జిల్లా కలెక్టరును కొన్ని నెలల క్రితం పోలీసుల ఒత్తిడి మీద బదిలీ చేయడం జరిగింది. గిరిజనులు

ఉమ్మడిగా నిరసన తెలిపినా ప్రయోజనం లేకపోయింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇవ్వాళ 3 లక్షల మంది గిరిజనులున్నారు. జిల్లా జనాభాలో వాళ్లు 17 శాతమే గానీ అయిదారు దశాబ్దాల క్రితం వాళ్లదే అక్కడ మెజారిటీ. అప్పటి నుండి గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవడం ఒక పద్ధతి ప్రకారం మొదలయింది. ఈ రకమయిన భూమి బదలాయింపు జరగకుండ చూడడం అనేది భారత ప్రభుత్వ విధానాలలో ఒక అంశం. దానిని అమలు చేసే బాధ్యత జిల్లా కలెక్టర్‌ది. అయితే ఆ బాధ్యతను సీరియస్‌గా తీసుకునే కలెక్టర్ రాగానే అది గిరిజనేతరులకు కంటగింపయింది. అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలూ వారికి మద్దతుగా నిలబడ్డాయి. ఈ లోపల తమ భూమి సమస్య అపరిష్కృతంగా వుండిపోయిన కారణంగా గిరిజనులు నక్సలైట్ల వైపు మొగ్గ చూపడం, పోలీసులు రంగప్రవేశం చేయడం జరిగింది. సామాజిక ఆర్థిక సమస్యలను శాంతిభద్రతల సమస్యగా చూడకూడదని పెద్దలు అంటూంటారుగానీ పోలీసులకు ఇచ్చే అవగాహన దానికి పూర్తిగా విరుద్ధమయినది. ఫలితంగా, జిల్లా కలెక్టరు గిరిజనులకు ఇస్తున్న దన్ను (అంటే మరేదో కాదు, రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970ని అమలు చేయడం మట్టుకే!) వల్ల వారు మరింత నిర్భయంగా నక్సలైట్లకు మద్దతు నిస్తున్నారని పోలీసులు ఆయన మీద ఆరోపణ చేయగలుగుతారు. అంతేకాక, నక్సలైట్ సమస్యను పరిష్కరించడం కోసం పోలీసులు గిరిజన యువకులను గ్రామాల నుండి తీసుకుపోయి కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడం కూడ వాళ్లకు నచ్చలేదు. ఈ కారణాల వల్ల గిరిజనేతరుల ఒత్తిడికి పోలీసుల ఒత్తిడి తోడయి ఆయనను ఆదిలాబాద్ నుండి బదిలీ చేయడం జరిగింది. దీనితో 'తలకిందులు కావడం' అనేది సంపూర్ణం అయింది. సమస్యను అందరూ గుర్తిస్తారు. కాని దాని పరిష్కారం విచిత్రంగా మారిపోతుంది. ఒక సమస్యకు రాజ్యాంగబద్ధమయిన పరిష్కారం 'రెచ్చగొట్టే చర్య' అయిపోగా దాని రాజ్యాంగ విరుద్ధమయిన పరిష్కారం ఆమోదనీయం అవుతోంది. ఈ క్రమంలో అన్ని విభాగాలలోకి తగ్గుస్థాయిలో ఉండాల్సిన పోలీసు యంత్రాంగం నిజానికి ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో నిర్ణాయక స్థానాన్ని పొందుతోంది.

ఈ క్రమం సంపూర్ణంగా సాగింది ఈశాన్య భారతదేశంలో. అక్కడి ప్రజానీకం అత్యధికంగా గిరిజనులు. వారిని బయటి వారి దోపిడి నుండి కాపాడడం ప్రభుత్వం

బాధ్యత. అటువంటి ప్రాంతంలోనే పౌర అధికార నిర్వహణ బాధ్యతను పూర్తిగా త్యజించి, ఆ మొత్తం బాధ్యతను సైన్యానికి అప్పజెప్పడం జరిగింది. దాని తర్వాత సైన్యం అక్కడి పౌర అధికార యంత్రాంగాన్నీ, న్యాయవ్యవస్థనూ కూడ ఎంతటి తృణీకారభావంతో చూస్తోందనేది చాలా కొద్దిమందికి తెలిసిన చారిత్రక వాస్తవం. ఈ మధ్య జరిగిన ఒక ఉదాహరణ 'ఒయినం' ఉదంతం. మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలో వున్న ఒయినం పరిసర గ్రామాల మీద 1987 జూలై 17వ తేదీన అస్సాం రైఫిల్స్ పోలీసులు దాడిచేసి 30 మంది స్త్రీ పురుషులను చంపారు. 10 మంది స్త్రీలను బలాత్కరించారు. చాలామందిని చిత్రహింసలకు గురిచేసి 100కు పైగా ఇళ్లనూ, చర్చిలనూ ధ్వంసం చేశారు. సేనాపతి జిల్లా కలెక్టర్‌నూ, పోలీసు సూపరింటెండెంట్‌నూ కూడ అస్సాం రైఫిల్స్ ఆ ప్రాంతంలోకి ప్రవేశించనీయలేదు! గౌహతి హైకోర్టులో ఈ అత్యాచారాలపై రిట్‌పిటిషన్ వేయగా హైకోర్టు సాక్ష్యాలు రికార్డు చేయమని ఇంఫాల్ సెషన్స్ కోర్టును ఆదేశించింది. సెషన్స్ కోర్టు ఆ పనికి ఉపక్రమించగానే అస్సాం రైఫిల్స్ కూడ తన పనికి తానూ ఉపక్రమించింది. సాక్షులను బెదిరించడం, కొట్టడం, అపహరించడం, కేసు నిర్వహిస్తున్న నందితా హక్సర్ తదితర న్యాయవాదుల నివాసాల మీద దాడులు చేయడం నిరాఘాటంగా కొనసాగిస్తోంది. ప్రభుత్వం అస్సాం రైఫిల్స్ బలగాలను కంట్రోల్ చేయగలదని గానీ, చేస్తుందని గానీ, పవిత్రమయిన న్యాయ నిర్ణయ క్రమానికి అడ్డు రాకుండ ఆపుతుందని గానీ ఎవ్వరూ కనీసం ఆశించే స్థితిలో కూడ లేరు.

ఈ పరిణామాలన్నిటి వెనుకా పోలీసు యంత్రాంగం పట్ల ప్రభుత్వానికి ఒక వైఖరి ఉందనేది స్పష్టం. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే పోలీసుల మీద చర్య తీసుకోవాలన్న డిమాండుతో ఉద్యమించే క్రమంలో పౌరహక్కుల ఉద్యమకారులు గమనించిన విషయం ఏమిటంటే ఈ దేశంలోని ప్రభుత్వాలకు పోలీసుల మీద చర్య తీసుకునే ఉద్దేశ్యం లేదు, తీసుకోనూ లేవు. వామపక్ష ప్రభుత్వ పాలనలో వున్న పశ్చిమబెంగాల్‌లో సహితం తనకు పక్షవాతం వచ్చేలాగ చిత్రహింసలకు గురి చేసిన రూణు గుహ నియోగి అనే పోలీస్ ఆఫీసర్ మీద అర్చనా గుహ అనే స్కూల్ టీచరు, కోర్టులలో 11 సంవత్సరాలు పోరాటం చేసి ఓడిపోయింది. కేసు ఇంతకాలం కొనసాగడం గురించి కలకత్తా హైకోర్టు 'అనవసర జాప్యం' అని వక్రభాష్యం చెప్పి,

కేసును కొట్టేసింది. ఈ 11 సంవత్సరాల కాలంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం ఆ అధికారి మీద కనీసం సస్పెన్షన్ వంటి చర్య కూడ తీసుకోలేకపోయింది.

అంతేకాదు, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే పోలీసు అధికారులకు నగదు పారితోషికాలు, ప్రమోషన్లు తదితర రూపాలలో ప్రభుత్వం ప్రోత్సాహం కూడ ఇస్తోంది. మన రాష్ట్రంలో నక్సలైట్లను వేటాడే స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు డి.ఐ.జి కె.ఎస్. వ్యాస్ అనే పోలీసు అధికారి అధిపతిగా వున్నాడు. ఈయనకు ఉన్నంత పరపతి వేరే ఏ పోలీసు అధికారికీ లేదు. ఇతని ఘనత ఏమిటంటే ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత దాదాపు మూడు సంవత్సరాల కాలం ఆగిపోయిన 'ఎన్‌కౌంటర్' హత్యలను 1980లో నల్గొండ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా వున్నప్పుడు తిరిగి ప్రారంభించడం. స్కూల్ ఫైనల్ లోనూ, ఇంటర్‌మీడియట్‌లోనూ వున్న యువకులను ఏరి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించాడు. ఆ తరువాత ఆయన చాలా వేగంగా పైకి వెళ్ళి, ప్రస్తుతం తననూ తన అనుయాయులను ఎవరూ ప్రశ్నించలేరనే స్థితికి చేరుకున్నాడు. అంత పైస్థాయి పోలీస్ అధికారి దాకా కూడ పోనక్కరలేదు, ఎస్.ఐ స్థాయిలో కూడ డిపార్ట్‌మెంట్‌లో వేగంగా పైకి పోవడానికి కావలసిన సర్టిఫికెట్ ఏమిటంటే ప్రజల మీద హింస ప్రయోగించడానికి అతను ఎంత మాత్రం వెనుకాడడు అనేది.

ప్రభుత్వానికి పోలీసు యంత్రాంగం పట్ల ఈ వైఖరి ఉండడం వల్లనే, పోలీసు యంత్రాంగం మీద పర్యవేక్షణ అధికారం వున్న ఇతర అధికారులలో ఒక రకమయిన నిస్సహాయత పేరుకొనిపోయింది. లాకప్పు నుండి కోర్టుకు తీసుకొచ్చిన ముద్దాయి నివేదించే చిత్రహింసల కథలు వినే మేజిస్ట్రేట్ ముఖంలోను, తమ రిపోర్టు చెత్త బుట్టలోకి పోతుందని తెలిసీ పోలీసు అత్యాచారాల మీద విచారణలు నిర్వహించే విచారణాధికారుల నివేదికలలోనూ, నిష్ప్రయోజమయిన వాగాడంబరంతో పోలీసు యంత్రాంగాన్ని 'లైసెన్స్ గూండాలు' తదితర దూషణలతో వర్ణించే ఉన్నత న్యాయస్థానాల తీర్పుల్లోని భాషలోనూ ఈ నిస్సహాయతను స్పష్టంగా చూడవచ్చు.

## చారిత్రక నేపథ్యం

రాజ్య యంత్రాంగం హింసా ప్రవృత్తిలో వస్తున్న ఈ మార్పులన్నీ స్వాతంత్ర్యానంతర భారతదేశ చరిత్రలో సంభవించిన ఒక్కొక్క సంక్షోభానికీ సంకేతాలు. ప్రతి సంక్షోభం ప్రజా ఉద్యమాలకూ తిరుగుబాట్లకూ దారితీస్తుంది. వాటిని అణచడానికి

రాజ్య యంత్రాంగం అనేక అణచివేత చర్యలు చేపడుతుంది. వాటి ఫలితంగా త్వరలోనే 'శాంతి' నెలకొంటుంది. సమస్య పైకి పరిష్కారం అయినట్టే కనబడుతుంది. అయితే అంతా అయిపోయి అలలు వెనక్కి మళ్ళిన తరువాత ఉప్పెనకు గుర్తుగా రెండు విషయాలు మిగిలిపోతాయి. ఒకటి, సమస్యకు 'మూలకారణం' అయిన సంక్షోభం. ఈ సంక్షోభం సాధారణంగా అపరిష్కృతంగా ఉండిపోతుంది. రెండవది, పెరిగిన అణచివేత యంత్రాంగం. సమస్య వివరాలన్నీ అందరూ మరిచిపోయిన తరువాత చాలా కాలం దాకా కూడ ఈ సమస్యను పరిష్కరించే పేరుతో రాజ్య యంత్రాంగం అలవర్చుకున్న దురలవాట్లూ, దుష్ట శాసనాలూ మిగిలిపోతాయి. ఎమర్జెన్సీ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ సంవత్సరన్నర కాలంలో పోలీసులు నేర్చుకున్న కొత్త అణచివేత పద్ధతులూ, అణచివేత సంస్కృతీ ఎమర్జెన్సీని ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని 'పునరుద్ధరించిన' ఇన్నేళ్ళ తర్వాత కూడ కొనసాగుతూనే వున్నాయి. సామాజిక జీవితంలో పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున జోక్యం చేసుకోవడం ఆ కాలంలోనే మొదలయింది.

స్వాతంత్ర్యానంతరం రాజకీయ ఉద్యమాలను అణచివేయడానికి సైనిక బలగాలను మొట్టమొదట ప్రయోగించింది తెలంగాణలో. ఆ నేపథ్యంలోనే కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని తయారుచేసి అసిస్టెంట్ ఎస్.ఐ ర్యాంకు అధికారికి సైతం ఎవ్వరినైనా కేవలం అనుమానం మీద కాల్చేసే అధికారం ఇవ్వడం జరిగింది. దేశం కొత్తగా సాధించుకున్న స్వాతంత్ర్యానికి ద్రోహం చేసే ఉద్దేశంతో కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేస్తున్నారని, స్వాతంత్ర్యాన్ని సంరక్షించడానికి కఠిన చర్యలు అవసరమని అప్పట్లో అన్నారు. కమ్యూనిస్టులే తమ పోరాటాన్ని 1951లో విరమించుకున్నారు. అయినా కల్లోలిత ప్రాంతాల చట్టమూ, దాని వినియోగము కూడ కొనసాగుతూనే వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు ఒక డజను తాలూకాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబడి వుండడమే కాక 1983లో అదే చట్టాన్ని పంజాబు కోసం కూడ తయారుచేసి జారీచేశారు. తెలంగాణ తరువాత సైన్యాన్ని పంపింది ఈశాన్య భారతదేశంలో 1956 నుండి మొదలయిన తిరుగుబాట్లను అణచడానికి. దానితోబాటు సైన్యానికి వర్తించే కల్లోలిత ప్రాంతాల చట్టం వంటి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం జారీ అయింది. దేశం ఉనికిని దెబ్బతీయడానికి విదేశీ శక్తులు అక్కడి గిరిజన ప్రజానీకాన్ని రెచ్చగొడుతున్నారని అప్పట్లో అన్నారు. ఆ తరువాత ఈ

తిరుగుబాట్లు వివిధ పరిపాలనా వ్యూహాల వల్లనూ, ఒడంబడికలూ ఒప్పందాల వల్లనూ చాలావరకు చల్లబడ్డాయి. కానీ సైన్యమూ ఆ సైనిక చట్టమూ ఇంకా అక్కడే వున్నాయి. పైగా ఆ సైనిక చట్టాన్ని పంజాబు కోసం తిరిగి జారీ చేశారు. ఇటువంటి చట్టాలు భారత రాజ్యాంగంలోని అధికరణం 21కి వ్యతిరేకం అని జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్ వంటి వ్యక్తులు బహిరంగంగా తమ అభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ ఆ చట్టాలూ, వాటి వినియోగమూ కొనసాగుతూనే వున్నాయి.

ఈ లోపల రాజకీయ సమస్యలను, సామాజిక సంఘర్షణలను అదుపు చేయడానికి సైన్యాన్ని ఉపయోగించడం అనేది ఎంతగా అలవాటు అయిపోయిందంటే ఇప్పుడు దానికి సంజాయిషీ అడిగే వారు లేరు, చెప్పేవారూ లేరు. ఈ మధ్య కూడ అస్సాంలో బోడో విద్యార్థుల ఉద్యమం మీద సైన్యాన్ని ప్రయోగించారు. దీనికి మనం ఎంతగా అలవాటు పడ్డామంటే అత్యంత అల్పసంఖ్యాకులూ బలహీనులూ అయిన బోడోల వల్ల ఈ దేశ భద్రతకు గానీ, సమగ్రతకు గానీ ఏమంత ముప్పు వాటిల్లిందని అడిగేవారు కూడ లేకుండా పోయారు.

రాజకీయ ఉద్యమాలనూ సామాజిక సంఘర్షణనూ అదుపు చేయడానికి సైన్యాన్ని ప్రయోగించడం అనేది 'సామాజిక సమస్యలను శాంతిభద్రతల సమస్యగా చూడడం' అనే దురలవాటుకు పరాకాష్ట మాత్రమే కాదు, అది దేశంలోని కొంత జనాభాను విదేశీయులుగా, శత్రువులుగా చూడడం అవుతుంది. పోలీసులు ఎంతో తీవ్రమయిన 'శాంతిభద్రతల' సమస్యను ఎదుర్కొనేటప్పుడయినా సంబంధిత ప్రజల హక్కులను గౌరవించాలి. తమ విధి నిర్వహణకు ఏ మాత్రం బలప్రయోగం అవసరమో అంత మాత్రమే చేయాలి. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి రాజ్యాంగాన్ని, అందులోని 21వ అధికరణాన్ని ప్రత్యేకించి వ్యాఖ్యానించి తెలుసుకోవలసిన అవసరం లేదు. మన వలస పాలకులు ఒక శతాబ్దం కింద, దేశంలో ప్రజలకు ఏ పౌరహక్కులూ లేని దినాలలోనే – రూపొందించిన నేర విచారణస్మృతి (సి.ఆర్.పి.సి) శాసనమే ఉంది. సెక్షన్లు 46, 130 ఈ పరిమితిని స్పష్టం చేస్తాయి.

సైన్యం విధులూ, సంస్కారమూ ఇందుకు భిన్నమయినవి. ఎదుటివారి హక్కులను గుర్తించవలసిన అగత్యం దానికి లేదు. దాని ప్రమాణం కనీస హింసా

ప్రయోగం కాదు, సమర్థవంతమయిన హింసా ప్రయోగం. ఎంత కొద్దిమందిని చంపుతాననేది కాదు, ఎంత తక్కువ ప్రయాసతో పని పూర్తి చేసుకుంటాననేది దాని దృక్పథం. సైన్యం సంస్కారమూ, శిక్షణా, ఆయుధాలూ కూడ ఈ దృక్పథంతోనే సమకూర్చబడతాయి.

ఈ కారణంగానే అన్ని నాగరిక దేశాలలోనూ ఒక వైపు సైన్యానికి మరింత ప్రాణాంతకమయిన ఆయుధాలను సరఫరా చేస్తూ పోలీసు యంత్రాంగానికి మట్టుకు కనీస బలప్రయోగానికి అనుగుణ్యమయిన ప్లాస్టిక్ బుల్లెట్ల వంటి ఆయుధాలు ఇవ్వడం జరుగుతోంది. ఒక్క భారతదేశంలో మట్టుకే పోలీసు యంత్రాంగానికి సైన్యం నుండి అరువు తెచ్చుకున్న శక్తివంతమయిన ఆయుధాలు ఇస్తున్నారు. మొదట్లోనే అన్నట్టు, దినదినం మరింత ఆధునికం అవుతున్న ఆటోమాటిక్ తుపాకులు ఇవ్వాళ పోలీసుల చేతిలో సర్వసాధారణ ఆయుధ సామాగ్రి అయిపోయాయి. ఇది పంజాబులో మొదలయింది. అక్కడి టెర్రరిస్టుల దగ్గర శక్తివంతమయిన ఆయుధాలు ఉన్నందువల్ల వారిని ఎదుర్కోవడానికి ఇవి అవసరం అని అన్నారు. అయితే త్వరలోనే ఆ ఆయుధాలు దేశం అంతటికీ విస్తరించాయి. పోలీసులు అదుపు చేయవలసిన ఉద్యమాలు కేవలం సాంప్రదాయికమయిన ఆయుధాలనే కలిగివున్నా, అసలు పూర్తిగా నిరాయుధమయిన ఉద్యమాలే అయినా పోలీసుల చేతిలో మాత్రం ఈ కొత్త ఆయుధాలే కనబడతాయి.

ఈ రకమయిన ఆయుధ సామాగ్రికి సాకుగా చూపిస్తున్న టెర్రరిజం ఏదో ఒక రోజు సమసిపోతుంది. కాని ఇప్పటికే ఈ 'మూల కారణాన్ని' దాటి చాలా దూరం విస్తరించిన వారి ఆధునిక ఆయుధ సామాగ్రి మట్టుకు శాశ్వతంగా నిలిచి పోతుంది. దీనికి స్పందించి రాజకీయ కార్యకర్తలు కూడ అంతే ఆధునికమైన ఆయుధాలను సమకూర్చుకోవడం మొదలుపెడితే, దానిని తమ దురలవాటును సమర్థించడానికి వాడుకుంటారు. మరొకవైపు సామాజిక హింస స్థాయి మరింత పెరుగుతుంది.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే, నక్సలైట్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనే పోలీసులకు ప్రభుత్వం ఆధునిక ఆయుధాలు సరఫరా చేసిన ఫలితంగా నక్సలైట్లు కూడ ఆధునిక ఆయుధాలు సమకూర్చుకోవడం మొదలుపెట్టారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని పాతబస్తీలో గస్తీ తిరిగే పోలీసుల చేతిలోనూ మనకు ఆటోమాటిక్

తుపాకులే కనబడుతున్నాయి. పాతబస్తీలో అడపాదడపా జరిగే మతకల్లోలాలలో కత్తులూ, చాకులూ తప్ప అంతకంటే ఆధునికమయిన ఆయుధాలు గతంలో ఎన్నడూ ప్రయోగించబడలేదు. ఇప్పుడిక గస్తీ తిరుగుతున్న పోలీసుల చేతిలోని ఆటోమేటిక్ తుపాకులను చూసి పాతబస్తీ గూండాలు కూడ ఆధునిక ఆయుధాలు సమకూర్చు కోవడం మొదలుపెడితే ఆ పరిణామం ఫలితాన్ని ఊహించుకోలసిందే!

నిజానికి పెరుగుతున్న అధికార హింసా ప్రవృత్తికి నేపథ్యంగా నిలిచే ఈ సంక్షోభాలు ఒక్కొక్కటీ ఒక్కొక్క వైఫల్యాన్ని సూచిస్తాయి. అది ప్రజల న్యాయమయిన ఆకాంక్షలను తీర్చడంలో వైఫల్యం. లేదా భారత రాజ్యాంగ లక్ష్య ప్రకటనలోని రెండు మూడు అధ్యాయాలు, ప్రజల సకల ఆకాంక్షలకూ హామీ ఇస్తాయి కాబట్టి ఇది రాజ్యాంగబద్ధంగా పరిపాలించడంలో వారి వైఫల్యం అయినా అనుకోవాలి. ఇటువంటి ఒక్కొక్క వైఫల్యమూ అధికార హింసా ప్రవృత్తిని ఒక్కొక్క మెట్టు పెంచుతుంది. ఈశాన్య భారత గిరిజన ప్రజానీకం కోరుకున్న స్వయం నిర్ణయాధికార హక్కును తిరస్కరించడం అక్కడ సైనిక పాలనకూ, గృహ దహనాలకూ, తగాదాలకూ, హత్యలకూ, అత్యాచారాలకూ, గ్రామాల బలవంతపు తరలింపుకూ దారితీసింది. అలాగే ఆర్థిక విధానాలు పేదరికాన్నీ, దోపిడీ దౌర్జన్యాలనూ నిర్మూలించడంలో ఘోరంగా విఫలం కావడం నక్సలైట్ ఉద్యమానికీ, దానిని అణిచేందుకు భారత రాజ్యం రూపొందించిన 'ఎన్‌కౌంటర్' అనే విలక్షణమయిన భారతీయ హింసా రూపానికీ దారితీసింది.

ఆర్థిక సంక్షోభానికి సమాధానంగా ఆర్థిక రంగాన్ని సడలించడం అనే పరిష్కారాన్ని దాదాపు 10 సంవత్సరాలుగా మన పాలకులు అనుసరిస్తున్నారు. ఇది అనివార్యంగా కార్మికవర్గం మీద, రాజకీయ ప్రత్యర్థుల మీద అణచివేతకు దారితీస్తున్నది. ఈ సడలింపు ప్రారంభమయినప్పుడే జాతీయ భద్రతా చట్టాన్ని (NSA), అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టాన్ని (ESMA) రూపొందించారు. సడలింపు పెరిగే క్రమంలో కార్మికవర్గం మీద అణచివేత పెంచడానికి కార్మిక చట్టాలు, పారిశ్రామిక వివాదాల (సవరణ) బిల్లు, ఆస్పత్రులు ఇతర సంస్థల (ఫిర్యాదుల పరిష్కారం) బిల్లు అవసరం అయ్యాయి. ఆర్థిక రంగం ప్రాంతీయ సమతుల్యాన్ని సాధించడంలో ఎంతగా విఫలం అయిందంటే దేశంలోని ఏ ప్రాంతానికి చెందినవారయినా, ఏ కొంచెమయినా తమ జాతి ప్రయోజనాన్ని గురించి అలజడి చేయడాన్ని రాజ్య యంత్రాంగం సహించలేని


స్థితికి వచ్చింది. కేవలం జాతి స్వయం ప్రతిపత్తిని సమర్థించినా, ఒక ఆశ వ్యక్తం చేసినా అది జీవితఖైదు వేయగల 'విచ్ఛిన్న కార్యకలాపాల' కిందికి వస్తుందని కొత్తగా రూపొందించిన టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టం – 'టాడా' అంటుంది.

అధికార యంత్రాంగం పట్ల ప్రజలలో నిరసన ఎంతగా వుందంటే వారిని అణచడానికి జాతీయ భద్రతా చట్టం వంటి పెద్ద చట్టాలు ప్రభుత్వానికి సరిపోవడం లేదు. చిన్న చిన్న నిరసనలకు కూడ కఠినమయిన శిక్షలు వేసే చట్టాలు కావాల్సొస్తోంది. బస్సుల మీద రాళ్ళు వేస్తే శిక్షించడానికి ఒక చట్టం (ప్రభుత్వ ఆస్తుల విధ్వంసక నిరోధక చట్టం, 1984), జాతీయ పతాకాన్నీ, రాజ్యాంగాన్నీ అవమానపరిస్తే శిక్షించడానికి ఒక చట్టం (జాతి గౌరవభంగ నిరోధక చట్టం) – ఇటువంటి శాసనాలు చేశారు. ప్రజలలో వున్న అసంతృప్తి మిలిటెంట్ రూపం తీసుకుంటే వలస పాలకులు తయారుచేసిన నేర విచారణ స్మృతిలో వున్న కొద్దిపాటి హక్కులను సహితం సహించడం లేదు. 'టాడా' చట్టంలో ఈ హక్కులన్నిటినీ తొలగించారు. నియంతలు కలలు కనే అధికారాలన్నీ – రహస్య విచారణ, బలవంతపు వాంగ్మూలం, నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయి మీదనే పెట్టడం, అప్పీలుకు తిరస్కృతి, సరయిన ఛార్జిషీటు లేకుండా విచారణ జరపడం – 'టాడా'లో లిఖించారు. ఈ భయంకరమైన చట్టం కింద ఇప్పటికే దాదాపు 10,000 మంది ఆంధ్రప్రదేశ్‌లో, పంజాబ్‌లో, కాశ్మీర్‌లో, హర్యానాలో, గుజరాత్‌లో, ఢిల్లీలో, మహారాష్ట్రలో అరెస్టయి విచారణకు ఎదురు చూస్తున్నారు.

ఈ రాక్షస శాసనాలకు పోలీసు రాక్షసత్వం కలిస్తే ప్రస్తుత భారత రాజ్య యంత్రాంగం అవుతుంది. వేరే ఏదయినా గతంలో హామీ ఇచ్చి వుండవచ్చును గానీ ఇప్పుడు మట్టుకు ఇదే భారత రాజ్య యంత్రాంగం. అయితే అదే సమయంలో ప్రజలలో చైతన్యమూ, ప్రతిఘటనా కూడ గతంలో ఎన్నడూ లేనంతగా ఇవ్వాళ ఉన్నాయి. ఈ ప్రతిఘటన చాలా అసంఘటితంగా వుండడం విచారించదగ్గ విషయమైనప్పటికీ, అది రాశిలోను, గుణంలోను కూడ చెప్పుకోదగ్గ పరిమాణం చేరుకుందనేది నిర్వివాదాంశం. ప్రజలు భూమి కోసం, వేతనాల కోసం, గౌరవ ప్రదమైన జీవితం కోసం, గిట్టుబాటు ధరల కోసం పోరాటాలు చేస్తున్నారు. సమానత్వం కోసం

ఉద్యమిస్తున్నారు. తమ భూములను ముంచేసే ప్రాజెక్టులకు, తమ ప్రాణానికీ, ఆరోగ్యానికీ ప్రమాదకరమయిన అణు విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటాలు, ఆందోళనలు రకరకాల రూపాలలో సాగుతున్నాయి – రాజకీయ పోరాటాలు, రాజకీయాలు లేవని చెప్పుకునే పోరాటాలు, హింసాత్మకమైన పోరాటాలు, అహింసాత్మకమైన పోరాటాలు, ఎన్నికల పరిధిలో వున్న పోరాటాలు, ఎన్నికలను తిరస్కరించే పోరాటాలు – అన్ని రూపాలలోనూ పోరాటాలు సాగుతున్నాయి. అత్యంత పాశవికమైన నిర్బంధాలు కూడ ప్రజలను పూర్తిగా నాశనం చేయలేకున్నాయి. అందుకు విరుద్ధంగా తాను ఎంతగా హత్యలకూ, దహనాలకూ, అరెస్టులకూ, అత్యాచారాలకూ పాల్పడితే ప్రజలలో అంతగా అసంతృప్తి బలపడుతోందని ప్రభుత్వం అనుభవపూర్వకంగా గ్రహిస్తోంది. ఈశాన్య భారతమే దీనికి చక్కని ఉదాహరణ. ఒక పిడికెడు మంది తిరుగుబాటుదారులు భారత సైన్యాన్ని 35 సంవత్సరాలుగా ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఈ వాస్తవాన్ని ఇంకా అనేక ప్రాంతాలలో చూడొచ్చు. అయితే – అది బీహార్ గానీ ఆంధ్రప్రదేశ్ గానీ ఆ మాటకొస్తే పంజాబు రాష్ట్రమే గానీ ఈ ప్రతిఘటన తన అసంఘటిత స్వభావాన్ని వదులుకొని ఒక బలమైన ఐక్య ప్రజా ఉద్యమం కాగలిగిన నాడు రాజ్య యంత్రాంగం పెంచి పోషిస్తున్న అణచివేత శక్తి తప్పనిసరిగా ఓటమిని చవిచూస్తుంది.

*నలుపు పక్షపత్రిక*
***1-15 ఆగస్టు 1989***



# మిలిటెన్సీకి తప్పుడు భాష్యం

తీవ్రవాదాన్నీ, టెర్రరిజాన్నీ కలిసికట్టుగా ఎదుర్కోవాలని ప్రపంచదేశాలు పదే పదే ప్రకటిస్తుంటాయి. పనిగట్టుకొని ఇతర దేశాలలో సాయుధ మిలిటెన్సీని ప్రోత్సహించే కొన్ని దేశాలను మినహాయించి, తక్కిన దేశాలకు ఈ విషయంలో ఏకాభిప్రాయం ఉంది.

కానీ ప్రభుత్వాలు ఎన్నిసార్లు ఎంత గంభీరంగా ప్రకటనలిచ్చినా, తీర్మానాలు చేసినా ఇది సులభంగా తీరే సమస్య కాదు. 20వ శతాబ్దం సెలవు తీసుకుంటూ 21వ శతాబ్దానికి తన వారసత్వంగా అందిస్తున్న సమస్యలలో ఇదొకటి. నిజానికి ఇది రాబోయే రోజులలో మరింత తీవ్రరూపం తీసుకునే అవకాశం ఉంది. ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు అమలు చేస్తున్న ఆర్థిక పునర్వ్యవస్థీకరణ విధానాల వల్ల 'తీవ్రవాదం', 'టెర్రరిజం' అని పిలవబడే రాజకీయ సమస్యలు పెరిగే అవకాశం, ఇప్పుడు లేని కొత్త ప్రాంతాలలో మొలకెత్తే అవకాశం కూడ ఉంది.

అసలు వీటిని 'సమస్యలు' అని మాత్రమే భావించడంలోనే లోపం ఉంది. రాజకీయ మిలిటెన్సీ వల్ల ప్రజలకే సమస్యలూ లేవని కాదు. కానీ ఆ మిలిటెన్సీని ప్రధానంగా సామాజిక పునాది ఉన్న రాజకీయ విషయంగా అర్థం చేసుకోవడం అవసరం. ప్రభుత్వాలు ఈ అవగాహన పెంచుకోలేని పక్షంలో 21వ శతాబ్దం చాలా హింసను చూడబోతుంది.

మన దేశాన్ని ఉదాహరణగా తీసుకొని దీనిని వివరించవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ళకు మన దేశంలోని మొదటి సాయుధ రాజకీయ

పోరాటం నాగాలాండ్‌లో మొదలయింది. ఆ తరువాత పదేళ్ళకు నక్సలైట్ ఉద్యమం బెంగాల్‌లో మొదలయి బీహార్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు పాకింది. ఇంకొక 15 సంవత్సరాల తరువాత పంజాబ్‌లోనూ, స్వాతంత్ర్యం వచ్చిన నలభై ఏళ్ళకు కాశ్మీర్‌లోనూ రాజకీయ మిలిటెన్సీ అంకురించింది. బాబ్రీమసీదు కూల్చివేత తరువాత దేశంలో అనేకచోట్ల సాయుధ నిరసన చర్యలకు పాల్పడే ముస్లిం యువకుల గుంపులు ఏర్పడ్డాయి.

దీనినంతా 'టెర్రరిజం' అనీ, 'తీవ్రవాదం' అనీ తిట్టిపోసినా, ప్రజలందరూ ఒక్కుమ్మడిగా దీనిని వ్యతిరేకించాలని ఉద్ఘోషించినా, కలిసికట్టుగా దీనిని వ్యతిరేకించాలని ప్రపంచ దేశాలు నెలకొకసారి తీర్మానాలు చేసినా ఇదెక్కడికీ పోదు. కనీసం అర్థం కూడ కాదు. 'జనజీవన స్రవంతి'లోకి రమ్మని ఈ మిలిటెంట్లకు మన ప్రభుత్వం తరచుగా పిలుపు ఇస్తుంటుంది. ఆ స్రవంతిలోకి రానందుకు వారిని నిందిస్తుంటుంది. కానీ నిజానికి ఈ మిలిటెన్సీ 'జనజీవన స్రవంతి'కి దూరంగా ఉన్న ప్రజల నుండి – లేదా దూరంగా ఉన్నామన్న బలమైన భావన గల ప్రజల నుండే పుట్టింది. ఆ విషయాన్ని గుర్తించినప్పుడు ఇవి 'సమస్యలు'గా కనిపించవు.

మిలిటెన్సీ వల్ల ప్రజలకు ఏ సమస్యలూ లేవని చెప్పడం నా ఉద్దేశం కాదు. సాయుధ పోరాట రాజకీయాలకు ఎంత న్యాయమైన కారణమైనా ఉండవచ్చును గాక, కాని అది తీసుకునే రూపం వల్ల దాని సామాజిక పునాది అయిన ప్రజలకు సహితం అనేక సమస్యలు వస్తాయి. వాటిని ఏకరవు పెట్టనవసరం లేదు. కానీ ఆ సమస్యలనే సర్వం చేసి దానిని నిందించడంలో బొత్తిగా అర్థం లేదు. నాగాలాండ్ నుండి కాశ్మీర్ దాకా మిలిటెన్సీకి 'తీవ్రవాదం' అనీ, 'టెర్రరిజం' అనీ పేరుపెట్టి నిందించి సాధించిన ఫలితమేమీ లేదు – ప్రజలను విపరీతంగా హింసించడం తప్ప.

నాగాలాండ్, పంజాబు, కాశ్మీర్‌ల ప్రస్తావన వచ్చేసరికి మన భూభాగం, మన దేశ సమగ్రత, అఖండత మొదలయిన భావనలు ముందుకొస్తాయి. చాలా ఆవేశం కూడ వస్తుంది. కానీ మన దేశ సరిహద్దుగా మనం భావించేది చాలావరకు బ్రిటిష్ వలస పాలకుల కల్పన. సరిహద్దును నిర్ణయించడంలో వారు కొంతమేరకు చారిత్రకంగా సంక్రమించిన విభజన రేఖలను ఆశ్రయించారు కాని కేవలం తమ పాలనా సౌలభ్యం కోసం, లేక వ్యూహాత్మక భద్రతా ప్రయోజనాల కోసం వారు గీసిన విభజన రేఖలు కూడ కొన్నిచోట్ల సరిహద్దులో భాగమయ్యాయి. అవి చారిత్రకంగా, సాంస్కృతికంగా

కృత్రిమమైనవి. వాటి పట్ల కూడ మనం 'దేశభక్తి' పెంచుకొని ఆవేశపడడం వల్ల తమ ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మన సరిహద్దు లోపల ఇరుక్కున్న ఆ ప్రజల మాటలు వినడానికి సహితం మనం సిద్ధంగా లేము.

నాగా ప్రజలు ఏ రోజూ ఏ అర్థంలోనూ భారతదేశంలో భాగం కాదు. వాళ్ళను పూర్తిగా లోబరుచుకునే ప్రయత్నం మొగలాయి పాలకులు సహితం చేయలేదు. సాంఘికంగా, సాంస్కృతికంగా నాగాలు పొరుగున ఉన్న ఉత్తర బర్మా ఆదివాసీ తెగలకు సన్నిహితులు. వాళ్ళ ఇష్టాయిష్టాలతో సంబంధం లేని చారిత్రక కారణాల వల్ల నాగాలకూ ఆ తెగలకూ మధ్య భారత – బర్మా సరిహద్దు రేఖ ఏర్పడింది. ఆ సరిహద్దు రేఖ కొంచెం ఇటువైపు ఉండి ఉంటే నాగా ప్రజలు బర్మాలో ఉండేవారు. వారి స్వాతంత్ర్య కాంక్ష భారత దేశభక్తికి కాక బర్మా దేశభక్తికి శత్రువు అయి ఉండేది. దేశభక్తికి సరిహద్దు రేఖలను ప్రమాణం చేసుకునేటట్టయితే ఆ మాటకు అర్థం ఇంత చంచలంగా ఉంటుంది.

కాశ్మీర్ ఎప్పటి నుండో భారత భూభాగంలో భాగమంటూ మనవాళ్ళు ఆవేశపడుతుంటారు గానీ ఆ మాట అనే అవకాశమేమైనా ఉందంటే దానికి కారణం బ్రిటిష్ వలస పాలకులు కాకతాళీయంగా తీసుకున్న ఒక నిర్ణయం. జమ్ము–కాశ్మీర్ లాహోరు రాజధానిగా గల సిక్కు రాజ్యాలలో భాగంగా ఉండేది. మహారాజా రంజిత్‌సింగ్‌ను బ్రిటిష్‌వాళ్ళు ఓడించిన తరువాత అతని రాజ్యంలోని పంజాబు ప్రాంతాన్ని నేరుగా బ్రిటిష్ పాలిత ప్రాంతంలో కలుపుకున్నట్టే జమ్ము–కాశ్మీర్‌ను కూడ కలుపుకొని ఉన్నట్టయితే, దేశ విభజన సందర్భంగా పంజాబులోని ముస్లిం మెజారిటీ ప్రాంతం పాకిస్తాన్‌కు పోయినట్టే జమ్ము–కాశ్మీర్‌లోని ముస్లిం మెజారిటీ ప్రాంతం కూడ 1947లోనే పాకిస్తాన్‌లో కలిసేది. ఈ రోజు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీరుగా మనం పిలుచుకునే ప్రాంతమే కాక ఈ రోజు ఇండియాలో ఉన్న జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని పెద్ద భాగం కూడ ఆనాడే పాకిస్తాన్‌లో కలిసి ఉండేది. మనమంతా నలభై ఏళ్ళుగా దేశభక్తి పెంచుకొని ఆవేశపడుతున్న కాశ్మీర్‌లోయ (ఇక్కడ 95 శాతం పైగా ముస్లింలే) మొత్తంగా పాకిస్తాన్‌లో కలిసి ఉండేది. ఈ మధ్య కాలంలో మనం చాలా ఆవేశపడిన కార్గిల్ జిల్లా కూడ పాకిస్తాన్‌లో కలిసి ఉండేది. కార్గిల్‌కు దక్షిణాన ఉన్న 'లే' జిల్లా, జమ్ము ప్రాంతంలోని దోడా, ఉధంపూర్ జిల్లాలను మినహాయించిన భూభాగం మాత్రం ఇండియాలో ఉండేవి.

సరిహద్దు రేఖల చుట్టూ అల్లుకున్న దేశభక్తి పునాదులు ఇంత చంచలమైనవి.

బ్రిటిష్ వాళ్ళు జమ్ము–కాశ్మీర్‌ను బ్రిటిష్ పాలిత ప్రాంతంలో కలుపుకోకుండా, సిక్కు రాజ్యం మీద చేసిన యుద్ధంలో తమకు లోపాయికారీగా సహకరించి తన యజమానికి ద్రోహం చేసిన రాజా గులాబ్‌సింగ్‌కు పారితోషికంగా జాగీరుగా అప్పగించారు. అందువల్ల 1947 వచ్చేనాటికి 76 శాతం ముస్లింలుగా ఉన్న జమ్ము–కాశ్మీర్ రాష్ట్రాన్ని గులాబ్‌సింగ్ వారసుడు హరిసింగ్ భారతదేశంలోకి తీసుకురాగలిగాడు, మనం ఆ భూభాగాన్ని గురించి దేశభక్తి పెంచుకోగలిగాము.

మన ఆవేశం ఎంత అసంబద్ధమైనదో చెప్పడం కోసం ఈ విషయాలు ప్రస్తావిస్తున్నాను గానీ, ఇక్కడ న్యాయాన్యాయాలు నిర్ణయించవలసింది చరిత్రలో ఏం జరిగిందన్న దాన్ని బట్టి కాదు, ఆ ప్రాంత నివాసులయిన ప్రజల ఆకాంక్షలను బట్టి. ఏ ప్రజలకైనా స్వయం నిర్ణయాధికారం ఉంటుందని అంతర్జాతీయ పౌర రాజకీయ హక్కుల ఒడంబడికలోని మొట్టమొదటి అధికరణం అంటుంది.

నాగా ప్రజలు 1947లోనే భారతదేశంలో తాము భాగం కాదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బ్రిటిష్ వలసవాదులు నాగా ప్రాంతాన్ని 'ఇండియా' అనే తమ వలసలో భాగంగా కలిపి పరిపాలించినంత మాత్రాన, వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత కూడ నాగాలు 'ఇండియా'లోనే ఉండాలని ఏమీ లేదన్నారు. అప్పుడు మన ప్రభుత్వం వాళ్ళను కేవలం పది సంవత్సరాలు వేచి చూడమని కోరింది. నచ్చకపోతే వెళ్ళిపోవచ్చు అంది. కానీ, 1957 వచ్చేనాటికి కూడ నాగా ప్రజలు తమ అభిప్రాయాలు మార్చుకోడానికి సిద్ధంగా లేరని గ్రహించిన భారత ప్రభుత్వం ఎట్టి పరిస్థితిలోనూ నాగా ప్రాంతాన్ని భారతదేశం నుండి బయటకు పోనిచ్చేది లేదని ప్రకటించింది. అప్పుడు నాగా యువకులు భారత రాజ్యంతో ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడ్డారు. అంటే స్వాతంత్ర్యం వచ్చిన పదేళ్ళకే మన దేశంలో మొదటి సాయుధ పోరాటం మొదలయింది. దీనికి 'వేర్పాటువాదం' అని పేరు పెట్టాము. తీవ్రవాదం అన్నాము. టెర్రరిజం అన్నమాట ప్రచారంలోకి వచ్చిన తరువాత టెర్రరిజం అని కూడ అన్నాము కానీ నాగా ప్రజల బలమైన జాతీయ కాంక్షలో దానికి మూలం ఉందని మాత్రం గుర్తించలేదు.

40 సంవత్సరాలకు పైగా భారత సైన్యం నాగా మిలిటెన్సీని ఎదుర్కొని పోరాటం చేస్తూనే ఉంది. భయంకరమైన అత్యాచారాలకు పాల్పడింది. వేలమందిని చంపింది.

అటు నాగా మిలిటెంట్లు కూడ భారత సైన్యం మీదనే కాక తమకు అడ్డం వచ్చిన వారందరిపైనా హింస ప్రయోగించారు.

సైనిక బల ప్రయోగంతోపాటు ఇంకొక వ్యూహాత్మక ప్రయోగాన్ని కూడ భారత ప్రభుత్వం చేపట్టింది. అదేమిటంటే భారత రాజ్యానికి అనుకూలమైన వర్గాన్ని నాగా ప్రజలలో తయారు చేసుకోవడం, అభివృద్ధి పేరిట వారి చేతిలో నిధులు బాగా పెట్టడం. ఈ ప్రయోగం జరుగుతున్న క్రమంలో అవినీతిమయమయిన వర్గమొకటి ఆ ప్రాంతంలో తయారయింది.

అయినప్పటికీ మిలిటెన్సీ తగ్గలేదు. దానికి నాగాలాండ్‌లో ఆకర్షణ తగ్గలేదు. ఈ లోగా భారత ప్రభుత్వం మరింత నీచమైన ఎత్తుగడకు ఒడిగట్టింది. అదేమిటంటే నాగాలతో సంప్రదాయంగా వైరం ఉన్న కుకీ జాతిని రెచ్చగొట్టడం. నాగా–కుకీ కలహాలు భయంకరమైన రూపం తీసుకున్నాయి. ఒకరిని ఒకరు ఊచకోత కోసుకున్న సంఘటనలనేకం జరిగాయి. నాగా పోరాటకారులు సహితం భారత ప్రభుత్వం రచించిన 'ట్రాప్'లోనే పడ్డారు. కుకీలను ఒక జాతిగానే భారత ప్రభుత్వ ఏజెంట్లుగా ప్రకటించి వారిపైన ప్రతీకారం తీర్చుకోసాగారు.

ఈ రకరకాల చావు వార్తలు పత్రికలలో అనునిత్యం వస్తుంటాయి. కాబట్టి నాగాలాండ్‌లో ఒక టెర్రరిస్టు సమస్య లేక 'వేర్పాటువాదం సమస్య' ఉందన్న అభిప్రాయం ఇతర ప్రాంతాలలో బలపడుతుంటుంది. మనకందరికీ నాగా ప్రజలు ఒక సమస్యగా కనిపిస్తుంటారు. కానీ అసలు సమస్య వాళ్ళది. బలవంతంగా తమను తాము 'భారతీయులు'గా భావించుకోవాలని మనం వాళ్ళను కోరడంతో వారి సమస్య మొదలయింది. ఈ సత్యాన్ని మనం గుర్తించనంత కాలం వారి సమస్య పరిష్కారం కాదు. మనకు 'టెర్రరిస్టు సమస్య' పోదు. ఈ లోపల నాగాలాండ్ హింసకూ రక్తపాతానికీ అవినీతికీ రాజకీయ అవకాశవాదానికీ నిలయంగా మారి వికారంగా తయారవుతుంది.

'నక్సలైట్ సమస్య' ఈ కోవకు చెందిన రెండవ సమస్య. భారత రాజ్యం కల్పించే రాజకీయ అవకాశాల పరిధిలోనే ఆ రాజ్యంపైన పోరాటం చేస్తే దానిని కూలదోయడం సాధ్యం కాదన్న అభిప్రాయానికొచ్చిన కమ్యూనిస్టుల రాజకీయ నిర్ణయమే దాని ఆవిర్భావానికి మూలం. నాగా, కాశ్మీర్ తదితర జాతి పోరాటాల లాగ దీని పోరాట లక్ష్యం ఏ సామాజిక వర్గంలోనయినా మెజారిటీ ప్రజల లక్ష్యమని

నమ్మడానికి ఆధారాలేమీ లేవుగానీ తమ లక్ష్యసాధన కోసం ప్రజలను సమీకరించడానికి మార్క్సిస్టు – లెనినిస్ట్ పార్టీలు అనుసరించే సాంఘిక ఆర్థిక పోరాటాలు, లేక చర్యలకు విశేష ఆదరణ, ఆకర్షణ ఉన్న సంగతి ఎవరూ కాదనలేరు. భారత రాజ్యం ఇవ్వగల హక్కులతోనూ, కల్పించగల సంక్షేమంతోనూ పైస్థాయికి చేరుకోలేకపోతున్న అట్టడుగు వర్గాల ప్రయోజనాలను మిలిటెంట్ ఉద్యమాల ద్వారా గానీ, మిలిటెంట్ల బలప్రయోగం ద్వారా గానీ సాధించే పోరాటంగా నక్సలైట్ ఉద్యమం ఉనికిలోకి వచ్చింది. గ్రామీణ ప్రాంతాలలో అనేక మార్పులకు ఇది తోడ్పడింది. మన రాష్ట్రంలో ఆదివాసులకు సంబంధించిన కొత్త సంస్కరణలూ, చట్టాలూ 1970 తరువాత ఉనికిలోకి రావడానికి ప్రధాన కారణం పార్వతీపురం ఏజెన్సీలో ఆదివాసులు పునాదిగా నడిచిన నక్సలైట్ ఉద్యమం. తెలంగాణలో చట్టాల కంటే సామాజిక సంబంధాలలో ఎక్కువ మార్పు తీసుకొచ్చాయి మార్క్సిస్టు – లెనినిస్ట్ పార్టీలు. తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో మధ్యయుగాలను పోలి నడుస్తుండిన దొరల ఆర్థిక పెత్తనాన్నీ, కుల పెత్తనాన్నీ అదుపుచేసి పేదలు, దళితులు, ఆదివాసులు తలెత్తుకు తిరిగేటట్టు చేయగలిగాయి.

అయితే నక్సలైట్ ఉద్యమం పాత్ర అక్కడే ఉండిపోలేదు. వారు తమ రాజకీయ లక్ష్యానికి ఎంత మద్దతు సమీకరించగలిగారో తెలీదుగానీ, రాజ్య యంత్రాంగానికి ఒక ప్రత్యామ్నాయ బలప్రయోగ కేంద్రంగా ఈ రోజు అనేక ప్రాంతాలలో వారు ఉన్నారనేది వాస్తవం. రాజ్య యంత్రాంగం మొత్తం మీద ధనవంతులకూ బలవంతులకూ అనుకూలంగా ఉండగా నక్సలైట్ పార్టీలు మొత్తం మీద పేదలకూ పీడితులకూ అనుకూలంగా ఉన్నాయి. ఈ రెండు బలప్రయోగ కేంద్రాలు పోటాపోటీగా ప్రజలను తమ అదుపులో ఉంచుకోవడానికి చేసే ప్రయత్నాల ఫలితం నిత్యం వివిధ హింసాత్మక ఘటనల రూపంలో పత్రికలలో వస్తుంటుంది. కానీ దాని వెనక ఉన్న సామాజిక ఆర్థిక పరిస్థితులను చూడకుండా హింసను మాత్రమే చూస్తే పూర్తి అవగాహన ఏర్పడదు.

ప్రభుత్వం వైపు నుండి ఈ హింస ప్రధానంగా మిలిటెంట్లనూ సానుభూతిపరులనూ ఎత్తుకుపోయి కాల్చి చంపే ఎన్‌కౌంటర్ల రూపంలో ఉంది. ప్రతీ సంవత్సరం మరింత ఎక్కువమందిని చంపుతున్నా 'నక్సలైట్ సమస్య' పరిష్కారం కాకపోవడం పట్ల ప్రభుత్వంలో ఎటువంటి పునరాలోచనా లేదు. దీని ఫలితమేమిటంటే ఏ తెలంగాణ

పీడిత ప్రజానీకం సమస్యలయితే నక్సలైట్ ఉద్యమానికి ఆస్కారం కల్పించాయో ఆ ప్రజలే తమ పిల్లలను ఏ రోజు పోలీసులెత్తుకుపోయి చంపుతారో అని భయపడుతూ బతికే వికృతమైన పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ ఆమోదిస్తున్న నూతన ఆర్థిక విధానాల ఫలితంగా సమాజంలో అసమానతలు, అభద్రత, నిరుద్యోగం పెరిగే ప్రమాదం ఉంది. అప్పుడు ఎం.ఎల్ పార్టీలు ఈ రోజు నిర్వహిస్తున్న ప్రత్యామ్నాయ బలప్రయోగకేంద్రం పాత్రకు ఆదరణ, ఆకర్షణ పెరిగే అవకాశం ఉంది. తమ ఉనికి కోసమే ఇప్పటికంటె ఎక్కువ సంఖ్యలో ప్రజలు వారి దరి చేరవచ్చు. దీనిని 'తీవ్రవాదానికి సహకరించడం' అనే నేరస్వభావం గల చర్యగా మాత్రమే అర్థం చేసుకునే మన పాలకుల చేతిలో తెలంగాణ ఈ రోజు అనుభవిస్తున్న హింస కంటే రేపు రెండింతలు బాధకు గురయ్యే ప్రమాదం ఉంది.

ఆ తరువాత పంజాబ్ వంతు వచ్చింది. నాగాలాండ్‌లోనూ, కాశ్మీర్‌లోనూ స్థానిక ప్రజానీకంలోని మెజారిటీ ఆకాంక్షల నుండి మిలిటెన్సీ పుట్టింది. కాని పంజాబులో మిలిటెన్సీ పంజాబీలలోనే కాదు, సిక్కులలో సహితం అంతటి విశాలమైన మద్దతు ఉన్న ఉద్యమం కాదు. అయినప్పటికీ ఒక బలమైన సాంఘిక అసంతృప్తి దాని వెనక ఉందని విశ్లేషకులందరూ గుర్తించారు. హరిత విప్లవం నుండి వచ్చిన ఆధునీకరణ తీసుకున్న వికృత సామాజిక రూపాల పట్ల వ్యక్తమైన నిరసన దానికి మూలం అని కొందరు, ఒక దశ దాకా పురోగమించిన హరిత విప్లవం ఆపైన ముందుకు పోలేక పోవడం వల్ల మిగిల్చిన నిరసన దానికి మూలమని మరికొందరు, హరిత విప్లవం వల్ల సంపద బాగా పెంచుకున్నవారి రాజకీయ అసహనం, లేక అహంకారం దానికి మూలమని ఇంకొందరు విశ్లేషించారు. చెప్పుకోదగ్గ విషయమేమిటంటే పంజాబీ సిక్కు మిలిటెన్సీని సామాజికంగా అర్థంచేసుకునే ప్రయత్నం చేసిన వారందరూ అది హరిత విప్లవానికి గల సామాజిక రాజకీయ పర్యవసానాలతో ముడిపడి ఉందనే భావించారు. ఇప్పుడు దేశవ్యాప్తంగా అదే నమూనాలోని అభివృద్ధిని సరళీకరణ, గ్లోబలైజేషన్‌ల పేరిట మన పాలకులు నిర్విచక్షణగా ప్రోత్సహిస్తున్నారు కాబట్టి అటువంటి పరిస్థితులు పునరుత్పత్తి అయ్యే ప్రమాదం చాలా ఉంది. గతాన్ని గురించి సహేతుకమైన అవగాహన ఉండి ఉంటే భవిష్యత్తులో కొంత మెలకువగా వ్యవహరిస్తారని ఆశించడానికి ఆస్కారం ఉండేది.

కానీ పంజాబు మిలిటెన్సీని మన 'అభివృద్ధి నమూనా'తో ముడిపడిన విషయంగా మన పాలకులు భావించలేదు. కేవలం గుడ్డి మతోన్మాదం నుండి పుట్టిన క్రూరత్వంగా దానిని అర్థం చేసుకొని అంతే క్రూరంగా దానితో వ్యవహరించారు. అటు ఖలిస్తాన్ పోరాటం కూడ మన దేశంలో ఏ మిలిటెంట్ పోరాటమూ ప్రదర్శించని క్రూరత్వాన్ని ప్రదర్శించింది. అనాలోచితమైన చర్యలకు, విచ్చలవిడి హింసకూ పాల్పడింది. దానికి జవాబుగా ప్రభుత్వం అంతే విచ్చలవిడిగా ఎదురుదాడులు చేసింది. ఖలిస్తాన్ హంతక ముఠాలను చేరదీసి జనంపైన హింసాకాండకు పాల్పడింది. ఎవరు మిలిటెంట్లో ఎవరు నకిలీ మిలిటెంట్లో ఎవరు తెల్లబట్టల పోలీసులో తెలియని భయంకరమైన పరిస్థితి 1980ల చివరి సంవత్సరాలలో పంజాబులో నెలకొనింది. జలంధర్, లూధియానా వంటి నగరాలలో సహితం సాయంత్రం అయిదు దాటితే పరిచయస్తులు కూడ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేసి అనుమానం నిండిన దృక్కులతో గబగబా ఇల్లు చేరుకునేవారు. ఏదో ఒక రాజకీయ వాసన ఉండి ఆ నాలుగయిదేళ్ళ కాలంలో ఎవరి చేతిలోనూ చావకుండా బయటపడిన పంజాబీలు అదృష్టవంతులనే చెప్పుకోవాలి.

కాశ్మీర్‌లో ఆఖర్లో మిలిటెన్సీ వచ్చింది గానీ బహుశా నాగాలాండ్‌ను మినహాయిస్తే వేరే ఎక్కడా మిలిటెన్సీకి ప్రజలలో అంత లోతయిన మద్దతు లేదు. ప్రభుత్వం ప్రతి చర్య కూడ ఇంత క్రూరంగా వేరే ఎక్కడా లేదు. ఎందుకంటే 'కాశ్మీర్ సమస్య' భారత–పాకిస్తాన్‌ల వైరంతో ముడిపడి ఉంది. ముడిపడి ఉండడమేమిటి! దానికదే పునాది. వేరే ఏ విషయంలోనయినా మన దేశ పాలక పార్టీలలోని ఏ ఒక్కటైనా కొంచెం హేతుబద్ధంగా వ్యవహరిస్తుందేమో గానీ పాకిస్తాన్ ప్రస్తావన వస్తే మెదళ్ళకు తాళాలు పడిపోతాయి. 'ఒక్క అంగుళం కూడ వెనక్కి తగ్గేది లేదం'టూ వీర దేశభక్తి ప్రకటించడం తప్ప మన దేశ రాజకీయవేత్తలకు పాకిస్తాన్ విషయంలో ఒక విధానమంటూ లేదు. ఈ మూర్ఖత్వానికి పాపం కాశ్మీరీలు బలవుతున్నారు. కాశ్మీర్ గురించి వాస్తవాలు ఎంత వివరంగా చెప్పినా 'అంతా నిజమే కావచ్చు గానీ పాకిస్తాన్ దుర్మార్గాన్ని మరచిపోలేము కదా' అని మనవాళ్ళు కొట్టిపారేస్తారు.

'రోజా'వంటి సినిమాల ఫలితంగా కాశ్మీరీ మిలిటెన్సీ క్రూరమైన మతోన్మాద మూర్ఖత్వానికి చిహ్నంగా నిలిచింది. ఈ రోజు కాశ్మీర్‌లో పోరాటం చేస్తున్న మిలిటెంట్లలో

మూర్ఖులూ మతోన్మాదులూ చాలామంది లేకపోలేదు గానీ కాశ్మీర్ సమస్య మూలాలలో మూర్ఖత్వం లేదు. మతోన్మాదం అసలే లేదు. నిజానికి కాశ్మీరీ ప్రజా జీవిత సంస్కృతిలోనే ఆ లక్షణాలు చాలా తక్కువ. ఒక ప్రజానీకానికి మొత్తంగా సద్గుణాలు గానీ దుర్గుణాలు గానీ అంటగట్టడంలో అర్థం లేదు. అయితే ఒక్కొక్క జీవిత సంస్కృతిలో కొన్ని లక్షణాలు ఎక్కువ, కొన్ని తక్కువ ఉంటాయి. ఈ అర్థంలో కాశ్మీరీలలో మృదుత్వం, స్నేహశీలం, పరస్పర సహనం మొదలయిన గుణాల పాలు ఎక్కువే. తమను ఈ రోజు ద్వేషానికీ ఉన్మాదానికీ ప్రతీకలుగా భారతదేశమంతటా భావిస్తున్నారన్నది కాశ్మీరీలకు బాధే కాక విస్మయం కూడ కలిగిస్తుంది.

నిజానికి 1947లో పాకిస్తాన్ బలవంతంగా కాశ్మీర్‌ను ఆక్రమించుకోవాలని ప్రయత్నం చేసినప్పుడు కాశ్మీరీలే బలంగా ప్రతిఘటించారు. అది పాకిస్తాన్ మీద ద్వేషంతో కాదు, తమ స్వాతంత్ర్యం మీద ప్రేమతో. అప్పటి పరిస్థితిలో పాకిస్తాన్ దాడి నుండి తమను తాము రక్షించుకోవాలంటే ఇండియాలో భాగం కావడం తప్పనిసరి అన్న రాజు హరిసింగ్ అభిప్రాయంతో కాశ్మీరీలు ఏకీభవించారు గానీ ఆ ఆపద తీరిపోయిన తరువాత స్వతంత్రంగా ఉండాలన్నదే అధిక భాగం కాశ్మీరీల అభిప్రాయం. వాళ్ళు ఆ అవకాశమే కోరారు. మన పాలకులు అదే హామీ ఇచ్చారు. కానీ ఒక కారణం కాకపోతే మరొక కారణం చెప్పి భారత పాలకులు ఆ హామీని అమలు చేయలేదు. పైగా ఆ హామీ గురించి భారత కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే రాజకీయ శక్తుల గొంతు నొక్కి, 'విలీనం' శాశ్వతం అని చెప్పేవారిని మాత్రమే మనవాళ్ళు కాశ్మీరీ రాజకీయాలలో బతకనిచ్చారు. స్వాతంత్ర్య కాంక్షను విడనాడని పాపానికి దీర్ఘకాలం జైలుపాలయి, జైలు బయట ఉన్నప్పుడు కూడ రాజకీయ స్వేచ్ఛకు దూరమయిన ప్రముఖ కాశ్మీరీ నాయకుడు షేక్ మహమ్మద్ అబ్దుల్లా.

నలభై ఏళ్ళ ఈ ప్రహసనం 1989లో అతి తీవ్రరూపం తీసుకున్న తరువాతే కాశ్మీరీ యువకులలో చాలామంది పాకిస్తాన్ నుండి సైనిక శిక్షణ, సహాయం తీసుకొని భారత ప్రభుత్వం మీద పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. మొదట్లో ఈ పోరాటకారులలో ఎక్కువ భాగం స్వతంత్ర కాశ్మీర్‌ను కోరుకున్నవారే. కానీ వారికి సహాయ సహకారాలు అందివ్వడం పాకిస్తాన్‌కు ఇష్టంలేదు కాబట్టి కొంతకాలానికి పాకిస్తాన్ అనుకూల మిలిటెంట్ల సంఖ్యే పెరిగింది. కానీ కాశ్మీరీ సమాజంలో మాత్రం

పాకిస్తాన్‌లో విలీనం కావాలన్న కాంక్ష కంటే స్వతంత్ర కాశ్మీర్‌ను సాధించాలన్న కాంక్షే ఎక్కువ.

మన ప్రభుత్వం మాత్రం కాశ్మీరీ పోరాటాన్ని పాకిస్తాన్ కుట్రగానే అర్థం చేసుకోదలచుకుంది. సైన్యాన్ని, పారా మిలిటరీని పెద్ద సంఖ్యలో దించి విపరీతమైన నిర్బంధకాండతో దానిని ఎదుర్కొంటున్నది. ఒక మూడేళ్ళుగా బలవంతంగా ఎన్నికలు జరపగలుగుతున్నది గానీ అంతకంటే ఈ పదేళ్ళలో సాధించిందేమీ లేదు. అయితే ఎంత లేదన్నా 60 వేల మంది కాశ్మీరీలు ఈ క్రమంలో చనిపోయారు.

పంజాబులో చేసినట్టు కాశ్మీర్‌లో కూడ భారత ప్రభుత్వం తనకు లొంగిపోయిన మిలిటెంట్లతో వివిధ సర్కారీ మిలిటెంట్ గ్రూపులను తయారుచేసింది. వాటిని కాశ్మీరీల పైకి వదిలింది. వాళ్ళు హత్యలు చేసినా, రేప్‌లు చేసినా, దొంగతనాలు చేసినా వాళ్ళను ఎవరూ ఏమీ అనరు. పోలీసులొక వేళ అరెస్టు చేసినా సైన్యం విడిపిస్తుంది. వాళ్ళ నుండి భారత ప్రభుత్వం కోరుకునేది ఏమిటంటే వాళ్ళు మిలిటెంట్ల సానుభూతిపరులను పట్టుకొని చంపాలి, సైన్యంతో కలిసి మిలిటెంట్లను పట్టుకునే చర్యలలో పాల్గొని తమకున్న పాత సంబంధాలన్నిటినీ సైన్యం సేవలో వినియోగించాలి.


కిరాయి నేరస్తుల మూకలను తయారుచేసి మిలిటెంట్లపైన, వారి సామాజిక పునాది అయిన ప్రజలపైన ప్రయోగించడం భారత ప్రభుత్వం ఒక విధానంగానే 'అభివృద్ధి' చేసిందని గుర్తించాలేమో! చట్టబద్ధపాలనకు పూర్తిగా విరుద్ధమైన ఈ చర్యను నిత్యం చట్టాన్ని గురించి మాట్లాడే ప్రభుత్వం ఆశ్రయించడం ఎబ్బెట్టుగా తోచినా చట్టబద్ధపాలన గురించి మన పాలకులకుండే అవగాహన అక్కడికి చేరుకుందని అనుకోవలసి ఉంటుంది మరి.

అయితే దీనికి పునాది అంతకంటే అభ్యంతరకరమైన వ్యూహంలో ఉంది. అదేమిటంటే రాజకీయ మిలిటెన్సీని ఎదుర్కోవాలంటే దాని సామాజిక పునాదిపైన దాడిచేసి ఆ ప్రజలను భయభ్రాంతులు చేయాలి, హింసించాలి, విసిగించాలి అనేది. అప్పుడు వారు మిలిటెన్సీకి దూరం అయితే మిలిటెన్సీ ఆ రకంగా బలహీనపడుతుందని ఈ వ్యూహం భావిస్తుంది. రాజకీయంగా జవాబు చెప్పవలసిన మిలిటెంట్ పోరాటాలకు, వాటి పునాది అయిన ప్రజలను హింసించడం ద్వారా జవాబు చెప్పడం చాలా అనాగరికమైన ఆలోచన. కానీ అదే మన ప్రభుత్వ నీతిగా ఉంది.

ఈ నీతితో మనం 21వ శతాబ్దంలోకి పోతున్నాం. రాజకీయ మిలిటెన్సీ రాబోయే రోజులలో పెరిగే అవకాశమే తప్ప తగ్గే అవకాశమేమీ లేదు కాబట్టి ఇది తీవ్రంగా ఆందోళన చెందవలసిన విషయం. ప్రభుత్వం ఆ ఆలోచన నుండి మనల్ని పక్కకు మళ్ళించడానికి మిలిటెంట్ల ఆయుధ సంపత్తి గురించి, హింసాత్మక చర్యల గురించి చర్చ పెడుతుంది. అదంతా వట్టి అబద్ధమని కాదు గానీ, మిలిటెంట్ల దగ్గర ఎంత విధ్వంసకశక్తి గల ఆయుధాలున్నా అవన్నీ ప్రభుత్వాలు తమ సైనిక అవసరాల కోసం తయారుచేసి 'బ్లాక్ మార్కెట్' ద్వారా మిలిటెంట్ల చేతిలోకి పోయిన నమూనాలేనని మరచిపోకూడదు. ఏ సైన్యం ఎక్కడా చేయని విధ్వంసం ఏ మిలిటెంట్లూ ఎక్కడా చేయలేదు. ఏ సైన్యమూ ఎక్కడా ధరించని ఆయుధాలు ఏ మిలిటెంట్ల దగ్గరా లేవు. ఇది రాజకీయ సాయుధ పోరాటాల హింసను తక్కువ చేసి చూపడం కోసం చెప్తున్న మాట కాదు. విషయాన్ని గురించి కొంచెం స్థిమితంగా చూడడం అవసరమని గుర్తు చేయడం కోసం చెప్తున్న మాట.

స్థిమితంగా చూసినప్పుడు మనకు కనిపించేది మిలిటెంట్ల చేతిలోని ఆయుధాలు కావు. వారి వెనక ఉన్న ప్రజలు, ప్రజా సమస్యలు. ఆ ప్రజలకు వారే ప్రతినిధులని గానీ, వారి మాటలన్నీ ప్రజల మాటలేనని గానీ అనుకోనక్కరలేదు, ఒప్పుకోనక్కరలేదు. వారు చేసే హింసనంతా సమర్థించవలసిన అవసరమూ లేదు. అయినప్పటికీ ఈ మేరకు వాస్తవాలను చూడాలి. వాస్తవికంగా అర్థం చేసుకోవాలి. ఇక మీదటయినా ఈ స్పృహను మన ప్రభుత్వానికి మనం కల్పించకపోతే కొత్త సహస్రాబ్ది మరింత రక్తసిక్తంగా మారే ప్రమాదం ఉంది.

*సుప్రభాతం వీక్లీ*
***27 నవంబర్ 1999***



# పోలీసుమయమైన పాలనా సంస్కృతి

హక్కుల ఉద్యమం చాలాకాలంగా అడుగుతున్న ప్రశ్న ఇప్పుడు చేవెళ్ళ దారుణం సందర్భంగా మరొకసారి అడగవలసి వస్తున్నది.

ఈ ప్రభుత్వంలో పోలీసు శాఖ తప్ప వేరే శాఖలే లేవా? ఈ ప్రభుత్వానికి పోలీసు బాధ్యతలు తప్ప వేరే బాధ్యతలే లేవా?

చేవెళ్ళలో పోలీసులు అనవసరంగా బల ప్రయోగానికి పాల్పడ్డారు, అందులో భాగంగా ప్రైవేట్ పగలు తీర్చుకున్నారు అనేది తరువాతి సంగతి. అసలు ఆనాటి సమస్యకూ పోలీసులకూ సంబంధం ఏమిటి? సంబంధం ఉన్న ప్రభుత్వ శాఖలు ఏం చేస్తున్నాయి?

ఒక సంవత్సర కాలంగా తీవ్రమైన కరువు అనుభవిస్తున్న రైతుల దగ్గర విత్తనాలు లేవు కాబట్టి సబ్సిడీకి విత్తనాలు ఇస్తున్నారంటే పెద్ద సంఖ్యలో వస్తారు, ఆశగా వస్తారు. ఈ సంగతి ఆ విత్తనాల పంపిణీకి బాధ్యత వహించే అధికారులకు తెలీదా?

రెండు పంటలు పోగొట్టుకున్న వ్యవసాయదారుల ఆశకూ ప్రభుత్వం చేయగల పంపిణీకీ మధ్య అంతరం ఉండక తప్పదు. దానిని తప్పుపట్టలేక పోవచ్చు. అయితే ఆ వాస్తవాన్ని గ్రహించి తగు ఏర్పాట్లు చేసుకోలేకపోవడాన్ని, అసలు ఆ ఆలోచనే తోచకపోవడాన్ని తప్పుపట్టకుండ ఉండలేము.

కొంత వ్యవధి తీసుకుని అందరి అవసరాన్నీ తీర్చగలిగినట్టయితే ఆ మాట చెప్పి రోజుకెన్ని బస్తాల విత్తనాల పంపిణీ జరుగుతుందో

ప్రకటించి రైతులను కొంచెం ఓపిక పట్టమని అడిగి ఉండవచ్చు. అందరి అవసరాన్నీ తీర్చడం సాధ్యం కానట్టయితే గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి, అవసరం ఎక్కువ ఉన్న రైతులను ఎంపిక చేసి వారికి మాత్రమే సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేసి ఉండవచ్చు. కరువు బియ్యం, కరువు పెన్షన్ల పంపిణీలో ఇదే పద్ధతి అనుసరించారు కాబట్టి ఇది ఆచరణ సాధ్యమేననీ, అవకతవకలు జరిగే అవకాశం ఉన్నప్పటికీ ఇతర పద్ధతుల కంటే ఇదే ప్రజాస్వామికమయినదనీ ఈ పాటికి రాష్ట్ర అధికార యంత్రాంగానికి అర్థమయ్యే ఉండాలి.

కాని ఈ ఆలోచనలు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులకెవ్వరికీ రాలేదు. కనీసం విత్తనాల పంపిణీ జరిగే చోట బాధ్యత గల అధికారి ఎవరయినా ఉండాలనీ, 'నాకు విత్తనాలు దక్కుతాయా?' అన్న రైతుల ఆందోళనకు జవాబు చెప్పి శాంతపరిచే సమాచారం, నిర్ణయాధికారం వారి వద్ద ఉండాలని కూడ మన పాలకులు అనుకోలేదు. సమస్యలొస్తే పోలీసులు చూసుకుంటారు. ఆ పైన 'గాయపడిన వారికి 10 వేలు, మృతులకు 1 లక్ష అనే ఫార్ములా' అన్నిటినీ చక్కదిద్దుతుంది అని చంద్రబాబు నమ్మకం.

రెండు రోజుల తరువాత వరంగల్ మార్కెట్‌లో ఇంకొక రూపంలో విత్తనాల గురించి రైతులు ఆందోళన చేసేసరికి 'చేవెళ్ళ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని' ఎస్.పితో బాటు కలెక్టర్ కూడ అక్కడికి కదిలి వెళ్ళాడు. చేవెళ్ళ ఘటన జరగకపోయుంటే అదే తంతు వరంగల్‌లో జరిగి ఉండేది. చేవెళ్ళకు ముందు ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదనీ కాదు, ఆ విషయం అధికార యంత్రాంగానికి తెలియదనీ కాదు. ఇప్పుడది అందరి మనస్సుల్లోనూ మెదులుతున్నందువల్లే అధికారులు అక్కడికి తరలి వెళ్ళారు. అందువల్ల వరంగల్ మార్కెట్ ఆందోళన ఏ నష్టపరిహారాలూ అవసరం లేకుండ ముగిసింది. ఇంకొక నాలుగు నెలలు గడిచి అందరూ చేవెళ్ళను మరిచి పోయినాక మళ్ళీ అదే వైఖరి ప్రదర్శిస్తారు.

అదే రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో ఏప్రిల్ నెల ఆఖరు వారంలో స్వంత ప్రాక్టీస్ మీద దృష్టి పెట్టి ప్రభుత్వ ఆస్పత్రి బాధ్యతను నిర్లక్ష్యం చేసిన డాక్టరు కారణంగా కాన్పుకు ఆస్పత్రికి వచ్చిన తల్లీ, బిడ్డ చనిపోయారు. అయిదు పోస్టులున్న వికారాబాద్ ఆస్పత్రిలో మూడే నింపారనీ, ప్రసూతి నిపుణుల పోస్టు ఖాళీగా ఉందనీ, ఉన్న ఆ

ముగ్గురు డాక్టర్లు మూడు పూవులు ఆరు కాయలుగా ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకుంటున్నారనీ ఇత్యాది విషయాలన్నీ ఉమారాణి మృతి సందర్భంగా వెలుగులోకి వచ్చాయి.

వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళనకు దిగారు. పూర్తిగా న్యాయమైన డిమాండ్లతో ఊరేగింపు తీశారు. అయినా వైద్య విధాన పరిషత్ అధికారులెవ్వరూ వాళ్ళ వద్దకు వెళ్ళలేదు. వికారాబాద్ వంటి సకల సౌకర్యాలు గల ఊరిలో పనిచేయడానికి డాక్లర్లెందుకు దొరకలేదో చెప్పలేదు. ప్రభుత్వ డాక్టర్లు తమ ఉద్యోగ బాధ్యతను ప్రైవేట్ ప్రాక్టీస్‌కు బలి చేయకుండా చూడడానికి వైద్య విధాన పరిషత్ ఏం చర్యలు చేపట్టిందో వివరించలేదు.

పోలీసులు మాత్రం వచ్చారు. ఊరేగింపుకూ బహిరంగసభకూ అనుమతి ఇచ్చే అధికారం ఉన్న డి.ఎస్.పి 'నా అనుమతి తీసుకోలేదు' అనే కారణం మీద వారిని అరెస్టు చేసాడు. అనుమతి ఇయ్యవలసింది ఆయనే అయినప్పుడు, అనుమతి తీసుకోకపోతే అప్పుడే ఇయ్యొచ్చు. అరెస్టే చేసి తీరాలా?

ఉమారాణినీ ఆమె బిడ్డనూ చంపిన డాక్టరు జైలుకు పోలేదు గానీ ఆందోళన చేసిన వారు – ఉమారాణి అన్నతో సహా – జైలుకు పోయారు. నాలుగయిదు రోజుల దాకా వారికి బెయిలు రాలేదు. నేరం చేసిన డాక్టర్ గారి చర్య చట్టం కళ్ళలో బెయిలబుల్ నేరం కాబట్టి అతను పోలీస్ స్టేషన్‌లోనే బెయిలు తీసుకొని ఇంట్లో హాయిగా ఉన్నారు. ఆ నేరానికీ దాని పూర్వాపరాలకూ స్పందించి ఆందోళన చేసిన వారిపైన పోలీసులు నాన్ బెయిలబుల్ సెక్షన్లు పెట్టదలచుకున్నారు కాబట్టి వారు జైలుకు పోయారు. ఇది ప్రజల కళ్ళకు వికారంగా కనిపిస్తుందనీ, అది తమ పాలనకే మంచిది కాదనీ ఏలిన వారికి కనీసం తోచను కూడ లేదు.

పి.యు.సి.ఎల్ వారు చేవెళ్ళ పోలీసు దౌర్జన్యాన్ని హైకోర్టు దృష్టికి తీసుకుపోయారు. విచారణ జరుపుతున్నామనీ దోషులను శిక్షిస్తామనీ బాధితులకు నష్టపరిహారం ఇస్తామనీ ప్రభుత్వం హైకోర్టుకు చెప్తుంది. 'ఇంక మేము చేయగలిగేది ఏముంది?' అని హైకోర్టు జడ్జీలు అనబోతారు.

పోలీసు సంస్కృతినీ, పోలీసుమయమయిన పాలనా సంస్కృతినీ సంస్కరించాలన్న సంకల్పం మన దేశ న్యాయస్థానాలలో ఎప్పుడూ బలంగా లేదు. 'కొంచెం చూసీ

చూడనట్లు పోకపోతే  ఈ దేశాన్ని ఏలడాన్ని అసాధ్యం చేసిన వాళ్ళమవుతాం' అనే అభిప్రాయం న్యాయమూర్తులలో సహితం బలంగా ఉంది. అటువంటప్పుడు కోర్టుల వల్ల కొన్ని కొన్ని ఘటనలలో కొంచెం న్యాయం జరగవచ్చునెమో గానీ, అవి పునరావృతం కాకుండ నిరోధించడం మాత్రం జరగదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*
***7 జూలై 2003***

# టెర్రరిజం – దాని మూలం

'టెర్రరిజం' అనే దానిని చాలా రకాలుగా నిర్వచించవచ్చును గానీ, 'ఇన్నాళ్ళూ ప్రభుత్వాలు మాత్రమే పాల్పడిన హింసాకాండ, బీభత్సకాండలు ఇప్పుడు ప్రైవేటు గుంపులు కూడ పాల్పడడం' అనేది చారిత్రకంగా చూసినప్పుడు అన్నిటికంటే ఉచితమైన నిర్వచనం. ఎటొచ్చీ టెర్రరిజం గురించి విపరీతంగా ఆవేశపడుతున్న వాళ్ళలో ఎంతమందికి ఈ సత్యం రుచిస్తుందో!

పాలస్తీనాకు ఇజ్రాయిల్ చేసిన అన్యాయం కారణంగా యూదుల మీద ద్వేషం పెంచుకున్న ముస్లిం యువకుల బృందం ముంబాయిలోని కొలాబా ప్రాంతంలో ఒక మూల నివసిస్తున్న యూదు పూజారినీ, ఆయన కుటుంబాన్నీ చంపేసి పోయింది. ఇది ఘోరం అని నిందించడం ఎంత న్యాయమో, ఇటువంటి పనులు సకల ప్రభుత్వాలూ – భారత ప్రభుత్వంతో సహా – కొన్ని వేలసార్లు చేశాయని గుర్తించడం అంత అవసరం. మిలిటెంట్లు పోలీసులను, సైనిక అధికారులను చంపితే దానికి ప్రతీకారంగా ఆ మిలిటెంట్ల సానుభూతిపరులు నివసించే గ్రామాలపైన దాడిచేసి ఎవరిని బడితే వారిని కొట్టిన ఘటనలూ, చంపిన ఘటనలూ కరీంనగర్ నుండి కాశ్మీర్ దాకా ఎన్ని జరగలేదు?

కానీ ఏ కారణంగానో ఇప్పుడొచ్చినంత కోపం అప్పుడు రాదు. ప్రభుత్వ హింసకొక సాధికారత స్వతహాగా ఉండడం అనేది ప్రభుత్వం లేక రాజ్యం అనే భావాన్ని అంటిపెట్టుకొని ఉండే భావజాలంలో ఒక ముఖ్యమైన అంశం. ఈ భావజాలం అన్ని సమాజాలలోనూ ఉంది గానీ

హైందవ సంస్కృతిలో దీని పాలు కొంచెం ఎక్కువ. హింస క్షాత్ర ధర్మం అనే సంప్రదాయ భావన ఆధునిక కాలంలో ప్రభుత్వాల వైపు నుండి జరిగే విచ్చలవిడి హింసాకాండకు సహితం సమాజంలో ఆమోదం తెచ్చి పెడుతున్నది. అహింసనొక ముఖ్యమైన విలువగా స్వీకరించిన గాంధీ వంటి వ్యక్తి రాజ్యహింస పట్ల మెతక వైఖరి కలిగి ఉండడానికి వర్ణ ధర్మం ఆయన ప్రాపంచిక దృక్పథంలో ఒక ముఖ్యమైన భాగం కావడం కారణం. అది ప్రభుత్వాలు శాంతి భద్రతలను నెలకొల్పడం కోసం చేయగల పరిమితమైన బల ప్రయోగానికే కాక రాజకీయ అణచివేత కోసం ప్రయోగించే విచ్చలవిడి హింసాకాండకు కూడ ఆమోదాన్ని అందిస్తుంది. నిజానికి భగవద్గీతను ప్రామాణిక గ్రంథంగా భావించేవారు ఈ రెండింటి మధ్య తేడా చూడగలుగుతారా అంటే అనుమానమే.

ఈ భావజాలం నుండి బయటపడాలే గానీ టెర్రరిస్టులు చేస్తున్న అన్ని పనులూ ప్రభుత్వాలు – సార్వభౌమ పాలకులు – అనాదిగా చేస్తున్నవేనని గుర్తించడానికి ఎక్కువ సమయం పట్టదు. టెర్రరిస్టులు కొత్తగా ఒక్క ఆయుధాన్ని కనిపెట్టలేదు. ఆర్‌డిఎక్స్ నుండి ఎకె 47 దాకా అన్నీ సార్వభౌమ పాలకులు తమ అవసరాల కోసం కనిపెట్టి ఉత్పత్తి చేసి పెట్టుకున్న ఆయుధాలే. తరచుగా వారి ఆయుధాగారాల నుండే వీరు స్మగుల్ చేసి తెచ్చుకుంటున్నారు. ఆయుధాలే కాదు, వాటిని వినియోగించే పద్ధతి మొత్తం కూడ ప్రభుత్వాలు నేర్పినదే. శత్రువు దొరకకపోతే వాడు నివసించే ప్రాంతంలోని అమాయకులను చంపిపోవడం, వాడికి ప్రజాదరణ లేక ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో విచ్చలవిడి బీభత్సకాండకు పాల్పడడం ద్వారా అక్కడి ప్రజలలో వాడి పట్ల వ్యతిరేకత కల్గించడం, శత్రువును లొంగదీసుకోవడానికి అమాయకులను చెరబట్టడం – వీటిలో ఏది కొత్త? యుద్ధంలోనే కాక అంతర్యుద్ధంలోనూ, ప్రకటిత అంతర్యుద్ధంలోనే కాక అప్రకటిత అంతర్యుద్ధంలోనూ ప్రభుత్వాలు నిత్యం చేస్తున్న పనులు కావా ఇవి?

ఉమ్మడి ప్రయోజనాల కోసం సమాజంలో భద్రత నెలకొల్పడం అవసరం అనే ఆలోచన ప్రభుత్వాలకు ఉండే అణచివేత అధికారానికి పునాది. దానిని అడ్డం పెట్టుకొని ఉమ్మడి ప్రయోజనాల కోసం కాక కొన్ని పరిమితమైన, తరచుగా అన్యాయమైన ప్రయోజనాల కోసం కూడ హింసాకాండకు పాల్పడడం చరిత్ర ఆది

నుండి పాలకులు అన్ని సమాజాలలోనూ చేస్తున్న పనే. దాని చుట్టూ పెద్ద భావజాలాన్ని, సిద్ధాంతాలను, చివరికి మతాలను, తత్వశాస్త్రాన్ని కూడా నిర్మించుకున్నారు. ఆది నుంచి కూడ ఈ భావజాలాన్ని వినియోగ సంస్కృతి భావజాలంగా గుర్తించిన వారు, ఉమ్మడి ప్రయోజనం అనే ఆచ్ఛాదన చాటున దాగి ఉన్న పాక్షిక ప్రయోజనాలను చూసినవారు అన్ని సమాజాలలోను ఉన్నారు. అంతేకాక ఆ పాక్షిక ప్రయోజనాలకు భిన్నమైన ప్రయోజనాల కోసం తాము కూడ అణచివేతనూ ఆయుధాలనూ చేపట్టి పాలనాధికారానికి ఉండే గుత్తాధిపత్యాన్ని సవాలు చేసిన వారూ ఉన్నారు. ఇది అన్ని సందర్భాలలోనూ మంచి కోసమే జరిగిందని అనలేము. చరిత్ర అంత అందంగా ఉంటే ఎంతో బాగుండును. కానీ మంచి కోసం జరిగినా వేరే దేని కోసం జరిగినా పాలక భావజాలం దీనిని ఎప్పుడూ విద్రోహం అనే అనింది. ఇక్కడ 'ద్రోహం' జరిగింది రాజ్యానికి హింస విషయంలో ఉండే గుత్తాధిపత్యానికి. అది సమాజానికి కూడ ద్రోహం అనేది పాలక భావజాలమే తప్ప నిజం కానక్కరలేదు. నిజం కాని సందర్భాలలోనే కాక నిజమైన సందర్భాలలో కూడ ఈ 'విద్రోహానికి' ప్రజల జ్ఞాపకాలలో కొంత గ్లామర్ ఉంటుంది. అది ప్రాణాన్ని లెక్కచేయనితనానికి లక్ష్యంతో నిమిత్తం లేకుండ ఎల్లవేళలా ఉండే గ్లామర్. అందువల్ల ఒక్కొక్కసారి ఈ రకమైన తిరుగుబాటుదార్ల సామాజిక పాత్ర గురించి, చరిత్రలో వారి స్థానం గురించి ఒక అంచనాకు రావడం కష్టం. ఉదాహరణకు రాయలసీమ జిల్లాలలో బ్రిటిష్ పాలనపైన 'విద్రోహానికి' పాల్పడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి పాలెగాళ్ళ చారిత్రక స్థానం గురించిన చర్చ తెగదు.

తాము తయారుచేసే ఆయుధాలతో, తమ పద్ధతిలోనే హింస ప్రయోగించే తిరుగుబాటుదార్లు ఎప్పుడయినా పుట్టుకు రాగలరు కాబట్టి బలప్రయోగ విన్యాసాలలో కొంత మితం పాటించే ఆలోచన సార్వభౌమ అధికారాలు గల పాలకులు ఎప్పుడైనా చేశారా అంటే లేదు. అధికార దాహమే ఆయుధాల తయారీనీ, కొత్త ఆయుధాల ఆవిష్కరణనూ, వాటిని వినియోగించే పద్ధతులనూ శాసించింది. విజ్ఞానశాస్త్రం విపరీత వేగంతో పెరుగుతున్న ఆధునిక కాలంలో దానిని తమ బలప్రయోగశక్తిని ఇనుమడింప చేసకోవడానికి పూర్తిగా వాడుకున్నారు. 'విద్రోహ' శక్తుల ఆయుధ సంపత్తి కూడ అదే సమయంలో పెరిగింది. మరింత క్రూరంగా తయారయింది. ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా చూస్తే అది ప్రధానంగా ఇస్లాం పేరు మీద నడుస్తుండవచ్చు. రేపు ఇంకొక


పేరు మీద జరగొచ్చు. కానీ ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగాలు చట్టం ఇచ్చిన బలప్రయోగ అధికారాన్నీ, దానికి అనుబంధంగా అన్ని సంస్కృతులలోని భావజాలం ఇచ్చిన సాధికారతను వాడుకొని విపరీతంగా పెంచుకుంటూ పోతున్న ఆయుధ సంపదనూ, అణచివేత సంస్కృతినీ మనం వ్యతిరేకించనంత కాలం ఏదో ఒక రూపంలో టెర్రరిజం మనతో ఉంటుంది.

దానిని ఎదుర్కొనడానికి అడ్డదారులు లేవు. ఇస్లాం పేరు మీద ఇవాళ అమలవుతున్న విచ్చలవిడి హింసాకాండ వెనక రెండు రకాల ఆలోచనలున్నాయి. ఆధునిక కాలంలో అమెరికా ఆధిపత్య ప్రయోజనాలకు అత్యధికంగా బలి అయింది ముస్లింలు ప్రధానంగా నివసించే సమాజాలు. ఆ సమాజాలు సెక్యులర్ భావాల ప్రాతిపదిక మీద ఈ దాడిని ఎదుర్కొనడానికి చేసిన ప్రయత్నాలు అమెరికా సైనిక శక్తికీ, కుయుక్తులకూ, అమెరికా నెరపుతున్న అంతర్జాతీయ పెత్తనానికీ తట్టుకొని నిలబడలేక పోయాయి. క్రమంగా వాటి స్థానంలో మత భావజాలం గల సంస్థలొచ్చాయి. మతం నుండి వచ్చే ఆవేశం మరింత బలమైన ప్రతిఘటనను నిర్మించడానికి పనికొచ్చింది. అయితే సెక్యులర్ ప్రాతిపదిక నుండి మతం ప్రాతిపదికకు మారడం వల్ల ఒక రకమైన మౌఢ్యం కూడ జత అయి విచ్చలవిడి హింసాకాండకు తావు దొరికింది. ఎక్కడ ముస్లింలకు అన్యాయం జరిగినా అక్కడ విచ్చలవిడి బీభత్సకాండ ద్వారా జవాబు చెప్పాలి అనే ఆలోచన ఈ క్రమంలో బలపడింది. ఈ ఆలోచన అమెరికాను, అమెరికాకు సన్నిహితంగా ఉన్న దేశాలను, ఇతరత్రా ముస్లింలను అణచివేస్తున్న దేశాలను లక్ష్యంగా ఎంచుకుంది. భారతదేశంలో హిందుత్వవాద శక్తులు బలపడి మైనారిటీలపైన దాడులు జరగడం, అంతర్జాతీయ రాజకీయాలలో భారత్ అమెరికాకు దగ్గర కావడం ఒక దశాబ్దం పైగా సమాంతరంగా సాగుతున్నాయి కాబట్టి ఈ బీభత్సకాండకు భారత్ తరచుగా గురి అవుతున్నది.

ఈ హింసాకాండ అమానుషమైనా దీని వెనుక ఒక న్యాయమైన ఆగ్రహం ఉంది. ముస్లింలకు ఇక్కడ అన్యాయం జరగదు, జరగనివ్వం అన్న విశ్వాసం కలిగించడం ద్వారా ఈ ఆలోచనవైపు యువకులు పోకుండ నిరోధించే అవకాశం ఉంది. కానీ 'టెర్రరిజం' గురించి ఊరికే ఆవేశపడుతున్న వారిలో ఎంతమంది ఈ కర్తవ్యం పైన దృష్టి పెడుతున్నారు?

రెండవ కారణం వెనుక న్యాయమైన ఆగ్రహమేమీ లేదు. ఇది ముస్లింలు ముస్లిమేతర పాలన కింద ఉండకూడదనీ, షరియా కిందనే బతకాలనీ, కాబట్టి బీభత్సకాండ ద్వారా ముస్లింలను పరాయిపాలన నుండి 'విముక్తం' చేయాలనీ చెప్పే ఆలోచన. ఈ ఉన్మాదాన్ని ముస్లిం సమాజమే ఎదుర్కొనాలి. ఆ ప్రయత్నం ముస్లిం మతపెద్దలు ఇప్పుడు చేస్తున్నారు. కేవలం మాటమాత్రంగా ఖండించడం కాకుండ దానిని ఇస్లాం స్ఫూర్తికి విరుద్ధమైన ఆలోచనగా గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. దీనితోపాటు ముస్లిమేతర భారత సమాజం మొదటి విషయంలో తన బాధ్యతను సమాంతరంగా చేపట్టడం మొదలుపెడితే ఈ సంక్షోభం నుండి బయటపడే దారి దొరకగలదు.

*ప్రజాతంత్ర వారపత్రిక*
***7 డిసెంబర్ 2008***



# II. నిషేధాలు - నిర్బంధాలు

## తుపాకీ రాజ్యం : నిర్బంధంపై నివేదిక

అనుభవం నుండి ఏమీ నేర్చుకోకపోవడం మన పాలకుల లక్షణం. అణచివేతతో ఏ రాజకీయ ఉద్యమమూ అణగారిపోదని ఈశాన్య భారతంలో, పంజాబ్‌లో, కాశ్మీర్‌లో, బీహార్‌లో, ఆంధ్రలో ఒకటికి పదిసార్లు చరిత్ర వాళ్ళకు నేర్పింది. అయినా వాళ్ళు నేర్చుకోదలచుకోలేదు.

ఇప్పుడిప్పుడు కొన్ని మాటలు మట్టుకు నేర్చుకుంటున్నారు. 'పంజాబు సమస్య' నుండి 'నక్సలైటు సమస్య' దాకా ఏదీ కూడ శాంతిభద్రతల సమస్య కాదు, అన్నీ సామాజిక ఆర్థిక మూలాల నుండి పుట్టిన రాజకీయ పరిణామాలని అనడం నేర్చుకున్నారు. వీటి పరిష్కారానికి మా పోలీసు యంత్రాంగం ఉంది చాలుననడం మానేసి మేధావులనూ, ప్రజాస్వామికవాదులనూ పిలిచి, మాట్లాడి - ముచ్చటించి - పంపడం నేర్చుకున్నారు. ఉపకమిటీలు, సలహా సంఘాలు ఏర్పాటు చేయడం నేర్చుకున్నారు. ఈ మాటలూ, చేతలూ నేర్చుకున్నారుగానీ అంతకంటే లోతయిన అవగాహనేదీ అబ్బినట్టు లేదు. ఎందుకంటే ఆచరణ యధావిధిగా సాగుతూ వుంది.

1989 చివరి భాగంలో తెలుగుదేశం ప్రభుత్వమూ, 1990 ప్రథమార్థంలో కాంగ్రెస్ ప్రభుత్వమూ మేధావులనూ, పౌరహక్కుల సంఘాలనూ పిలిచి మాట్లాడినప్పుడు ఎ.పి.సి.ఎల్.సి కొన్ని వాస్తవాలను ప్రభుత్వాల ముందు ఉంచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాబినెట్ కమిటీకి ఎ.పి.సి.ఎల్.సి ఇచ్చిన లిఖితపూర్వకమయిన నివేదిక 'ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల పరిస్థితి' అనే పేరుమీద (ఇంగ్లీషులో) జనవరి

1990లో అచ్చయింది. పౌరహక్కులనూ, ప్రజాస్వామ్య విధానాలనూ పునరుద్ధరిస్తానని ఆర్భాటంగా పలికిన చెన్నారెడ్డి ప్రభుత్వం ఆ పలుకులను వాస్తవం చేయాలంటే నిజానికి ఏమేమి కనీస చర్యలు చేపట్టవలసి ఉంటుందో ఆ నివేదికలో వివరించాము. 11 నెలలు వేచిచూసి మళ్ళీ ముఖ్యమంత్రికి ఒక బహిరంగలేఖ రాశాము. 'పౌరహక్కుల పునరుద్ధరణ అయిపోయినట్టేనా, ముఖ్యమంత్రిగారూ?' అన్న శీర్షికతో జాపా లక్ష్మారెడ్డి నాలుగవ వర్ధంతి సందర్భంగా విడుదల చేసిన ఆ బహిరంగలేఖలో చెన్నారెడ్డి ప్రభుత్వం మాటలకూ, చేతలకూ మధ్యనున్న అంతరాన్ని ఎత్తి చూపాము.

ఏ దేశంలోనయినా పరిపాలనా యంత్రాంగం ఏ మాత్రం ప్రజాస్వామికంగా నడుస్తోందనడానికి ఒక అంతిమ ప్రమాణం ఉంటుంది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఉత్తర ఐర్లాండ్ ప్రమాణమయినట్టు, భారత ప్రభుత్వానికి పంజాబు, కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు ప్రమాణం అయినట్లు ఆంధ్రప్రదేశ్ పరిపాలనా యంత్రాంగానికి నక్సలైట్ ఉద్యమం ప్రమాణం. ఈ మాట ఒప్పుకోవడానికి ఆయా ఉద్యమాలతో రాజకీయంగా ఏకీభవించనవసరం లేదు, వాళ్ళు చేపట్టే అన్ని చర్యలనూ మెచ్చుకోనవసరం లేదు.

పరిపాలనా యంత్రాంగంలోని ఏ సంస్థా – పోలీసులు, జైళ్ళు, న్యాయస్థానాలు, పరిపాలనా నిర్వాహణశాఖ, అభివృద్ధి శాఖలు, సంక్షేమ శాఖలు, విద్యా వైద్య శాఖలు – బడుగువర్గాలకు ఎన్నడూ న్యాయం చేయలేదు. అట్టడుగు వర్గాలు సంఘటితమయి తిరగబడితే పరిపాలనా యంత్రాంగం మరింత అన్యాయంగా స్పందిస్తుంది. రాష్ట్రంలో ఇప్పటిదాకా బడుగువర్గాల నుండి వచ్చిన బలమయిన తిరుగుబాటు నక్సలైట్ ఉద్యమం కాబట్టి ఆ గీటురాయితో పరీక్షిస్తే ఏ సంస్థలోనూ ఏ శాఖలోనూ ఆవగింజంతయినా ప్రజాస్వామ్యం మిగిలిందని అనుకోలేం. భవిష్యత్తులో బడుగువర్గాల నుండి వేరే ఏ ఉద్యమం బలంగా ముందుకొచ్చినా పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఉండబోదు.

ప్రజాస్వామ్య పునరుద్ధరణ పాలనా యంత్రాంగంలో మొదలవ్వాలని పౌరహక్కుల సంఘం ప్రభుత్వంతో చర్చలకు వెళ్ళినప్పుడు నొక్కి చెప్పింది. రాజకీయ శాంతి కావాలనుకుంటే ముందు రాజకీయ న్యాయం ఉండేటట్టు చూడాలి. సామాజిక శాంతి కావాలనుకుంటే సామాజిక న్యాయాన్ని అందియ్యాలి. వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో అలజడులూ, ఘర్షణలూ ఉండకూడదని కోరుకుంటే కార్మికులకూ,

రైతులకూ, కూలీలకూ కనీస జీవన ప్రమాణాలు, గౌరవప్రదమయిన మనుగడ, ఆరోగ్యవంతమయిన పరిస్థితులు, శ్రమకు తగ్గ ఫలితం దొరికేలాగ చూడాలి. ఇదంతా ఒక్క రోజులో జరిగే పని కాదనీ, మనది వెనకబడ్డ దేశమనీ, బ్రిటిష్‌వాళ్ళు పీల్చి పిప్పి చేసిన దేశమనీ, నాలుగు దశాబ్దాలలో అందరికీ అన్నీ ఇచ్చేయాలంటే ఎట్లాగనీ అడుగుతారు. అది నిజమే. ఇవ్వాళే భూతల స్వర్గం కావాలని ఎవ్వరూ అనడం లేదు. కానీ సమగ్రమయిన ప్రగతిబాటలో మనం ప్రయాణం చేస్తున్నామన్న దాఖలాలు కావాలి. ఈ పాలనలో న్యాయం ఎప్పటికయినా జరుగుతుందన్న విశ్వాసం ప్రజలలో కలిగించగలగాలి. అందరికీ న్యాయం చేకూర్చే సమాజాన్ని నిర్మిస్తున్నాం, ఆ బాటలో ప్రయాణం చేస్తున్నామన్న భరోసా ప్రజలలో వాస్తవికంగా కలిగించగలగాలి. ప్రజా సంక్షేమం, న్యాయ విధేయత, చట్టబద్ధత, నిజాయితీ – ఈ లక్షణాలు పరిపాలనా యంత్రాంగంలోనూ, రాజకీయ ప్రభుత్వంలోనూ కనబడ్డ రోజున రాజకీయ శాంతీ, సామాజిక శాంతీ ప్రజాస్వామికంగా సాధ్యమవుతాయి. లేకపోతే తుపాకులతో మట్టుకే సాధ్యమవుతాయి.

రాజకీయ ప్రభుత్వాన్నీ, పరిపాలనా యంత్రాంగాన్నీ ప్రజాస్వామీకరించడానికి తక్షణం చేపట్టవలసిన చర్యలుగా పౌరహక్కుల సంఘం కొన్నిటిని చెన్నారెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో పేర్కొనింది. వాటిని అదే వరసలో తిరిగి పేర్కొని ప్రస్తుతం వాటి పరిస్థితి ఏమిటో సోదాహరణంగా చూద్దాం. ఈ పరిశీలన 'నక్సలైట్ సమస్య'కే పరిమితం కాదు. అయినప్పటికీ ఆ ప్రస్తావన తరచూ రావడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే పైన చెప్పినట్టు ఆ 'సమస్యే' మన రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ప్రధానమయిన గీటురాయి.

**1. పోలీసు యంత్రాంగం :** నివేదికలో ఈ విధంగా అన్నాము –

*అన్నిటికంటే ముఖ్యమయిన కర్తవ్యం పోలీసు యంత్రాంగానికి సంబంధించినది. ఈ యంత్రాంగం తనకు తానే న్యాయనిర్ణేత అయింది. ఇది కేవలం తెలుగుదేశం ప్రభుత్వం సృష్టి అని మేము అనుకోవడం లేదు. గతంలోని మీ పార్టీ ప్రభుత్వాలు (తమరి గత ప్రభుత్వంతో సహా) ప్రారంభించిన సరళిని వాళ్ళు యథాశక్తి ముందుకు తీసుకుపోయారంతే. తత్ఫలితంగా ఇవ్వాళ పోలీసు యంత్రాంగం మీద ఏ రకమయిన నియంత్రణ లేకుండా పోయింది.*

*న్యాయస్థానాలు సహితం పోలీసుల నుండి పౌరులకు కనీస రక్షణ కల్పించలేకుండా ఉన్నాయి. శాంతిభద్రతలను సంరక్షించడం, నేరాలను అరికట్టడం అనే పేరు మీద ఎంతటి రాక్షసత్వాన్నయినా ప్రదర్శించవచ్చుననీ, ఏ నేరమయినా చేయవచ్చుననీ పోలీసులనుకుంటున్నారు. అధికార పార్టీల సాయుధ బలగంగా పోలీసు యంత్రాంగం మారిపోయింది. ఈ క్రమంలో పోలీసు అధికారులు అధికార దుర్వినియోగంతో ఆస్తులు సంపాదించు కుంటున్నారు. ప్రజలు పోలీసులను తమ సంరక్షకులుగా కాక పీడకులుగా చూస్తున్నారు. ఈ పరిస్థితిని ఇప్పటికయినా సవరించకపోతే భారతదేశాన్ని ప్రజాస్వామ్య దేశంగా వర్ణించడంలో అర్థం లేదు.*

అటువంటి సవరణ ఏ మాత్రం జరగలేదని చెప్పనవసరం లేదు. లాకప్పు మరణాలు, విచ్చలవిడి పోలీసు కాల్పులు, 'ఎన్‌కౌంటర్లు', అక్రమ నిర్బంధాలు, చిత్రహింసలు, సభలు, సమావేశాలపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి.

లాకప్పు మరణాలు మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం దాదాపు 20 జరుగుతాయి. ఒక్కోసారి 25 దాకా కూడ జరుగుతాయి. కొత్త సంవత్సరంలో ఇప్పటికే కర్నూలు జిల్లాలో రెండు, చిత్తూరు, గుంటూరు, మెదక్, ఆదిలాబాద్, శ్రీకాకుళం జిల్లాలలో ఒకటొకటి చొప్పున 7 లాకప్పు మరణాలు జరిగాయి. అంటే ఈ సంవత్సరం లోటు లేకుండ కోటా పూర్తి అవుతుందన్నమాట. లాకప్పు మరణాల విషయంలో చట్టం స్పష్టంగానే వుంది. ఎవరినుండయినా సమాచారం రాబట్టడం కోసం కస్టడీలో బలప్రయోగం చేస్తే అది నేరం అని భారత శిక్షాస్మృతి సెక్షన్లు 330, 331లలో అంది. దీనికి గరిష్ట శిక్ష 10 సం॥దాకా ఉండగలదు. ఈ చిత్రహింసల ఫలితంగా ప్రాణం పోతే అది హత్యే కాగలదు. అసలు పోలీసు కస్టడీలో మరణం ఎప్పుడు జరిగినా దానిని హత్యగానే భావించాలనీ, కాదని రుజువు చేసుకునే బాధ్యత పోలీసుల మీదనే పెట్టాలనీ, చట్టంలో ఆ రకమయిన సవరణ తీసుకురావాలనీ లా కమీషన్ తన 113వ రిపోర్టులో చెప్పింది. అంత దూరం పోనవసరం లేదు. కనీసం అన్ని లాకప్పు మరణాల మీదా న్యాయవిచారణలు జరిపిస్తామన్న హామీ ఏదయితే తెలుగుదేశం ప్రభుత్వం 1986లో ఇచ్చి అరకొరగా నిలబెట్టుకుందో దానిని కూడ కాంగ్రెస్ ప్రభుత్వం తృణీకరిస్తూ వుంది. తెలుగుదేశం పాలనలో జరిగిన లాకప్పు మరణాల న్యాయవిచారణ నివేదికలను ఆ ప్రభుత్వమూ అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమూ చేయడం

లేదు. దీనికి ఒకటి రెండు మినహాయింపులు మాత్రమే ఉన్నాయి. దేశమంతటా సంచలనం కలిగించిన మురళీధరన్ హత్య కేసు మీద విచారణ ఇన్నేళ్ళకు ప్రారంభమయింది. అటువంటివి ఇంకొక రెండు మూడు ఉన్నాయి. మిగిలిన నివేదికలన్నీ డి.జి.పిగారి ఆఫీసులో చెదలకు ఆహారమయ్యాయి. కాంగ్రెస్ పాలనలో జరిగిన లాకప్పు మరణాల మీదనయితే కనీసం న్యాయవిచారణ తంతు కూడ లేదు.

లాకప్పు మరణాలకు సంబంధించిన ఒక బిల్లు ఇప్పుడు రాష్ట్ర అసెంబ్లీ ముందు వుంది. ఉబుసుపోనప్పుడల్లా పౌరహక్కుల సంఘాన్ని నిషేధించాలని ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టే శాసనసభ్యులు ఓంకార్‌గారు దీనిని ప్రవేశపెట్టారు. ఎక్కడ లాకప్ మరణం జరిగినట్టు తెలిసినా జిల్లా జడ్జి దానిని కేసుగా నమోదు చేసుకొని సాక్ష్యాలను తెప్పించుకుని రికార్డుచేసి ప్రాసిక్యూషన్‌కు అప్పగించాలనీ, అందుకు కావలసిన సవరణలు భారత శిక్షాస్మృతిలోనూ, నేర విచారణ స్మృతిలోనూ తీసుకురావాలనీ ఈ బిల్లు ప్రతిపాదన. దీనిని రాష్ట్ర అసెంబ్లీ ఒకసారయినా చర్చించిందో లేదో తెలియదు. ఈ బిల్లుకు లా కమిషన్ సూచించినట్టు 'రుజువు చేసుకొనే బాధ్యత'ను పోలీసుల మీదనే పెట్టే అంశాన్ని కూడ చేర్చి విస్తృతంగా ప్రచారం చేయడం అవసరం. శాసనసభ్యుల మీద ఒత్తిడిపెట్టి ఆమోదింప జేయడం కూడ అవసరం.

అయితే చెన్నారెడ్డి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో చెప్పినట్టు –

*చట్టపరయిన చర్యల కంటే ముఖ్యమైనది పోలీసు యంత్రాంగంపైన సరయిన నియంత్రణ ఉండడం. పోలీసు అత్యాచారాలను అంతం చేయడం అనేది ప్రధానంగా రాజకీయ విషయం. ఆ నిర్ణయం ప్రభుత్వం తీసుకొని అమలు చేయాలి. చట్టవ్యతిరేక నేరపరిశోధనా పద్ధతులకు పాల్పడడానికి వీలులేదని ప్రభుత్వం పోలీసులకు కచ్చితంగా చెప్పాలి. అటువంటి చర్యలకు పాల్పడే వాళ్ళను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించాలి. పోలీసుల కార్యకలాపాలను పర్యవేక్షించే అధికారం వున్న ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు అంతటి సాహసం చేయడానికి అవసరమయిన రాజకీయ మద్దతు ప్రభుత్వం కల్పించాలి.*

ఈ రాజకీయ నిర్ణయమే ప్రధానంగా లోపించిందని అర్థమవుతూ వుంది. నిజానికి రాజకీయ నాయకులకూ పోలీసు యంత్రాంగానికీ దుశ్చర్యలకు పాల్పడడంలో చేదోడువాదోడు సంబంధం ఉంది. అక్రమ సంపాదనకు, భూముల దురాక్రమణకు, ఎన్నికలలో రిగ్గింగ్ చేయడానికి, ప్రజలనూ, ప్రత్యర్థులనూ భయపెట్టి బెదిరించి గెలవడానికి రాజకీయ నాయకులకు పోలీసుల అండదండలు కావాలి. ఈ పరిస్థితులలో వారు స్వచ్ఛందంగా పోలీసులను నియంత్రిస్తారనుకోవడం కల్ల. చాలా పెద్దఎత్తున ప్రజలవైపు నుండి ఒత్తిడి అవసరం. ఒక సత్పరిణామం ఏమిటంటే ఈ మధ్యకాలంలో లాకప్పు మరణాలు తదితర పోలీసు అత్యాచారాల పట్ల ప్రజలు బలంగా స్పందిస్తున్నారు. బంద్‌లూ, రాస్తారోకోలూ చేసి అధికారులను లొంగదీసుకొని తమకు విశ్వాసం ఉన్న డాక్టర్ చేత పోస్టుమార్టం చేయించుకుంటున్నారు. పోలీసుల మీద కేసు నమోదు చేయిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఇక్కడితో ఆందోళన ఆగిపోతూ వుంది. అది ఇంకా ముందుకుపోయి సంపూర్ణ రూపం తీసుకున్ననాడు పోలీసు యంత్రాంగం మీద నియంత్రణ సాధ్యం అవుతుంది.

పోలీసు కాల్పులు మన రాష్ట్రంలో ఒకప్పుడు ప్రధాన పౌరహక్కుల సమస్య కాదు. ఒక ఇంద్రవెల్లి, ఒక టంగుటూరు, ఒక చీరాల, ఒక కొండమొదలు లాంటి పెద్ద సంఘటనలు సంవత్సరానికి ఒకటో రెండో మాత్రమే జరిగేవి. కాని గత రెండేళ్ళుగా అడ్డూ ఆపూ లేకుండ కాల్పులు జరుగుతున్నాయి. సామాజిక శాంతికి భంగం కలిగించగల గుంపుల మీద బలప్రయోగం జరిపేటప్పుడు పోలీసులు పాటించవలసిన కచ్చితమైన నియమాలు పోలీస్ స్టాండింగ్ ఆర్డర్స్‌లోనే ఉన్నాయి. కాని పోలీసులు వాటిని ఎన్నడూ పాటించరు. అన్నిటికంటే ప్రాథమిక నియమం – అలజడి జరగగలదని తెలిసినప్పుడు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను పిలవాలనేది. పోలీసులు దానితో మొదలుపెట్టి దేనినీ పాటించరు. సమాజంలో అశాంతి, ప్రజలలో అసంతృప్తి, పాలనా వ్యవస్థ పట్ల అసహనం పెరిగేకొద్దీ ప్రజా సమూహాల మీద పోలీసు కాల్పులూ పెరుగుతాయి. ఎందుకంటే వీటిలో దేనికీ తుపాకులతో తప్ప ఇతరత్రా సమాధానం చెప్పే సత్తా పాలనా వ్యవస్థలో లేదు.

పోలీసు చిత్రహింసల గురించి చెప్పుకునేటప్పుడు ఒక వింత విషయం ఏమిటంటే ఇవ్వాళ పౌరహక్కుల గురించి మాట్లాడని పోలీస్ ఆఫీసర్ లేడు, రాజకీయ

నాయకుడు లేడు. కానీ చిత్రహింసలు ఎప్పటిలాగా ఉండడమే కాదు, కొత్త రూపాలు తీసుకుంటున్నాయి కూడ. కరెంట్ షాక్ ఒకప్పుడు చాలా తీవ్రమైన నేరాల విచారణలో మట్టుకే ప్రయోగించేవారు. ఇప్పుడు చాలా విరివిగా ప్రయోగిస్తున్నారు. అది మనిషి శరీరంమీద గుర్తు వదలని హింసారూపం కావడంవల్లనేమో ఈనాటి చదువు మీరిన పోలీస్ అధికారులకు కూడ నచ్చుతూ వుంది. పైకి మాట్లాడే మాటలలో మట్టుకు చాలా తేడా వచ్చింది. ఒకప్పుడు పౌరహక్కులు అన్న మాట వింటేనే పోలీస్ ఆఫీసర్లు మండిపడేవారు. ఇప్పుడు వాళ్ళే సౌమ్యంగా పౌరహక్కుల గురించి లెక్చర్లిస్తున్నారు. పౌరహక్కుల నాయకులను పోలీస్ అకాడమీకి పిలిచి లెక్చర్లు ఇప్పించుకుంటున్నారు.

ఎన్‌కౌంటర్ల విషయం కూడ ఇంతే. 'నిజమైన ఎన్‌కౌంటర్లు జరగవచ్చును గానీ బూటకపు ఎన్‌కౌంటర్లు ఎట్టి పరిస్థితులలోనూ జరగనివ్వమని' రాష్ట్ర ముఖ్యమంత్రి, డి.జి.పిలు పదే పదే ప్రకటిస్తున్నారు. ఒకప్పుడు అటువంటి ప్రకటనలు ఇచ్చేవారే కాదు. అయినా జరిగేవి మట్టుకు జరుగుతూనే ఉన్నాయి. ఈ వ్యాసానికి అనుబంధంగా కాంగ్రెస్ పాలనలో గత సంవత్సర కాలంలో 45 మంది ప్రాణాలు తీసిన 'ఎన్‌కౌంటర్ల' వివరాలు ఇచ్చాము. వాటిని చదివితే మాటలలోనే తప్ప ఆచరణలో తేడా ఏమీ రాలేదని అర్థం అవుతుంది. వీరిలో ఇద్దరు మాత్రమే పోలీస్ కానిస్టేబుళ్ళు.

రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో 'ఎన్‌కౌంటర్ల' గురించి వివరంగా ప్రస్తావించాము. నక్సలైట్ ఉద్యమం ప్రారంభమైన నాటి నుండి మొన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారానికి వచ్చినదాకా మొత్తం 660 మంది ఎన్‌కౌంటర్లలో మరణించారని చెప్తూ ఈ విధంగా అన్నాము :

*హింసాత్మకమైన అణచివేత విధానం సమస్యను పరిష్కరించకపోగా, అట్టడుగు వర్గాల ప్రజానీకానికి చాలా హాని కలగజేస్తుంది. ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు (అంటే 1990 జనవరి నాటికి) చనిపోయిన 660 మందిలో అత్యధికులు పేద రైతాంగం, లేక గిరిజన రైతాంగానికి చెందినవారు. చిత్రహింసలు, ఆస్తుల విధ్వంసం, అక్రమ కేసులు మొదలయిన అణచివేతను అనుభవించిన వారూ ప్రధానంగా ఈ వర్గాల ప్రజలే. ఈ అణచివేత ప్రారంభమైననాడు రాష్ట్రంలో 660 మంది నక్సలైట్లు ఉండి ఉండరు. అయినా*

అంతమందిని చంపిన తరువాత కూడ మీరు సమస్యను పరిష్కరించలేక పోయారు సరికదా, నక్సలైట్ ఉద్యమం వర్ధిల్లుతూనే వుంది. ఇదయినా మీ కళ్ళు తెరిపించాలి. అణచివేత విధానం రాజ్యాంగ వ్యతిరేకమే కాక సమస్య పరిష్కారానికి అయోగ్యమైన విధానం అని మీకు దీనినుండయినా అర్థం కావాలి.

కేవలం చట్టపరంగా చూసినా 'ఎన్‌కౌంటర్' అనేది ఆత్మరక్షణార్థం చేసే హత్య. ఆత్మరక్షణ చేసుకునే హక్కు భారత శిక్షాస్మృతి పోలీసులకే కాక పౌరులందరికీ ఇచ్చే మినహాయింపు. భారత సాక్ష్యాల చట్టం ప్రకారం ఈ మినహాయింపును కోరేవారు దానికి తగ్గ పరిస్థితులు ఉన్నాయని తామే రుజువు చేసుకోవాలి. ఈ విషయంలో చట్టం సాధారణ పౌరులకూ, పోలీసులకూ తేడా చూడదు. కాబట్టి 'ఎన్‌కౌంటర్' జరిగినప్పుడు సంబంధింత పోలీస్ అధికారులను హత్య కేసులో అరెస్టుచేసి విచారించాలి. ఆత్మరక్షణకై చేయవలసి వచ్చిందని ముద్దాయిలే రుజువు చేసుకోవాలి. ఇదొక్కటే చట్టబద్ధమైన మార్గం.

మేము సుప్రీంకోర్టులో 'ఎన్‌కౌంటర్లపైన దాఖలుచేసిన రిట్ పిటిషన్ ప్రస్తుతం విచారణలో వుంది. (W.P. నెం. 68/1982, మందడి నరసింహారెడ్డి వర్సస్ స్టేట్ ఆఫ్ ఆం.ప్ర.) ఈ పిటిషన్‌లో 1980-81 సంవత్సరాలలో రాష్ట్రంలో జరిగిన 'ఎన్‌కౌంటర్ల'ను ప్రస్తావించాము. తరువాత మరికొన్ని ఎన్‌కౌంటర్ల వివరాలు కూడ సుప్రీంకోర్టుకు ఇచ్చాము. గత సంవత్సరం సుప్రీంకోర్టు ఈ కేసులో ఒక ఆర్డర్ జారీచేస్తూ, మమ్మల్ని రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని వివరాలతో అర్జీ పెట్టుకొమ్మని ఆదేశించింది. మేము 'ఎమర్జెన్సీ' ఎత్తివేసిన తరువాత జరిగిన అన్ని ఎన్‌కౌంటర్ల వివరాలూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చాము. ఇప్పుడు మీ ప్రభుత్వం వీటి మీద చర్య తీసుకొని సుప్రీంకోర్టుకు రిపోర్టు సమర్పించుకోవలసి ఉంది.

అయితే లాకప్పు మరణాలలాగే ఈ విషయంలో కూడ రాజకీయ నిర్ణయం ప్రధానమయినది. ఈ హత్యలు అధికారంలో వున్న ప్రభుత్వం ప్రోత్సాహంతో, అనుమతితో జరుగుతున్నాయనడంలో సందేహం లేదు. ఈ హత్యలు చేసిన

పోలీస్ అధికారులను చట్టం నుండి కాపాడడమే కాక, వారికి ఆర్థిక పురస్కారాలూ ప్రమోషన్లూ ఇస్తున్నారు. పోలీసులు దీనిని ఆసరా చేసుకొని సాయుధ నక్సలైట్లనే కాక రైతులనూ, కూలీలనూ, కార్మికులనూ కేవలం సానుభూతిపరులయినందుకు కాల్చేస్తున్నారు.

పౌరహక్కుల గురించి మాట్లాడడం, బూటకపు ఎన్‌కౌంటర్లు జరగవని హామీలు ఇవ్వడం పాలకులు కొత్తగా నేర్చుకున్నారు గానీ ఆచరణలో మాత్రం పై పరిస్థితే కొనసాగుతూ వుంది. ఆ నివేదికలో పేర్కొన్న 660కి ఇప్పుడు మరొక 43 మంది చేరారు. వీరూ అవే వర్గాలకు చెందినవారే, అదే విధంగా చంపబడ్డవారే.

**2. వాక్ సభా స్వాతంత్ర్యాలు :** ప్రజల సమస్యలను పరిష్కారం చేయలేని పాలకులు కనీసం ఆ సమస్యల వ్యక్తీకరణకైనా స్వేచ్ఛనివ్వాలి. అది పాలనా వ్యవస్థ నుండి ప్రజలు కోరుకునే కనీస న్యాయం. భారత రాజ్యాంగం అధికరణం 19(1)లో హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కు కూడ.

రాష్ట్రంలో ఈ హక్కు మీద, వ్యక్తీకరణ స్వేచ్ఛ మీద పెద్దఎత్తున దాడి జరుగుతూ వుంది. సంఘాలు పెట్టుకునే హక్కు, సభలూ సమావేశాలూ జరుపుకునే హక్కు అన్నీ పోలీసుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే పరిస్థితి వచ్చింది. అచ్చంపేట, గజ్వేల్, భువనగిరి సభలను భగ్నం చేసినప్పుడు రాడికల్స్ సభలకు అనుమతి పొందడం కోసం కిడ్నాప్‌లకు పాల్పడుతున్నారనీ, లారీ యజమాన్లనూ ఆర్టీసీ డిపో మేనేజర్లనూ బెదిరించి వాహనాలు తీసుకుంటున్నారనీ, కరెంటు సప్లయి ఉచితంగా చేయాలని విద్యుత్ శాఖను బెదిరిస్తున్నారనీ పోలీసులూ, ప్రభుత్వమూ కారణంగా చూపారు. ఈ ఆరోపణల నిజానిజాలు అటుంచి ఇవేవీ కూడ సభకు అనుమతి ఇవ్వకపోవడానికీ, సమావేశమయిన ప్రజానీకం మీద తుపాకులు ప్రయోగించడానికీ నెపాలు కాజాలవు. చట్టవ్యతిరేకమయిన ఒత్తిడికి లొంగి బస్సులు కానీ, విద్యుత్తు కానీ ఇవ్వనవసరం లేదు. అయినా సభను భగ్నం చేయడానికి అది కారణం ఎట్లా అవుతుంది?

ఈ వాదన వాదన కోసం చేస్తున్నదే తప్ప దానిలో నిజాయితీ లేదని ప్రభుత్వమే త్వరలో రుజువు చేసుకుంది. ఏ నెపమయితే రాడికల్స్ మీద పెట్టారో ఆ నెపం పెట్టలేని పార్టీలకూ, సంఘాలకూ కూడ సమావేశ హక్కు లేకుండ చేసినప్పుడు ఈ

విషయం స్పష్టం అయింది. తిరుపతిలో ఓపిడిఆర్ సభను, చిల్లకల్లులో వివిధ దళిత సంఘాల సభనూ, విశాఖపట్నంలో పౌరహక్కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటయిన మత వ్యతిరేక వేదిక సమావేశాన్నీ కూడ భగ్నం చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం సభలకూ, సమావేశాలకూ కరీంనగర్, వరంగల్ జిల్లాలలో అనేక ఆటంకాలు ఏర్పరచారు. ఈ సంస్థ లేవీ ఎవ్వరినీ కిడ్నాప్ చేయలేదు; ఉచితంగా ఏ వసతీ ఇమ్మని ప్రభుత్వాన్ని బెదిరించలేదు.

ఈ వాదనలన్నీ కేవలం సాకులే. తాను పరిష్కరించలేని సమస్యలను ఎత్తిచూపే స్వేచ్ఛను అధికార యంత్రాంగం  గౌరవించలేకపోతూ వుంది. దాని దృష్టిలో అణచివేతకు గురయ్యే అట్టడుగు వర్గాల ప్రజల హక్కులను గురించి మాట్లాడే సంఘాలలో సభ్యత్వం నేరం. వాటి కార్యక్రమాలలో పాల్గొనడం నేరం. ఆ ఉద్యమాలలో ఉద్యమకారులు నేరాలకు పాల్పడితేనూ, చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తేనూ చర్య తీసుకోవడం వేరు. దానికి ఎవ్వరూ అభ్యంతరం చెప్పరు. ప్రభుత్వం శాంతిభద్రతల కర్తవ్యాన్ని వదిలేయాలని ఏ పౌరహక్కుల సంఘమూ అనడం లేదు. కానీ ప్రభుత్వానికి ఇబ్బందికరమయిన రాజకీయాలలో పాల్గొనడమే నేరం అనడానికి వీలు లేదు. అదే ఇవ్వాళ జరుగుతూ వుంది. పోలీసులు గ్రామాల మీద దాడులుచేస్తూ జనాన్ని హింసిస్తూ వున్నది వాళ్ళేవో నేరాలు చేశారని కాదు (నేరాలు చేసినా హింసించే అధికారం పోలీసులకు లేదన్నది వేరే సంగతి). వాళ్ళు ఫలానా సంఘంలో సభ్యులని, ఫలానా పాటలు పాడుతున్నారని, ఫలాన మీటింగ్‌లకు వెళ్ళారని, ఫలానా అభ్యర్థికి వోటువేశారని లేదా వోటునే బహిష్కరించారని, ఇంకా ఎక్కువగా ఫలానా వారికి అన్నం పెట్టారని వాళ్ళను అరెస్టు చేస్తున్నారు. కరెంట్‌షాక్ ఇస్తున్నారు. తోలు ఊడగొడుతున్నారు. లాకప్పులో వారం రోజులో పది రోజులో ఉంచుకొని ఏదో ఒక కేసులో ఇరికిస్తున్నారు. ఈ మధ్య కాలంలో తెలంగాణ జిల్లాలలో పోలీసుల చేతిలో దెబ్బలు తిన్నవాళ్ళు, అరెస్టయి జైలుకు పోయినవాళ్ళు, ఇతర రూపాల నిర్బంధానికి గురయిన వాళ్ళ జాబితా వేసి వారి మీద పోలీసుల అభియోగం ఏమిటని పరిశీలిస్తే 'అన్నలకు అన్నం పెట్టడం' అనేది ప్రధాన అభియోగం అని తెలుస్తుంది.

విలేఖరుల మీద జరుగుతున్న పోలీసు దాడులను పరిశీలిస్తే ఈ దాడులకు శాంతి భద్రతల నిర్వహణతో ఏమీ సంబంధం లేదని, ఇది రాజకీయమని స్పష్టంగా

అర్థమవుతుంది. 'నక్సలైట్ల వార్తలు రాసే విలేఖర్లను తన్నండి' అని మెదక్ జిల్లా ఎస్.పి ప్రజలను రెచ్చగొడుతూ మాట్లాడుతున్నాడు. మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలలో 'నక్సలైట్ల అణచివేత'లో భాగంగా పోలీసులు విలేఖరుల మీద దాడులు చేశారు, కొట్టారు, అవమానించారు, హింసించారు. 'టాడా' కేసులు పెట్టారు. పోలీసు అధికారులు విలేఖరులంటేనే మండిపడుతున్నారు. పత్రికలు సమాజంలోని ప్రబలమయిన వాస్తవాలను వ్యక్తీకరిస్తాయి. అది వాటి కర్తవ్యం. ఏ రాజకీయానికయినా ప్రజలలో ఉండే ప్రభావాన్ని బట్టి ప్రాముఖ్యం ఇస్తాయి. పాలకులకు అప్రియమయిన ఉద్యమాలకు ప్రజలలో ప్రభావం ఉంటే వాటినీ పత్రికలు వ్యక్తీకరిస్తాయి. ఆ అప్రియమయిన ఉద్యమాలను పోలీసులకు అప్పజెప్పి, ఏ గడ్డయినా కరచి అణచివేయండి అని పాలకులు ఆదేశించేసరికి పత్రికల ఈ సహజ కర్తవ్యం పోలీసు వ్యవస్థతో ఢీకొనవలసి వస్తూ వుంది. పత్రికా యాజమాన్యం తమ హక్కుల కొరకు నిలబడకపోతే సాధారణ విలేఖరులు బలవుతారు. భావప్రకటనా స్వేచ్ఛ మీద జరుగుతున్న దాడికి పరాకాష్ట రాష్ట్రంలో విలేఖరుల అభద్ర పరిస్థితి.

**3. అక్రమ కేసులు, 'టాడా' :** క్రిందటి సంవత్సరం రాష్ట్రంలో నక్సలైట్ ఉద్యమాన్ని అణచడంలో భాగంగా 6000 మందిని అరెస్టు చేసినట్టు డిజిపి స్వయంగా ప్రకటించారు. ఈ సంవత్సరం కూడ అదే వేగంతో అరెస్టులు సాగుతున్నాయి. దీని గురించి పౌరహక్కుల సంఘం బాధ్యులు నిరసన తెలపగా, 'కిడ్నాప్‌లు, బస్సు దహనాలు, హత్యలు చేసేవాళ్ళను అరెస్టు చేయొద్దంటారా' అని డిజిపి ఎదురు ప్రశ్న వేస్తున్నారు.

నిజమయిన నేరాలకు పాల్పడ్డ వాళ్ళను అరెస్టు చేయొద్దని ఎవరూ అనలేదు. నేరాలను నిరోధించడానికి అవసరమయిన చట్టపరమయిన చర్యలు చేపట్టవద్దనీ అనలేదు. కానీ నిత్యం అరెస్టవుతున్న వందల మంది నిజమయిన నేరాలకే అరెస్టు అవుతున్నారనుకుంటే మాత్రం పొరబాటే.

అరెస్టులు ఎక్కువగా రాజకీయంగా జరుగుతున్నాయని పైన చెప్పాము. 'నక్సలైట్ల సానుభూతిపరులు' అని చెప్పి అరెస్టు చేయడం, ఆపైన బాంబు పట్టుకొని తిరుగుతున్నారనో, ప్రభుత్వాన్ని కూలదోయడానికి కుట్రచేస్తున్నారనో కేసుపెట్టడం పరిపాటి అయింది.

ఇవికాక, భూమి దురాక్రమణ (ఐపిసి 447) క్రింద రెండు మూడు వేలమందిని ఈ రెండేళ్ళలో అరెస్టు చేశారు. వీళ్ళు హైదరాబాద్‌లో, విజయవాడలో వున్న భూమి కబ్జాదారులు కారు. ప్రజల భూములను లాక్కొని అనుభవిస్తూ వున్న భూస్వాములు కారు. వీళ్లంతా కూడ ప్రభుత్వ భూములో, భూస్వాముల భూములో దున్నుకుంటూ వున్న వ్యవసాయ కూలీలు. 40 ఏళ్ళుగా భూసంస్కరణలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమయిన ప్రభుత్వం ఆ చట్టాన్ని పేదలే అమలు చేసుకుంటే వాళ్ళను అరెస్టుచేసి జైలుకు పంపించడం సిగ్గుచేటయిన విషయం. పైగా ఆ అరెస్టులు చేసిన పద్ధతి కూడ చాలా అమానుషమయినది. ఆక్రమించుకున్న భూమిలో వేసుకున్న పంట కోతకు ఎదిగి చేతికొచ్చిన సమయంలో వాళ్ళను అరెస్టుచేసి నోటికాడి కూడు కొట్టేశారు.

ఈ రకంగా వివిధ అక్రమ కారణాల వల్ల అరెస్టవుతున్న వాళ్ళ మీద ఎక్కువగా 'టాడా' కేసులు పెడుతున్నారు. మొత్తం తెలుగుదేశం హయాంలో ఎంతమంది మీద 'టాడా' పెట్టారో ఆ సంఖ్యను కాంగ్రెసు పాలకులు ఒక్క సంవత్సరంలోనే మించి పోయారు. ఒక్క నర్మెట్ట కాల్పుల కేసులోనే 348 మంది మీద 'టాడా' పెట్టారు. 'టాడా' చట్టాన్ని రాష్ట్రంలో ఎట్టి పరిస్థితులలోనూ ఉపయోగించబోమని హామీ ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో ఈ విధంగా అన్నాము.

*టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని ('టాడా') 1985లో కేంద్రప్రభుత్వం రూపొందించింది. పంజాబులోని ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా ఈ ప్రత్యేక చట్టం అవసరం అని ఆనాడు కేంద్ర ప్రభుత్వం వాదించింది. కాని ఈ చట్టం లక్ష్య ప్రకటనలో పంజాబు, ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌ల ప్రస్తావన ఎక్కడా లేదు. 1988 మార్చిలో ఇచ్చిన ఒక తీర్పులో సాధారణ శాంతి భద్రతల యంత్రాంగం పనిచేయలేని పరిస్థితి ఏర్పడినప్పుడు మట్టుకే 'టాడా'ను ఉపయోగించాలిగానీ చీటికీ మాటికీ ప్రయోగించకూడదని సుప్రీంకోర్టు అనింది. ఆంధ్రప్రదేశ్‌లో అంతటి పరిస్థితి ఉందనలేము. అయినప్పటికీ ఆ చట్టాన్ని రాష్ట్రంలో విస్తృతంగా ప్రయోగిస్తున్నారు.*

*'టాడా' క్రింద అరెస్టవుతున్న వారిలో అత్యధికులు అజ్ఞాత నక్సలైట్లు కారు. పేద రైతులు, కూలీలు, కార్మికులు, గిరిజనులు. 'టాడా' అత్యంత అప్రజాస్వామికమయిన చట్టం. సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకమయిన చట్టం. భారత రాజ్యాంగంలోని అధికరణాలు 14, 19(1), 20(3), 21లకు*

*టాడా వ్యతిరేకమనీ, ఆ చట్టాన్ని కొట్టి వేయాలనీ కోరుతూ దాఖలయిన రిట్ పిటిషన్లు ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ హైకోర్టులలోనూ, సుప్రీంకోర్టులోనూ విచారణలో ఉన్నాయి.*

ఈ నివేదిక సమర్పించిన తరువాత రాష్ట్రంలో 'టాడా' వినియోగం ఇంకా పెరిగింది!

'టాడా' గురించి చెప్పేటప్పుడు ఒక విషయం నొక్కి చెప్పాలి. ఆ చట్టాన్ని నక్సలైట్ సానుభూతిపరుల మీదనే కాక కొన్ని ఇతర వర్గాల మీద కూడ ప్రయోగిస్తున్నారు. ప్రధానంగా, హైదరాబాద్ పాతబస్తీలో మత సంఘర్షణలో అరెస్టయిన వారి మీద, రాయలసీమ జిల్లాలలో నాటుబాంబుల ముఠా తగాదాలలో అరెస్టయిన వారి మీద. ఈ రెండు ప్రాంతాలలోనూ ఘర్షణల వల్ల ఉపయోగం పొందుతున్న వాళ్ళు ప్రముఖ రాజకీయ నాయకులు. హైదరాబాదులో ఈ మధ్య జరిగిన 'మతఘర్షణ'లలో కొందరు కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన పాత్ర, దాని ఫలితంగా వాళ్ళు పొందిన ప్రయోజనం రాష్ట్రమంతటా తెలిసిన విషయాలే. బి.జె.పి, మజ్లీస్ నాయకులు ఈ రకమయిన ఘర్షణల నుండి ఎంతకాలంగానో ప్రయోజనాన్ని పొందుతున్నారు. ఇక రాయలసీమ మాటకొస్తే అక్కడి ముఠా కొట్లాటలు రాజకీయ నాయకులకు ఆలంబన, అవే వాళ్ళ రాజకీయ పునాది.

ఈ నాయకులంతా బాగానే వున్నారు గానీ తెలిసో తెలియకో వాళ్ళ ముఠా ప్రయోజనాల కోసం పనిచేసినవారు మట్టుకు 'టాడా' క్రింద జైలుకు పోతున్నారు. వీళ్ళందరితో కలుపుకుంటే రాష్ట్రంలో మొత్తం 'టాడా' ముద్దాయిల సంఖ్య 10 వేలకు సమీపంలో ఉంది.

**4. సామాజిక న్యాయం :** శాంతిభద్రతలు ప్రజాస్వామికంగా నెలకొనాలంటే పోలీసు యంత్రాంగాన్ని నియంత్రించడం, నల్ల చట్టాలను తొలగించడం, అత్యాచారాలు చేసే పోలీస్ అధికారుల మీద కేసులు పెట్టడం ఇవన్నీ అవసరమే కానీ ఇవి సరిపోవు. ఈ పరిపాలనా వ్యవస్థలో తమకు న్యాయం జరుగుతుందన్న విశ్వాసం ప్రజలలో కల్పించాలి.

ఇందులో ప్రజలలోని వివిధ వర్గాల జీవితాలు మెరుగుపడడం ఒక అంశం. భూమిలేని వారికి భూములు, పేద రైతులకు రుణ సౌకర్యం, సేద్యపు నీటి సౌకర్యం,

మొత్తం రైతాంగానికి చవకగా విద్యుత్తు, ఎరువులు, మందులు, నీటి వసతి కల్పించాలి. గ్రామీణప్రాంత యువజనంలో ఇవ్వాళ సగభాగం ఏదో ఒక మేరకు నిరుద్యోగ పీడితులయి ఉన్నారు. వాళ్ళకు ఉద్యోగాలు కల్పించాలి. దానికోసం అవసరమయిన గ్రామీణ పారిశ్రామీకరణ చేపట్టాలి. కూలీలకూ రైతులకూ శ్రమకు తగ్గ ఫలం దక్కేటట్టు చూడాలి. నాలుగు దశాబ్దాల స్వాతంత్ర్యం తర్వాత దేశంలో అక్షరాస్యత 50 శాతానికి చేరుకుందని చెప్తున్నారు. మిగిలిన 50 శాతం ఇంకెన్ని దశాబ్దాలకు పూర్తికావాలో. అదుపు లేకుండా పెరిగిపోతున్న ధరలను అరికట్టి 3 కోట్లు దాటిన నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడం కూడ తక్షణ సమస్యగా చేపట్టాలి.

ఈ సమస్యల పరిష్కారం దిక్కుగా మన సమాజం ప్రయాణం చేస్తూ వుందన్న విశ్వాసం ప్రజానీకంలో విస్తృతంగా కలిగించలేని పాలన ఏదీ ప్రజాస్వామికంగా ఉండలేదు. అది దేశాన్ని తుపాకీలతోనే పరిపాలించగలదు. ఆ తప్పు ప్రజల మీదికి నెట్టి ప్రజలు తీవ్రవాదులయిపోతున్నారనీ, విచ్ఛిన్నకారులయిపోతున్నారనీ కేసులుపెట్టి కాల్చిపారేసి అణచివేయాలని చూస్తే ప్రజాస్వామికవాదులు ఊరుకోడానికి వీలులేదు.

సంపూర్ణమయిన సామాజిక ఆర్థిక న్యాయం చేకూరుస్తామని బలవంతుల దాడుల నుండి పీడితవర్గాలకు కనీస రక్షణ కలిగిస్తామని అది ప్రజలలో విశ్వాసం కల్పించగలగాలి. ఈ విషయంలోనూ రాష్ట్ర పాలనా యంత్రాంగం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనబడుతూ వుంది. భూస్వాముల దాడుల నుండి కూలివాళ్ళకుగానీ, అగ్రకుల పెత్తందార్ల దాడుల నుండి దళితులకుగానీ, పురుషాహంకారం నుండి స్త్రీలకుగానీ కనీస రక్షణ కరువయింది. కనీస న్యాయం కరువయింది. కడప జిల్లా పులివెందుల, శ్రీకాకుళం జిల్లా జీరుపాలెం, తూర్పుగోదావరి జిల్లా వేట్లపాలెం, వీరారం, ప్రకాశం జిల్లా తిమ్మసముద్రం, హైద్రాబాదులో ఎన్టీఆర్ నగర్, విజయనగరం జిల్లాలో కన్పాగదబవలస దాడులు ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో బాగా ప్రచారం అయ్యాయి. అన్ని సంఘటనలలోనూ బడుగువర్గాల ప్రజల ఇళ్ళు అగ్నికి ఆహుతయ్యాయి. కొందరు ప్రాణాలు కోల్పోయారు. అన్ని సంఘటనలలోనూ దాడిచేసిన పెత్తందార్లకు అధికార పార్టీ నాయకులు, పోలీసుల అండ వుంది. అన్నింటిలోనూ నెలల తరబడి దుండగులను అరెస్టు చేయడం, కేసుపెట్టడం జరగలేదు. తిరిగి మళ్ళీ బాధితులే భయభ్రాంతులయి బ్రతకవలసి వస్తూ వుంది.

గత నవంబర్‌లో పౌరహక్కుల పునరుద్ధరణ అయిపోయిందా అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తూ అచ్చువేసిన బహిరంగ లేఖలో ఇటువంటి దాడులను ప్రస్తావిస్తూ ఈ విధంగా అన్నాము.

*ఇక్కడ మరీ తీవ్రమయిన కొన్ని సంఘటనలను మాత్రమే పేర్కొన్నాము. నిజానికి రాష్ట్రవ్యాపితంగా మీ పార్టీకీ, మీకూ సన్నిహితులయిన భూస్వాములు పేదల మీద దాడులు చేస్తున్నారు. పోలీసులు ప్రేక్షకులుగా చూస్తున్నారు. మీరు అధికారానికి వచ్చి 10 నెలలు గడిచినా కారంచేడు కేసు విచారణ త్వరితం చేయలేకపోయారంటే మీ నిర్లక్ష్యం ఎంతటిదో అర్థం అవుతుంది. దళితుల మనస్సులలో ఈ నిర్లక్ష్యం ఎంతటి వైమనస్యాన్ని కలిగిస్తుందో ఊహించడం కష్టం కాదు. గౌరవప్రదమయిన జీవితం కావాలనే ప్రాథమికమయిన ఆకాంక్షను ఇంతగా నిర్లక్ష్యం చేసిన తరువాత వాళ్ళకు శాంతియుతమయిన ఆందోళనా పద్ధతుల పట్ల విశ్వాసం సన్నగిల్లితే ఆ తప్పు మీదే అవుతుంది.*

*అయితే మీ వైఖరి అన్ని విషయాల్లో కంటే రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళన పట్ల మీరు చూపుతూ వున్న అసాధారణమయిన సహనంలో నగ్నంగా బయటపడింది. వాళ్ళు బహిరంగంగా దళితులను కించపరిచే మాటలు అంటున్నా మీరు కిమ్మనకుండ వున్నారు. రిజర్వేషన్‌లను వ్యతిరేకించే వాళ్ళకు వాక్ సభా స్వాతంత్ర్యాలు ఉండకూడదని మా ఉద్దేశ్యం కాదు. అయితే దళితుల ఆత్మగౌరవాన్ని కాపాడవలసిన రాజ్యాంగ నిర్దేశిత కర్తవ్యం మీ ప్రభుత్వం మీద వుంది. అగ్రకులాల ప్రచారాన్ని మీరు బహిరంగంగానే ఎదుర్కొని రిజర్వేషన్ విధానాన్ని వివరిస్తూ ప్రచారం చేపట్టవలసి ఉండింది. మీ ప్రభుత్వం గానీ, గతంలో వేరే ఏ ప్రభుత్వం గానీ ఎవ్వరి ప్రజాస్వామిక స్వేచ్ఛలనూ ఇంతగా గౌరవించలేదనేది అందరికీ స్పష్టంగా తెలుస్తూ వుంది.*

*రిజర్వేషన్ వ్యతిరేకులు ప్రభుత్వ ఆస్తులను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తూ వుంటే మీ పోలీసులు ఎంత ఉదారంగా చూస్తూ వున్నారో దళితులు గమనిస్తున్నారు. అదే పేదవాళ్ళు ఎక్కడయినా ఎంత న్యాయమయిన ఆందోళన నడిపినా వాళ్ళను పోలీసులు ఎంత పాశవికంగా అణిచేస్తారో అందరికీ*

*తెలుసును. ఈ తేడా నుండి వాళ్ళు మీ పాలన తమకు కల్పించగల న్యాయాన్ని గురించి అవిశ్వాసం పెంచుకున్నా, సామాజిక శాంతికి భంగకరమయ్యే అభిప్రాయాలు ఏర్పరచుకున్నా ఆశ్చర్యం ఏముంది?*

గ్రామీణ పేదలు, దళితులు భూస్వాముల దాడులనూ, కులపరయిన దాడులనూ ఎదుర్కొనడానికి కనీసం సంఘటితమవుతున్నారు, పోరాటాలు చేస్తున్నారు. కానీ స్త్రీలలో ఆ సంఘటన కూడా చాలా బలహీనంగా ఉంది. వరకట్నం చావులకూ వరకట్న సంబంధమయిన వేధింపులకూ మన రాష్ట్రం దేశంలోనే విఖ్యాతిగాంచింది. ప్రతీరోజు రాష్ట్రంలో కనీసం రెండు మూడు వరకట్న సంబంధమయిన మరణాల గురించి పత్రికలలో చూస్తుంటాము. ఈ వేధింపులకూ ఈ హత్యలకూ సంబంధించి బలమయిన చట్టాలున్నాయి. ఇవి చట్టాలతో ఆగిపోయే నేరాలు కాకపోయినప్పటికీ చట్టాలను సమర్థవంతంగా అమలుచేస్తే కొంతలో కొంతయినా అదుపులోకి వస్తాయి. కానీ పోలీసు యంత్రాంగమూ, న్యాయస్థానాలు ఈ కేసుల పట్ల చాలా నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శిస్తూ వున్నాయి. మామూలుగానే నేరస్తులకు శిక్షపడడం అరుదనుకుంటే ఈ 'కుటుంబ సంబంధమయిన' నేరాలలో మరీ అరుదయిపోయింది.


**ముగింపు :** పరిపాలనా యంత్రాంగం చేకూర్చే న్యాయం ఈ విధంగా వుంది. ఈ నేపథ్యంలో ప్రజలలో అసహనం, అసంతృప్తి పెరిగిపోతున్నాయన్నా ఆందోళనలూ అలజడులూ పెరిగిపోతున్నాయన్నా ఆశ్చర్యం ఏముంది?

అటువైపు పాలక రాజకీయాలలో ప్రజాస్వామ్య లక్షణాలు మృగ్యం అయినాయి. హింసకు పాల్పడకుండ, రిగ్గింగ్ చేయకుండ, మతోన్మాద ప్రచారంతో ప్రజల మనసులను కలుషితం చేయకుండ, వోటర్లపైన గూండా దాడులు చేయకుండ ఎన్నికలలో గెలవలేకుండా వున్నారు. ప్రజల సమస్యలు, వాటికి వివిధ పార్టీలు చూపే పరిష్కార విధానాలు అనే ప్రాతిపదిక మీద నడవవలసిన ప్రజాస్వామ్యం డబ్బు, సారాయి నుండి ఇప్పుడు గూండాయిజం ప్రాతిపదిక మీద నడుస్తూ వుంది. చెన్నారెడ్డిని గద్దె దించడానికి మతం పేరిట ఘర్షణలను కాంగ్రెస్ అసమ్మతి నాయకులు ఎంత అమానుషంగా వాడుకున్నారో మొన్ననే చూశాం. మతఘర్షణలను దేశవ్యాపితంగా రెచ్చగొట్టి అధికారానికి రావాలని చూస్తున్న భారతీయ జనతాపార్టీ విన్యాసాలనూ

రెండేళ్ళుగా చూస్తున్నాం. ఈ పార్టీ ఆ పార్టీ అన్న తేడా లేకుండ పాలక పార్టీలన్నీ ఈ క్రమంలో పాలుపంచుకుంటున్నాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతూ వున్న తుపాకీ రాజ్యానికి నేపథ్యం ఇది. ఈ నేపథ్యం పౌరహక్కుల ఉద్యమం మీదనున్న భారాన్ని సూచిస్తుంది. ఉద్యమ కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది.

***‘తుపాకి రాజ్యం’ పుస్తకానికి రాసిన ముందుమాట***
***ఎ.పి.సి.ఎల్.సి ప్రచురణ, ఏప్రిల్ 1991***



# రాజకీయ ఉద్యమాల నిషేధాన్ని వ్యతిరేకిద్దాం

ప్రజలకు ప్రాథమిక హక్కులుండడం ప్రభుత్వానికి ఇబ్బందయినప్పుడు ఎమర్జెన్సీ ప్రకటించి ప్రాథమిక హక్కులను తొలగించే అధికారం రాజ్యాంగకర్తలు ప్రభుత్వానికి ఇచ్చారు. ఆ అధికారాన్ని ఇందిరాగాంధి 17 ఏళ్ళ క్రితం ఒకసారి ఉపయోగించారు. వేలాదిగా ఉద్యమకారులను, రాజకీయ ప్రత్యర్థులను జైళ్ళలో పెట్టించారు. పోలీసుల చేత హింసింపజేశారు. 'ఎన్‌కౌంటర్ల'లో చంపించారు. బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతోనూ, నగరాల ఆధునీకరణ ప్రయోగాలతోనూ సామాన్య పౌరులను వేధించారు. అయితే ఈ అణచివేత బెడిసికొట్టి ఆమె అధికారానికే ముప్పు వచ్చింది. ఫలితంగా 44వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలో మార్పు తెచ్చారు. ఎమర్జెన్సీ ప్రకటించినా పౌరుల ప్రాథమిక హక్కులను పూర్తిగా తొలగించడం సాధ్యంగాని పరిస్థితి కల్పించారు.

ఆమె రెండవసారి అందలం ఎక్కే నాటికి ఒక గుణపాఠం తీసుకుంది. ఆ గుణపాఠాన్ని ఆమె కుమారుడూ తదనంతర వారసులూ క్షుణ్ణంగా నేర్చుకుని అమలు చేస్తున్నారు. అణచివేత ప్రయోగించడానికి ఎమర్జెన్సీ అవసరం లేదని వాళ్ళు గుర్తించారు. ప్రాథమిక హక్కులను తొలగించడానికి రాజ్యాంగ ఆమోదం అక్కరలేదని అర్థం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్ హత్యలను రోజువారీ కార్యక్రమం చేసేయొచ్చు. గ్రామాలలో ఇళ్ళు కూల్చడం, గ్రామాలకు అగ్గిపెట్టడం, మనుషులను తుక్కుతుక్కుగా చితగ్గొట్టడం, పొలాలను ధ్వంసం చేయడం పోలీసుల విధి నిర్వహణలో భాగం చేసేయొచ్చు. పత్రికలనూ, పత్రికా విలేఖరులనూ బెదిరించవచ్చు.

చంపేయొచ్చు కూడ. రాజకీయ ఉద్యమాలను, ఉద్యమ సంస్థలనూ నిషేధించవచ్చు. ఆపైన 'సంబంధాలున్నా'యంటూ వేలాదిమందిని జైలుపాలు చేయొచ్చు. ఇవన్నీ చేయడానికి ఎమర్జెన్సీ అక్కరలేదు. ప్రత్యేక శాసనాలు అవసరం లేదు. అణగదొక్కి అణగదొక్కి ప్రజాస్వామ్యాన్ని నీరసింపజేస్తే ఆపైన ఎంత అక్రమంగా పరిపాలించినా అడిగేవాళ్ళుండరు. ఇక్కడొకరూ అక్కడొకరూ హక్కులంటూ చట్టమంటూ ప్రజాస్వామ్యమంటూ నోరు తెరిచినా వాళ్ళ నోళ్ళు మూసేయడానికి జైళ్ళున్నాయి.

## ఎన్‌కౌంటర్లు

మన రాష్ట్రంలో నిత్యం జరుగుతున్న 'ఎన్‌కౌంటర్ల' సంగతే తీసుకోండి. ప్రతిరోజూ పేపర్లో ఒక వరకట్నం హత్య వార్త ఉన్నట్టే ఒక ఎన్‌కౌంటర్ వార్త కూడ తప్పనిసరిగా ఉంటున్నది. 'రోజూ చచ్చేవాడి కోసం ఏడ్చేవాడెవడు' అన్నట్టు వరకట్నం హత్యల వార్తలు ఎవరినీ కదిలించనట్లే 'ఎన్‌కౌంటర్ల' వార్తలూ ఇప్పుడెవరినీ కదిలించడం లేదు. 130 మందిని 'ఎన్‌కౌంటర్ల'లో కాల్చేశారు పోలీసులు. ప్రతీ ఎన్‌కౌంటరూ దళంతోనే జరిగిందని పోలీసులంటారు గానీ 130 మందిలో దళ సభ్యులు 10 మంది కూడ లేరు. పోలీసులు చెప్తున్న కథలు ఎంత వీరోచితంగా ఉన్నా నిజానికి ఈ మధ్య జరుగుతున్న 'ఎన్‌కౌంటర్ల' తీరు నూటికి తొంభై శాతం ఒకే రకంగా ఉంటున్నది. పీపుల్స్‌వార్ గ్రూపు కార్యకర్తలు ఒక గ్రామంలో ఏదో ఒక చర్యకు పాల్పడతారు. అది మంచి పని కావచ్చు, చెడ్డ పని కావచ్చు, హింసాత్మకం కావచ్చు, కాకపోవచ్చు. ఏదయినప్పటికీ పోలీసుల జోక్యం అవసరమైతే వాళ్ళు చర్య తీసుకోవడానికి చట్టాలనేవి ఉన్నాయి. కానీ అప్పటికే తమ దగ్గర కస్టడీలో ఉన్న వారినో లేకపోతే సమీప గ్రామంలోని యువకులనో తీసుకొచ్చి పై సంఘటనకు దగ్గరి ప్రాంతంలో కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటిస్తున్నారు. ఈ విధంగా చనిపోతున్నది దళసభ్యులు కారు. గ్రామంలో నివసించే పేద రైతాంగ యువకులు, సానుభూతిపరులు, మద్దతుదారులు, దళ సభ్యుల అన్నదమ్ములు, ఒకప్పుడు పనిచేసి లొంగిపోయినవారు, లేకపోతే గ్రామ పెత్తందారీ వర్గాలకు కంటగింపయిన యువకులు.

ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు, ఈశాన్య భారతంలో, పంజాబ్, కాశ్మీర్, బీహార్ రాష్ట్రాలలో హింసా మార్గాన్ని ఎంచుకుని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడిన రాజకీయ

ఉద్యమకారులనూ వారి మద్దతుదారులనూ పట్టుకొని 'ఎన్‌కౌంటర్' పేర కాల్చి పారేయడం రివాజయిపోయింది. ఉద్యమకారులను ఎదుర్కొనవలసింది ఈ విధంగా కాదు. పౌరులు చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారని చెప్పి ప్రభుత్వం చట్టబద్ధ పాలనకు తిలోదకాలివ్వడానికి వీలు లేదు. అప్పుడు మిగిలేది ఆటవిక రాజ్యమే. ఒకరు దొంగతనం చేస్తే దానికి ప్రతీకారంగా పోలీసులు వారి ఇంట్లో దొంగతనానికి పాల్పడడం నాగరిక నేర విచారణ విధానం కాదు. ఒకరు దాడికి పాల్పడితే పోలీసులు వారిపైన దాడిచేసి 'బుద్ధి చెప్పడం' నాగరిక శిక్షా వ్యవస్థ కాదు. ఎన్‌కౌంటర్ల విషయమూ అంతే. ఒక ఉద్యమానికి చెందిన కార్యకర్తలనూ, సానుభూతిపరులనూ, అన్నం పెట్టే వారినీ, ఆశ్రయం ఇచ్చేవారినీ పట్టుకొని కాల్చేయడం ఎట్టి పరిస్థితిలోనూ సమర్థనీయం కాదు. ఉద్యమాలు ఎందుకు హింసాత్మక రూపం తీసుకుంటున్నాయో ఆలోచించాలి. ప్రజలు వాటివైపు ఎందుకు ఆకర్షితులవుతున్నారో విశ్లేషించాలి. ఆ ప్రాతిపదిక మీద వాటిని ఎదుర్కొనే రాజకీయ విధానాన్ని రూపొందించాలి.

ఈ రాష్ట్రం ఆ రాష్ట్రం అన్న తేడా లేకుండా దేశం నలుమూలలా ఇవాళ వివిధ రూపాలలో వివిధ లక్ష్యాలతో వివిధ పద్ధతులలో మిలిటెంట్ రాజకీయ పోరాటాలు ముందుకు వస్తున్నాయి. అవన్నీ మంచివేననీ, సమర్థనీయమనీ మేము అనడం లేదు. ఆ ఉద్యమాలు చేపడుతున్న పోరాట రూపాలను మేము సమర్థించడం లేదు. ఆ పోరాటాలలో భాగంగా అమాయకుల ప్రాణాలకు వాళ్ళు హాని కలిగిస్తే మేము నిస్సంకోచంగా వ్యతిరేకిస్తున్నాము కూడ. అయితే వాటి మూలం ఏమిటో, ప్రజలు వాటి పట్ల ఎందుకు ఆకర్షితులవుతున్నారో ఆలోచించకుండ అప్రకటిత ఎమర్జెన్సీ విధించి అధికారాలతో అణచివేయడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏకైక మార్గంగా ఎంచుకోవడం, 'దెబ్బకు దెబ్బ' తీయడాన్ని ఒక రాజకీయ విధానంగా తయారు చేసుకోవడం అన్యాయమంటున్నాం. అది ఆ ఉద్యమకారులకే కాదు, మనందరికీ, మనందరి హక్కులకూ, రాజకీయ స్వేచ్ఛకూ హానికరమంటున్నాం.

## నిషేధాలు

ఈ అప్రకటిత ఎమర్జెన్సీకి పరాకాష్ఠ పోరాట రాజకీయాల నిషేధం. సంస్థలు హింసా రాజకీయాలను అనుసరిస్తున్నాయని వాటిని నిషేధించడం జరుగుతున్నది.

కానీ నిషేధిస్తున్నది వారి హింసను కాదు, వారి రాజకీయాన్ని. హింసను నిషేధిస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. నిజానికి హింసను కొత్తగా నిషేధించవలసిన అవసరం లేదు. అది చట్టంలో ఎప్పుడూ నిషిద్ధమే. కొత్తగా నిషేధిస్తున్నది రాజకీయాలను. ఇది ప్రజాస్వామ్య దృక్పథంలో చాలా అభ్యంతరకరమయిన విషయం. అభ్యంతరమే కాదు, మూర్ఖం కూడ. మంత్రాలకు చింతకాయలు రాలవన్నట్టు నిషేధిస్తే రాజకీయాలు పోతాయా? ఈశాన్య భారతంలో నాగా మిజో జాతుల పోరాట సంస్థలను ఎప్పుడో నిషేధించారు. దానితో ఆ ప్రజల మనస్సులోని వైమనస్య భావం పోయిందా? తమ్మ తాము ఈ దేశానికి పరాయివారుగా భావించుకోవడం మానేశారా? పంజాబులో, కాశ్మీర్‌లో, అస్సాంలో రాజకీయ సంక్షోభాలకు కారణమయిన కొన్ని దశాబ్దాల చరిత్ర రాజకీయ సంస్థల నిషేధంతో తుడిచిపెట్టుకుపోతుందా? శ్రీలంకకు చెందిన ఎల్.టి.టి.ఇ ని నిషేధించి చాలా పరాక్రమం ప్రదర్శించామనుకుంటున్నారు మన దేశ పాలకులు. దానితో శ్రీలంక తమిళుల పట్ల మన దేశ తమిళ ప్రజలలో వున్న సానుభూతి భావం పోయిందా? పీపుల్స్‌వార్ గ్రూప్‌ను నిషేధిస్తే గ్రామీణ పేదల భూమి సమస్య పోతుందా? గ్రామీణ పేదరికం పోతుందా?

ఇవేవీ పోనప్పుడు వీటి నుంచి పుట్టిన రాజకీయాలను నిషేధించడాన్ని మూర్ఖత్వం అనకపోతే ఏమనాలి? మూర్ఖత్వం సంగతి అటుంచి ఒక రాజకీయ అభిప్రాయాన్ని నిషేధించే అధికారం ప్రభుత్వం చేతిలో ఉండడం ప్రజాస్వామికమేనా? హింసాత్మక చర్యలకు పాల్పడడం నేరమవుతుందిగానీ ఒక రాజకీయం నేరమవుతుందా? పీపుల్స్‌వార్ గ్రూప్ హింసకు పాల్పడుతున్నది కాబట్టి ఆ గ్రూప్‌ను నిషేధించామంటున్నారు. ఆ హింసకు గల సామాజిక మూలాన్ని చూడకుండ నిషేధాన్ని పరిష్కారంగా ముందుకు తెచ్చారు. సరే బాగుందనుకుందాం. మరయితే చుండూరు వంటి మారణకాండల హింసకు జవాబుగా ఎవరిని నిషేధిస్తారు? వరకట్నం హత్యలకు సమాధానంగా దేనిని నిషేధిస్తారు? ఎన్నికలు వచ్చినప్పుడల్లా బాంబులతో మారణాయుధాలతో భారీ ఎత్తున రిగ్గింగ్ జరుపుకుంటున్నారే, దానికి పరిష్కారంగా కాంగ్రెస్ పార్టీని నిషేధిస్తారా? తెలుగుదేశం పార్టీని నిషేధిస్తారా? 'రోజుకు కోటి రూపాయలు తింటున్నాడ'ని ముఖ్యమంత్రి అవినీతి గురించి వారి పార్టీవారే ప్రచారం చేస్తున్నారే, ఆ మహానుభావుడి మీద ఏ నిషేధం ప్రయోగిస్తారు! ఎవరు ప్రయోగిస్తారు! రాయలసీమ జిల్లాలలో

మంత్రులూ ఎంఎల్ఏలూ ఇతర రాజకీయ నాయకులూ మారణాయుధాలతో ముఠాలు తయారు చేసుకొని భూమి తగవులొచ్చినా కులం తగాదాలొచ్చినా ఎన్నికలొచ్చినా సారాయి కాంట్రాక్టుల వేలం పాటలొచ్చినా హత్యలకూ, గృహదహనాలకూ పాల్పడు తున్నారే! ఈ హింసాకాండ ఎవరిని నిషేధిస్తే పోతుంది? పీపుల్స్‌వార్ గ్రూపు గత రెండేళ్ళలో ఎన్ని హత్యలకు పాల్పడిందో హోంమంత్రి ఆవేశంగా ప్రకటించారు. ప్రజలకు ఆ సమాచారం అందజేసినందుకు కృతజ్ఞులం. కానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు హోంమంత్రిగారి స్వంత జిల్లాలోనే గత రెండేళ్ళలో ఎన్ని హత్యలు చేయించారో, ఎన్ని బాంబులు వేసుకున్నారో కూడ అంతే ఆవేశంగా ప్రకటించడం సబబుగా ఉంటుంది కదా! ఆ హత్యాకాండకు జవాబుగా దానికి పాల్పడుతున్న వారి మీద ఏ నిషేధం ప్రయోగిస్తారో ప్రకటించడం కూడ ఉచితంగా ఉంటుంది కదా! హింస ఎవరు చేసినా తప్పే. తుపాకులు చేతపట్టుకొని ఎవరు సంచరించినా తప్పే. నక్సలైట్లు చేస్తే మట్టుకే తప్పా? కాంగ్రెస్ వారు చేస్తే తప్పు కాదా?

## నిషేధం ఎందుకోసం?

'హింస' అనేది నిషేధానికి ఒక సాకు మాత్రమే. ప్రజా ఉద్యమాలపైన అణచివేత ప్రయోగించడం అసలు ఉద్దేశ్యం. ఇంతకుముందు కూడ అణచివేతకూ 'ఎన్‌కౌంటర్ల'కూ హింసనే సాకుగా చూపించారు. అయితే హింసాత్మక పద్ధతులు ఎక్కువగా అవలంబించే పీపుల్స్‌వార్ గ్రూపుకు సంబంధించిన వారినే కాక ఇతర విప్లవ గ్రూపులకు సంబంధించిన వారిని కూడ 'ఎన్‌కౌంటర్ల'లో చంపలేదా? చిత్రహింసలు పెట్టలేదా? టాడా కేసులలో ఇరికించలేదా? సిరిసిల్ల, ఇల్లెందు నియోజక వర్గాలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వారిని చిత్రహింసలకు గురిచేయలేదా? 'ఎన్‌కౌంటర్ల'లో కాల్చి చంపలేదా? ఖమ్మం, కరీంనగర్ జిల్లాలలో ప్రజాస్వామికంగా ఎన్నికయిన ప్రజా ప్రతినిధులను బెదిరించి రాజీనామా చేయించలేదా? విప్లవ గ్రూపులనే కాక పూర్తిగా చట్టబద్ధంగా నడుచుకునే దళిత ఉద్యమం మీద అణచివేత ప్రయోగించలేదా? చుండూరులో అనిల్ కుమార్‌ను కాల్చివేయలేదా? దేశవ్యాప్తంగా పర్యావరణ ఉద్యమకారుల మీద కూడ పోలీసులు లాఠీలూ తుపాకులూ ప్రయోగించడం లేదా? ఉద్యమాలపైన అణచివేత ప్రయోగించడం ప్రభుత్వ విధానాల నైజం అయినప్పుడు ఈ సాకులు చూపించడం ఎందుకు?

కొంతకాలంగా రాష్ట్రంలో పోలీసులు 'నక్సలైట్లతో ఏ సంబంధాలున్నా వదిలి పెట్టం' అనీ, 'సంబంధాలున్న వాళ్ళు వదులుకొని సరండర్ కాకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి' అనీ ప్రకటనలు చేస్తున్నారు. ఊళ్ళను చుట్టుముట్టి 'సంబంధాలున్న వాళ్ళను' పోగేసి చావగొడుతున్నారు. 'టాడా' కేసులలో ఇరికించి జైలుకు పంపిస్తున్నారు. ఇప్పుడు నిషేధం దీనికంతటికీ ఒక చట్ట సంబంధమయిన ముసుగు కల్పిస్తోంది. పీపుల్స్‌వార్ గ్రూపుతో సంబంధం ఉండడం ఇంతవరకు చట్టం కళ్ళలో నేరం కాదు. ఇప్పుడు నేరం అవుతుంది. (అంతమాత్రం చేత వాళ్ళందరినీ చావగొట్టవచ్చుననీ, చంపవచ్చుననీ అర్థం చేసుకోకూడదు. కేసుపెట్టి జైలుకు మాత్రం పంపించవచ్చును. ఈ రెండు వారాలలో అప్పుడే వందల సంఖ్యలో అరెస్టుచేసి ప్రజలను జైలుకు పంపారు కూడ.)

ఇంతవరకు మారుమూల ప్రాంతాల పత్రికా విలేఖర్లను మాత్రమే 'మీకు నక్సలైట్లతో సంబంధాలున్నాయి' అని బెదిరించేవారు. కొందరిని తప్పుడు కేసులలో ఇరికించేవారు. గులాం రసూల్‌ను హత్యచేశారు. కాని ఇప్పుడు ఈ నిషేధాన్ని అడ్డంపెట్టుకొని పత్రికల మీద ప్రభుత్వం నేరుగా దాడి చేస్తోంది. ఏ వార్తలు రాయొచ్చునో తాను నిర్ణయిస్తానంటూ ఉంది. 'సంబంధాలున్న' విలేఖర్ల మీద చర్య తీసుకుంటానంటూ ఉంది. పీపుల్స్‌వార్ మీద నిషేధాన్ని నెమ్మదిగా పత్రికా స్వేచ్ఛ మీద నిషేధంగా మార్చాలని ప్రయత్నిస్తూ ఉంది. పత్రికా స్వేచ్ఛ అన్నా, వార్తలన్నా వారికి అంత భయమెందుకో!

ఒక్క పత్రికా స్వేచ్ఛపైనే కాదు, అన్ని ప్రజాస్వామిక హక్కులపైనా, అన్ని ప్రజా ఉద్యమాలపైనా దాడి చేయడం ఈ నిషేధం ఉద్దేశ్యం. ఒక పార్టీని మాత్రమే నిషేధించానని ప్రభుత్వం అంటుంది కానీ ఆచరణలో ఈ నిషేధం పోలీసుల బుద్ధికి ఎవరు తోస్తే వారందరికీ వర్తిస్తుంది. భూమి కోసం, కూలిరేట్ల కోసం, సామాజిక గౌరవం కోసం, సమానత్వం కోసం సాగే అన్ని ఉద్యమాలపైనా నిషేధం వేటు పడుతుంది. ఇప్పటికే తెలంగాణ జిల్లాలలో అన్ని ప్రజా ఉద్యమాలపైనా దాడులు ముమ్మరం అయ్యాయి. అరెస్టులు పెరిగాయి. 'ఎన్‌కౌంటర్' చేస్తామన్న బెదిరింపులు పెరిగాయి. న్యాయం కోసం మాట్లాడడమే నేరమన్న భయకంపిత వాతావరణం కల్పిస్తున్నారు.

## ఈ నిషేధం చట్టబద్ధమేనా?

ఇష్టమొచ్చిన రాజకీయ సంస్థలను ఏర్పరచుకోవడం ఆర్టికల్ 19(1)(c) ప్రకారం భారత ప్రజల ప్రాథమిక హక్కు. అలాగే ఇష్టమొచ్చిన రాజకీయ భావాలను వ్యక్తం చేయడం 19(1)(a) ప్రకారం ప్రాథమిక హక్కు. వీటికి పరిమితులు పెట్టడం అంటూ జరిగితే అది న్యాయంగా, హేతుబద్ధంగా ఉండాలని 19 (2), (5) అంటాయి.

మన రాజ్యాంగం ఉనికిలోకి రాకముందు, భారత ప్రజలకు ప్రాథమిక హక్కులు లేకముందు బ్రిటిష్ ప్రభుత్వం 1908లో క్రిమినల్ లా సవరణ చట్టం పేరిట ఒక నిషేధ చట్టాన్ని జారీచేసింది. పంజాబు, బొంబాయి ప్రాంతాలలో లాలా లజపతిరాయ్, బాల గంగాధర్ తిలక్‌ల వంటి నాయకుల ప్రభావాన్నీ, బెంగాల్‌లో అనుశీలన్ సమితి, జుగంతర్ వంటి జాతీయవాద పోరాట సంస్థల ప్రభావాన్నీ అరికట్టడం కోసం అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఈ చట్టాన్ని చేసింది. ఈ చట్టం ఈనాటికీ ప్రస్తుత కోస్తా ఆంధ్ర, రాయలసీమ జిల్లాలకు (అధికార పరిభాషలో 'ఆంధ్ర ప్రాంతానికి') వర్తిస్తుంది. హైదరాబాదు సంస్థానంలో కమ్యూనిస్టుల, ఆర్యసమాజీయుల, కాంగ్రెస్ అనుయాయుల చొరవతో పెరుగుతున్న ప్రజా ఉద్యమాలను అణచడం కోసం 1938లో నిజాం ప్రభుత్వం జారీచేసిన పబ్లిక్ సెక్యూరిటీ చట్టం (ఫస్లీ 1348) తెలంగాణ ప్రాంతానికి వర్తిస్తుంది. ఈ రెండు చట్టాల కింద రాష్ట్రంలో పీపుల్స్‌వార్ గ్రూప్‌ను ఇప్పుడు నిషేధించారు.

మరి ఈ చట్టాలు భారత రాజ్యాంగం ప్రకారం చెల్లుతాయా? చెల్లవని సుప్రీంకోర్టు ధర్మాసనం 1952లోనే తీర్పు చెప్పింది. అప్పటి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీని క్రిమినల్ లా సవరణ చట్టం (1908) సెక్షన్ 15(2)(b) కింద నిషేధించగా మొదట మద్రాసు హైకోర్టు, ఆ తరువాత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఈ చట్టం రాజ్యాంగ సమ్మతం కాదనీ నిషేధం చెల్లదనీ ప్రకటించాయి. రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 40 ఏళ్ళ క్రితమే కొట్టేసిన ఈ చట్టాన్ని ఉపయోగించి జనార్ధనరెడ్డి ఇప్పుడు పీపుల్స్‌వార్ గ్రూపును నిషేధించాడు! ఈ విషయాన్ని ఎత్తి చూపిస్తే నిషేధాన్ని వెనక్కి తీసుకోకపోగా ఎత్తి చూపించిన వాళ్ళనే బెదిరిస్తున్నారు. రాజ్యాంగబద్ధమయినా, కాకపోయినా నిషేధాన్ని

అమలు చేస్తామనే ప్రకటిస్తున్నారు. రాజ్యాంగం అంటే అంత గౌరవం మన పాలకులకు!


రాజ్యాంగం అంటే గౌరవం లేని వాళ్ళు, ప్రజాస్వామ్యం అంటే ఏమిటో తెలీని వాళ్ళు, అవినీతి మురికి కూపంలో కూరుకుపోయిన వాళ్ళు, గుండాలను పోషించి హత్యలు చేయించి అధికారాన్ని నిలబెట్టుకునే వాళ్ళు – ఇవాళ వీళ్ళూ మనకు ప్రజాస్వామ్యాన్ని గురించి లెక్చర్లు ఇస్తున్నారు. విని తరించవలసిన దుర్దశ మనకు పట్టింది. వీళ్ళు మిజో నేషనల్ ఫ్రంట్‌ను నిషేధించినా, ఎల్‌టిటిఇని నిషేధించినా, పీపుల్స్‌వార్ గ్రూప్‌ను నిషేధించినా అది ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం అనుకుంటే మనం మూర్ఖులం అవుతాం.

ఉద్యమాలపైన దాడి చేయడం కోసం, పత్రికా స్వేచ్ఛను అణచడం కోసం, జీవించే హక్కును నిరాకరించడం కోసం, రాజకీయ స్వేచ్ఛను మృగ్యం చేయడం కోసమే ఈ నిషేధాలు. ఆ హక్కులనూ స్వేచ్ఛనూ కాపాడుకోకపోతే మనకు మనం ద్రోహం చేసుకున్నవాళ్ళమవుతాం. అప్రకటిత ఎమర్జెన్సీని మౌనంగా ఆమోదించిన వాళ్ళమవుతాం.

- ఉద్యమ సంస్థలను నిషేధించే అధికారాన్ని రద్దుచెయ్యాలి.
- ఇప్పటికే ప్రకటించిన నిషేధాలను ఉపసంహరించుకోవాలి.
- అణచివేత విధానాలనూ, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యాకాండనూ మానుకోవాలి.
- పత్రికా స్వేచ్ఛపైన దాడులు మానుకోవాలి.

*ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థల సంయుక్త కరపత్రంగా వచ్చింది*

***జూన్ 1992***



# పౌరహత్యలు – పోలీసుల సంస్కృతి

'మానవహక్కుల' గురించి మాట్లాడడం ఈరోజు మన దేశంలో ఆమోదనీయమయింది. దీని అర్థం పౌరహక్కుల ఉద్యమకారుల మీద నిందలు, దాడులు పూర్తిగా ఆగిపోయాయని కాదు. కాని పౌరహక్కుల గురించి మాట్లాడడమే తీవ్రవాదం అనే రోజులు పోయాయి. ఇష్టమున్నా లేకపోయినా పౌరహక్కుల భావనను గుర్తించక, గౌరవించక తప్పని పరిస్థితి దేశాన్ని ఏలే రాజకీయ అధినేతలకు, పోలీసు, సైనిక అధికారులకు దాపురించింది. దారిద్ర్యాన్ని రూపుమాపుతాం అని హామీ ఇచ్చినట్టే ప్రజల హక్కులను గౌరవిస్తాం అని కూడ పాలకులు హామీలు ఇచ్చే రోజులు వచ్చాయి.

ఈ స్థితిని సాధించడం కోసం తమ స్వేచ్ఛను, జీవితాన్ని త్యాగం చేసినవాళ్ళు చాలామంది వున్నారు. వారిలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ రామనాథం ఒకరు. సరిగ్గా 10 సంవత్సరాల క్రితం ఇదే రోజున (3 సెప్టెంబరు 1985) ఆయనను పోలీసులు కాల్చిచంపారు. వరంగల్ పట్టణం జయప్రకాశ్ నారాయణ్ రోడ్‌లోని తన క్లినిక్‌లో వున్న రామనాథం గారిని పోలీసులు లోపలికి వచ్చి తరిమి కాల్చిచంపారు.

ఆ సమయంలో ఆ రోడ్డులో పోలీసులు తప్ప వేరే ఎవ్వరూ లేరు. నక్సలైట్లు కాల్చి చంపిన కాజీపేట ఎస్ఐ మృతదేహాన్ని ఊరేగింపుగా తీసుకుపోతున్న సాయుధ పోలీసు మూకను చూసి ప్రజలంతా ఇండ్లలోకి పోయి తలుపులు వేసుకున్నారు. దుకాణాలు బంద్ చేశారు. పోలీసుల

ఊరేగింపు నుండే కొందరు వ్యక్తులు పక్కకు దూసుకొచ్చి డాక్టర్‌గారిని కాల్చి చంపారు. చంపినవాళ్ళు పోలీసులు కారనీ, వేరే ఎవరో ఊరేగింపులో చేరి ఆ పని చేశారని ఆనాటి నుంచి ఈనాటిదాకా పోలీసులు అంటున్నారు. అదే నిజమయితే వాళ్ళను పోలీసులు ఈ 10 సంవత్సరాలలో ఎందుకు పట్టుకోలేకపోయారు? మొత్తం జిల్లా పోలీసు యంత్రాంగమంతా అక్కడే వుండగా, అందరి సమక్షంలో ఆ నేరం జరిగింది. ఇన్నేళ్ళు గడిచినా వాళ్ళను పోలీసులు పట్టుకోలేకపోయారంటే అది అసమర్థత అనుకోవాలా లేకపోతే హంతకులు తమవారే అనుకోవాలా?

పోలీసులే చేశారని అనుమానించదగ్గ పరిస్థితిలో ఒక నేరం జరుగుతుంది. ఎవరు చేసినా పరిశోధించవలసింది పోలీసులే కాబట్టి మనం వాళ్ళనే అడుగుతాం. వాళ్ళు ఏదో ఒక సమాధానం చెబుతారు. చేసినది మేము కాదంటారు. వేరే ఎవరో అంటారు. మరి వాళ్ళను గుర్తించారా అంటే ఇంకా పరిశోధిస్తున్నాం అంటారు. లేకపోతే అది అసలు నేరమే కాదంటారు. సహజ సంఘటన అంటారు, ప్రమాదం అంటారు, ప్రకృతి వైపరీత్యం అంటారు. మీకెట్లా తెలుసునంటే మా పరిశోధనలో తేలిందంటారు. మీ పరిశోధనలోని సత్యాసత్యాలను తేల్చేది ఎవరంటే మేమేనంటారు. అనుమానం వారిమీదనే వున్నప్పుడు వారి పరిశోధనే సత్యానికి ప్రమాణం ఎలా అవుతుందని మనం ప్రభుత్వాన్ని అడుగుతాం. స్వతంత్ర న్యాయ విచారణ జరిపించమని అడుగుతాం. దీనికి పోలీసు యంత్రాంగం ఒప్పుకోదు. స్వతంత్ర విచారణ జరిపితే తమ ఆత్మస్థైర్యం దెబ్బతింటుందంటారు. పోలీసులే కాదు, ప్రభుత్వం కూడ ఆ మాటే అంటుంది. పోలీసుల ఆత్మస్థైర్యం అనేది చాలా సులభంగా దెబ్బ తినే సున్నితమైన వస్తువని మనం అనుకోవలసి వుంటుంది. దానిని కాపాడడం కోసం వారి చర్యలపైన వారి తీర్పునే సమాజం ఆమోదించాలి.

వాళ్ళు లాఠీఛార్జి చేస్తారు. చేసి ఎందుకు చేశారో చెబుతారు. అదే అంతిమ తీర్పు. అదే సత్యం. వాళ్ళు కాల్పులు జరుపుతారు, ఎన్‌కౌంటర్ చేస్తారు, నిండు ప్రాణాన్ని తమ కస్టడీలో శవంగా మారుస్తారు. అంతా చేశాక అది ఎందుకు జరిగిందో, అసలేం జరిగిందో తామే చెప్తారు. అదే అంతిమ తీర్పు. అదే సత్యం. సమాజం దానిని ఆమోదించాలి. ఆమోదించక స్వతంత్ర విచారణ జరగాలని అంటే పోలీసుల మనోస్థైర్యం దెబ్బతింటుందని మనల్ని బెదిరిస్తారు. ఒకవేళ విచారణ జరిపిస్తే, సాక్ష్యాలు

నమోదు కానివ్వరు. బెదిరిస్తారు, భయపెడతారు, నిర్బంధిస్తారు, హింసిస్తారు, డబ్బు పెట్టి కొనేస్తారు.

తాము చేసిన తప్పులపైన విచారణ జరిగితే తమ మనోస్థైర్యం దెబ్బతింటుందని చెప్పి విచారణను అడ్డుకునే సదుపాయం సమాజంలో ఎవరికీ లేనిది పోలీసులకు మాత్రం ఎందుకుండాలి?

పోలీసులు ఈ బెదిరింపు ప్రయోగించగలుగుతున్నారన్నా, సమాజం దానిని ఆమోదిస్తున్నదన్నా దానికి కారణం సమాజంలోనే వుంది. యథేచ్ఛగా హింస ప్రయోగించే అధికారం గల పోలీసు యంత్రాంగం మన సమాజానికి 'అవసరం' అయింది. ఆ బలప్రయోగాన్ని ప్రశ్నిస్తే 'మేము పనిచేయము జాగ్రత్త' అని పోలీసు యంత్రాంగం బెదిరిస్తుంది. ఆ బెదిరింపు సమాజం మీద పనిచేస్తుంది. మన సామాజిక భద్రత పోలీసుల విచ్చలవిడి అధికారంతో ముడిపడి వుంది. విచ్చలవిడిగా బలప్రయోగం చేయడంలో తప్పులేదనే 'గుండె నిబ్బరం' పోలీసులకు అవసరం అయింది. అందువల్లనే పోలీసుల 'మనోస్థైర్యం' అంత పవిత్రమైన విషయం అయింది.

మనం ఈ రకమైన సామాజిక భద్రతనూ, దానికోసం అవసరం అయ్యే పోలీసుల విచ్చలవిడితనాన్ని తిరస్కరించకపోతే మనది ఒక ప్రజాస్వామ్య వ్యవస్థ అని చెప్పుకోడంలో అర్థం లేదు. మనది గొప్ప సంస్కృతి అని పొగుడుకోవడంలోనూ అర్థం లేదు. రాజ్యాంగ యంత్రాంగానికి వుండే బలప్రయోగ అధికారానికి కచ్చితమైన పరిమితులు వుండాలి. దానిపైన స్వతంత్ర పర్యవేక్షణ వుండాలి. జవాబుదారీతనం వుండాలి. దీనిని మన సామాజిక వ్యవస్థ 'భరించ'లేకపోతే, అటువంటి వ్యవస్థను చూసి మనం సిగ్గుపడవలసి వుంటుంది. ఆ వ్యవస్థను సంస్కరించవలసి వుంటుంది. పోలీసు బలప్రయోగ అధికారానికి పగ్గాలు వేయడం ఆ సంస్కరణలో ఒక మెట్టు.

మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సగటున 20 మంది పోలీసు కస్టడీలో చనిపోతుంటారు. వాళ్ళలో సగం మంది ఆత్మహత్య చేసుకున్నారని, సగం మంది అనారోగ్యంతో చనిపోయారని పోలీసులే తక్షణం తీర్పు చెబుతుంటారు. ఈ తీర్పు మీద ఏ న్యాయస్థానం కళ్ళూ ప్రసరించవు. గడిచిన నాలుగు సంవత్సరాలలో మన రాష్ట్రంలో సగటున సంవత్సరానికి 150 మంది 'ఎన్‌కౌంటర్ల' పేరిట చనిపోయారు. 'వాళ్ళు మమ్మల్ని చంపబోగా మేమే ముందు వాళ్ళను చంపాము' అని పోలీసులు

తమకు తామే ఫిర్యాదు ఇచ్చుకుని చనిపోయిన వాళ్ళమీద కేసు నమోదుచేసి తామే నేరపరిశోధన చేసి చనిపోయినవాళ్ళు నిజంగానే హత్యా ప్రయత్నానికి పాల్పడ్డారని తేల్చి కేసు మూసేస్తున్నారు. ఈ ప్రహసనం ప్రాణాంతకం కాకుంటే చక్కటి హాస్యకథ అయివుండేది. ఈ కథల మీద కూడ ఏ న్యాయస్థానం చూపులు ప్రసరించవు.

అసలు తాము చేసే పనులు చట్టపరిధిలోకి, న్యాయస్థానాల పరిధిలోకి వస్తాయనే స్పృహే పోలీసులకు లేకుండా పోయింది. పెద్దగా విద్యావంతులు కాని పోలీసులకే కాదు, పైస్థాయి అధికారులకు సహితం లేదు. ఈ సంవత్సరం ఆగస్ట్ నెలలో హైదరాబాద్‌లో 'ఎన్‌కౌంటర్ల'పైన జాతీయ మానవహక్కుల కమిషన్ నిర్వహించిన విచారణలో సిఐ, డిఎస్‌పి స్థాయి గెజిటెడ్ పోలీసు అధికారులు ఇచ్చిన సమాధానాలు దీనికొక తార్కాణం. తాము ఒక మరణం మీద ఎమ్మార్వో చేత ఇంక్వెస్ట్ ఏ చట్టం కింద చేయిస్తారో వారికి తెలియదు. మృతునిపై కాల్పులు ఎంత దూరం నుంచి జరిగాయో నిర్ణయించేది ఫోరెన్సిక్ నిపుణుడా లేక బాలిస్టిక్ నిపుణుడా అంటే తెలీదు. ఒక వ్యక్తి ఆత్మరక్షణార్థం మరొక వ్యక్తిని చంపినట్టు తమ వద్దకు వచ్చి ఒప్పేసుకుంటే అతనిపైన ఏ సెక్షన్ క్రింద కేసు పెడతారో తెలియదు. తమకు తుపాకులు, లాఠీలు, లాకప్ గదులు ఇచ్చింది మనుషులను తమ బుద్ధికి తోచినట్టు హింసించి 'శాంతిభద్రతలు' నెలకొల్పడానికని వాళ్ళ ప్రగాఢ విశ్వాసం. పోలీసుల 'మనోస్థైర్యం' అని పిలువబడే దానిలో ఈ విశ్వాసమే ముఖ్యాంశం.

ఈ పరిస్థితి వుండడానికి వీలు లేదని చాలాకాలంగా పౌరహక్కుల సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. రాజ్యాన్ని, రాజ్య భద్రతను ప్రజాస్వామ్యానికి అతీతమయిన విషయాలుగా చూడడాన్ని పౌరహక్కుల ఉద్యమం వ్యతిరేకిస్తుంది. రాజ్యభద్రత అనేది ప్రజాస్వామ్య విలువలకు, సూత్రాలకు లోబడి వుండాలి. లేకపోతే అది ప్రజాస్వామ్య వ్యవస్థ అనిపించుకోదు. సమాజంలో ఎంతటి అభద్రస్థితి ఏర్పడినా శాంతిభద్రతలను కాపాడే యంత్రాంగం ప్రజాస్వామ్యానికి అనుగుణ్యమైన పద్ధతులకు లోబడే పనిచేయాలి. సామాజిక ఉద్రిక్తత పేరు చెప్పి రాజ్యం అనాగరికంగా తయారు కావడానికి వీలు లేదు. దానివల్ల ఉద్రిక్తత పోకపోగా, మొత్తంగా సమాజ జీవితం అనాగరికంగా తయారవుతుంది. ఏ సామాజిక ఉద్రిక్తతకయినా సామాజిక కారణాలుంటాయి. దానిని రాజకీయ చర్యల ద్వారా కాక విచ్చలవిడి బలప్రయోగంతో పరిష్కరింపజూస్తే, సమస్య పరిష్కారం కాక పరిష్కార ప్రయత్నమే ఒక సమస్య అయి కూర్చుంటుంది. అప్పటి

వరకు సమాజంలో నెలకొని వున్న ప్రజాతంత్ర విలువలూ సంప్రదాయాలూ ధ్వంసం అయి సమాజాన్ని మొత్తంగా వెనక్కి తీసుకుపోవడమే జరుగుతుంది.

అందువల్ల ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ యంత్రాంగం వ్యవహరించే తీరు కొన్ని కచ్చితమైన నియమాలకు, చట్టాలకు లోబడి వుండాలి. దాని పనితీరు మీద అదే తీర్పు చెప్పుకునే రాచరిక న్యాయం నడవడానికి వీలులేదు. దానిపైన స్వతంత్ర పర్యవేక్షణ వుండాలి. ఇది ఏ విధంగా సాధ్యం కావాలనే ప్రశ్నకు సులభమైన జవాబు లేదు. న్యాయస్థానాలకు ప్రస్తుతం వుండే స్వయం ప్రతిపత్తి, స్వతంత్ర అధికారాలు సరిపోవు. ఇంకా అనేక సంస్థలను, సంప్రదాయాలను నెలకొల్పవలసి వుంటుంది. వాటిని మన సామాజిక జీవితంలో అంతర్భాగం చేయవలసి వుంటుంది. దీనికి ఒక మొదటిమెట్టుగా, సామాజిక భద్రతను రాజ్యభద్రతను కాపాడే పేరు మీద భద్రతా సిబ్బంది చేసే నేరాలను పరిశోధించడానికి, విచారించడానికి, శిక్షించడానికి ప్రత్యేకమైన న్యాయస్థానాలను నెలకొల్పాలని పౌరహక్కుల ఉద్యమం డిమాండ్ చేస్తూ వుంది. అంతర్జాతీయ పౌరహక్కుల పరిభాషలో వీటికి మానవహక్కుల సంస్థలు అన్న పేరు వచ్చింది.

ప్రజా ఉద్యమాలపైన నిష్కారణంగా కాల్పులు, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలు, నేర పరిశోధన పేరిట లాకప్పులో చిత్రహింసలు, కస్టడీ మరణాలు మన దేశంలో ఎప్పటి నుంచో వున్నవి. అయినా వాటిపైన ఎన్నడూ స్వతంత్ర విచారణ జరిపిందీ లేదు, హింసకు పాల్పడిన పోలీస్ అధికారులను శిక్షించిందీ లేదు. 1984 నుంచి 1995 ఆగస్టు నెల దాకా మన రాష్ట్రంలో 212 మంది పోలీసు కస్టడీలో చనిపోయారు. అందులో కేవలం నాలుగు కేసులలో బాధ్యులయిన పోలీస్ అధికారులకు కోర్టులో ఎంతో కొంత శిక్ష పడింది. 'ఎన్‌కౌంటర్ల' పేరిట గడచిన 27 సంవత్సరాలలో రాష్ట్రంలో దాదాపు 1200 మందిని పోలీసులు చంపారు. వీటిలో ఒక్క సంఘటనపైన కూడ కోర్టులో కేసు నడవలేదు.

పంజాబు, కాశ్మీరులలో భారత భద్రతా దళాలు పెద్దఎత్తున మానవ హక్కుల అతిక్రమణకు పాల్పడిన తరువాతే మన దేశంలో జరుగుతున్న ఈ అధికార హింసాకాండ ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షించింది. అప్పటి నుంచి ఈ హింసాకాండను నివారించాలనీ, దానిపై విచారణ జరిపే మానవహక్కుల సంస్థలను నెలకొల్పాలనీ

భారత ప్రభుత్వంపైన అంతర్జాతీయ ఒత్తిడి పెరిగింది. ఈ ఒత్తిడిలో రెండు అంశాలు వున్నాయి. ఈ రోజు ప్రపంచంలో మొత్తంగానే హక్కుల స్పృహ చాలా పెరిగింది. ముఖ్యంగా, అభివృద్ధి చెందిన దేశాలలో హక్కులకు సంబంధించిన చైతన్యం బలంగా వుంది. ఆ దేశాల ప్రభుత్వాలు తమకు అనుయాయులుగా భావించి చేరదీసే మూడవ ప్రపంచ రాజ్యాలపైన మానవహక్కుల విషయంలో ఒత్తిడి పెట్టాలని ఆ దేశాలలోని ప్రజాతంత్రవాదులు ఆందోళన చేస్తున్నారు. ఆ దేశాల ప్రభుత్వాలు ఒకవైపు ఈ ఆందోళనకు లొంగుతూనే మరొకవైపు ఆ ప్రజాతంత్ర వాతావరణాన్ని కూడ బడుగు దేశాలపైన మరింత ఒత్తిడి పెట్టడానికి వాడుకుంటున్నాయి. మానవహక్కుల విషయంలో మనబోటి దేశాల ప్రభుత్వాలపై పాశ్చాత్య దేశాల నుంచి వస్తున్న ఒత్తిడిలో వున్న ఈ రెండు అంశాలను దృష్టిలో పెట్టుకోకపోతే దానిని నిర్విమర్శగా స్వీకరించడమో, నిర్విమర్శగా వ్యతిరేకించడమో జరుగుతుంది.

భారత ప్రభుత్వం ఈ ఒత్తిడికి తలొగ్గిన అభిప్రాయమే కలిగిస్తూ అత్యంత బలహీనమైన మానవహక్కుల సంస్థను నెలకొల్పింది. ఇది రంగనాథ్ మిశ్రా ఛైర్మన్‌గా వున్న జాతీయ మానవహక్కుల కమిషన్. ఈ కమిషన్‌కు పోలీసుల మీద తప్ప మిలిటరీ మీద గాని, పారా మిలిటరీ మీద గాని విచారణ చేపట్టే అధికారం లేదు. ఆ విచారణ కూడ కేవలం నిజ నిర్ధారణ కోసం చేసే విషయ సేకరణే తప్ప నేర విచారణ కాదు. దానిలో దోషులుగా తేలినవారికి శిక్షవేసే అధికారం కమిషన్‌కు లేదు. కనీసం బాధితులకు నష్టపరిహారం ఇప్పించే అధికారం సైతం కమిషన్‌కు లేదు. ఈ కమిషన్ చేయగలిగింది ఏమిటంటే పోలీసులపైన వచ్చిన ఆరోపణల గురించి నిజనిర్ధారణ చేయడానికి విచారణ నిర్వహించడం, పోలీసులు నేరం చేశారనిపిస్తే వారిని ప్రాసిక్యూట్ చేయమని ప్రభుత్వానికి సూచనలివ్వడం, బాధితులకు నష్టపరిహారం ఇమ్మని ప్రభుత్వానికి సిఫారసు చేయడం.

జాతీయ మానవహక్కుల కమిషన్ కనీసం ఆ మేరకైనా – అంటే తన వద్దకు వచ్చిన అన్ని ఫిర్యాదుల పైన ఈ పరిమితమైన విచారణలు జరిపినా బాగుండును. పోలీసులు కనీసం తమ చర్యలకు బహిరంగంగా జవాబు చెప్పుకోవలసి వచ్చేది. కానీ ప్రస్తుత ఛైర్మన్ ఆ పని కూడ ఎక్కువగా చేయడం లేదు. ఆయన ఎక్కువగా ఏం చేస్తున్నారంటే తనవద్దకు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత ప్రభుత్వానికి పంపించి వివరణ కోరడం, దానికి వారు పంపిన సమాధానాన్ని ఫిర్యాదికి తిరిగి పంపించడం.


ఇది కాక, జాతీయ మానవహక్కుల కమిషన్ చేస్తున్న మరొక పని ఏమిటంటే రకరకాల మానవహక్కుల సమస్యలపైన ప్రచారం నిర్వహించడం, అభిప్రాయ సేకరణ చేయడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సలహాలు సూచనలు ఇవ్వడం.

అయినా ఈ మాత్రం మానవహక్కుల కృషి జరగడం కూడ పోలీసు యంత్రాంగానికి ఇష్టం లేదు. తమకు ఏ మాత్రం జవాబుదారీతనం వుండడానికి వీలులేదనేది మన భారత పోలీసుల నిశ్చితాభిప్రాయం. ఆ ప్రాతిపదిక మీదనే మన దేశ పోలీసు సంస్కృతి తయారయింది. వాళ్ళ పనితీరు మీద ఏ రకమైన అభిప్రాయ సేకరణ కాని, విచారణ కాని జరగడం వాళ్ళు సహించలేరు. గత సంవత్సరం ఆగస్టు నెలలో జాతీయ మానవహక్కుల కమిషన్ 'నక్సలైట్ సమస్య' పైన కేవలం ప్రజాభిప్రాయ సేకరణ చేయడం కోసం రాష్ట్రానికి రాగా, తమ అభిప్రాయం తప్ప వేరే ఎవరి అభిప్రాయమూ వారి చెవిన పడకుండా వుండడానికి పోలీసులు నానా తంటాలు పడ్డారు. కమిషన్ పర్యటనను అభాసుపాలు చేసి వెనక్కి పంపించారు. ఈ సంవత్సరం ఆగస్టు నెలలో ఆరు 'ఎన్‌కౌంటర్' సంఘటనలపై విషయ సేకరణ జరపడానికి మళ్ళీ జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్రానికి రాగా, పోలీసులు సాక్షులను అపహరించి, నిర్బంధించి, బెదిరించి, ప్రలోభపెట్టి లొంగదీసుకోవడానికి నానా రకాల విఫల ప్రయత్నాలు చేశారు.

మన పోలీసు సంస్కృతికి జవాబుదారీతనం నేర్పించడం అంత సులభం కాదు. దీనికి బాధ్యత కేవలం పోలీసు అధికారులది కాదు. మన సామాజిక వ్యవస్థే ఆ సంస్కృతికి అవకాశం కల్పించింది, పెంచి పోషించింది. రాజకీయ నాయకులు, అన్ని రంగాల ప్రభుత్వ అధికారులు, మేధావులు, సమాజంలోని పెత్తందారీ వర్గాలు అందరూ ఈ రకమైన పోలీసు వ్యవస్థనే కోరుకున్నారు. పోలీసు వ్యవస్థ ఇలా వుంటేనే దేశ భద్రత, సామాజిక భద్రత సాధ్యమవుతాయని భావించారు. ఈ అనాగరిక స్థితి నుంచి మన సమాజం బయటపడడానికి చాలా కృషి అవసరం అవుతుంది. దానికి రామనాథం వంటి వాళ్ళు ఇంకెంతమంది బలి కావలసి వుందో!

*ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం*

***3* సెప్టెంబరు *1995***



# పీపుల్స్‌వార్‌పై నిషేధాన్ని నిరసిద్దాం

రాష్ట్ర ప్రభుత్వం జూలై నెలలో సిపిఐ (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)పై, ఆ పార్టీ అనుబంధ సంస్థలయిన విద్యార్థి, యువజన, కార్మిక, రైతుకూలీ, ఆదివాసీ సంఘాలపైన ప్రకటించిన నిషేధాన్ని వ్యతిరేకించమని, ఆ నిషేధాన్ని వెంటనే తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయమని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం మీకు విజ్ఞప్తి చేస్తూ ఉంది.

ఎందుకు?

మీకు పీపుల్స్‌వార్ పార్టీ అంటే రాజకీయంగా సానుభూతి ఉండవచ్చు, ఉండక పోవచ్చు. ఆ పార్టీ అనుసరించే పద్ధతులను మీరు ఆమోదించవచ్చు, ఆమోదించక పోవచ్చు. అయినా ఆ పార్టీపైన ప్రభుత్వం ప్రకటించిన నిషేధాన్ని తొలగించమని కోరవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం.

ఎందుకు?

పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని వ్యతిరేకించే వాళ్ళంతా హింసనూ, సాయుధ పోరాట రాజకీయాలనూ సమర్థించే వాళ్ళని ప్రభుత్వం అంటుంది. పీపుల్స్‌వార్ పార్టీ మద్దతుదారులని అంటుంది.

అది నిజం కాదు. మేము ఏ పార్టీని సమర్థించం. ఎవరి హింసనూ సమర్థించం. అయినా ఈ నిషేధం ఎత్తివేయమని కోరుతున్నాం. కోరమని మిమ్మల్ని కూడ కోరుతున్నాం.

ఎందుకు?

పీపుల్స్‌వార్ హింస చేస్తూ ఉంది కాబట్టి నిషేధిస్తున్నామని ప్రభుత్వం అనింది. అంటే అర్థం ఈ సంవత్సరం జూలై నెల దాకా మన రాష్ట్రంలో హింస మీద నిషేధం లేదా? హత్యలకూ, భౌతిక దాడులకూ, బస్సుల దహనాలకూ, బిల్డింగుల పేల్చివేతకూ చట్టం అనుమతి ఉండిందా?

లేదని మనకందరికీ తెలుసు. ప్రతి హింసాత్మక చర్యను చట్టం ఎప్పుడో నిషేధించింది. వేల సంఖ్యలో కేసులు నమోదయి వున్నాయి. మరి ఇప్పుడు కొత్తగా దేనిని నిషేధించినట్టు? నిషేధ చట్టం (ఆం.ప్ర.పబ్లిక్ సెక్యూరిటీ ఆక్ట్) దేనిని నిషేధించింది? కేవలం ఆ పార్టీ చేపట్టే హింసాత్మక కార్యకలాపాలనా?

కాదు. ఆ పార్టీకి సంబంధించిన అన్ని కార్యకలాపాలనూ అది నిషేధించింది. ఆ కార్యకలాపాలకు సహకరించడం, సహాయం చేయడం, వాటిలో పాల్గొనడం నేరాలుగా ప్రకటించబడ్డాయి.

హింసాత్మక కార్యకలాపాలు ఎప్పుడో నిషేధించబడ్డాయి కాబట్టి ఇప్పుడు కొత్తగా నిషేధించింది శాంతియుత కార్యకలాపాలను మాత్రమే. ఆ పార్టీ, ఆ పార్టీ ప్రజా సంఘాలు చేపట్టే ధర్నాలు, ఊరేగింపులు, బహిరంగసభలు, వాళ్ళు ప్రచురించే కరపత్రాలు, పుస్తకాలు, పోస్టర్లు, వాళ్ళు ప్రదర్శించే సాంస్కృతిక కార్యక్రమాలు – ఇవీ ఇప్పుడు కొత్తగా నిషేధించబడినవి.

జూలై నెలలో ముఖ్యమంత్రి ఆర్భాటంగా విలేఖరుల సమావేశం నిర్వహించి గంభీరంగా ప్రకటించిన నిషేధం వీటిపైన; హింసపైన కాదు – అది ఎప్పుడో నిషిద్ధం అయిపోయింది.

దీనిని ఆమోదిద్దామా?

హింసచేస్తే కేసుపెట్టి కోర్టులో విచారించి శిక్షించే బాధ్యత ప్రభుత్వానిది. ఆ బాధ్యతను మీరు కాదనరు. మేమూ కాదనము. ఎటొచ్చీ నేర విచారణ న్యాయ సమ్మతంగా, ప్రజాస్వామికంగా ఉండాలనీ, కోర్టు విచారణతో నిమిత్తం లేకుండా పోలీసులే మరణ దండన విధించే చట్టబాహ్యమైన హత్యాకాండకు ఒక నాగరిక దేశంలో తావు ఉండరాదనీ మేము అంటాం. మీరు ఒప్పుకుంటారని ఆశిస్తాం.

హింసచేస్తే న్యాయసమ్మతంగా విచారించి శిక్షించవచ్చు. కానీ వారి భావ ప్రకటనా స్వేచ్ఛను నిషేధించడం సబబా? వాళ్ళు కరపత్రాలు వేయకూడదనీ, పోస్టర్లు అంటించకూడదనీ, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించకూడదనీ, తమ రాజకీయాలు చెప్పుకునే పుస్తకాలూ, పత్రికలూ ప్రచురించకూడదనీ నిషేధించడం న్యాయమా? ఈ కార్యకలాపాలకు సహకరించడం, సహాయం చేయడం, వాటిలో పాల్గొనడం శిక్షార్హమైన నేరాలుగా ప్రకటించబడడం భావ్యమేనా? ప్రజాస్వామ్యంలో సమర్థనీయమేనా?

కడప జిల్లాలో వై.యస్. రాజశేఖరరెడ్డి హింస చేస్తున్నాడని కాంగ్రెస్ పార్టీని నిషేధించాలని, అనంతపురంలో పరిటాల రవి హింస చేస్తున్నాడని తెలుగుదేశం పార్టీని నిషేధించాలని ఎవరయినా అంటారా? అంటే అది న్యాయం అని ఎవరయినా ఒప్పుకుంటారా? 'వాళ్ళను జైలులో పెట్టండి. పార్టీని ఎందుకు నిషేధిస్తారు?' అనరా?

పీపుల్స్‌వార్‌పైన పెట్టిన నిషేధం వల్ల ఎవరు హక్కులు కోల్పోతారు? ఎవరు చట్టం దృష్టిలో నేరస్తులవుతారు? సాయుధదళ సభ్యులా? కాదు. వాళ్ళు లైసెన్సు లేకుండా ఆయుధాలు చేతబూనినప్పుడే చట్టం దృష్టిలో నిషిద్ధులయిపోయారు. ఇప్పుడు కొత్తగా నేరస్తులయ్యేది నిరాయుధులయిన గ్రామీణ ప్రజలు. పీపుల్స్‌వార్ పార్టీ సామాజిక పునాదికి చెందినవారు. వీళ్ళు గ్రామీణ ప్రాంతాల్లోని భూమిలేని నిరుపేదలు, చిన్న రైతులు, దళితులు, ఆదివాసులు, గని కార్మికులు. పీపుల్స్‌వార్ పార్టీ సాంఘిక పునాది ఈ వర్గాలలో ఉంది. ఇప్పుడు నిషేధం ఫలితంగా నిర్బంధానికి గురికాబోయేది ఈ వర్గాలకు చెందిన ప్రజలే. వాళ్ళు నమ్ముకున్న పార్టీతోను, ఆ పార్టీ నెలకొల్పిన కార్మిక, యువజన, రైతుకూలీ సంఘాలతోను 'సంబంధాలు' కలిగి ఉన్నందుకు, 'సహకరించినందుకు' వాళ్ళను ఇకమీద జైలులో పెట్టవచ్చును. ఆ సంబంధాలు, ఆ సహకారం పూర్తిగా శాంతియుతంగా ఉండవచ్చును. అన్నం పెట్టడం, చందాలు ఇవ్వడం, కరపత్రాలు పంచటం, పోస్టర్లు అంటించటం, వారి సలహా మేరకు గ్రామ సమస్యల పరిష్కారానికి ఒక కమిటీ నెలకొల్పి ఆందోళన చేపట్టడం ఇవన్నీ నేరాలవుతాయి. ఇవే నిషేధించబడ్డాయి. వీటిని నిషేధించడం కోసమే పీపుల్స్‌వార్‌పైన నిషేధం ప్రకటించడం జరిగింది.

హింసను నిషేధించడం కోసం కాదు. అది ఎప్పుడో నిషేధించబడింది.

1992–95 మధ్య కాలంలో రెండున్నర సంవత్సరాలపాటు మన రాష్ట్రంలో పీపుల్స్‌వార్ పైన నిషేధం ఉండింది. అప్పుడు వేల సంఖ్యలో అరెస్టయింది, జైలుకు పోయింది పైన పేర్కొన్న వర్గాల ప్రజలే. హింస చేసినందుకు కాదు. తప్పో, ఒప్పో తాము నమ్ముకున్న రాజకీయాలకు శాంతియుతంగా సహకరించినందుకు.

ఇది అన్యాయం, అనాగరికం. ఈ మాట అనడానికి మీరు పీపుల్స్‌వార్ సానుభూతిపరులు కానవసరం లేదు. ప్రజాస్వామ్య ప్రేమికులయితే చాలు. ఏ హింసా చేయకున్నా కేవలం ఒక రాజకీయాన్ని నమ్మినందుకు, ఆ రాజకీయాలకు సహకరించి నందుకు ఎవరినయినా జైలుపాలు చేయడం నియంతృత్వ రాజ్యం లక్షణం. ప్రజాస్వామ్య పాలన లక్షణం కాదు.

అందుకే ఈ నిషేధాన్ని వ్యతిరేకించమని మిమ్మల్ని కోరుతున్నాం. అది హింసను సమర్థించడం కాదు; ప్రజాస్వామ్యాన్ని సమర్థించడం. పీపుల్స్‌వార్ రాజకీయాలను ఆమోదించడం కాదు; అప్రజాస్వామిక పాలనకు ఆమోదం నిరాకరించడం.

మన దేశంలో అన్ని సామాజిక, ఆర్థిక రంగాలలోనూ సంక్షోభం పెరుగుతూ ఉంది. ఈ సంక్షోభానికి పరిష్కారం వెతకాలంటే ప్రజలకు రాజకీయ స్వేచ్ఛ అవసరం. ప్రజల రాజకీయ స్వేచ్ఛపైన అహేతుకమయిన నిషేధాలు పెట్టే అధికారం ప్రభుత్వానికి మనం కట్టబెడితే మనం భవిష్యత్తును రూపొందించుకునే స్వేచ్ఛను కోల్పోతాం. సమస్యలకు పరిష్కారం వెతికే స్వాతంత్ర్యాన్ని కోల్పోతాం. నిషేధానికి గురయిన పార్టీ పట్ల మనకు సానుభూతి లేదనో, సాయుధ పోరాట రాజకీయాలంటే సదభిప్రాయం లేదనో ప్రభుత్వానికి అహేతుకమైన అధికారాలు కట్టబెడితే, ఈ రోజు నిషేధించబడిన వాళ్ళే కాదు, అందరమూ నష్టపోతాం.

అందుకే పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని తొలగించమనే డిమాండ్‌తో మీరు కూడ గొంతు కలుపుతారని ఆశిస్తాం.

*ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కరపత్రంగా వచ్చింది*

***15 ఆగస్టు 1996***



# ఈ నిషేధాల నుంచి విముక్తి ఎప్పుడు?

**పీ**పుల్స్‌వార్‌పైన నిషేధాన్ని ప్రభుత్వం మరొక్క సంవత్సరం పొడిగించినట్లు ఈ రోజు వార్త.

మొదట ఆ పార్టీపైన 1992లో నిషేధం పెట్టినప్పుడు అది పెద్ద వార్త. తరువాత 1995లో తొలగించినప్పుడు అది వార్త మాత్రమే కాదు, ఆ తొలగింపు కోసం కృషి చేసిన వారికి చాలా సంతోషం కూడ. తిరిగి 1996లో నిషేధం విధించినప్పుడు కూడ అదొక ముఖ్యమైన వార్తే. ప్రభుత్వం ఏ పరిస్థితులలో నిషేధం తిరిగి విధించిందో విశ్లేషిస్తూ పత్రికలు వ్యాఖ్యలు రాశాయి. రాజకీయ స్వేచ్ఛ ఒకరు ఇచ్చేది కాదు కాబట్టి 'పరిస్థితుల' పేరు చెప్పి ప్రభుత్వం తీసేయగలిగింది కూడ కాదని హక్కులు సంఘాలు వ్యతిరేకించాయి.

పబ్లిక్ సెక్యూరిటీ చట్టం కింద ప్రకటించే నిషేధం గడువు ఒక సంవత్సరం మాత్రమే కాబట్టి మళ్ళీ మళ్ళీ ప్రతీ సంవత్సరం ప్రభుత్వం పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని పొడిగిస్తూనే ఉంది. ప్రతీ సంవత్సరం జూలై నెలలో ఈ ప్రకటన వస్తుండడం వల్ల రాను రాను అందులో సంచలనం లేకుండా పోయింది.

అలవాటయిపోవడం, ఏం మాట్లాడినా ప్రయోజనముండడం లేదని నిస్పృహ చెందడం దీనికి రెండు కారణాలు కావచ్చు. బహుశా వేరే కారణం కూడ ఒకటి ఉంది. అదేమిటంటే నిషేధం పెట్టడం వల్ల పెద్దగా వచ్చిన తేడా ఏమీ లేదన్న గుర్తింపు. చట్టబద్ధమైన కార్యకలాపాలపైన ఆ పార్టీ

ఎన్నడయినా ఆధారపడింది తక్కువే. ఆ పార్టీ కార్యకలాపాలు ప్రధానంగా అండర్‌గ్రౌండ్ కార్యకలాపాలుగానే ఉన్నాయి చాలా కాలంగా. నిషేధం ఈ అండర్‌గ్రౌండ్ కార్యకలాపాలపైన ఎటువంటి ప్రభావం వేయలేదు. ఇకపోతే ఒక రాజకీయ భావనగా, ఆలోచనా రీతిగా, ప్రాపంచిక దృక్పథంగా దానికి ఉండే ప్రభావం మీద ఏ నిషేధమూ పనిచేయదు. అప్పుడప్పుడు ఆ పార్టీ నిర్వహించిన లీగల్ కార్యకలాపాలపైన నిషేధం పనిచేస్తుంది గానీ వేరే దేని మీదా పనిచేయదు.

నిజానికి రాజకీయ నిషేధాలు సూత్రప్రాయంగా అప్రజాస్వామికమే కాక ఈ కారణంగా వృధా కూడ. ఒక పార్టీ కార్యకలాపాలలో కొన్నిటిని నిషేధం ఆపగలదుగానీ ఆ రాజకీయం సమాజం మీద వేసిన ముద్రను చెరిపేయలేదు. ఆ ముద్ర మంచిది కాదనుకుంటే దాని ప్రభావాన్ని ప్రత్యామ్నాయ రాజకీయాల ద్వారా తొలగించటం సాధ్యమవుతుందే తప్ప పబ్లిక్ సెక్యూరిటీ చట్టం ద్వారా కాదు, అటువంటి ఏ నిషేధ చట్టం ద్వారానూ కాదు.

నిషేధించి ఇన్నేళ్ళయిన తరువాత కూడ ఉత్తర తెలంగాణలో పీపుల్స్‌వార్ ఉనికి కనిపించని, వినిపించని ప్రదేశంగానీ సందర్భంగానీ ఉండదు. పీపుల్స్‌వార్‌కు సంబంధించినంత వరకు ఆ నిషేధం ఎంత నిరర్థకమో అక్కడ ఏ గ్రామంలోనయినా రెండు రోజులు గడిపితే అర్థమవుతుంది. అన్ని రాజకీయాల కంటే ఆ నిషిద్ధ రాజకీయం ప్రభావమే – మంచికే కాక ఒక్కొక్కసారి చెడుకు కూడ ఎక్కువ కనిపిస్తుంది.

ఉత్తర తెలంగాణలోనే కాదు, ప్రభుత్వం నిషేధ అధికారాలు ప్రయోగించిన అన్ని ప్రాంతాలలోనూ ఈ చిత్రమే కనిపిస్తుంది. కాశ్మీర్ లాంటి చోట మరీ వికృత రూపంలో కనిపిస్తుంది. ఇప్పుడుకాదు గానీ రెండు మూడేళ్ళ క్రితం కాశ్మీర్ లోయలో కనిపించేదీ వినిపించేదీ నిషిద్ధ రాజకీయమే. చట్టబద్ధమైన రాజకీయమెక్కడా కనిపించేది కాదు. అస్సాం రాష్ట్రంలోని చాలా జిల్లాల పరిస్థితీ ఇదే. దీనికి ఆ నిషిద్ధ సంస్థల బలప్రయోగం ఒక కారణం మాత్రమే. వాటి రాజకీయాలకు నిజంగానే ప్రజలలో చాలా ప్రాచుర్యం ఉంది. ఇతర రాజకీయాలకు – నిషిద్ధ సంస్థల చేతిలో భౌతిక దాడులకు గురయ్యే 'ప్రధాన స్రవంతి' రాజకీయాలకు – అసలే ప్రాచుర్యం లేదని గానీ అవి కేవలం నామమాత్రంగా కనిపించడం వాటి వాస్తవ ప్రభావానికి అద్దం పడుతుందని గానీ అనలేము కానీ, చట్టబద్ధమైన ఆ రాజకీయ స్రవంతుల కంటే చట్టం

నిషేధించిన స్రవంతులకే ప్రజలలో ప్రభావం ఎక్కువ. తెలంగాణలోనయినా అంతే. ప్రజలలో అంత ప్రభావం ఉన్న రాజకీయాలను నిషేధించి అవి ఉండడానికే వీలు లేదనడం మూర్ఖత్వమే కాక నిరుపయోగం కూడ.


అయితే నిషేధానికి ప్రకటించిన ఫలితం లేకపోయినా వేరే ఏ ఫలితమూ లేకుండా పోలేదు. కనీసం రెండు ఫలితాలున్నాయి. రెండూ అవాంఛనీయమైనవే. పీపుల్స్‌వార్‌ను నిషేధించిన తరువాత ఆ పార్టీతో సంబంధముంది అనే నెపం మీద విలేఖరులను, స్థానిక ప్రజాప్రతినిధులను, వివిధ సమస్యల మీద ఉద్యమాలు నిర్వహిస్తున్న ప్రజలను, ప్రజాసంఘాలను వేధించడానికి పోలీసులు ఆ నిషేధ చట్టాన్ని విస్తృతంగా వాడుకున్నారు. ఒకరి రాజకీయ స్వేచ్ఛను నిషేధించే పేరిట సమాజంలో పాలకులకు ఇబ్బందికరమైన అన్ని రకాల రాజకీయ స్వేచ్ఛనూ గొంతు నొక్కివేయడం అన్యాయమే కాక సమాజంలో తీవ్ర అసంతృప్తికి దారితీయగలదని మన పాలకులకు అర్థం కావటం లేదు. ఒకవేళ రాజకీయవాదులకు అర్థమయినా నక్సలైట్ ఉద్యమాన్ని ఎదుర్కొనడానికి సంబంధించిన విధాన రచయితలయిన పోలీసులకు అది పట్టదు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య అవకాశాలనూ పూర్తిగా ధ్వంసం చేయడం తాము ఆశించే 'శాంతిభద్రతలకే' చాలా నష్టకరం అని పోలీసు బుద్ధికి తోచదు. బహుశా తోచదనుకోవడం కూడ తప్పేమో. ఆ పరిస్థితే పోలీసుల అవసరాలన్నీ బలాన్నీ పెంచుతుంది. వాళ్ళకదే కావాలి.

రెండవవైపు, తమకు రాజకీయ స్వేచ్ఛ లేదు కాబట్టి ఇతరుల రాజకీయ స్వేచ్ఛను హరించే హక్కు తమకుందని పీపుల్స్‌వార్ భావిస్తుంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడానికి వీలు లేదంటూ తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల గ్రామీణ నాయకులను పీపుల్స్‌వార్ కొట్టడం, తన్నడం, చంపుతాం అని బెదిరించడం ఇప్పటికే ప్రారంభం అయింది. పీపుల్స్‌వార్‌పైన నిషేధం లేకున్నా ఆ పార్టీ ఈ దాడులు చేసేదేమో గానీ ఇప్పుడు సమర్థించుకోవడానికి మంచి సాకు దొరికింది. "వీళ్ళంతా కలిసి మాకు రాజకీయ స్వేచ్ఛ లేకుండా చేసినప్పుడు వీళ్ళ రాజకీయ స్వేచ్ఛను మేమెందుకు గౌరవించాలి?" అంటారు. కాశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ నోటి నుండి, అస్సాంలో ఉల్ఫా నోటి నుండి (బహుశా జాఫ్నాలో ఎల్‌టిటిఇ నోటి నుండి కూడ) ఈ వాదనే వినబడుతుంది. వీళ్ళందరికీ అర్థం కానిదేమిటంటే తాము నిషేధిస్తున్నది తెలుగుదేశం,

కాంగ్రెస్ తదితర పార్టీల స్వేచ్ఛను కాదు, ఆ పార్టీలను అభిమానించడానికీ అనుసరించడానికీ ప్రజలకుండే స్వేచ్ఛను. అవి అభిమానించదగ్గ పార్టీలా, అనుసరించదగ్గ పార్టీలా అనేది అప్రస్తుతం.

బహుశా ప్రభుత్వానికి – కనీసం పోలీసులకు – ఇదే ఇష్టమేమో! సమస్య మొత్తం పోలీస్ వర్సెస్ నక్సలైట్‌గా మారి మధ్యలో అంతా శూన్యం ఏర్పడడమే వారి వ్యూహానికి తగిన పరిస్థితి. ఈ క్రమంలో తెలంగాణ గ్రామాలలోనూ పట్టణాలలోనూ చాలా బాధాకరమైన వాతావరణం ఏర్పడింది. రాజకీయ స్వేచ్ఛను పునరుద్ధరించుకోవడం – అందులో భాగంగా పీపుల్స్‌వార్‌పైన నిషేధాన్ని ఎత్తివేయించడం, ఇతరుల రాజకీయ స్వేచ్ఛను పీపుల్స్‌వార్ గౌరవించేటట్టు చూడడం – ఈ వాతావరణం నుండి, ఈ పరిస్థితి నుండి బయటపడడానికి తెలంగాణకు తొలిమెట్టుగా మారింది. రాజకీయ స్వేచ్ఛ నెలకొంటే బూటకపు ఎన్‌కౌంటర్‌లనూ, విప్లవం కోసమని చెప్పి న్యాయమో అన్యాయమో అర్థం కాకుండా జరుగుతున్న హత్యలనూ ఆపడానికి అవసరమైన కార్యాచరణ తెలంగాణ ప్రజానీకానికి సాధ్యం అవుతుందేమో.

*ప్రజాతంత్ర వారపత్రిక*
***8 ఆగస్టు 1999***



# 'టాడా' రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

'టాడా' చట్టాన్ని గురించి ఈ రోజు దేశంలో చాలా చర్చ జరుగుతూ వుంది. ఒకప్పుడు కేవలం పౌర ప్రజాస్వామ్య హక్కుల సంఘాలు, 'టాడా' చట్టం బాధితులైన రాజకీయ సంస్థలు ఆ చట్టాన్ని విమర్శించేవి. ఇప్పుడు 'టాడా'కి వ్యతిరేకంగా చాలామంది మాట్లాడుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులు లేక మాజీ మంత్రులు అయిన జాఫర్ షరీఫ్, రాజేష్ పైలట్, అబ్దుల్ రహమాన్ అంతూలే వంటివాళ్ళు 'టాడా' దుర్వినియోగం అవుతున్నదని, దానిని రద్దు చేయడం మంచిదని అంటున్నారు.

సంజయ్‌దత్ స్నేహితులైన బొంబాయి సినిమా తారలు 'టాడా'ను రద్దుచేయాలని ఆందోళన చేస్తున్నారు.

భారత సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, జాతీయ మానవహక్కుల కమిషన్ ప్రస్తుత ఛైర్మన్ అయిన రంగనాథ మిశ్రా 'టాడా' రాజ్యాంగ విరుద్ధమైన చట్టమని, దానిని రద్దుచేయాలని అంటున్నారు.

ఒక్క భారతీయ జనతాపార్టీని మినహాయిస్తే (ప్రజాస్వామ్య హక్కులకు సంబంధించిన ఏ విషయంలోనైనా ఆ పార్టీని మినహాయించవలసిందే) ప్రతిపక్ష పార్టీలన్నీ 'టాడా'ను రద్దు చేయాలని అంటున్నాయి.

కాబట్టి 'టాడా'కు ఇంక గుడ్‌బై చెబుదామా అంటే ఆ సుదినం ఇప్పట్లో వచ్చేట్టు లేదు. భారత సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఒకసారి

కాదు రెండుసార్లు 'టాడా' రాజ్యాంగబద్ధమైన చట్టమేనని ధ్రువీకరించింది. అంతకుముందు వివిధ హైకోర్టులు వెలిబుచ్చిన సందేహాలను సైతం సుప్రీంకోర్టు త్రోసిరాజని అంతా సక్రమంగానే వుందని ప్రకటించింది.

పోనీ ప్రభుత్వానికి ఏమైనా పునరాలోచన కలగనున్నదా అంటే కేంద్ర హోం మంత్రి అటువంటి ఆశలేవీ పెట్టుకోవద్దని వారానికి ఒకసారి స్పష్టం చేస్తున్నాడు. 'టాడా'ను రద్దు చేసే ప్రసక్తే లేదని ఎవరూ అడగకుండానే మళ్ళీ మళ్ళీ ప్రకటిస్తున్నాడు.

## టాడాను ఎందుకు వ్యతిరేకించాలి?

విచ్చలవిడి హింసాకాండను ప్రయోగించి ప్రజాస్వామ్యాన్ని హతమార్చే చర్యలను ఎవరైనా అసహ్యించుకుంటారు. అటువంటి చర్యలను అరికట్టడం కోసమే టాడా చట్టాన్ని తాము జారీచేశామని, 'టాడా'ను వ్యతిరేకించడమంటే విచ్చలవిడి హింసను సమర్థించడమేనని ప్రభుత్వం అంటోంది.

ఇందులో రెండు అభ్యంతరకర విషయాలున్నాయి.

ఒక నేరం హేయమైనదైతే దానిని నివారించే చట్టం, విచారించే యంత్రాంగం న్యాయసమ్మతంగా వుండనవసరం లేదనేది ఒక తప్పుడు అభిప్రాయం. ఎంత నీచమైన నేరాన్నయినా న్యాయసమ్మతమైన శాసనాలతోనే అరికట్టాలి. నిష్పాక్షికమైన పద్ధతిలోనే విచారణ జరపాలి. లేకపోతే శిక్ష పడేది దోషికో, నిర్దోషికో తెలియదు. ఎటువంటి నేరాలకైనా అమాయకులను శిక్షించకూడదు కదా? అందుకే నేరస్మృతి ఎప్పుడూ హేతుబద్ధంగా, నిష్పాక్షికంగా, న్యాయసమ్మతంగా వుండాలి. భారత రాజ్యాంగంలోని ఒక ప్రాథమిక హక్కయిన ఆర్టికల్ 21 ఈ మాటే అంటుంది.

ఇక రెండవ విషయం ఏమిటంటే ప్రజా సామాన్యాన్ని ఊచకోత కోసే విచ్చలవిడి హింసాకాండను అరికట్టడం కోసం మాత్రమే 'టాడా'ను జారీ చేశారనేది ఒట్టి అబద్ధం. ప్రజల్లో ఈ అపోహ కలిగించి 'టాడా'ను వ్యతిరేకించేవాళ్ళను హింసోన్మాదులుగా చిత్రించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

కానీ 'టాడా' చట్టాన్ని వివరంగా పరిశీలిస్తే దాని వాస్తవ స్వరూపం అర్థమవుతుంది. ప్రస్తుత సామాజిక ఆర్థిక వ్యవస్థను, రాజకీయ అధికారాన్ని వ్యతిరేకించే

ఉద్యమ చర్యలలో అధిక భాగం 'టాడా' కింద నేరాలవుతాయి. ఆ చర్య వలన విచ్చలవిడి హింసాకాండ జరగనవసరం లేదు. జరగకపోయినా అవి 'టాడా' కిందికి వస్తాయి. 'టాడా' అనేది రాజకీయ ప్రత్యర్థుల్ని అణచడానికి ఉద్దేశించిన చట్టం.

మరి వ్యవస్థను వ్యతిరేకించే ఉద్యమ చర్యల వల్ల ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగితే వాటిని ప్రభుత్వం అరికట్టనవసరం లేదా అని అడుగుతారేమో! అవసరం లేదని మేము అనడం లేదు. అరికట్టడానికి కావాల్సిన చట్టాలన్నీ ఇప్పటికే వున్నాయి. కొత్తగా వాటికి టెర్రరిస్టు చర్యలు, విచ్ఛిన్నకర కార్యకలాపాలు అని పేరుపెట్టి 'టాడా' అనే కొత్త చట్టాన్ని చేయనవసరం లేదు. ఇప్పటివరకు అమలులో వున్న చట్టాలు ముద్దాయికి కొన్ని హక్కులు కల్పిస్తాయి. సహజ న్యాయసూత్రాలను ఒక మేరకు అనుసరిస్తాయి. ఇవేవీ లేని చట్టం 'టాడా'. సహజ న్యాయసూత్రాలకు వ్యతిరేకమైన చట్టాన్ని తయారు చేసి వ్యవస్థను వ్యతిరేకించిన వారిపై ప్రయోగించడం 'టాడా' వెనక వున్న అసలు ఉద్దేశం.

సాయుధ పోరాట మార్గాన్ని ఎంచుకున్న కమ్యూనిస్టు విప్లవకారులు చేపట్టే ప్రతి చర్యా 'టాడా' కిందికి వస్తుంది. అది సారా దుకాణం మీద దాడి చేయడం కావొచ్చు. గిరిజనులకు అడవి భూములను పంచడం కావొచ్చు. కరువు పీడిత ప్రజలను సమీకరించి కరువు దాడులను నిర్వహించడం కావొచ్చు. వీటన్నిటికీ 'టాడా' వర్తిస్తుంది.

అసలు ఆయుధాలే ఉపయోగించకుండా ఒక ఉద్యమం చేపట్టినా, చేపట్టిన వాళ్ళు విప్లవ కమ్యూనిస్టులు కాబట్టి 'టాడా' చట్టం ప్రయోగిస్తున్నారు. విప్లవ కమ్యూనిస్టు సంస్థల కార్యకర్తలు ఎవరు అరెస్టయినా కేవలం వాళ్ళ రాజకీయ భావాల వల్ల 'టాడా' కేసే పెడుతున్నారు. మన రాష్ట్రంలో నక్సలైటన్న పేరు మీద 'టాడా' కేసు మోపబడ్డ వారు కనీసం 15 వేలమంది ఉన్నారు.

బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత బొంబాయి నగరంలో శివసేన మూకలు ముస్లింలపైన ప్రాణాంతకమైన దాడులు చేశాయి. పోలీసులు వాళ్ళతో కుమ్మక్కై ముస్లింలకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారు. ఆ తర్వాత కొన్ని నెలలకు బొంబాయి నగరంలో పెద్ద ఎత్తున బాంబు పేలుళ్ళు జరిగాయి. ప్రాణనష్టం కన్నా ఆస్తినష్టమే ఎక్కువ జరిగింది. ముస్లింల తరఫున దావూద్ ఇబ్రహీం వంటి కొందరు వ్యక్తులు ఈ ప్రతీకార చర్యకు పాల్పడ్డారని అధికార యంత్రాంగం భావించింది.

ముస్లింలపైన శివసేన దాడి చేస్తుంటే వారిని కాపాడలేకపోయిన అధికార యంత్రాంగం ఈ పేలుళ్ళను టెర్రరిస్టు చర్యగా భావించి వందల మందిని (ప్రధానంగా ముస్లిం యువకులను) 'టాడా' కింద అరెస్టు చేసింది. దినపత్రికలు విపరీతంగా ప్రచారం ఇచ్చిన సంజయ్‌దత్ వీరిలో ఒకడు మాత్రమే.

నాగా, మిజో, గూర్ఖా తదితర అల్పసంఖ్యాక జాతులు పరాయి పీడనకు వ్యతిరేకంగా చాలా కాలంగా పోరాటం చేస్తున్నాయి. కాశ్మీర్‌లోనూ తమ భవితవ్యం తాము నిర్ణయించుకునే హక్కు కోసం పోరాటం సాగుతోంది. పంజాబ్‌లోనూ ఇది చాలాకాలం ఉధృతంగా సాగింది. ఈ పోరాటాలలో జరిగే విచ్చలవిడి హింసాకాండే కాక పోరాటకారులు చేపట్టే ప్రతి చర్యా 'టాడా' కింద నేరమవుతుంది. ఈ ప్రాంతాలన్నిట్లో 'టాడా' చట్టాన్ని విచ్చలవిడిగా ప్రయోగిస్తున్నారు.

అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రతిఘటించడానికి దళితులు సాయుధులు కావాలని ఈ మధ్య కొన్ని దళిత సంస్థలు ప్రకటిస్తున్నాయి. ఆ పని చేస్తే అది 'టాడా' కింద నేరమవుతుంది. ఈ మార్గం అవలంబించే దళితులంతా టెర్రరిస్టులవుతారు.

అసలు హింస ఏమీ చేయకుండానే కేవలం కొన్ని అభిప్రాయాలను వ్యక్తపరచడం కూడ 'టాడా' కింద నేరమవుతుంది. దేశంలోని ఏ జాతి ప్రజలైనా ఈ దేశంలో వుండడానికి ఇష్టపడక వేరుపడిపోవాలని భావిస్తే ఆ ఆలోచనను వ్యక్తం చేయడం, ప్రోత్సహించడం, సమర్థించడం సహితం 'టాడా' కింద నేరం. ఏ ఆయుధాలూ పట్టుకోనవసరం లేదు. కేవలం స్వయం నిర్ణయ ఆకాంక్షను వ్యక్తం చేయడమే నేరం. దానికి శిక్ష యావజ్జీవ ఖైదు కాగలదు.

పైన పేర్కొన్న పోరాటాలన్నీ న్యాయమైనవేనా అని మీరు అడగవచ్చు. అవన్నీ సమర్థనీయమైనవా కావా అనేది ఇక్కడ అప్రస్తుతం. వాటినన్నింటినీ సమర్థించమని మేము మిమ్మల్ని అడగడం లేదు. వాటికి టెర్రరిస్టు చర్యలు లేక విచ్ఛిన్నకర కార్యకలాపాలు అని ముద్రవేసి సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైన చట్టం కింద వేల సంఖ్యలో జనాన్ని జైళ్ళలోకి నెట్టడం అన్యాయమంటున్నాం. ఆ ఉద్యమాలన్నీ కొన్ని ప్రత్యేకమైన పరిస్థితి నుంచి పుట్టాయి. వాటిని ప్రభుత్వం రాజకీయ ఉద్యమాలుగా గుర్తించాలి. వాటితో రాజకీయంగా వ్యవహరించాలి. ఆ ఉద్యమాల వలన శాంతి భద్రతలకు భంగం కలిగితే భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకు లోబడి

చర్య తీసుకోవాలి. అంతే తప్ప వ్యవస్థను వ్యతిరేకించే రాజకీయ కార్యాచరణను టెర్రరిజం అనడానికి వీల్లేదు. రాజకీయ అభిప్రాయాలను విచ్ఛిన్నకర కార్యకలాపాలు అనడానికి వీల్లేదు.

'టాడా' ఉద్దేశమే దుర్మార్గమైనది. పైగా దాన్ని అమలుచేసే క్రమంలో పోలీసులు తమ పరిధిని దాటి మరీ దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. 'టాడా' దృష్టిలో కూడ టెర్రరిజం కాని దానికి కూడ పోలీసులు టెర్రరిజం అని పేరు పెడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలో పారిశ్రామిక కార్మికుల మీద 'టాడా' చట్టాన్ని విచ్చలవిడిగా ప్రయోగించడం దీనికొక దృష్టాంతం.

## 'టాడా' వల్ల ముద్దాయి కోల్పోయే హక్కులేవి?

ముద్దాయి దాదాపు అన్ని హక్కులు కోల్పోవలసి వస్తుంది.

మామూలు కేసులలో ముద్దాయికి రెండు వారాల రిమాండు ఇస్తారు. 'టాడా' కేసులలో రెండు నెలల రిమాండు ఇస్తారు.

మామూలు కేసులలో అరెస్టయిన ముద్దాయిని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపరుస్తారు. తనను పోలీసులు హింసించి వుంటే మేజిస్ట్రేట్‌కు నివేదించుకునే అవకాశం ముద్దాయికి ఉంటుంది. 'టాడా' కేసులలో మండల రెవెన్యూ ఆఫీసర్‌తో మొదలుపెట్టి ఏ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ దగ్గరయినా హాజరుపరచవచ్చు. వాళ్ళకు ముద్దాయి ఏం చెప్పుకున్నా ప్రయోజనం ఉండదు.

మామూలు కేసులలో ముద్దాయి చేత పోలీసులు లాకప్పులో ఏం చెప్పించినా అది కోర్టులో సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. 'టాడా' కేసులలో ఎస్.పి ర్యాంకు పోలీసు అధికారి దగ్గర ముద్దాయి తన నేరం 'ఒప్పేసుకుంటే' అది సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుంది. అంటే చిత్రహింసలకు చట్టబద్ధత లభించింది.

మామూలు కేసులలో నేరం రుజువయ్యేంతవరకు కోర్టు ముద్దాయిని నిర్దోషిగా పరిగణిస్తుంది. 'టాడా' కేసులలో ఇది ఒక మేరకు తలకిందులవుతుంది. ముద్దాయి నిర్దోషి అని కోర్టు నమ్మితే తప్ప బెయిలు ఇవ్వదు. కొన్ని సందర్భాలలో తన నిర్దోషిత్వాన్ని ముద్దాయి రుజువు చేసుకోలేకపోతే నేరం రుజువయినట్టేనని కోర్టు భావిస్తుంది.

మామూలు కేసులలో అరెస్టయినందువల్ల ముద్దాయి ఆస్తికేమీ నష్టం కలగదు. 'టాడా' కేసులలో అరెస్టు కాగానే ముద్దాయి ఆస్తిని కోర్టు తన ఆధీనంలోకి తీసుకోవచ్చు. నేరం రుజువయితే ముద్దాయి ఆస్తి మొత్తం ప్రభుత్వపరం అవుతుంది. అది ఆ నేరం వల్ల పొందిన ఆస్తి కాకపోయినా జప్తు అవుతుంది.

మామూలు కేసులలో కేసు విచారణ బహిరంగంగా జరుగుతుంది. 'టాడా' కేసులలో కోర్టు నేర విచారణను రహస్యంగా జరుపవచ్చు.

మామూలు కేసులలో కేసు విచారణ స్థానికంగానే జరుగుతుంది. 'టాడా' కేసులలో కేసు విచారణ దేశంలో ఎక్కడయినా జరపవచ్చు.


మామూలు కేసులలో ముద్దాయి మీద ఉన్న అభియోగం, సాక్ష్యం ముద్దాయికి పూర్తిగా తెలుస్తాయి. టాడా కేసులలో సాక్షుల పేర్లను రహస్యంగా ఉంచవచ్చు.

మామూలు కేసులలో కనిష్ట శిక్ష, గరిష్ట శిక్ష నేరం తీవ్రతను బట్టి ఉంటాయి. 'టాడా' కేసులలో ఏ నేరానికయినా కనిష్ట శిక్ష 5 సం॥ల ఖైదు, గరిష్ఠ శిక్ష జీవిత ఖైదు, లేక ఉరిశిక్ష.

ఈ విధంగా 'టాడా' ముద్దాయికుండే ఒక్కొక్క హక్కును తొలగించి వేస్తుంది. ఎంత ఘోరమైన నేరాన్నయినా ఇంత అన్యాయంగా విచారించడం తప్పు. ఈ రకంగా విచారణ జరిపితే శిక్షపడేది దోషికో నిర్దోషికో ఎవరూ చెప్పలేరు.

అటువంటి వ్యవస్థను వ్యతిరేకించే రాజకీయ చర్యలకు 'టెర్రరిజం' లేక 'విచ్ఛిన్నకర కార్యకలాపం' అని ముద్రవేసి విచారించడానికీ, శిక్షించడానికీ 'టాడా' వంటి చట్టం చేయడం భావ్యమేనా? ప్రజాస్వామ్య చైతన్యం గల పౌరులుగా దీనిని మనం సహిద్దామా?

***జాపా లక్ష్మారెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా***
***ఎ.పి.సి.ఎల్.సి, ఓ.పి.డి.ఆర్.ల సంయుక్త కరపత్రంగా వచ్చింది***
***1 నవంబర్ 1994***



# టాడాను ఎందుకు వ్యతిరేకించాలి?

సమాజంలో ఒక మూల ప్రారంభమైన చర్చలు కాలక్రమంలో సాధారణ సామాజిక సంవాదంలోకి, 'జాతి జీవన ప్రవంతి'లోకి వస్తాయి. ఇట్లా రావడానికి ప్రజా ఉద్యమాల ఒత్తిడే కాక ఒక్కొక్కసారి కాకతాళీయమైన కారణాలేవో ఉంటాయి. అవి ఉత్తేజకరమయిన కారణాలు కావచ్చు, కాకపోవచ్చు. పెద్దగా ఉత్తేజకరం కాని కారణాలు కూడ ఒక్కొక్కసారి మార్పుకు హేతువు అవుతుంటాయి. కానీ సమాజంలో ఒక భాగానికి పరిమితమయి ఉన్న చర్చ ఏ కారణంగా సామాన్య సామాజిక జీవితంలోకి వచ్చినా అది పురోగతికి గుణాత్మకంగా దోహదం చేయగలదు. ఆ చర్చ ముందుకు తెచ్చిన విలువలు, ఆలోచనలు సామాజిక చైతన్యంలోను, ఆచరణలోను భాగం అవుతాయి. మనుషుల ఆలోచనారీతినీ, రాజకీయ ఆచరణనూ మారుస్తాయి. అది లేవనెత్తిన సమస్యలను పరిష్కరించే కర్తవ్యాన్ని సమాజం ముందు పెడతాయి. సమాధానం చెప్పే బాధ్యతను అందరి ఎదుటా నిలబెడతాయి. అయితే ఈ మార్పు సత్ఫలితాన్ని ఇవ్వాలంటే పురోగామి శక్తులు అందుకు అనుగుణమైన ఆచరణను రూపొందించుకోవలసి ఉంటుంది.

10 సంవత్సరాలుగా పౌరహక్కుల సంస్థలు, వివిధ ప్రజా ఉద్యమాలు 'టాడా'కు వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళన ఈ రోజు ఆ ఉద్యమాలతో నిమిత్తం లేని కొన్ని ఇతర కారణాల వల్ల సాధారణ రాజకీయ చర్చలో భాగం అయింది. అరణ్యరోదనగా కనిపించిన జనరోదన ఇప్పుడు జనరోదనగానే గుర్తింపు పొందింది. సినిమాస్టార్ సంజయ్‌దత్ 'గ్లామర్' దీనికొక కారణం. కాగా గుజరాత్, మహారాష్ట్రలలో ముస్లిం వోట్లు

పోతాయన్న కాంగ్రెస్ నేతల భయం మరొక కారణం. భారతదేశంలో మైనారిటీ అయిన ముస్లింలను అణచివేస్తున్నారన్న ఆరోపణ అంతర్జాతీయంగా ప్రచారమయితే దేశ ప్రతిష్ఠకు, పరపతికి నష్టకరం అన్న భయం ఇంకొక కారణం. అందువల్ల 'టాడా'ను రద్దుచేయాలన్న డిమాండ్ ఈ రోజు ప్రజా ఉద్యమాలతో, మైనారిటీల సంక్షేమంతో సంబంధం లేని కొత్త గొంతుల నుండి కూడ వినపడుతూ ఉంది. 'టాడా'ను రద్దు చేస్తేనే మంచిదని గతంలో ఎన్నడూ ఆ అభిప్రాయాన్ని దరికి రానీయని పత్రికా సంపాదకులు సైతం అంటున్నారు. రద్దుచేసే ఆలోచనలోనే వున్నామని దేశ ప్రధాని బొంకుతున్నాడు. ఇందులో ఇతర సామాజిక, రాజకీయ కారణాల ప్రభావమే ఎక్కువ ఉన్నప్పటికీ ప్రజాతంత్ర ఉద్యమాల మీద ఇప్పుడొక కొత్త కర్తవ్యం వచ్చిపడింది. 'టాడా' రద్దయినా, కాకున్నా దాని మీద జరిగే చర్చ రాజకీయ అవకాశవాదానికీ, ఒత్తిడులకూ, ప్రతిష్ఠకూ సంబంధించిన విషయంగా ముగియకుండా ప్రజాస్వామ్య సూత్రాలకు సంబంధించిన చర్చగా సాగేటట్టు చూడాలి. లేకపోతే ఈ రోజు రద్దయినా రేపో ఎల్లుండో అది పునస్సాక్షాత్కరించగలదు. ఈ పేరుతో ఈ రూపంలో కాకున్నా ఇదే స్వభావం గల మరో చట్టంగా రాగలదు. ఒకవేళ 'టాడా' రద్దు కాకపోయినా ఈ చర్చ నిష్ఫలంగా ముగియకుండా సామాజిక చైతన్యాన్ని పెంచిన ఫలితాన్ని ఇవ్వాలి. నేరస్మృతికి సంబంధించిన ప్రమాణాలను పటిష్టం చేయగలగాలి.

ప్రజాతంత్ర ఉద్యమాలలో విభిన్న దృక్పథాలు ఉంటాయి. పౌరహక్కుల దృక్పథంతో చూసినప్పుడు 'టాడా'లో రెండు అభ్యంతరకర అంశాలు కనిపిస్తాయి. మొదటిది, సహజ న్యాయసూత్రాలకు 'టాడా' పూర్తిగా తిలోదకాలివ్వడం. నేరవిచారణ వ్యవస్థకు సంబంధించి మానవజాతి అనేక శతాబ్దాల సంఘర్షణ ఫలితంగా రూపొందించుకున్న నియమాలు ఇవి. రెండవది, ప్రజల రాజకీయ స్వేచ్ఛను అరికట్టడం. రాజకీయ చర్చకూ వివాదానికీ వదిలివేయవలసిన విషయాలను 'టాడా' నేరస్మృతిలోకి లాగి శిక్షలు నిర్దేశిస్తుంది. ఈ రెండింటినీ కేవలం నిర్బంధానికి సంబంధించిన విషయాలుగా కాక మానవ నాగరికతా విధ్వంసంగా అర్థం చేసుకోగలిగినప్పుడే 'టాడా'ను ఏ పరిధిలో వ్యతిరేకించాలో అర్థం అవుతుంది. భూసారాన్ని ధ్వంసం చేస్తే తిరిగి పెంపొందించడం ఎంత కష్టమో నాగరికతాసారాన్ని నాశనం చేస్తే తిరిగి సాధించడం అంతకంటే కష్టం. నడుస్తున్న ఉద్యమాల మీద, మైనారిటీ ప్రజల మీద 'టాడా' అమలు చేస్తున్న అణచివేతను ఈ విస్తృత పరిధిలో భాగంగా చూసినప్పుడే దాని పట్ల పరిపూర్ణమైన ప్రజాతంత్ర దృక్పథం ఏర్పడుతుంది.

## రాజకీయ స్వేచ్ఛ

రాజకీయ స్వేచ్ఛ అన్ని ప్రజాస్వామ్య విలువలలోకీ అతి విలువయినది. ఇక్కడ 'రాజకీయ' అన్నప్పుడు కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన విశేషణంగా అర్థం చేసుకోకుండా సామాజిక సంబంధాలలో మార్పును కాంక్షించే అన్ని రకాల ఆలోచనలకూ ఆచరణకూ వర్తింపజేసుకోవాలి. సంకీర్ణమయిన సంఘర్షణల రూపంలో చరిత్ర పురోగమనం జరుగుతుంది. ఇందులో రాజకీయ ఆమోద తిరస్కారాలు ఒకరు నిర్ణయించవలసినవి కావు. అధికారంలో ఉన్నవాళ్ళు నిర్ణయించవలసినవి అసలే కావు. శాంతిభద్రతల దృష్ట్యా కొన్ని నియమాలనూ నిబంధనలనూ ఏ సమాజమైనా పెడుతుంది. అది కొంత మేరకు రాజకీయ ఆచరణకు కూడ ఆటంకం కావచ్చు. సామాజిక భద్రత అనేది పూర్తిగా వర్గ సమాజం కల్పించిన కృత్రిమ అవసరం కాదు. అణచివేతను పరిరక్షించే అంశం దానిలో ఒకటి ఉంది. అయితే సంఘ జీవితానికి కావలసిన నియమాలు ఏర్పరచడం దానిలోని రెండవ అంశం. దీనికోసం అందరూ ఎంతో కొంత స్వేచ్ఛను కోల్పోవలసిన అవసరం ఉంటుంది. అయితే ఆ పేరు మీద రాజకీయ స్వేచ్ఛను మౌలికంగానే తిరస్కరించే అధికారం ఏ ప్రభుత్వానికీ ఉండకూడదు. అటువంటి అధికారాన్ని ఏ పేరు మీద ఆమోదించినా అది మానవజాతి పురోగమనానికి ఆటంకం అవుతుంది.

'విచ్ఛిన్నకర కార్యకలాపాలు' (సెక్షన్ 4), 'టెర్రరిస్టు చర్యలు' (సెక్షన్ 3) అనేవి 'టాడా'లోని రెండు ప్రధాన నేరాలు. ఒక దేశంలో నివసిస్తున్న ఒక జాతికి లేక ఒక ప్రాంతానికి చెందిన ప్రజలకు స్వయం నిర్ణయాధికారం ఉండాలనేది ఒక ప్రజాతంత్ర భావన. దానికి ఏ పరిస్థితిలో క్రియారూపం ఇవ్వాలి, ఏ విధంగా ఇవ్వాలి అనే విషయంలో సిద్ధాంత విభేదాలకూ రాజకీయ సంవాదానికీ తావు ఉంటుంది కాని 'టాడా' ఆ ఆలోచననే ఒక నేరంగా మారుస్తుంది. దాని వ్యక్తీకరణ, దానికోసం జరిగే అన్ని రకాల రాజకీయ కృషీ, 'టాడా' లో 'విచ్ఛిన్నకర కార్యకలాపం' అని పిలవబడ్డాయి. ఆ ఆలోచన పూర్తిగా శాంతియుతంగా వ్యక్తమయినా, దానికి క్రియారూపం ఇచ్చే రాజకీయాలు పూర్తిగా శాంతియుతంగా ఉన్నా కూడ అది 'టాడా' సెక్షన్ 4 క్రింద నేరమే. దానికి గరిష్ఠ శిక్ష యావజ్జీవ ఖైదు.

ఒక భూభాగానికి వేరుపడిపోయే స్వేచ్ఛ ఏ దేశమూ ఇవ్వజాలదని చాలామంది వాదిస్తారు. సోవియట్ రష్యా, చైనా వంటి దేశాలు సైతం సిద్ధాంతరీత్యా ఏం మాట్లాడినా ఆచరణలో ఆ స్వేచ్ఛ ఇవ్వలేదని కూడ వాదిస్తారు. ఇది సత్యమే. కానీ ఉబుసుపోకకు వేరుపడిపోవాలని ఎవరయినా ఎందుకు కోరుకుంటారు? 'వేర్పాటువాదం' అనే దానికి చాలా బలమయిన కారణం ఉండాలి. లేకపోతే అది కొద్దిమంది ఆలోచనలలో ఉండవచ్చును కాని ఒక రాజకీయశక్తి కాజాలదు. బలమయిన కారణం ఉన్నప్పుడు దానిని ప్రజాస్వామికంగా ఎదుర్కొని సమాధానం చెప్పి, వేరయి పోదలచుకున్న వాళ్ళను ఆ కోరిక వదలుకొమ్మని ఒప్పించగలగాలి. అది సాధ్యం కానప్పుడు వేర్పాటు అయితే తప్ప గత్యంతరం ఉండదు. ఆ దృక్పథాన్ని అమలు చేయటం సులభం కాకపోవచ్చు. సమస్యల పట్ల ప్రజాస్వామిక దృక్పథంతో పరిష్కారాలను సూచించడం ఎంత సులభమో వాటిని ఆచరించడం అంత కష్టం. అంతటి జటిలమైన సమస్యలు ఉత్పన్నమే కాని సామాజిక వ్యవస్థ సిద్ధిస్తుందనేది ఒక కోరిక మాత్రమే. అటువంటి కోరికలను ప్రమాణంగా పెట్టుకొని ప్రజాస్వామ్య పరిష్కారాల అమలులోని ఇబ్బందులను తృణీకరించడంలో అర్థం లేదు. కాని ప్రజాతంత్ర పరిష్కారానికి ప్రత్యామ్నాయం ఏముంది? బలవంతంగా ఆ ప్రజలను దేశంలోనే ఉంచడం కోసం సైనిక చర్యలకు పాల్పడడమే కదా! కాశ్మీర్‌లో ఈనాడు సాగుతున్నది అదే కదా! ఒక నాగరిక సమాజం ఈ పరిష్కారాన్ని ఆమోదించగలదా?

అదట్లాగుంచి, వేర్పాటు భావాల వ్యక్తీకరణనే ఒక నేరంగా పరిగణించడం క్షమించరాని అన్యాయం. 'టాడా' సెక్షన్ 4 లోని విచ్ఛిన్నకర కార్యకలాపాల నిర్వచనం ఈ పనే చేస్తుంది. పైగా ఆ నేరాన్ని రుజువు చేయడానికి అత్యంత అప్రజాస్వామికమైన పద్ధతిని నిర్దేశిస్తుంది. దానికి విధించే శిక్ష కూడ స్వల్పం కాదు. 5 సంవత్సరాల ఖైదు నుండి యావజ్జీవ కారాగారవాసం. కాశ్మీరీలకు, నాగాలకు, మిజోలకు స్వయం నిర్ణయాధికారం ఇచ్చి తీరాలన్నా, ఇస్తే మంచిదన్నా, వాళ్ళు కోరుకోవడం సమంజసమేనన్నా, కొంతకాలానికి ఆ ప్రజలు వేరుపడిపోవడం తథ్యమని అన్నా 5 సంవత్సరాల నుండి జీవిత ఖైదు దాకా శిక్ష వేస్తుంది 'టాడా'. దేశంలోని ఒక భాగం వేరుపడిపోయే స్వేచ్ఛను గురించి ఎవరేమనుకున్నా ఆ భావనను దగ్గరకు రానివ్వడం సహితం ఇంత పెద్దనేరం అనే చట్టాన్ని ఎవరూ ఆమోదించడానికి వీలు లేదు.

సెక్షన్ 4 లోని 'విచ్ఛిన్నకర కార్యకలాపాల' నిర్వచనం ప్రత్యక్షంగానే రాజకీయ భావాలను నేరాలుగా నిర్దేశించే యత్నం కాగా, సెక్షన్ 3 లోని 'టెర్రరిస్టు చర్య'ల నిర్వచనం పైకి హింసాత్మక చర్యలకు సంబంధించినదిగా కనిపించినా అది కూడ రాజకీయ స్వేచ్ఛపైన దాడే. దీని అర్థం విచ్చలవిడి హింసాకాండకు పాల్పడే స్వేచ్ఛ రాజకీయ స్వేచ్ఛ అని కాదు.

'టాడా'లో 'టెర్రరిస్టు చర్య' అంటే ఏమిటి? హత్య, పేల్చివేత, దహనకాండ మొదలయిన హింసాత్మక చర్యలు మనకు పరిచయమే. వాటిని భారత శిక్షాస్మృతి తదితర నేర చట్టాలు నిర్వచించి శిక్షలు నిర్దేశించాయి. 'టెర్రరిస్టు చర్య' వీటికంటే ఏ విధంగా భిన్నమయింది? ఒకరినో ఇద్దరినో కాక ఒకేసారి 20 మందిని చంపే హత్యను 'టాడా' టెర్రరిస్టు చర్య అంటుందా? ఒకటో రెండో బాంబులు పేల్చడం కాక ఒక వీధి మొత్తం పేలిపోయేటట్టు బాంబులు పేలిస్తే దానిని 'టాడా' టెర్రరిస్టు చర్య అంటుందా? సాధారణ హింసాత్మక నేరాలు అధిక రాశిలో జరగడమేనా టెర్రరిస్టు చర్య అంటే? చాలామంది బహుశా అదే అనుకుంటూ వుండవచ్చు. ఢిల్లీ సిటీ బస్సులలో బాంబులు పెట్టి ప్రయాణీకులను చంపిన ఘటనలు, జలంధర్ బజారులో స్టెన్‌గన్‌తో కాల్పులు జరిపి ప్రజలను చంపిన సంఘటనలు, శ్రీనగర్‌లో పెద్ద పెద్ద డైనమైట్లతో బిల్డింగులు మొత్తం కూల్చేసిన సంఘటనలు అందరికీ తెలిసినవే కాబట్టి అంత పెద్దఎత్తున జరిగే హింసాకాండను 'టాడా' టెర్రరిస్టు చర్యగా నిర్వచించింది అనుకుంటారేమో! అందువల్లనే 'టాడా'ను వ్యతిరేకించడం అంటే అమాయకుల ప్రాణాలకు హాని కలిగించే విచ్చలవిడి హింసాకాండను సమర్థించడం అని కూడ చాలామంది అనుకుంటారేమో!

కాని అది నిజం కాదు. ఒక హింసాత్మక చర్య 'టెర్రరిస్టు చర్య' కావడానికి రాశిలోని తేడా కారణం కాదు. దాని లక్ష్యంలోని తేడాను బట్టి దానిని 'టాడా' టెర్రరిస్టు చర్యగా నిర్వచిస్తుంది. హత్య చేసింది ఒకరినే కావచ్చు. పేల్చింది ఒక చిన్న నాటు బాంబునే కావచ్చు. ఈ చర్యలు భారత శిక్షాస్మృతికీ పేలుడు పదార్థాల చట్టానికీ సుపరిచితమైనవే కావచ్చు. కానీ ఈ చర్యలు చేపట్టడంలోని లక్ష్యాన్ని బట్టి అవి టెర్రరిస్టు చర్యలుగా 'టాడా'లో వర్గీకరించబడ్డాయి. ప్రభుత్వాన్ని లొంగదీసుకునే లక్ష్యంతో ఆ చర్యలకు పాల్పడినట్టయితే అవి టెర్రరిస్టు చర్యలవుతాయి; సమాజంలో ఒక వర్గాన్ని

భయపెట్టడం కోసం పాల్పడిన చర్యలయితే అవి టెర్రరిస్టు చర్యలవుతాయి; సమాజంలో రెండు వర్గాల మధ్య సామరస్యాన్ని భగ్నం చేయడం కోసం పాల్పడిన చర్యలయితే టెర్రరిస్టు చర్యలవుతాయి. ఈ రకమైన లక్ష్యాలతో హింసకు పాల్పడడం గురించి ఎవరేమనుకున్నా లక్ష్యాల రాజకీయ స్వభావాన్ని గుర్తించకుండ ఉండలేము.

దొంగతనాల కోసం, వ్యక్తిగత కక్షల తీర్చుకోవడం కోసం, కిరాయి డబ్బుల కోసం హింసాత్మక చర్యలకు పాల్పడితే పోనీలే పాపం అని కొన్ని హక్కులు కల్పించి నేరస్మృతి రాస్తే, రాజకీయ తిరుగుబాట్లలోకీ సాంఘిక ఉద్యమాలలోకీ హింసను తీసుకొస్తున్నారు కాబట్టి హక్కులకు తావులేని కొత్త నేరస్మృతిలో ఈ రకమైన హింసను పునర్నిర్వచించి హక్కులన్నీ తీసేసి శిక్షించాలని మన పాలకులు నిర్ణయించుకున్నారు. దాని ఫలితమే 'టాడా'.

ఈ హింసకు గురయ్యే వాళ్ళకు హక్కులు లేవా అని అడగవచ్చు. చాలామంది అదే ప్రశ్న అడుగుతారు. ఈ హింసకు గురయ్యేవారందరూ అన్యాయాలు చేసినవారే అయితే ఆ ప్రశ్నకు సులభంగానే జవాబు చెప్పవచ్చును. కానీ సమాజంలో న్యాయం కోసం జరిగే పోరాటాలు చేసే చర్యలన్నీ న్యాయమైనవేనని చెప్పలేము. ఆ చర్యలకు గురయ్యే వాళ్ళందరూ దుర్మార్గులేనని కూడ చెప్పలేము. కానీ దానికి కారణాన్నీ సమాధానాన్నీ వెతకవలసింది సమాజంలో. నిర్బంధ చట్టాలలో సమాధానాన్ని వెతికితే సమస్యకు మూలమయిన సంక్షోభం పరిష్కారం కాకపోగా సమాజంలోని ప్రజాతంత్ర విలువలు ధ్వంసం అవుతాయి. ఒకరి హక్కులకు మరొకరి హక్కులను పోటీ పెట్టి నిర్బంధానికి స్వాగతం పలికే ఏ వైఖరయినా సాధించేది ఈ రెండు విధాల తిరోగమనాన్నే.

ఎటువంటి చర్యలు 'టాడా' సెక్షన్ 3 కింద టెర్రరిస్టు చర్యలవుతాయో చూద్దాం.

ప్రభుత్వాన్ని భయపెట్టి దాని ఎక్సైజ్ విధానాన్ని మార్చడం కోసం నక్సలైట్లు ఒక సారాయి దుకాణాన్ని పేల్చేయడమో, లేదా తగలబెట్టడమో చేసారనుకోండి. మనుషులెవ్వరూ ఈ చర్యలో చనిపోకపోయినా ఇది టెర్రరిస్టు చర్యే. ప్రభుత్వాన్ని బెదిరించి లొంగదీసుకునే లక్ష్యం లేకుండా కేవలం ఒక దుకాణదారు ఆస్తి మీద ఇంకొక దుకాణదారు వ్యాపార వైరంతో దాడి చేసి అదే రకమైన నష్టం కలిగిస్తే అప్పుడది టెర్రరిస్టు చర్య కాదు. కేవలం పేలుడు పదార్థాల చట్టం కింద, భారత శిక్షాస్మృతి కింద నేరం అవుతుంది.

అటవీశాఖ అధికారులను నక్సలైట్లు తుపాకీ చూపించి బెదిరించి తరిమేసి ఆదివాసులను రిజర్వ్ ఫారెస్టు దున్నుకొమ్మని ప్రోత్సహించారనుకోండి. ఎవ్వరి ప్రాణానికీ ఆస్తికీ హాని జరగకున్నా ఇక్కడ ఆదివాసులు, నక్సలైట్లూ అందరూ టెర్రరిస్టు చర్యకు పాల్పడినట్లే. అదే ఒక ధనిక భూస్వామి అటవీశాఖ సిబ్బందిని భయపెట్టి లొంగదీసుకునే బదులు లంచం ఇచ్చి లొంగదీసుకొని అటవీ భూమిని ఆక్రమించుకుంటే, ఆ చర్య మీద ఒకవేళ కేసు పెట్టినా అది 'టాడా' కేసు కాదు. భారత శిక్షాస్మృతి కింద మాత్రమే కేసు అవుతుంది.

సాయుధ నక్సలైట్లు ఒక భూస్వామినో, ఒక సారా కాంట్రాక్టరునో, ఒక పోలీస్ ఇన్‌ఫార్మర్‌నో తుపాకితో కాల్చి చంపుతారనుకోండి. ఇది చట్టానికి సుపరిచితమైన హత్యా నేరమే అయినప్పటికీ, ప్రభుత్వాన్ని సాయుధంగా కూలదోసే లక్ష్యంలో భాగంగా జరిగిన చర్య కాబట్టి టెర్రరిస్టు చర్య అవుతుంది.

'ప్రభుత్వాన్ని లొంగదీసుకోవడం' అనే లక్ష్యానికి సంబంధించిన ఈ ఉదాహరణలు ఊహాత్మకంగా ఇస్తున్నవి కావు. మన రాష్ట్రంలో ఇటువంటి కేసులు వందల సంఖ్యలో ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుండి కూడ ఉదాహరణలు ఇవ్వవచ్చును.

'సమాజాన్ని భీతిల్ల జేయడం' లేక 'సమాజంలో ఒక వర్గాన్ని భయభ్రాంతులు చేయటం' అనే లక్ష్యం స్వభావరీత్యానే అభ్యంతరకరమయినదిగా అనిపించవచ్చును. దానిని ఒక రాజకీయలక్ష్యంగా గుర్తించడానికి చాలామంది ఇష్టపడకపోవచ్చు. కానీ కొన్ని ఉదాహరణలు తీసుకొని చూస్తే ఈ లక్ష్యం కూడ (ఎవరు హర్షించినా హర్షించకున్నా) సామాజిక సంఘర్షణకు అంతర్గతమైన ఒక రాజకీయ లక్ష్యం అని అర్థం అవుతుంది.

బాబ్రీమసీదు కూల్చివేతను ప్రభుత్వం ఆపలేకపోయింది. (ఆపాలనుకోలేదని నమ్మడానికి కూడ ఆధారాలు వున్నాయి). ఆ తరువాత బొంబాయి నగరం వంటి కొన్ని చోట్ల హిందూమత సంస్థల చేతిలో జరిగిన ముస్లింల ఊచకోతను కూడ ప్రభుత్వం ఆపలేకపోయింది. ఈ నేపథ్యంలో దేశంలోని కొన్ని ప్రాంతాలలో పెద్దఎత్తున పేలుళ్ళు జరిగాయి. బొంబాయిలో స్టాక్‌ఎక్స్ఛేంజ్ బిల్డింగ్‌ను, మద్రాసులో ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయాన్ని పేల్చివేయడం జరిగింది. కొన్ని ముస్లిం సంస్థలు లేక కొందరు ముస్లిం వ్యక్తులు ఈ పేలుళ్ళకు బాధ్యులని పోలీసులు భావించారు. అది సహేతుకంగానే

కనిపిస్తుంది. ఆ పేలుళ్ళలో నిజానికి ప్రాణనష్టం ఎక్కువగా జరగకున్నప్పటికీ వీటి మీద 'టాడా' కేసు పెట్టారు. ఎందుకంటే ఈ పేలుళ్ళకు పోలీసులు ఆపాదించిన లక్ష్యం అటువంటిది. 'ముస్లింలను ముట్టుకుంటే దేశాన్ని పేల్చివేస్తాం జాగ్రత్త' అని సమాజాన్ని భీతిల్ల జేయడం కోసం వారు ఈ పనిచేశారని పోలీసులు వ్యాఖ్యానించి 'టాడా' కేసు పెట్టారు. 'సమాజాన్ని భీతిల్ల జేయడం కోసం' అని కాకుండ ఆర్ఎస్ఎస్, శివసేన వంటి సంస్థలను బెదరగొట్టడం కోసం ఈ చర్యను చేపట్టారని వ్యాఖ్యానించ దలచుకుంటే, అప్పుడు 'టాడా' వర్తించదు. ఏ విధంగా వ్యాఖ్యానించుకున్నా ఈ పేలుళ్ళు దేశంలో మైనారిటీ మతస్తులయిన ముస్లింలపైన దాడులు చేసే వాళ్ళను బెదిరించి ఆత్మరక్షణ సాధించుకోవడం కోసం ఉద్దేశించిన రాజకీయ చర్యలనేది స్పష్టం. విచ్చలవిడిగా పేలుళ్ళకు పాల్పడే కన్నా అన్యమార్గం వెతుక్కోవడం ఉచితంగా ఉండేదని భావించే వాళ్ళు సహితం ఈ లక్ష్యానికి ఉండే రాజకీయ స్వభావాన్ని కాదనలేరు.

దళితులపైన దేశవ్యాప్తంగా జరుగుతున్న భౌతిక దాడుల నేపథ్యంలో, వాటిని ప్రతిఘటించడానికి దళితులు సాయుధులు కావాలని దళితవాదులు కొందరు వాదిస్తున్నారు. ఈ ప్రతిపాదన అమలయితే అందులో భాగంగా దళితులు పాల్పడే ప్రతి సాయుధ చర్యా 'టాడా' దృష్టిలో టెర్రరిస్టు చర్యే అవుతుంది. ఎందుకంటే దాని లక్ష్యం సమాజంలో ఒక వర్గంలో (అంటే అగ్రకులాలలో) భయోత్పాతం కల్గించడమే కాబట్టి.

ఇది ఇరువర్గాలకూ వర్తిస్తుంది కదా అనవచ్చు. హిందువులు ముస్లింలపైన దాడిచేసి భయోత్పాతం సృష్టించినా, అగ్రకులాలవారు దళితులను భయభ్రాంతులు చేయటానికి సాయుధ దాడులకు కానీ దహనకాండకు కానీ పాల్పడినా అది కూడ 'టాడా' కింద టెర్రరిస్టు చర్యే అవుతుంది కదా అనవచ్చు. చట్టం ప్రకారమయితే అవుతుంది. కానీ ఆ చర్యలను పోలీసులు ఆ విధంగా కాక భిన్నంగా వ్యాఖ్యానించవచ్చు. 'టాడా' కిందికి రాకుండ వ్యాఖ్యానించవచ్చు. తరచుగా అదే జరుగుతూ వుంది కూడ. ఉదాహరణకు బాబ్రీ మసీదు కూల్చివేతలో కూడ బాంబుల వంటి పేలుడు పదార్థాలను ఉపయోగించడం జరిగింది. ఆ చర్య ముస్లింలను భయభ్రాంతులు చేయడానికి ఉద్దేశించబడిందని అర్థం చేసుకునేట్టయితే అది 'టాడా' కిందికి వస్తుంది. కానీ ఉత్తరప్రదేశ్ అధికార యంత్రాంగం దాని లక్ష్యాన్ని కేవలం ఆస్తి సంబంధమయిన

విషయంగానే వ్యాఖ్యానించి 'టాడా' వర్తించకుండా చేసింది. అదే విధంగా దళితులపైన అగ్రకులాలు ఆధునిక మారణాయుధాలతో దాడిచేసిన సంఘటనలను 'దళితులను భయభ్రాంతులు చేయడానికి' ఉద్దేశించిన దాడులుగా కాక కొందరు వ్యక్తులపైన జరిగిన దాడిగానో లేక ఇరువర్గాల మధ్య ఘర్షణగానో చిత్రీకరించి పోలీసులు 'టాడా' నుండి తప్పిస్తున్నారు. కాకపోయినా, సమాజంలో వ్యవస్థీకృత ఆధిపత్యాన్ని చలాయించే వాళ్ళ ప్రయోజనాలు పెద్దగా ప్రత్యక్ష హింసా దౌర్జన్యాలకు పాల్పడవలసిన అవసరం లేకుండానే అనేక ప్రశాంతమయిన రూపాలలో అమలవుతుంటాయి. ప్రత్యక్ష హింసకు పాల్పడే స్థితి ఆధిపత్యాన్ని ప్రతిఘటించే వాళ్ళకే ఎక్కువగా ఎదురవుతుంది.

పోనీ టాడాను ఈ విషయంలో నిష్పక్షపాతంగానే అమలు చేస్తారనుకుందాం. సాంఘిక సంఘర్షణలలో జరిగే సాయుధ చర్యలన్నిటి మీదా నిష్పక్షపాతంగా (హిందువుల మీద, ముస్లింల మీద, అగ్రకులామీద, దళితులమీద) టాడాను అమలు చేస్తారనుకుందాం. అలా చేసినంత మాత్రాన 'టాడా' ఆమోదనీయమయిపోతుందా? ఇక్కడే 'టాడా'ను కేవలం అణచివేత సాధనంగా కాక, ప్రజాతంత్ర నాగరికతకు విధ్వంసకరమైన విషయంగా అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. సాంఘిక సంఘర్షణలను నిర్బంధ చట్టాల పరిధిలోకి తీసుకొస్తే ఆ చట్టాలను ఎంత నిష్పక్షపాతంగా అమలు చేసినా ఆ సంఘర్షణలను అణచిపెట్టి యథాస్థితిని కొనసాగించడం మాత్రమే జరుగుతుందనేది ఒక దుష్ఫలితం కాగా, ఆ క్రమంలో నేరవిచారణ వ్యవస్థకు, న్యాయవ్యవస్థకు సంబంధించిన ప్రజాతంత్ర ప్రమాణాలు ధ్వంసమయి అప్రజాస్వామిక పద్ధతులు ఆమోదనీయం కావడం, సమాజానికి అలవాటైపోవడం మరొక దుష్ఫలితం. ఈ నాగరికతా విలువల విధ్వంసాన్ని తేలికగా తీసుకోకూడదు. ఒక అప్రజాస్వామిక సమాజానికి అలవాటయిపోయి అందులో తప్పేమీ లేదనుకునే స్థితి వస్తే దాన్ని తొలగించడం కష్టం.

'టాడా' చట్టంలోని సెక్షన్ 4 స్వయం నిర్ణయ ఆకాంక్షనే విచ్ఛిన్నకర కార్యకలాపం అనే నేరంగా నిర్వచించిందని చెప్పాము. అదే సెక్షన్ 4 మరొక చర్యను కూడ విచ్ఛిన్నకర కార్యకలాపం అంటుంది. అదేమిటంటే రాజ్యాంగాన్ని అమలుచేసే బాధ్యత గల ఒక వ్యక్తి లేక ఒక ప్రభుత్వ ఉద్యోగి మరణాన్ని కాంక్షించడం, ఆ వ్యక్తి చనిపోతారని ప్రకటించటం, లేక ఆ వ్యక్తిని చంపమని ప్రేరేపించడం. దీనికి కూడ

కనీస శిక్ష 5 సంవత్సరాల ఖైదు, గరిష్ఠ శిక్ష జీవిత ఖైదు. ఎవరినైనా చంపమని ప్రేరేపించడం భారత శిక్షాస్మృతి కింద ఎట్లాగూ నేరమే. ఆ వ్యక్తి 'రాజ్యాంగాన్ని అమలు చేసే బాధ్యతగలవార'యితే అదనంగా ఏమొచ్చింది? హత్యకు ప్రేరేపించడం నేరమే కాని కేవలం ఒకరి మరణాన్ని బహిరంగంగా కాంక్షించడం నేరం ఎట్లా అవుతుంది? సందర్భాన్ని బట్టి దానిని సంస్కారహీనమయిన కోరిక అనుకోవచ్చు. లేకపోతే కడుపు కాలిన వారి ఆవేదనగా అర్థం చేసుకోవచ్చు. అంతేగాని అది నేరం ఎట్లా అవుతుంది? ఇక్కడ శాసనకర్తల రాజకీయ లక్ష్యం చాలా స్పష్టంగా తెలుస్తుంది. రాజ్యాంగ యంత్రాంగానికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటం చేసే వాళ్ళు తరచుగా తమ ఉపన్యాసాలలో, రచనలలో, నినాదాలలో ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటారు. వారి రాజకీయ భావ ప్రకటనకు యావజ్జీవ కారాగార శిక్ష విధించాలంటుంది 'టాడా'.

## 'టాడా' ఎందుకు అవసరం అయింది?

ఇటువంటి చట్టం ఒకటి దేశంలో ఎందుకు 'అవసరం' అయిందో ఇప్పుడు సులభంగానే గుర్తించవచ్చు. దేశంలో టెర్రరిజం పెరగడం వల్ల 'టాడా' అవసరం కాలేదు. విచ్చలవిడి హింసాకాండ ద్వారా సామాన్య ప్రజలను మూకుమ్మడిగా హింసకు, భయోత్పాతానికి గురిచేసే చర్యలను 'టెర్రరిజం' అనదలుచుకుంటే ఈ మధ్యకాలంలో దేశంలో అది పెరిగిన మాట వాస్తవమే. ఒకరిని చూసి ఒకరు నేర్చుకుంటూ దేశంలోని వివిధ సాయుధ బృందాలు ఇటువంటి చర్యలకు కొన్ని సంవత్సరాలుగా పాల్పడుతున్నాయి. ఈ పరిణామం ప్రజాస్వామికవాదులకు సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. అనేక సందర్భాలలో ఇటువంటి చర్యలను పౌరహక్కుల సంఘాలు ఖండించాయి. అయితే దీని వల్లనే 'టాడా' అవసరం అయివుంటే ఆ చట్టంలోని నేరాల నిర్వచనం ఈ చర్యలకు అనుగుణంగా ఉండేది. ఒకవేళ అట్లాగున్నా ఆ నేరాలను విచారించే పద్ధతి అప్రజాస్వామికంగా ఉంటే దానిని వ్యతిరేకించవలసిందే. ఒక నేరం ఎంత హేయమయినదయినా దానిని విచారించే పద్ధతి అన్యాయంగా ఉండడానికి వీలు లేదు. అది ఆ నేరాన్ని నిరోధించలేకపోగా న్యాయవ్యవస్థ ప్రమాణాలను నాశనం చేస్తుంది. అయితే 'టాడా'లోని నేరాల నిర్వచనానికీ ఈ విచ్చలవిడి హింసాకాండకూ సామ్యం లేదని చూశాము.

'టాడా'ను ప్రవేశపెట్టడానికి గల అసలు కారణాన్ని ఈ చట్టం నుండే గ్రహించ వచ్చును. భారతదేశంలోని సామాజిక ఆర్థిక వ్యవస్థ ప్రజలలోని అనేక వర్గాలకు సంతృప్తినివ్వడంలో విఫలం అవుతూ ఉంది. తమకు న్యాయం జరగడం లేదనీ, జరుగుతుందన్న నమ్మకం లేదనీ ఒకరి తరువాత ఒకరు అసంతృప్తి చెందుతున్నారు. పెరుగుతున్న ఆకాంక్షలకు తగినట్టు వ్యవస్థలో మార్పులు రాకపోవడం దీనికి ఒక కారణం కాగా, దేశపాలకులు ఎప్పటికయినా ఆ మార్పును సాధిస్తారన్న విశ్వాసం కుప్పకూలిపోవడం మరొక కారణం. భవిష్యత్తు దాకా పోనక్కరలేదు. ఇప్పటి పరిస్థితులలో పాలనా యంత్రాంగం తమకు రక్షణ కల్పిస్తుందన్న విశ్వాసాన్ని సహితం అణచివేతకూ, వివక్షకూ గురవుతున్న ప్రజలు చాలావరకు కోల్పోయారు. దాని వల్ల ఎవరికి వారు ఆత్మరక్షణ కోసమో, లేక తమ హక్కుల సాధన కోసమో ప్రత్యక్ష చర్యలకు పాల్పడుతున్నారు. సాయుధ పోరాటాన్ని నమ్మే సిద్ధాంతాలను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిణామాన్ని అందరూ హర్షించినా హర్షించకున్నా దానికి ప్రజల అసంతృప్తిలో మూలం ఉందని గుర్తించడం అవసరం. కానీ ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందే సామర్థ్యం లేని పాలకులు ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి అన్యమార్గం అన్వేషించలేక ఒకవైపు 'ఎన్‌కౌంటర్లు', చిత్రహింసల వంటి చట్టవిరుద్ధమైన అణచివేతకు పాల్పడుతున్నారు. ఇంకొకవైపు ఒక నాగరిక చట్టంగా గుర్తించడానికి వీలులేని 'టాడా' లాంటి చట్టాన్ని తయారుచేశారు. అందుచేతనే ప్రజాస్వామ్యవాదులు 'టాడా' రద్దునే కోరుతున్నారు తప్ప దాని దుర్వినియోగాన్ని అరికట్టాలని కోరి ఊరుకోవడం లేదు. 'టాడా'ను తయారు చేయడమే శాసనాధికార దుర్వినియోగం. పార్లమెంటుకు ఉండే శాసనాధికారం రాజ్యాంగ ప్రాథమిక హక్కులకూ, ప్రజాస్వామ్య విలువలకూ లోబడి ఉన్న శాసనాలను తయారుచేసే అధికారమే తప్ప ఏలినవారికి బుద్ధిపుట్టినట్టు చట్టాలు తయారుచేసే అధికారం కాదు. పార్లమెంటులో కూర్చున్న అన్ని పార్టీలకూ ఆ విషయంలో ఏకీభావం ఉన్నంత మాత్రాన రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలు తయారుచేయడం శాసనాధికార దుర్వినియోగం కాకుండ పోదు. ఆ దుర్వినియోగం నుండి పుట్టిన శాసనాన్ని పూర్తిగా రద్దు చేయడం ఒక్కటే హేతుబద్ధమయిన చర్య.

సాంఘిక రాజకీయ లక్ష్యాలతో సాయుధ చర్యలకు పాల్పడడం అనే కొత్త పరిస్థితి ఇప్పుడు దేశపాలకులకు ఎదురయింది. ఆ పరిస్థితికి తగినట్టే 'టాడా'లోని నేర నిర్వచనాలు ఉన్నాయి. ఈ రాజకీయ నేరాలలో ముద్దాయిలయిన వారికి హక్కులు

లేకుండా చేస్తే వారి పీడ త్వరగా విరగడ అవుతుందనేది శాసనకర్తల ఉద్దేశ్యం. దాని ఫలితమే 'టాడా'లోని రెండవ అభ్యంతరకర అంశం. 'టాడా'లో నేరవిచారణ పద్ధతిని కనీస ప్రజాస్వామ్య హక్కులకు తావు లేకుండా రూపొందించారు.

## సహజ న్యాయసూత్రాలు

నేరవిచారణలో సహజ న్యాయసూత్రాలు అనేవి అత్యున్నతమైన ఒక ప్రజాతంత్ర విలువ. దానిని విశ్వసించడం ఒక అలవాటుగా మారిన దశను మన దేశ రాజకీయ సంస్కృతి ఇంకా అందుకోలేదు. ప్రజలు, న్యాయమూర్తులు, న్యాయవాదులు ఎవ్వరూ ఆ దశకు ఇంకా పూర్తిగా ఎదగలేదు. ఈ స్థితిలో సహజ న్యాయసూత్రాలకు తావులేని 'టాడా' వంటి చట్టం ముందుకొచ్చి టెర్రరిజం పేరిట, దేశభద్రత పేరిట, పెరిగిపోతున్న హింసాకాండ పేరిట ఆమోదం పొంది స్థిరపడితే ఇప్పుడిప్పుడే ఘర్షణ పడుతూ పడుతూ ఎదుగుతున్న ప్రజాతంత్ర సంస్కృతిని చావుదెబ్బ కొట్టడమే అవుతుంది. అందుకే 'టాడా'ను కేవలం అణచివేతకు సంబంధించిన విషయంగా కాక ప్రజాతంత్ర నాగరికతకు సంబంధించిన ఒక అవాంఛనీయమైన విషయంగా కూడ చూడాలన్నాము.

'టాడా' కేసులో అరెస్టు చేసిన ముద్దాయి చేత పోలీసులు బలవంతంగా ఒప్పుకోలు తీసుకొని కోర్టులో దానిని సాక్ష్యంగా ప్రవేశపెట్టవచ్చు. 'బలవంతంగా' అని చట్టం అనదు కానీ పోలీసు కస్టడీలో ఒప్పుకోలు ఇంకొక రకంగా ఉండజాలదు. ఎవ్వరిచేతా బలవంతంగా నేరం ఒప్పించడానికి వీలు లేదనే నాగరిక నేరవిచారణ సూత్రానికి ఇది పూర్తిగా విరుద్ధం. ఈ సూత్రం ఇప్పటికింకా వలస సమాజానికి పూర్తిగా ఒంటబట్టలేదు. 'నాలుగు తన్నకపోతే దొంగ వెధవ ఒప్పుకుంటాడా' అన్న లోక జ్ఞానమే ఇప్పటికీ రాజ్యమేలుతోంది. ఇప్పుడు 'టాడా' ద్వారా ఈ అనాగరికమైన ఆలోచన శాసనబద్ధం అయింది.

ఒప్పుకోలు తీసుకునే కార్యక్రమం అయిపోయిన తరువాత ముద్దాయిని పోలీసులు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పెడితే ముద్దాయిని పోలీసులు హింసించిందీ లేనిదీ తెలుసుకునే బాధ్యత, హింసించినట్టు ముద్దాయి చెప్తే ఆ ఫిర్యాదు నమోదు చేసుకొని కేసుపెట్టే బాధ్యత ఆ న్యాయమూర్తి మీద ఉంటాయి. కాని ఈ చట్టం ముద్దాయిని తాసీల్దారు వంటి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పెట్టినా సరిపోతుందంటుంది. కాని ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పోలీసులతో పాటు కార్యనిర్వాహక

శాఖలో భాగం కాబట్టి ముద్దాయి ఫిర్యాదుపై కేసు పెట్టే బాధ్యత, అధికారం వారికి ఉండవు. కార్యనిర్వాహక శాఖను, న్యాయశాఖను వేరువేరుగా ఉంచాలనేది మరొక ప్రజాతంత్ర సూత్రం. అధికారం చెలాయించేవాడే న్యాయనిర్ణేత అయితే న్యాయ నిర్ణయం సక్రమంగా జరగదన్న సహేతుకయిన సందేహం నుండి ఈ సూత్రం పుట్టింది. ఇది మన సమాజానికింకా పూర్తిగా అలవడలేదు. ఆస్తి, న్యాయ నిర్ణయ అధికారం, కర్ర పెత్తనం అన్నీ ఊరి పెద్దల చేతిలోనే ఉండే సంస్కృతి నుండి మనమింకా బయటపడలేదు. 'టాడా' మన నేర విచారణ సంస్కృతిని దానికి తగినట్టు వెనక్కి తీసుకుపోతుంది.

మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపెట్టిన తరువాత ముద్దాయికి రెండు నెలల రిమాండు ఇస్తారు. రిమాండు ప్రతిసారీ రెండు నెలలు పొడిగిస్తారు. ఒక సంవత్సరం దాకా ఇట్లా పొడిగిస్తూ ఉండవచ్చు. రిమాండు పొడిగించినప్పుడు నేర పరిశోధన ఎంత దూరం సాగిందని చూడడం న్యాయస్థానం కర్తవ్యం కాబట్టి మామూలు నేరస్మృతిలో రిమాండు కాలం రెండు వారాలు మాత్రమే ఉండడం, 90 రోజుల లోపల నేర పరిశోధన పూర్తికాకపోతే రిమాండు పొడిగించే అవకాశం లేకపోవడం ముద్దాయి స్వేచ్ఛను నేరపరిశోధన పేరిట హరించకుండ చూడడానికి ఉపయోగపడతాయి. నేరం రుజువయ్యే వరకు ముద్దాయి నిర్దోషి కాబట్టి ముద్దాయి స్వేచ్ఛపైన అహేతుకమయిన పరిమితులు పెట్టకూడదనే ప్రజాతంత్ర సూత్రానికి ఇది అనుగుణంగా ఉంటుంది. 'టాడా'లోని రిమాండు నియమాలు అందుకు విరుద్ధంగా, ముద్దాయి స్వేచ్ఛకు వీలయినంతవరకు కాపాడాలనే లక్ష్యానికి బదులు నేరపరిశోధనకు వీలయినంత ఎక్కువ సదుపాయం కల్పించాలని ప్రయత్నిస్తాయి. నేరారోపణ చేసిన పోలీసులను నేరపరిశోధన విషయంలో తొందరపెట్టకూడదు, సావధానంగా చేసుకునే వెసులుబాటు కల్పించాలి, దానివల్ల ముద్దాయి స్వేచ్ఛకు కలిగే నష్టాన్ని లెక్కచేయనవసరం లేదు అనేది 'టాడా' భావిస్తుంది. నేరారోపణతోనే నేరం సగం రుజువయినట్టు అనే అప్రజాస్వామిక వైఖరికి  అనుగుణమైన శాసనం ఇది.


బెయిలు విషయంలో కూడ 'టాడా' మరొక్క అడుగు వెనక్కిపోయి నేరారోపణతోనే నేరం పూర్తిగా రుజువయినట్టేనని భావిస్తుంది. బెయిలు మీద విడుదల కావడం 'టాడా' ముద్దాయికి చాలా కష్టం. మామూలు నేరస్మృతిలో ముద్దాయి నేరపరిశోధనకు ఆటంకం కలిగించరని నమ్మితే చాలు. బెయిలు ఇవ్వాలి. కానీ 'టాడా' కేసులో బెయిలు దొరకాలంటే కోర్టు ముద్దాయిని బెయిలు మీద విడిచిపెడితే

ఇంకొక నేరం చేయడని కూడ నమ్మాలి. నేరం మీద ఉన్న కసిని ముద్దాయి మీదికి బదలాయించి నేరారోపణ రుజువు చేయడం కోసం ముద్దాయిని అన్ని రకాల హింసకు గురి చేయడంలో తప్పు లేదనుకునే అనాగరిక వైఖరి ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. నేరాలు తగ్గాలంటే అనుమానించిన వాళ్ళందరినీ జైలులో పడేసి ఒక సంవత్సరమైనా లోపల ఉంచాలి అనే 'పోలీసు సంస్కృతి' నుండి ఈ శాసనం పుట్టింది.

'టాడా' కేసులో ముద్దాయికి తన మీదనున్న నేరారోపణకు సంబంధించిన పత్రాలు అన్నీ ఇవ్వరు. సాక్షుల పేరు, చిరునామా ముద్దాయికి తెలియకుండ జాగ్రత్తపడడం కోసం ఈ రహస్యాన్ని పాటించటం జరుగుతుంది. దీనికి ముద్దాయి ప్రవర్తనతో ఏమీ సంబంధం లేదు. 'టాడా' కేసు పెట్టారంటేనే ముద్దాయి క్రూరత్వం రుజువయినట్టే. ఇంక ముద్దాయికి సహజ న్యాయసూత్రాల ప్రకారం తనమీద ఉన్న నేరారోపణ పూర్తిగా తెలియజేయడం కంటే, రుజువయిపోయిన ముద్దాయి క్రూరత్వం నుండి సాక్షులను కాపాడడమే వారి ప్రధాన బాధ్యత అయిపోతుంది. రాజ్యం శ్రేయస్సు కోసం, గ్రామం శ్రేయస్సు కోసం, కులం శ్రేయస్సు కోసం ఒక వ్యక్తి హక్కులను బలిపెట్టినా తప్పు లేదనే మధ్యయుగాల సంస్కృతి నుండి వ్యక్తి హక్కులకు గౌరవం కల్పించే ప్రజాతంత్ర సంస్కృతి వైపు ఇంకా పూర్తిగా పయనించని మన సమాజంలో 'దేశభద్రత' పేరిట 'టాడా' ఆ మధ్యయుగాల అనాగరిక సంస్కృతికే పునర్జన్మ కల్గిస్తూ ఉంది.

ఇంక ఎక్కువ వివరాలలోకి పోకుండ, 'టాడా'లో ఆద్యంతం ఈ ప్రజాతంత్ర విలువల విధ్వంసమే ఉందని ఒక్క వాక్యంలో ముగించవచ్చును. 'టాడా' కింద అరెస్టయిన ఉద్యమకారుల హక్కుల అతిక్రమణకు ఎంత ప్రాముఖ్యం ఇస్తామో, అరెస్టయిన వారి మంచి చెడులతో, తప్పొప్పులతో నిమిత్తం లేకుండ ఈ ప్రజాతంత్ర విలువల విధ్వంసానికి కూడ అంతే ప్రాముఖ్యం ఇవ్వడం అవసరం. దీనికి ప్రభుత్వం ఏ కారణమైనా చూపించవచ్చు. ప్రభుత్వం చూపించే కారణాలన్నీ అహేతుకమైనవి కాకపోవచ్చును. కానీ వాటికి మూలాన్నీ సమాధానాన్నీ సమాజంలో వెతకాలి తప్ప మూలాన్ని కుట్రలలో, కుతంత్రాలలో చూడడం, సమాధానాన్ని ప్రజాతంత్ర సంప్రదాయాల విధ్వంసంలో చూడడం సమాజాన్ని వెనక్కి తీసుకుపోయే వైఖరే తప్ప ముందుకు తీసుకుపోయేది కాదు.

*ఉద్యమం మాసపత్రిక*
*జనవరి - మార్చి **1995***



# మళ్ళీ వస్తున్న 'టెర్రరిస్ట్' చట్టం

'టాడా' చట్టం త్వరలోనే తిరిగి రాబోతున్నది. దాదాపు అయిదు సంవత్సరాలుగా భారతదేశంలో 'టెర్రరిస్టు నేరాలు' అని పిలువబడే ప్రత్యేకమైన నేరాలు చట్టంలో లేవు. వాటి కోసం ఒక ప్రత్యేకమైన నేరస్మృతి లేదు. దాని వలన ఫలానా నష్టం జరిగిందని చూపించిన వారెవ్వరూ లేరు. దాని వలన టెర్రరిజం అని పిలువబడే రాజకీయ మిలిటెన్సీ పెరిగిందని నమ్మడానికి దాఖాలాలు కూడ లేవు. అయినప్పటికీ 'టాడా' లాంటి చట్టం లేకుండా దేశమెట్లా బతికిబట్టగలదంటూ చాలామంది చాలా ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే టెర్రరిస్టు చట్టాన్ని తిరిగి తీసుకొస్తామని భారతీయ జనతాపార్టీ చాలాకాలం కిందనే 'హామీ' ఇచ్చింది. (మంచినీళ్ళ బావి తవ్విస్తామన్నట్టు, సాగునీటి చెరువు కట్టిస్తామన్నట్టు భారత రాజకీయాలలో ఇది కూడ ఒక హామీయే!) కాని ఒకసారి 13 రోజులు, రెండవసారి 13 నెలలు మాత్రమే అధికారంలో ఉండడం వల్లనో లేక వారి కూటమిలో ఉన్న ఇతర పార్టీలకు అంతకంటే అర్జెంట్ గొడవలు వేరే ఏవో ఉండడం వల్లనోగానీ ఇప్పటిదాకా ఆ పుణ్యం కట్టుకోలేదు.

ఇప్పుడు బి.జె.పికి అభద్రతా భయం కొంత తగ్గినట్టుంది. తన హామీని నిలబెట్టుకోవడానికి సిద్ధమవుతున్నది. నాలుగేళ్ళ క్రింద ముసాయిదా రూపం తీసుకున్న టెర్రరిస్టు చట్టానికి ఈ మధ్యనే లా కమిషన్ నుండి ఆమోదం పొందింది. ఇంక దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్ట రూపం ఇవ్వడమొక్కటే తరువాయి.

పరిశీలనకు ప్రభుత్వం అప్పగించిన ఈ బిల్లుకు ఆమోదం తెలుపుతూ లా కమిషన్ తయారుచేసిన 'వర్కింగ్ పేపర్'ను చదివితే 'టెర్రరిజం' అనే దానిని గురించి అదుపుతప్పి ఆలోచించడం కేవలం హిందుత్వవాదుల వైపరీత్యం కాదని అర్థం అవుతుంది. ఆ సమస్య గురించి పూర్తిగా ఏకపక్షంగా ఆలోచించడంలో జీవన్‌రెడ్డి గారు ఛైర్మన్‌గా ఉన్న లా కమిషన్ అధికార పార్టీకి ఎంతమాత్రం తీసిపోదని చెప్పవలసి రావడం బాధాకరమే అయినప్పటికీ చెప్పక తప్పదు.

జీవన్‌రెడ్డి గారికి న్యాయమూర్తిగా సాంఘిక న్యాయం, ప్రజాస్వామ్యం, హక్కులు మొదలయిన భావనలనూ, విలువలనూ నిలబెట్టడానికి కృషిచేసిన న్యాయశాస్త్ర కోవిదునిగా గుర్తింపు ఉంది. రిజర్వేషన్లు, పర్యావరణం, కార్మికుల హక్కులు అనే మూడు రంగాలలోనూ ఆయన విలువయిన తీర్పులు ఇచ్చారు. లౌకికవాదం భారత రాజ్యాంగం మౌలిక స్వరూపంలో భాగమని సూత్రీకరించారు.

అటువంటి వ్యక్తి ఛైర్మన్‌గా ఉన్న లా కమిషన్, ప్రభుత్వం ప్రతిపాదించిన టెర్రరిస్టు బిల్లును మొత్తంగా తిరస్కరించకపోయినా పాలకుల కంటే ఎక్కువ సమతుల్యం పాటిస్తుందని ఆశించడంలో తప్పు లేదు. దురదృష్టవశాత్తూ లా కమిషన్ వర్కింగ్ పేపర్‌లో అదే లోపించింది.

'టెర్రరిజం' అనే దానిని అర్థం చేసుకోవడంలో సామాజిక, రాజకీయ కోణాలకు స్థానమేమీ లేదన్నట్టు ఆ పత్రం సాగుతుంది. నిజానికి టెర్రరిజం, ఉగ్రవాదం, తీవ్రవాదం అనే మాటల ప్రయోగంలోనే ఈ సమస్య ఉంది. వాటి సామాజిక ప్రాతిపదికనూ, రాజకీయ స్వభావాన్నీ చూడడానికి నిరాకరించి కేవలం తుపాకుల ప్రయోగం మీదే దృష్టిపెట్టే వైఖరి నుండి ఈ మాటలు పుట్టాయి. అందుకే మానవ హక్కుల ఉద్యమకారులు ఈ మాటలు ప్రయోగించడానికి ఇష్టపడరు. 'టెర్రరిజం' అని పిలువబడేదానిలో నిజానికి టెర్రర్ పుట్టించే లక్షణం లేదని కానీ, అది కేవలం పాలక వర్గాలకు మాత్రమే టెర్రర్ పుట్టిస్తుందని కానీ దీని భావం కాదు. రాజకీయ మిలిటెన్సీ వల్ల పాలకులకే కాదు, ప్రజలకు కూడా అనేక సమస్యలుంటాయి. అదంతా పాలకవర్గాల కల్పన కాదు. అయినప్పటికీ టెర్రర్‌నే కేంద్ర విషయం చేసి ఆలోచించడం తప్పని హక్కుల ఉద్యమకారులు భావిస్తారు. ఆ తప్పుడు వైఖరి నుంచి పుట్టిన టెర్రరిజం, ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి పదాలను ప్రయోగించడం సరయినది కాదని కూడ భావిస్తారు.

కాని లా కమిషన్ వర్కింగ్ పేపర్ చదివితే ఈ తప్పుడు వైఖరి అద్వానీ వారి వంటి మెదళ్ళనే కాక ఇతరత్రా సున్నితంగా ఆలోచించగల వాళ్ళ మెదళ్ళను కూడ ఆక్రమించి ఉందని అర్థం అవుతుంది. 'ఎందుకు?', 'ఏ కారణంగా?' అన్న ప్రశ్నలు వేసుకోకుండా కాశ్మీర్‌లో, పంజాబ్‌లో, ఈశాన్య భారతంలో మిలిటెంట్లు ఇన్నిన్ని హత్యలు చేశారు, ఇంతింత విధ్వంసానికి పాల్పడ్డారు అని ఏకరువుపెట్టి 'ఇప్పుడు దీనికి సమాధానం కావాలి' అంటుంది లా కమిషన్.

రాజకీయ మిలిటెన్సీని కేవలం హింసగా అర్థం చేసుకుంటే ఏం సమాధానం ఉంటుంది? మరింత కఠినమైన నేరసంస్కృతి ఒక్కటే దానికి జవాబు కాగలదు. మిలిటెన్సీలో 'హింస' అనదగినది ఏమీ లేదనీ, అదంతా పాలకవర్గాల కల్పన అనీ అనుకోనక్కరలేదని మరొక్కసారి నొక్కి చెప్పాలి. 'కఠినమైన నేరస్మృతి' కావాలన్న ఆందోళనకు ఇక్కడ అసలు సమస్యే లేదన్న అవాస్తవికమైన వైఖరి జవాబు కాదు. సమస్య ఉంది. కానీ దాని స్వభావం కేవలం నేరస్మృతిలో లేదు అని నచ్చజెప్పగలిగినప్పుడే ఆ ఆందోళనకు నిజంగా జవాబు చెప్పగలుగుతాము. నేరస్మృతిలో కాక సమగ్రమైన సామాజిక రాజకీయ ఆచరణలో జవాబు అన్వేషించగలుగుతాము.

లా కమిషన్ వర్కింగ్ పేపర్‌లోని మరొక విచిత్రమైన గుణం ఏమిటంటే అది చూసేది హింసను మాత్రమే కాక కేవలం ఒకరి హింసనే. కాశ్మీర్‌లో, పంజాబ్‌లో, నాగాలాండ్‌లో, మణిపూర్‌లో ఒక్కొక్క రాష్ట్రంలో మిలిటెంట్లు ఎంతమందిని చంపారో ఎంతెంత విధ్వంసం చేశారో వివరంగా చెపుతుంది కానీ దానిని ఎదుర్కొనే పేరు మీద పోలీసులు, సైన్యం, పారా మిలిటరీ బలగాలు ఎంత విధ్వంసానికి, ఎన్ని హత్యలకు పాల్పడ్డారు అనే విషయం ఎక్కడా చెప్పదు.

చట్టం ఎదుర్కోవాలని చూస్తున్నది మిలిటెంట్ల హింసనే తప్ప ప్రభుత్వ బలగాల హింసను కాదు కదా అంటారేమో. ఆ వైఖరే తప్పు. కాగా ఈ హింసను చూడడానికీ, దాని గురించి మాట్లాడడానికీ నిరాకరించడం వల్ల మిలిటెంట్ల హింసను ఎదుర్కోవడానికి 'కఠినమైన నేరస్మృతి'ని ప్రవేశపెట్టడం ఎంత నష్టం చేస్తుందన్న విషయం లా కమిషన్ పెద్దల స్పృహకే రాకుండా పోయింది.

ఇంతా చేసి ఈ టెర్రరిస్టు చట్టం ఎందుకు? ప్రజలను భయానికి గురిచేసే హింసాకాండను శిక్షించడమే ఉద్దేశమైతే మామూలు చట్టాలేమైనా ఆ హింసాకాండను

ఇప్పటిదాకా నేరంగా గుర్తించలేదా? మరి ఎప్పటి నుండో చట్టాలు నేరంగా అర్థం చేసుకున్న హింసాకాండను విచారించడానికీ, శిక్షించడానికీ ఇప్పుడు ప్రత్యేకమైన చట్టాలెందుకు?

పైకి ఒప్పుకున్నా, ఒప్పుకోకున్నా మామూలు నేరస్మృతిలో లేని కొన్ని 'సదుపాయాల' కోసం ప్రత్యేక చట్టాలు కావలసి వచ్చాయి. అవేమిటంటే ఒకసారి అరెస్టు చేసిన ముద్దాయి బెయిలు గియిలు లేకుండా విచారణ మొత్తం అయిపోయే దాకా జైలులోపడి ఉండాలి. నేరం రుజువయితే దీర్ఘకాలం ఖైదు చేయాలి. లాకప్పులో నేరాన్ని 'ఒప్పించి' దానిని సాక్ష్యంగా న్యాయస్థానంలో ప్రవేశపెట్టే అవకాశం ఉండాలి. ఒకరిచేత ఒప్పించి అందరినీ ఇరికించే అవకాశం ఉండాలి. పూర్తి సాక్ష్యం లేకున్నా సగం సగం సాక్ష్యాలతో నేరాన్ని రుజువుచేసే తంతు ముగించాలి. ఏ మేరకు వీలయితే ఆ మేరకు నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయి మీదికి నెట్టేయాలి. ట్రయల్ కోర్టు నుండి హైకోర్టుకు, అక్కడి నుండి సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశాలు లేకుండా ఏకంగా సుప్రీంకోర్టుకు ఒకే ఒక్క అప్పీలు చేసుకునే అవకాశం ఇచ్చి అదే న్యాయం అని సరిపెట్టాలి.

ఏదో ఒక సామాజిక లేక రాజకీయ అన్యాయానికి నిరసనగా మిలిటెంట్ ఉద్యమాలలోకి వచ్చిన వాళ్ళకు అందుకు జవాబుగా ఇటువంటి నేరస్మృతిని రుచి చూపిస్తే వారిలోని నిరసన మరింత పెరుగుతుందే తప్ప తగ్గదు. కానీ ఈ విషయం గుర్తించాలంటే అసలు ముందక్కడ ఒక సామాజిక, రాజకీయ సమస్య ఉందని గుర్తించాలి కదా? ప్రజలలో వైమనస్యం ఉందని గుర్తించాలి కదా? ఆ స్పృహే లేనప్పుడు, మిలిటెంట్ ఉద్యమాలు కేవలం కండకావరంతో చేసే అరాచకాలుగా కనిపించినప్పుడు ఆ గుర్తింపు ఎక్కడి నుండి వస్తుంది?

గతంలో ఉన్న 'టాడా'లోనయినా, రేపు రాబోయే టెర్రరిస్టు చట్టంలోనయినా చాలా సిగ్గుమాలిన విషయం ఏమిటంటే చిత్రహింసలు పెట్టి నేరం ఒప్పించే ప్రక్రియకు చట్టబద్ధత కల్పించే ప్రయత్నం. ఈ చట్టం లేనిదే 'టెర్రరిజాన్ని' ఎదుర్కోవడం సాధ్యం కాదన్న స్థితికి ప్రభుత్వాలే కాదు, న్యాయమూర్తులు సహితం రావడం బాధాకరమైన విషయం. చిత్రహింసలు పెట్టి ఒప్పిస్తే నిజం మాత్రమే ఒప్పుకుంటారన్న భరోసా


లేదని మరొక్కసారి చెప్పవలసిన అవసరం ఉందా? చిత్రహింసలు పెట్టి నేరం ఒప్పించే అవకాశం పోలీసులకు ఇస్తే నిజంగానే ముద్దాయి చేసిన నేరాన్ని మాత్రమే 'ఒప్పిస్తారన్న' భరోసా లేదని చెప్పవలసిన అవసరం కూడ ఉందా?

టెర్రరిస్టు చట్టాలు లేని దేశమేదీ ఇప్పుడు ప్రపంచంలో లేదనీ, 'టాడా'లో హక్కుల ఉద్యమకారులు గర్హించిన సూత్రాలు ఇంగ్లాండ్, అమెరికా వంటి దేశాలలోనూ ఉన్నాయనీ లా కమిషన్ నచ్చజెప్ప చూసింది. లా కమిషన్ పెద్దల న్యాయశాస్త్ర పాండిత్యం ఇందుకు పనికొచ్చింది.

ముద్దాయికి న్యాయబద్ధమైన విచారణ కల్పించని నేరస్మృతి ఏ దేశంలో ఉన్నా తప్పే. అయితే దానిని దుర్వినియోగం చేసే సంస్కృతి మితంగా ఉన్న దేశాలలో వాటి వల్ల జరిగే నష్టం ఏపాటి ఉంటుందో కానీ ఏ కొంచెం అధికారం ఇచ్చినా విచ్చలవిడిగా దుర్వినియోగం చేసే పాలనా సంస్కృతి – ముఖ్యంగా పోలీసు సంస్కృతి – పాదుకుని ఉన్న మనబోటి దేశాలలో అటువంటి నేరస్మృతి ఉండడం చాలా ప్రమాదకరం.

గతంలో 'టాడా' పట్ల వ్యతిరేకత ఈ కారణంగానే పెల్లుబికిందన్న సంగతి రాజకీయ నాయకులు ఒకవేళ మరిచిపోయినా లా కమిషన్‌కయినా జ్ఞాపకం ఉండి ఉండాలి. మిలిటెన్సీ పట్ల అభిమానం లేనివారు సహితం టెర్రరిస్టు చట్టాన్ని అసహ్యించుకునేంతగా దానిని దుర్వినియోగం చేయడం జరిగింది. ముద్దాయికి న్యాయసమ్మతమైన విచారణ కల్పించని చట్టాలు సూత్రప్రాయంగా తప్పని గుర్తించలేక పోయినా, కనీసం అటువంటి చట్టాలను విచ్చలవిడిగా ప్రయోగించకుండా చూడడానికి పోలీసు సంస్కృతిని, పాలనా సంస్కృతిని సంస్కరించే ప్రయత్నమేదీ చేయకుండా ఈ దేశాన్ని, ఆ దేశాన్ని ఉదాహరణగా చూపించి టెర్రరిస్టు చట్టాన్ని మరోసారి తీసుకురావాలని ప్రయత్నించే విజ్ఞతను ఏమనాలి?

*ఆంధ్రప్రభ దినపత్రిక*
***20 జనవరి 2000***



# కొత్త టాడా చట్టాన్ని కూడ వ్యతిరేకిద్దాం

**1995** లో తాత్కాలికంగా కాలం చెల్లిన టాడా చట్టం ఇప్పుడు మళ్ళీ రాబోతున్నది. కేంద్ర ప్రభుత్వం తయారుచేసిన ముసాయిదా బిల్లును కొన్ని మార్పులు చేర్పులతో లా కమిషన్ ఆమోదించి 'ఇక చట్టం చేసుకొమ్మ'ని వెనక్కి పంపించింది. బడ్జెట్ వల్ల, గుజరాత్ గొడవ వల్ల, బీహార్ సంక్షోభం వల్ల మొన్నటి పార్లమెంట్ సమావేశంలో ఆ బిల్లును ప్రవేశపెట్టలేదు గాని రాబోయే సమావేశంలో ప్రవేశపెట్టి చట్టం చేస్తారనడంలో సందేహమేమీ లేదు.

ఎందుకంటే, అయిదేళ్ళ పాటు టెర్రరిస్టు చట్టం లేకుండా బతికామంటేనే ఒంటి మీద గుడ్డలు లేకుండా బతికినంత ఇబ్బందిగా అనిపిస్తున్నది మన పాలకులకు. కేవలం రాజకీయ పాలకులకే కాదు, లా కమిషన్ ఛైర్మన్ జీవన్‌రెడ్డి గారికి కూడ.

గతించిన టాడా పైన మానవహక్కుల కోణం నుండి వచ్చిన విమర్శను దృష్టిలో పెట్టుకుని ఈ కొత్త చట్టాన్ని రాశామని లా కమిషన్ అంది గానీ ఆ దాఖలాలు బిల్లులో పెద్దగా కనిపించవు.

పోలీసు కస్టడీలో ముద్దాయి ఇచ్చే వాంగ్మూలాన్ని సాక్ష్యంగా స్వీకరించవచ్చుననేది 'టాడా'లోని చాలా అభ్యంతరకరమైన విషయాలలో ఒకటి. కొత్త టాడా బిల్లులో దానిని తీసేసి ఉంటే మానవహక్కుల విమర్శను కొంత మేరకయినా పట్టించుకున్నారని అనుకొని ఉండవచ్చు. కాని ఆ అంశాన్ని కొత్త టాడా బిల్లులోనూ కొనసాగించారు. అయితే ముద్దాయి

పోలీస్ కస్టడీలో వాంగ్మూలం ఇచ్చిన తరువాత ఆ వాంగ్మూల పత్రంతో పాటు ముద్దాయిని కూడ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దగ్గర హాజరుపెట్టాలనీ, అప్పుడు ముద్దాయి ఏమి చెప్తే అది ఆ న్యాయాధికారి నమోదు చేసుకోవాలనీ ఒక సవరణ చేర్చారు. కానీ న్యాయాధికారి వద్ద నుండి ముద్దాయి తిరిగి పోలీస్ కస్టడీకి పోక తప్పదు కాబట్టి దీని వల్ల ఏమంత ప్రయోజనం ఉండకపోవచ్చు.

నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత కొన్ని సందర్భాలలో ముద్దాయిపైనే పెట్టడం కూడ టాడాలోని అభ్యంతరకరమైన విషయాలలో ఒకటి. అది కొత్త బిల్లులోనూ యథాతథంగా కొనసాగుతుంది.

ఇట్లా ఒక్కొక్కటీ చెప్పుకోనక్కరలేదు. టాడాలోని అభ్యంతరకరమైన విషయాలన్నీ కొత్త బిల్లులోనూ ఉన్నాయి. నేర విచారణ కోర్టులో కాక వేరే ఎక్కడయినా (జైలుతో సహా) జరపవచ్చును. కేసులో తుది తీర్పు మీద తప్ప అప్పీల్ ఉండదు, అది కూడ సుప్రీంకోర్టుకే తప్ప హైకోర్టుకు ఉండదు. సాక్షుల పేర్లు, చిరునామాలు రహస్యంగా ఉంచవచ్చును. యాంటిసిపేటరీ బెయిలు ఉండదు. ముద్దాయి నేరం చేయలేదని కోర్టు నమ్మితే తప్ప బెయిలు సహితం ఇవ్వకూడదు.

ఇవి నేర విచారణ పద్ధతికి సంబంధించిన విషయాలు.

కాగా, హక్కుల సంఘాలు గతించిన టాడాను విమర్శించింది కేవలం నేర విచారణ పద్ధతి అప్రజాస్వామికంగా ఉన్నందుకు మాత్రమే కాదు. అసలు 'టెర్రరిస్టు చర్య' 'విచ్ఛిన్నకర కార్యకలాపం' అనే నేరాల నిర్వచనమే అప్రజాస్వామికమనీ, అభ్యంతరకరమనీ హక్కుల సంఘాలు ఆందోళన చేశాయి. అయినా కొత్త బిల్లు ఆ నిర్వచనాలను యథాతథంగా కొనసాగించింది.

నిజానికి ఈ విషయంలో కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేకతకు కొంత స్పందించి ఆ నిర్వచనాన్ని ఒక మేరకు సడలించే ప్రయత్నం చేసింది గానీ లా కమిషన్ అక్కరలేదనింది.

పాత టాడాలో టెర్రరిస్టు చర్య అంటే ప్రజలను, లేదా ప్రజలలో ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసే చర్య, లేదా ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లోబరుచుకునే చర్య. టాడా దుర్వినియోగం గురించి గతంలో జరిగిన ఆందోళన ఫలితంగానేమో,

కేంద్రప్రభుత్వం ఈ బిల్లును తయారుచేసినప్పుడు 'ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లోబరుచుకోవడం' అనే వాక్యాన్ని తీసేసి 'దేశ సమైక్యతకూ, భద్రతకూ, సార్వభౌమత్వానికీ హాని కలిగించడం' అనే వాక్యం చేర్చింది. ఇది కనీసం కొంత నిర్దిష్టమైన అభియోగం. కానీ లా కమిషన్ 'ప్రభుత్వాన్ని బలప్రయోగంతో లోబరుచుకోవడం' అనే వాక్యం ఉండవలసిందేనన్నది. ఇప్పుడు లా కమిషన్ నుండి ప్రభుత్వానికి తిరిగివెళ్ళిన బిల్లులో రెండూ ఉన్నాయి! ఈ రకంగా కొత్త టాడా బిల్లులో 'టెర్రరిస్టు చర్య' నిర్వచనం పాత టాడా చట్టంలో నిర్వచనం కంటే మరింత కఠినంగా మారింది.

'విచ్ఛిన్నకర కార్యకలాపాలు' అనేది మరీ అభ్యంతరకరమైన అభియోగం. టెర్రరిస్టు చర్య అనే దానిలో కనీసం ఒక హింసాత్మక ఘటన ఉంది. కానీ విచ్ఛిన్నకర కార్యకలాపం అనేది కేవలం ఒక అభిప్రాయ వ్యక్తీకరణను నేరంగా గుర్తించే అభియోగం. ఈ దేశ ప్రజలలో ఎవరైనా 'మేము ఈ దేశంలో భాగం కాదు' అంటే చాలు, అది నేరం. దానికి శిక్ష జీవిత ఖైదు. పాత టాడా చట్టంలో 'దేశ సమగ్రతను, సమైక్యతను ప్రశ్నించే చర్య' మాటల రూపంలో ఉన్నా చేతల రూపంలో ఉన్నా వేరే ఏ రూపంలో ఉన్నా అది విచ్ఛిన్నకర కార్యకలాపం అవుతుందని ఉండింది. కాశ్మీర్‌లో, పంజాబులో, నాగాలాండ్‌లో, అస్సాంలో కొన్ని వేలమంది కేవలం తమ జాతివిముక్తి గురించి మాట్లాడినందుకు, రాసినందుకు టాడా కేసులపాలయ్యారు. కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త బిల్లులో ఆ నేర నిర్వచనాన్ని సారాంశంలో అట్లాగే ఉంచినప్పటికీ, 'మాటల రూపంలో ఉన్నా చేతల రూపంలో ఉన్నా వేరే ఏ రూపంలో ఉన్నా' అన్న వివరణ మరీ ఎబ్బెట్టుగా ఉందనుకున్నారో ఏమోగానీ దానిని తొలగించారు. కాని అది ఉండవలసిందేనని లా కమిషన్ భావించింది కాబట్టి ఇప్పుడు పార్లమెంటు ముందుకు పోబోయే బిల్లులో ఆ వాక్యం తిరిగివచ్చి చేరింది.

పాత టాడా చట్టం పట్ల వ్యక్తమైన తీవ్రమైన వ్యతిరేకత ఫలితంగా టాడా చట్టం శాశ్వతంగా రద్దు కాకపోయినా కనీసం కొంత సవరణలు జరిగాయనే సంతృప్తి కూడ మిగలకుండా చేసిన ఘనత లా కమిషన్ ఛైర్మన్ జీవన్‌రెడ్డిగారికి దక్కుతుంది. రాజకీయ నాయకులను నమ్ముకోలేము గానీ న్యాయమూర్తులు ప్రజాస్వామ్యాన్ని కాపాడతారని నమ్ముకోవచ్చని భావించే వాళ్ళు ఈ దేశంలో చాలామంది ఉన్నారు. వారికిదే హెచ్చరిక కాగలదు.

చివరిగా, నేర విచారణ పద్ధతి, నేరాల నిర్వచనం అప్రజాస్వామికంగా ఉన్నాయన్నది మాత్రమే హక్కుల సంఘాల విమర్శ కాదు. టాడాలో అంతకంటే ప్రాథమికంగానే లోపం ఉంది. అది రాజకీయ మిలిటెన్సీనీ, స్వయం నిర్ణయాధికార రాజకీయాలనూ నేరాలుగా మార్చి, మామూలు నేరాల కంటే కఠినంగా వాటితో వ్యవహరించాలని చూసే చట్టం. అటువంటి చట్టం ఎట్టి పరిస్థితిలోనూ ఆమోదనీయం కాదు.

రాజకీయ మిలిటెన్సీ గురించి, అంటే సాయుధ పోరాట రాజకీయాల గురించి మనకు ఏ అభిప్రాయమైనా ఉండవచ్చు. కానీ అది ప్రాథమికంగా ఒక రాజకీయం. ఎంతో కొంత సామాజిక పునాది ఉన్న రాజకీయం. ఆ రాజకీయం ఎంచుకున్న సాయుధ పోరాట రూపం వల్ల జరిగే హింసాత్మక నేరాలను సాధారణ చట్టంతో ఎదుర్కొంటూ, మొత్తంగా ఆ రాజకీయాన్ని మాత్రం రాజకీయంగానే చూసి రాజకీయంగానే ఎదుర్కోవాలన్నది హక్కుల సంఘాల వాదన. టాడా అందుకు భిన్నంగా ఆ రాజకీయాన్నే ఒక నేరంగా నిర్వచిస్తుంది. అందులోనూ మామూలు హక్కులకూ సహజ న్యాయసూత్రాలకూ అర్హతలేని నేరంగా చూస్తుంది.

స్వయం నిర్ణయాధికార రాజకీయాలను నేరంగా నిర్వచించడం మరీ అభ్యంతరకరం. అందులోనూ వలసలన్నీ విముక్తి పోరాటాల ద్వారా స్వంత రాజకీయ అస్తిత్వాన్ని ఏదో ఒక మేరకు సాధించుకున్న 20వ శతాబ్దంలో భారత రాజ్యంలో అంతర్భాగంగా ఉన్న ప్రజలెవ్వరూ బయటకు పోతామనడానికి వీలులేదనీ, అలా అనేట్టయితే యావజ్జీవ ఖైదు విధిస్తామనీ అనడం చరిత్రనే అపహాస్యం చేయడం. నిజానికి ఆ చరిత్ర ఫలితంగానే 'స్వయం నిర్ణయాధికారం' ఐక్యరాజ్యసమితి పౌర రాజకీయ హక్కుల ఒడంబడికలో మొదటి స్థానం పొందింది. అయినప్పటికీ ప్రపంచంలో ఏ దేశ రాజ్యాంగమూ (అమలు చేయించుకునే అవకాశం లేని ఒకనాటి సోవియట్ రాజ్యాంగం తప్ప) స్వయం నిర్ణయాధికారాన్ని ఒక హక్కుగా గుర్తించకపోవడం ఒకెత్తయితే, ఆ ఆలోచనే జీవిత ఖైదు విధించగల నేరంగా భావించడం మరీ దారుణమైన విషయం.

ఏ సందర్భంలోనయినా ఇటువంటి చట్టాన్ని ప్రజాస్వామ్యవాదులు వ్యతిరేకించ వలసిందే. అయితే ఇప్పటి పరిస్థితులలో దానిని పటిష్టంగా వ్యతిరేకించడం మరీ

అవసరం. గ్లోబలైజేషన్ ఫలితంగా రేపు మన సామాజిక ఆర్థిక జీవితంలో పెరగబోయే అసంతృప్తి మీద ఈ కొత్త టాడాను ప్రభుత్వం పెద్దఎత్తున ప్రయోగించే ప్రమాదం ఉంది. ఆ అసంతృప్తి సాయుధ రూపం తీసుకుంటేనే ఇది జరుగుతుందని అనుకోనక్కర లేదు. గతంలో టాడా ప్రకటించుకున్న నేర నిర్వచనంతో నిమిత్తం లేకుండా ఎవరెవరి మీద ఎంత విచ్చలవిడిగా ప్రయోగించారో మనకు జ్ఞాపకం లేకపోలేదు. నిజానికి ఈ 'దుర్వినియోగం' గురించే అప్పట్లో ఎక్కువ గొడవ జరిగి టాడాను 1995లో పొడిగించకుండా నిలిపివేయడం జరిగింది.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
***8 ఏప్రిల్ 2000***

# అన్యాయమైన లా కమిషన్ ఆలోచనలు

ఈ వ్యాసం కొత్త టాడా చట్టం గురించి మాత్రమే కాదు, దానికి ఆమోదం తెలియజేస్తూ లా కమిషన్ రూపొందించిన వర్కింగ్ పేపర్ గురించి కూడ. కొత్త టాడాలో కొత్తదనం పెద్దగా లేదు. ఉన్న కొంచెం కొత్తదనంలో చెడు కొంచెం, మంచి కొంచెం ఉందిగానీ అంతా కలిసినా కొత్తదనం స్వల్పమే. కొత్త టాడా బిల్లు పాతదానికి కాపీయేనంటే పెద్దగా అతిశయోక్తి కాదు.

లా కమిషన్ వర్కింగ్ పేపర్ మాత్రం ఆశ్చర్యం కలిగించే పత్రం. దానిని రాసిందొక పోలీస్ అధికారి అయి వున్నా, కేంద్ర హోంశాఖలో రాటుదేలిన ఐఎఎస్ అధికారి అయి వున్నా అంత ఆశ్చర్యపోకపోదుమేమో కాని లా కమిషన్ ఛైర్మన్ జీవన్‌రెడ్డి గారి కలం నుండి అది వెలువడింది. (రిటైరయిపోయిన జడ్జిలను 'జస్టిస్' అని సంబోధించే దురలవాటును మేము పాటించదలుచుకోలేదు. ఆ బిరుదు వారు కూర్చున్న కుర్చీకి చెందుతుంది. వ్యక్తికి కాదు). జీవన్‌రెడ్డిగారు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే తీర్పులు కొన్ని ఇచ్చారు. రిజర్వేషన్లు, పర్యావరణం, లౌకికవాదం, కార్మికుల హక్కులు, ఎన్‌కౌంటర్లు మొదలయిన విషయాలకు సంబంధించి ఆయన కలం నుండి వెలువడిన కొన్ని తీర్పులు హక్కుల పురోభివృద్ధికి దోహదం చేశాయనడంలో సందేహం లేదు.

అటువంటి వ్యక్తి సహితం 'టెర్రరిజం' అనే భూతం దగ్గరికొచ్చేసరికి తన ఆలోచనాశక్తికి తానే సంకెళ్ళు వేసుకోవడం ఆశ్చర్యమే కాక ఆందోళన

కూడ కలిగించే విషయం. టెర్రరిజం అనే పేరుతో పిలవబడేది వట్టి అభూతకల్పన అని గానీ, పాలకుల బుర్రలలో తప్ప బయట ఎక్కడా అటువంటిదేదీ లేదని గానీ మేము అనడం లేదు. ఈ వైఖరి హక్కుల ఉద్యమంలో బలంగా ఉందని మాకు తెలుసు. అది తనతో తాను మాత్రమే సంభాషించుకుంటూ ఇతరులెవ్వరినీ ఒప్పించే ప్రయత్నం చేయకుండా కాలక్షేపం చేసే వైఖరి. దాని వల్ల టాడా వంటి చట్టాలను వ్యతిరేకించే ఉద్యమానికి జరిగే మేలు కంటే నష్టమే ఎక్కువ.

అయినప్పటికీ బస్సులో బాంబు పేలుళ్ళ వార్త వినగానే సాధారణ వివేచన నుండి సెలవు పుచ్చుకునే మేధో బలహీనతను గౌరవించడం కష్టం. మేధో బలహీనత అంటున్నామంటే అది మేధావులలో మాత్రమే ఉందని అర్థం కాదు. భయం వల్ల వివేచనా శక్తిని కోల్పోయే ఈ దౌర్బల్యం ప్రజలలోనూ ఉంది. ఇతరులలో దీనిని కనీసం అర్థం చేసుకోవచ్చునేమోగానీ చట్టాలను రాజ్యాంగం వెలుగులో సమీక్షించే బాధ్యత గల లా కమిషన్ అదే దౌర్బల్యాన్ని ప్రదర్శిస్తే క్షమించడం కష్టం.

1995లో టాడాను ఇంకా పొడిగించడం అనవసరం అని పార్లమెంటు భావించిన తరువాత కేంద్రప్రభుత్వం ఆ చట్టాన్ని కొద్దిగా సవరించి క్రిమినల్ లా అమెండ్‌మెంట్ బిల్లు పేరిట ఒక ముసాయిదా చట్టాన్ని తయారుచేసింది. మంచి చెడులు చర్చించి సలహాలూ సూచనలూ ఇమ్మని దానిని లా కమిషన్‌కు అప్పగించింది.

పోలీసుల ఆమోదమే కావాలంటే ప్రభుత్వం దానిని రిబైరోకు గానీ, కెపిఎస్ గిల్‌కు గానీ పంపించి ఉండవచ్చు. చట్టాలను ఆమోదించే ముందు లా కమిషన్‌కు చూపించాలన్న నియమం రాజ్యాంగంలో ఎక్కడా లేకున్నా కూడ ప్రభుత్వం దానిని లా కమిషన్‌కు పంపించింది. అప్పటివరకు టాడాపైన వచ్చిన విమర్శను దృష్టిలో పెట్టుకొని ఈ బిల్లుకు తుదిరూపం ఇవ్వమని కోరింది. బహుశా ఆ విమర్శ తీవ్రతే ప్రభుత్వం ఈ పద్ధతిని అనుసరించడానికి కారణం కావచ్చు.

'ఇప్పటివరకు ఉన్న నేరస్మృతి టెర్రరిజాన్ని ఆపలేకపోయింది కాబట్టి మరింత కఠినమైన చట్టం కావాలి' అనే వైఖరితో లా కమిషన్ సూచనలిచ్చేటట్టయితే – ప్రభుత్వం వారిని అడగడం ఎందుకు, ఏ హోంశాఖ కార్యదర్శినో అడిగితే సరిపోయేది. దురదృష్టకరమైన విషయమేమిటంటే లా కమిషన్ కొత్త టాడా బిల్లుపైన రూపొందించిన

వర్కింగ్ పేపర్ సారాంశం ఇదే. అది ఏమి చెపుతుందంటే 'బ్రిటిష్ వలస పాలకులు ఎప్పుడో తయారుచేసిన నేరస్మృతి ఈనాటి సంఘటిత నేరాలను అదుపు చేయడానికి సరిపోదు కాబట్టి సంఘటిత (ఆర్గనైజ్డ్) నేరాలను ఎదుర్కోగల కఠినమైన చట్టాలు కావాలి. నిజం చెప్పాలంటే ప్రస్తుత నేరస్మృతి, నేర విచారణ వ్యవస్థ సంఘటిత నేరాలనే కాదు, అసంఘటిత నేరాలను సహితం ఎదుర్కొనలేకపోతున్నాయి. చాలావరకు అసంఘటితంగా జరిగే – అంటే వృత్తి నేరస్తుల ముఠాలు కాక సాధారణ పౌరులు చేసే – నేరాలలో రేప్ ఒకటి. రేప్ కేసులలో శిక్ష పడేవి నాలుగు శాతం కూడ లేవు'.

అయితే ఏం చేయాలి? నేరస్మృతిని కఠినతరం చేయడమే పరిష్కారమని లా కమిషన్ అంటుంది. అదే సరైన వైఖరా లేక నేరానికి జవాబంతా నేరస్మృతిలోనూ నేరవిచారణ వ్యవస్థలోనూ లేదని, వాటిని అట్లా ఉండనిచ్చి నేరాలకు – సంఘటిత నేరాలకు కూడ – జవాబును ప్రధానంగా పోలీస్ స్టేషన్లు, జైళ్ళు, కోర్టుల వెలుపల వెతుక్కోవాలని గుర్తించడం సరైన వైఖరా? ఈ ఆలోచన సహితం ఒక పోలీసు లేక సైనిక అధికారికి రాకపోవడాన్ని అర్థం చేసుకోవచ్చునేమో గానీ లా కమిషన్ కూడ ఈ విషయాన్ని గ్రహించలేక నేరాలు పెరిగినప్పుడల్లా నేరస్మృతిని మరింత కఠినతరం చేయాలనీ, ఆపైన నేరాలు ఇంకింత పెరిగితే మరొక్కసారి నేరస్మృతిని మరింత కఠినతరం చేయాలనీ వాదిస్తే ఏమనాలి?

గతించిన టాడాపైన విమర్శ కేవలం చట్టాలు, రాజ్యాంగం కోణం నుండి మాత్రమే రాలేదు. రాజకీయ సామాజిక కోణాల నుండి కూడ చాలా వచ్చింది. అయినా ఆ స్పృహ లా కమిషన్ కొత్త టాడా బిల్లు పైన రూపొందించిన వర్కింగ్ పేపర్‌లో ఎక్కడా కనిపించదు. టాడాకు దాదాపుగా 'ముస్లిం వ్యతిరేక చట్టం' అని పేరు వచ్చిన తరువాతే పార్లమెంటులోని అన్ని పార్టీలూ – ఒక్క బిజెపి మినహాయించి – దానినింక పొడిగించవద్దని నిర్ణయించాయి. టాడా ప్రయోగించబడిన వ్యక్తుల జాబితా తీస్తే ముస్లింలు, సిక్కులు, ఈశాన్య రాష్ట్రాల ఆదివాసులు, ఆంధ్రప్రదేశ్, బీహార్‌లలో గ్రామీణ పేదలు, గని కార్మికులు, తమిళనాడులో ప్రవాస శ్రీలంక తమిళులు, తమిళనాడు – కర్ణాటక సరిహద్దు అడవులలో (వీరప్పన్ సంచరించే ప్రాంతంలో) ఆదివాసీ, సంచార తెగలు – ఇటువంటి ప్రజలే కనిపిస్తారు. అంటే దేశ సామాజిక ఆర్థిక రాజకీయ ప్రధాన స్రవంతికి (మెయిన్‌స్ట్రీం) వెలుపల ఉన్నవారే కనిపిస్తారు.

టెర్రరిస్టులంతా ఈ 'ప్రధాన స్రవంతికి' వెలుపలే ఎందుకుంటారు? అది వారి లోపమా, 'ప్రధాన స్రవంతి' లోపమా లేక దేశ జన జీవితంలో ఒక 'ప్రధాన స్రవంతి' అనేది ఉండడమే ఈ పరిస్థితికి దారి తీసిందా? ఈ ప్రశ్నలు వేసుకోనక్కర లేకుండా కొత్త టాడా బిల్లుకు ఆమోదం ఇచ్చేసిన లా కమిషన్ గురించి ఏమనుకోవాలి?

లా కమిషన్ తన వర్కింగ్ పేపర్‌లో టెర్రరిజాన్ని గురించి సామాజిక కోణం నుండి చర్చ చేయనే లేదని కాదు. కొంచెం చేసింది, కానీ ఆ కొంచెం చూసిన తరువాత అసలే చేయకుండా ఉంటే బాగుండేదేమో – జీవన్‌రెడ్డిగారి విజ్ఞత గురించి కొంచెం భ్రమ అయినా మనకు మిగిలి ఉండేదేమో – అనిపించకమానదు.

కాశ్మీరు, పంజాబు, నాగాలాండ్, అస్సాం, మణిపూర్, త్రిపుర, మేఘాలయాలలో మిలిటెంట్లు ఎంతెంత మందిని చంపారో తెలిపే గణాంకాలు లా కమిషన్ ఇచ్చింది. వారి హింస ఎంత భయోత్పాతం కలిగిస్తున్నదో తెలిపే చిత్రం ఇచ్చింది. ప్రత్యేకించి భారత సైనికులు, ఇతర సాయుధ బలగాల సిబ్బంది ఎంతమంది చనిపోతున్నారో చెప్పింది.

ఇవి చెప్పనే వద్దని కాదు. మిలిటెంట్లు హింసకు పాల్పడడమే లేదని గానీ, బతికే అర్హతలేని దుర్మార్గులకు తప్ప వేరే ఎవరికీ దాని వలన సమస్య లేదని గానీ చెప్పడం మా ఉద్దేశ్యం కాదు. కానీ ఈ విషయాలు మాత్రమే చెప్పి, వీటిని గురించి మాత్రమే ఆలోచించి టాడా వంటి చట్టాల మంచిచెడులు బేరీజు వేస్తే అది అవాంఛనీయమైన నిర్ణయాలకు దారితీయగలదు.

పైగా 'ప్రధాన స్రవంతి'కి వెలుపల ఉండేవాళ్ళ హింసను మాత్రమే టెర్రరిజంగా నిర్వచించే ఈ వైఖరి 'ప్రధాన స్రవంతి' లోపల జరిగే హింసను సాధారణ జీవితంలో భాగంగా గుర్తించడం వల్ల, ఆ సాధారణ జీవితంలోని 'సాధారణ' స్వభావం ఈ హింసకు కూడ అంటుకుంటోంది. దాని గురించి ప్రత్యేకమైన చర్చ అక్కరలేదు, ప్రత్యేక చట్టాలు అక్కరలేదు. 'ప్రధాన స్రవంతి' చేసే హింస, 'ప్రధాన స్రవంతి'కి వెలుపల ఉండేవారు చేసే హింసకు జవాబు అయినట్టయితే ఇంక చెప్పనవసరమే లేదు. అది ధర్మం, దేశభక్తి, సమాజ సంరక్షణ; హింస కానేకాదు.

వివేచన లేకుండా ఒక ఆలోచనా స్రవంతిలో చిక్కుకుంటే ఇటువంటి ప్రమాదాలే ఉంటాయి. మిలిటెన్సీ బలంగా ఉన్న ఒక్కొక్క రాష్ట్రంలోనూ మిలిటెంట్లు ఎంత హింసకు

పాల్పడ్డారు, ఎన్ని హత్యలు చేశారు, మృతులలో భద్రతా సిబ్బంది ఎందరు, మిలిటెంట్ల చర్యల పర్యవసానంగా సమాజంలో నెలకొన్న బీభత్సం ఎంత అని వివరంగా చెప్పిన లా కమిషన్ అవే రాష్ట్రాలలో భారత సాయుధ బలగాలు, స్థానిక పోలీసులు పాల్పడిన హింస గురించి కానీ, చేసిన హత్యల గురించి కానీ ఒక్క మాట కూడ అనలేదు. దాని గురించి మాట్లాడటం అనవసరం అని లా కమిషన్ అనవచ్చును కూడ. ఎందుకంటే సైనిక చర్యల వల్ల ఒకవేళ టెర్రర్ కలిగినా, టాడా నిర్వచించే 'టెర్రర్' అది కాదు కదా. కాబట్టి టాడా వంటి టెర్రరిస్టు వ్యతిరేక చట్టాల గురించి చర్చించేటప్పుడు సైనిక టెర్రర్ గురించి మాట్లాడడం అనవసరం అనవచ్చు. పైగా ప్రధాన రాజకీయ స్రవంతిని తిరస్కరించే ఆ మిలిటెన్సీ పైన సైన్యం చేసే దాడులు ప్రధాన స్రవంతిని కాపాడడానికి చేసే సమాజసేవ, దేశసేవ అయినపుడు దానిని టెర్రరిస్టులు పాల్పడే టెర్రర్‌తో ఎట్లా పోలుస్తాం? అని అడగవచ్చు.

అది నిజమేనని ఒకవేళ ఒప్పుకున్నా, ఈ దేశసేవ వల్ల కూడ అక్కడి ప్రజలు చాలా భయానికి గురవుతున్నారు కదా. చాలా టెర్రర్ కలుగుతున్నది కదా. మరి ఆ టెర్రర్ గురించి ఏం చేద్దాం? అది నాకు అనవసరం అని లా కమిషన్ అనడానికి వీలు లేదు, ఎందుకంటే తాను ఆమోదముద్ర వేస్తున్న కొత్త టాడా చట్టం పోలీసులు, సైనిక బలగాల చేతిలో పెట్టే అధికారం వల్ల ఈ టెర్రర్ పెరుగుతుంది. సాయుధ బలగాలు కలిగించే టెర్రర్‌తో తనకు ప్రమేయం లేదనవచ్చునేమో గానీ తనకు ప్రమేయం ఉన్న విషయాలలో తాను ఇవ్వబోయే సూచనల వల్ల ఆ టెర్రర్ పెరిగే అవకాశం ఉందన్న విషయంతో కూడ తనకు ప్రమేయం లేదంటే ఎట్లా? పైగా దానికి గురయ్యేది దేశ సామాజిక రాజకీయ ప్రధాన స్రవంతికి వెలుపల ఉండే మైనారిటీలు, ఆదివాసీ తెగలు, అణగారిన గ్రామీణ శ్రామికులు అయినప్పుడు రాజ్యాంగ లక్ష్యాలకు లోబడి పని చేయవలసిన లా కమిషన్ ఈ వైఖరి తీసుకోవడం సబబా? సబబే అనుకుంటే టెర్రరిజం నుండి దేశ నాగరికతను కాపాడే సూత్రబద్ధమైన ప్రయత్నమేదో చేస్తున్నామన్న అతిశయం విడిచిపెట్టి మేము నిర్వచించదలచుకున్న టెర్రరిజాన్ని మేము ఎదుర్కొన దలచుకున్న పద్ధతులకు అనుకూలంగా ఒక చట్టం చేసుకుంటున్నామని అంటే కనీసం నిజాయితీ ఉందనయినా ఒప్పుకుంటాం. సమాజంలో భయమే లేకుండా చేయాలనేది గొప్ప ఆదర్శం. కాని ఒక భయానికి మాత్రమే ఆ పేరుపెట్టి దానిని ఎదుర్కొనే

క్రమంలో వేరే భయాన్ని పెంచుతున్నామేమో అన్న స్పృహ లేకుండా విధాన రచన – అది పాలనా విధాన రచన కానీయండి, శాసన విధాన రచన కానీయండి – చేసే విజ్ఞతను మెచ్చుకోవడం కష్టం.

టాడా చట్టం మాత్రమే కాక, లా కమిషన్ కూడ ప్రధాన సామాజిక స్రవంతికి వెలుపల ఉండే టెర్రరిజాన్ని మాత్రమే టెర్రరిజంగా గుర్తిస్తున్నదనీ, తద్వారా ప్రధాన స్రవంతి టెర్రరిజానికి ఆమోదముద్ర వేయకపోయినా పరోక్షంగా 'ఏమంత ప్రమాదకరమైన విషయం కాదు' అనే సర్టిఫికెట్ ఇస్తున్నదనీ అనడానికి ఒక మంచి ఉదాహరణ వర్కింగ్ పేపర్‌లో మత తీవ్రవాదం గురించి లా కమిషన్ చేసిన చర్చ.

'1993లో బొంబాయి పేలుళ్ళతో మొట్టమొదట అంకురించిన మత తీవ్రవాదం ఇప్పటికీ తన ప్రభావం చూపుతూనే ఉంది. 1997లో ఢిల్లీలో 23 పేలుళ్ళు జరిగాయి. హర్యానాలో మూడు, ఉత్తరప్రదేశ్‌లో మూడు జరిగాయి. 1998లో పార్లమెంటు ఎన్నికలకు ముందు బొంబాయిలో మూడు పేలుళ్ళు జరిగాయి. దక్షిణ భారతదేశానికి చెందిన ప్రధాన మత తీవ్రవాద సంస్థ అయిన అల్‌ఉమ్మా ఫిబ్రవరిలో కోయంబత్తూరులో 17 సార్లు బాంబు పేలుళ్ళకు పాల్పడింది' అని లా కమిషన్ పేర్కొంది.

ఇక్కడ మత తీవ్రవాదం అంటే ముస్లిం తీవ్రవాదం మాత్రమే. 1993లో బొంబాయిలో జరిగిన బాంబు పేలుళ్ళకు పూర్వరంగం – బాబ్రీమసీదు కూల్చివేత తర్వాత శివసేన, పోలీసులు ఆ నగరంలోని ముస్లింలపైన జరిపిన మారణకాండ. కాని అదెందుకో 'మత తీవ్రవాదం' అనే శీర్షిక కింద రాలేదు. అలాగే 1998 ఫిబ్రవరిలో కోయంబత్తూరులో అల్‌ఉమ్మా పేల్చిన బాంబులకు పూర్వరంగం – అదే నగరంలో అంతకుముందు హిందు మున్నాని, పోలీసులు ముస్లింలపైన చేసిన భయంకరమైన దాడులు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన మత తీవ్రవాద సంస్థ అల్‌ఉమ్మా మాత్రమేనా? హిందు మున్నాని ఎందుకు కాదు? దేశమంతటా ఉన్న ఏకైక మత తీవ్రవాద సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ కాదా? అదే ప్రధానమైనది ఎందుకు కాదు?

ఇక్కడ స్పష్టం చేయవలసిన విషయం ఏమిటంటే లా కమిషన్ ఛైర్మన్ జీవన్‌రెడ్డిగారు ఆర్‌ఎస్‌ఎస్ సానుభూతిపరుడు కాదు. 'లౌకికవాదం భారత రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం' అన్న తీర్పు ఇచ్చినవాడు ఆయన. అయినప్పటికీ ముస్లిం

మిలిటెంట్లు చేసింది మాత్రమే ఆయనకు తీవ్రవాదంగా కనిపించిందంటే అది ప్రధాన స్రవంతికి వెలుపల ఉన్న మిలిటెన్సీ కావడమే కారణం అయి ఉండాలి. ప్రధాన స్రవంతిలో ఉండే హిందూ టెర్రరిజం అవాంఛనీయమే అయినప్పటికీ దానికి టెర్రరిజం అని పేరు పెట్టవలసిన ఆవశ్యకత గానీ, దాని కోసం ప్రత్యేక శాసన విధానాలు గానీ అక్కరలేదని భావించి ఉండాలి.

ప్రతి సమాజంలోనూ ఒక ప్రధాన స్రవంతి ఉంటుంది. దానిని వర్గం, కులం, జెండర్, మతం, జాతి, భాష మొదలయినవి నిర్వచిస్తాయి. ఆ సమాజ భావజాలంలో అదే 'సమాజం'గా చలామణీ అవుతుంది. ఆ ప్రధాన స్రవంతి వల్ల జరిగే హింస ఆ భావజాలంలో దుస్సహమైనదిగా కనిపించదు. అవాంఛనీయమైనదిగా కనిపించవచ్చు గాక! కాని ఆ హింస 'సమాజం'తో సమానార్థకమైన ప్రధాన స్రవంతికి నష్టం కలిగించదు. నష్టం కలిగించకపోగా దానికి మరింత బలం చేకూర్చవచ్చును కూడ. కానీ ప్రధాన స్రవంతికి ఏదో ఒక కోణం నుండి వ్యతిరేకంగా జరిగే హింస 'సమాజాన్ని' కుదిపేస్తుంది కాబట్టి అది మాత్రం సహించరానిదిగా కనిపిస్తుంది. ఒక హింస ఒకే మోతాదులో ఒకే పద్ధతిలో ప్రయోగించబడినా అది ప్రధాన స్రవంతికి లోపల ఉందా, వెలుపల ఉందా అనేదాన్ని బట్టి మన కళ్ళకు వేరుగా కనిపిస్తుంది.

ఇదంతా ఆ హింసను సమర్థించడం కోసం అంటున్నది కాదు. హింస ఏ మూలం నుండి పుట్టినా దాని వల్ల అనేక హక్కుల సమస్యలు వస్తాయి. ఆ విషయం గుర్తించడానికి నిరాకరించే హక్కుల దృక్పథం హక్కుల దృక్పథమే కాదు. అయితే హింసాకాండను అర్థం చేసుకునేటప్పుడు ప్రధాన స్రవంతి భావజాలంలో పడి కొట్టుకుపోకుండా ఉండడం అవసరం. ఇప్పటిదాకా టెర్రరిజానికి ఉండే నిర్వచనం ఆ భావజాలంతో సన్నిహితంగా ముడిపడి ఉందని లా కమిషన్ గుర్తించలేకపోవడం బాధాకరమే కాక హక్కులకు చాలా నష్టకరం కూడ. అందుకే లా కమిషన్‌కు దావూద్ ఇబ్రహీం కనిపిస్తాడు గానీ బాల్‌థాకరే కనిపించడు, అల్‌ఉమ్మా కనిపిస్తుంది గానీ హిందు మున్నాని కనిపించదు. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి బిల్డింగ్ పేల్చివేత కనిపిస్తుంది గానీ బాబ్రీమసీదు కూల్చివేత కనిపించదు.

ప్రధాన స్రవంతికి వెలుపల నిలబడి ఆ కళ్ళతో సమాజాన్ని చూసినప్పుడు తప్ప టెర్రరిజం అనే దానిని ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలీదు. అయినప్పటికీ ప్రజాస్వామ్యాన్ని భయానికి గురిచేసే చర్యలను, అమాయకుల ప్రాణాలు తీసే చర్యలను,

భయపెట్టి సమాజాన్ని లోబరచుకునే చర్యలను మనం వ్యతిరేకించాలన్నది వేరే విషయం. అయితే టెర్రరిజం అని పిలవబడే దాన్ని అర్థం చేసుకోవాలంటే మాత్రం ఈ దృక్కోణం అవసరం.

టెర్రరిజం అనే భావనలో ఈ దృక్కోణానికి చోటు లేకుండా పోయింది కాబట్టే – కేవలం భయాన్నీ, భీతినీ నిష్పాక్షికంగా నిర్వచిస్తుందనే మార్మికపు పద్ధతిలో ఆ పద ప్రయోగం జరుగుతున్నది కాబట్టే – హక్కుల ఉద్యమం టెర్రరిజం, తీవ్రవాదం అన్న మాటలను ఉపయోగించదు. టెర్రర్ అనేది నిజంగానే అక్కడ ఉందని ఒప్పుకుంటూ కూడ ఆ పదాన్ని మాత్రం ఉపయోగించదు. సందర్భాన్ని బట్టి దానిని రాజకీయ మిలిటెన్సీ అని గానీ సామాజిక మిలిటెన్సీ అని గానీ అంటుంది.

భారతదేశం అనే ప్రధాన స్రవంతి వెలుపల నిలబడి ఈ ఇండియా అనే దానివైపు చూస్తే నాగాలు, కాశ్మీరీలు (ఇండియా నుంచి వేరయిపోవాలని అత్యధిక సంఖ్యలో భావించే ప్రజలు ఈ ఇద్దరే కాబట్టి) తమ పరిస్థితిని ఏ విధంగా అర్థం చేసుకుంటున్నారో గ్రహించగలుగుతాం. 'హిందువులలో పరమత సహనం ఎక్కువ. వారు సహజంగా లౌకికవాదులు' అనే ప్రధాన స్రవంతి భావనకు వెలుపల నిలబడి చూస్తే ముస్లింలు, క్రైస్తవులు మైనారిటీలుగా తమ స్థితిని ఏ విధంగా అర్థం చేసుకుంటున్నారో గ్రహించగలుగుతాం. 'శాంతి భద్రతలు లేనిదే అభివృద్ధి సాధ్యం కాదు' అనే ప్రధాన స్రవంతి భావనకు వెలుపల నిలబడి చూస్తే నక్సలైట్లకు ఆశ్రయం ఇచ్చే గ్రామీణ పేదలు 'అభివృద్ధి'నీ, 'అన్న'లనూ ఏ విధంగా చూస్తారో గ్రహించగలుగుతాం.

అప్పుడు సామాజిక రాజకీయ మిలిటెన్సీకి తొందరపడి ఒట్టి భయోత్పాతం అని పేరు పెట్టకుండా ఉండగలుగుతాం. దానిని ఒట్టి హింసగానూ సంఘవిద్రోహం గానూ కాక ప్రజా జీవితంలోని కొన్ని న్యాయమైన ఆకాంక్షలకు ఒకానొక వ్యక్తీకరణగా గుర్తించగలుగుతాం. దానిని ఎదుర్కోవడానికి ప్రత్యేకమైన నిర్బంధ చట్టాలు చేయడం వల్ల జరగగల అన్యాయాన్ని గ్రహించగలుగుతాం. లా కమిషన్ వర్కింగ్ పేపర్‌లో ఈ స్పృహ లేశమంత కూడ లేకపోవడం చాలా బాధాకరం.

## కొత్త బిల్లులోని అంశాలు

కొత్త బిల్లులోని అంశాలు చాలావరకు పాతవే కాబట్టి వీటి గురించి క్లుప్తంగా మాట్లాడుకుంటే సరిపోతుంది.

టాడాలో మాటల మాయాజాలం చాలా ఉంది. 'టెర్రరిజం' అనగానే మన కళ్ళకు కొన్ని భయంకరమైన దృశ్యాలు కనిపిస్తాయి. చట్టం వాటి గురించే మాట్లాడుతున్నదనీ, వాటిని నివారించే ఉపాయాలనే అన్వేషిస్తున్నదనీ అనుకుంటాం. అందువల్ల ఆ చట్టానికి సులభంగా ఆమోదం ఇచ్చేస్తాం. ఎవరైనా వ్యతిరేకిస్తే కోపగించుకుంటాం కూడ.

ఆ దృశ్యాలేమిటంటే బస్సులో బాంబులు పెట్టి బస్సుతోపాటు ప్రయాణీకులను పేల్చి చంపిన ఘటనలు, క్రిక్కిరిసిన బజారులో ఎకె 47తో కాల్పులు జరిపి జనాన్ని వధించిన ఘటనలు, రైలు పట్టాల మీద బాంబు పెట్టి వందలాది ప్రయాణీకులను వధించిన ఘటనలు, బస్సు ఆపి ఒక మతానికి చెందిన వారిని మాత్రం దింపి కాల్చి చంపిన ఘటనలు మొదలయినవి. వీటిని మనం సహజంగానే – చాలా న్యాయంగానే – అసహ్యించుకుంటాం. ఇతర ఘోరమైనవి కాని ఘటనలు కూడ అనేకం మిలిటెంట్ల చేతిలో జరుగుతుంటాయి. బలవంతంగా అపహరించి తీసుకుపోయి డబ్బులు వసూలు చేసుకోవడం, లేదా తమ నిర్ణయాలకు తల ఒగ్గేలాగ చేయడం, బెదిరించి, భయపెట్టి తమ మాట సాగించుకునే చర్యలకు పాల్పడడం – ఇవన్నీ మిలిటెన్సీ ప్రభావం ఉన్న ప్రాంతాలలో తరచూ జరిగే ఘటనలే. అన్యాయాన్నీ అణచివేతనూ ఎదుర్కోవడానికి హింసను ప్రయోగించడంలో సూత్రప్రాయంగా తప్పు లేదని ఒప్పుకునేవారు కూడ ఇటువంటి చర్యలను ఆమోదించకపోవచ్చు. వాటిలోని 'టెర్రర్' మోతాదును బట్టి తీవ్రంగా వ్యతిరేకించవచ్చును కూడ.

టాడా చట్టం – ఈ కొత్త బిల్లు – ఒకవేళ ఇటువంటి చర్యలనే టెర్రరిజంగా నిర్వచించి ఉన్నా వీటిని ఎదుర్కొనడానికి సాధారణ నేరస్మృతి పనికిరాదన్న వాదనను ఒప్పుకోనవసరం లేదు, అప్రజాస్వామికమైన అసాధారణ నేరస్మృతిని ప్రవేశపెట్టడాన్ని సమర్థించనక్కరలేదు. ఆ విషయం తరువాత చూద్దాం గానీ మొట్టమొదట గుర్తించవలసింది ఏమిటంటే ఈ బిల్లు (పాత టాడా లాగే) నిర్వచించే 'టెర్రరిజం' పైన వివరించిన అభ్యంతరకరమైన చర్యలకు పరిమితం కాదు.

మరి టెర్రరిస్టు చర్య అంటే ఏమిటి? బాంబులు, తుపాకుల వంటి ఆయుధాలతో 1. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే చర్యలకు, లేదా 2. ప్రజలలో ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురి చేసే చర్యలకు, లేదా 3. భిన్న ప్రజా వర్గాల మధ్య సామరస్యాన్ని

భగ్నం చేసే చర్యలకు, లేదా 4. చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని లోబరుచుకునే చర్యలకు పాల్పడితే అది టెర్రరిస్టు చర్య అవుతుంది.

పైన ఉదహరించిన అభ్యంతరకరమైన చర్యలను దాటి ఈ నిర్వచనం చాలా దూరం పోయిందని చదవగానే స్పష్టం అవుతుంది. ఆ చర్యలు మన కళ్ళముందు నిలబెట్టే చిత్రాన్ని ఆసరా చేసుకొని మన ఆమోదం పొందే ఈ చట్టం, ఆ చిత్రంతో ఏ మాత్రం సంబంధం లేని అనేక చర్యలను తన పరిధిలోకి తెచ్చుకునింది. సాధారణ సామాజిక చైతన్యం 'టెర్రరిజం' పట్ల అభ్యంతరం చెప్పేది అందులోని విచ్చలవిడి హింసకూ, రక్తపాతానికీ, భయానికీ కాగా ఈ చట్టం మాత్రం సామాజిక రాజకీయ మిలిటెన్సీని మొత్తంగానే 'టెర్రరిజం' అంటుంది. అటువంటి మిలిటెన్సీ అంతా ఆమోదనీయం కాకపోవచ్చును. వాంఛనీయం కాకపోవచ్చు. అయినప్పటికీ ఆ అభ్యంతరానికీ, విచ్చలవిడి రక్తపాతం పట్ల మనకుండే అభ్యంతరానికీ మధ్య మౌలికమైన తేడా ఉంది. రెండవ దానిని కారణంగా చూపించి మొదటి దానిని అతి క్రూరంగా అణచివేయాలని చూసే చట్టం టాడా.

చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఆయుధాల ప్రయోగంతో లోబరుచుకోవడం అనేది స్పష్టంగా రాజకీయ మిలిటెన్సీని సూచించే చర్య. ధనవంతులు, బలవంతులు కూడ తుపాకులు, బాంబులు పెట్టుకొని ప్రభుత్వాన్ని లోబరుచుకొని సమాంతర ప్రభుత్వాలు నడుపుతుంటారు. మన రాయలసీమ జిల్లాలు, బీహార్, తూర్పు యు.పి ప్రాంతాలు దీనికి పేరుపడ్డాయి. ఈ బలవంతపు లోబరుచుకోవడం పైన టాడా చట్టాన్ని ఎప్పుడూ ప్రయోగించలేదు గానీ వేరే లక్ష్యంతో, వేరే సామాజిక పునాదితో ఇదే పని చేసే నక్సలైట్ల పైన మాత్రం దేశవ్యాప్తంగా టాడా చట్టాన్ని పెద్దఎత్తునే ప్రయోగించారు. మొత్తంగా నక్సలైట్ రాజకీయాలను టెర్రరిజం కిందికి తీసుకురావడానికి ఆ చట్టంలో టెర్రరిస్టు చర్యకు ఇచ్చిన ఈ నిర్వచనం పనికొచ్చింది. నక్సలైట్ ఉద్యమకారులు కొన్ని సందర్భాలలో భయోత్పాతం కలిగించే చర్యలకూ, విచ్చలవిడి హింసకూ పాల్పడిన మాట వాస్తవమే గానీ 'ప్రభుత్వాన్ని ఆయుధాల ప్రయోగంతో లోబరుచుకునే' లక్ష్యం వాళ్ళకుందని చెప్పి వారు చేసే ప్రతి హింసాత్మక చర్యనూ టెర్రరిస్టు చర్యల జాబితాలో చేర్చడం అర్థరహితం. విచ్చలవిడి భయోత్పాతం సామాన్య ప్రజలలో కలిగించే ఏవగింపును ఆసరా చేసుకొని, దానిని సూచించే టెర్రరిజం

అనే మాటకు అక్కడికి పరిమితం కాని విస్తృతమైన అర్థమిచ్చి, మిలిటెంట్ రాజకీయాలను మొత్తంగానే టెర్రరిజం అనే ప్రత్యేక నేరాల కోవలోకి చేర్చి, దానిని సహజ న్యాయసూత్రాల వాసన సహితం లేని నేర విచారణ వ్యవస్థ కోరల్లోకి నెట్టి అణచివేయడం టాడా లక్ష్యం.

నాగా, కాశ్మీరీ తదితర ప్రజల స్వేచ్ఛాకాంక్షకు కూడ ఇదే గతి పడుతుంది. ఆ స్వేచ్ఛాకాంక్ష ప్రాతిపదికన నడిచే మిలిటెంట్ ఉద్యమాలు కూడ ఆయుధాల ప్రయోగంతో ప్రభుత్వాన్ని లొంగదీసుకునే ప్రయత్నం చేస్తాయి – ప్లెబిసైట్ నిర్వహించమనో, దేశం నుండి బయటికి వెళ్ళిపోనిమ్మనో – కాబట్టి ఆ ఉద్యమాల వల్ల జరిగే ప్రతి ఒక్క హింసాత్మక చర్యా టెర్రరిస్టు చర్యే అవుతుంది. కేవలం హిందువులను లేక సిక్కులను ఏరి చంపిన ఘటనల వంటివి మాత్రమే కాదు.

టెర్రరిస్టు చర్య నిర్వచనంలోని ఇతర అంశాల స్వభావం కూడ ఇటువంటిదే.

'ప్రజలలో ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడం, లేక భిన్న ప్రజావర్గాల మధ్య సామరస్యాన్ని భగ్నం చేయడం' అనేవి కూడ కొన్ని సందర్భాలలో అభ్యంతరకరమైన చర్యలు కావచ్చు, కొన్ని సందర్భాలలో సామాజిక పోరాటాలలో భాగంగా తలెత్తే పరిస్థితులు కావచ్చు. అన్నిటినీ కలిపేసి ఆయుధ ప్రయోగంతో అనే మాటను ముందు చేర్చడం వల్ల కలిగే ఫలితమేమిటంటే సామాజిక మిలిటెన్సీ మొత్తంగా టెర్రరిజం కిందికి వచ్చేస్తుంది. నిజానికి ఈ నిర్వచనం కింద భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలపైన అనేక టాడా కేసులు పెట్టి ఉండవచ్చు. కాని అదేమీ జరగలేదు. బాబ్రీమసీదు కూల్చివేత తరువాత ముస్లిం యువతలో పొడసూపిన బీజప్రాయమైన మిలిటెంట్ పోకడలు మాత్రం మొత్తంగా టాడా కిందకి వచ్చేశాయి. చివరికి లా కమిషన్ వర్కింగ్ పేపర్ కూడ దీనికే 'మత తీవ్రవాదం' అన్న పేరు పెట్టింది. టాడాను బొంబాయి నగరంలోనూ గుజరాత్ రాష్ట్రంలోనూ ముస్లింలపైన పెద్దఎత్తున ప్రయోగించడమే చివరికి ఆ చట్టం చావుకు వచ్చింది. ముస్లింల నిరసన మిలిటెంట్ రూపం తీసుకోవడం వాంఛనీయమా కాదా అన్నదిక్కడ ప్రశ్న కాదు. కోయంబత్తూరు, త్రిస్సూర్‌లలో బస్సులలో బాంబులు పెట్టి సాధారణ ప్రయాణీకులను చంపిన ఘటనలు ఎట్టి పరిస్థితిలోనూ ఖండించవలసినవే. అయితే అంతకుముందు అదే కోయంబత్తూరులో ముస్లింలపైన హిందుత్వవాద సంస్థలు, పోలీసులు కలిసి చేసిన దాడులకు చట్టము,

సమాజము అంతే వ్యతిరేకతతో స్పందించకపోవడం అభ్యంతరకరం కాగా, మొత్తంగానే ముస్లిం మిలిటెన్సీని టెర్రరిజం అనడం – అందుకు తగినట్టుగా టెర్రరిస్టు చర్యను చట్టంలో నిర్వచించడం – మరీ అభ్యంతరకరం.

టాడాలో ఈ లోపం అంతర్లీనంగానే ఉండగా, అది దుర్వినియోగం పేరిట చర్చకు వచ్చింది. పోలీసులు ఆ చట్టాన్ని ముస్లింలకు వ్యతిరేకంగా దుర్వినియోగం చేశారన్న అభియోగం తీవ్రస్థాయిలో వచ్చింది. పార్లమెంటులో బిజెపిని మినహాయించి తక్కిన అన్ని పార్టీలూ ఆ అభియోగం సహేతుకమేనని ఒప్పుకొని 1995లో ఆ చట్టాన్ని ఇంక పొడిగించవద్దని నిర్ణయించుకున్నాయి. దేశవ్యాప్తంగా పోలీసు ప్రముఖులు చాలామంది దీని పట్ల బహిరంగంగానే తమ నిరసన తెలిపారు. రాజకీయ నాయకుల ఓట్ల బలహీనత వల్ల సమాజానికి అత్యవసరమైన ఆ చట్టం లేకుండా పోయిందని వాపోయిన వారిలో మన రాష్ట్రానికి చెందిన అరవిందరావు వంటి పోలీస్ ఆఫీసర్లు కూడ ఉన్నారు.

అయితే కేంద్ర ప్రభుత్వం టాడాను పూర్తిగా వదిలేసుకోవాలనేం అనుకోలేదు. పార్లమెంటు టాడాను ఇంక పొడిగించవద్దని నిర్ణయం తీసుకున్న వెంటనే, కొన్ని మార్పులతో అదే చట్టాన్ని ప్రభుత్వం 'క్రిమినల్ లా అమెండ్‌మెంట్ బిల్లు' పేరిట తిరిగి రూపొందించింది. అప్పటి నుండి కేంద్రంలో ప్రభుత్వాలు అస్థిరంగా ఉండడం వల్లనేమో దానిని చట్టం చేసే ప్రయత్నం అంతకంటే ముందుకు పోలేదు. చివరికి 1999లో కేంద్రప్రభుత్వం ఆ బిల్లులో మరికొన్ని సవరణలు చేసి, టాడా పైన వచ్చిన విమర్శలను, సుప్రీంకోర్టు వివిధ తీర్పులలో సూచించిన జాగ్రత్తలను దృష్టిలో ఉంచుకొని బిల్లుని పరిశీలించి తుదిరూపం ఇవ్వడానికి తగిన సూచనలిమ్మని లా కమిషన్‌కు అప్పగించింది. లా కమిషన్ కొన్ని మార్పులతో దానికి తన ఆమోదముద్ర వేసి, తన ఆమోదాన్ని వివరించే 'వర్కింగ్ పేపర్' నొకదాన్ని జతచేసి వెనక్కి పంపించింది.

ఇక్కడ ముఖ్యంగా చెప్పాల్సిన విషయం ఏమిటంటే ప్రజాభిప్రాయంలో వ్యక్తమయిన విమర్శకు వెరచి ఏ కొన్ని మార్పులనయితే కేంద్రప్రభుత్వం బిల్లు తయారుచేసినప్పుడు, ఆ తరువాత దానిని సవరించినప్పుడు ప్రవేశపెట్టిందో, ఆ మార్పులన్నీ అనవసరం అని చెప్పి లా కమిషన్ తొలినాడు టాడాలో ఉన్న అంశాలనే తిరిగి ప్రవేశపెట్టింది. ఇందులో బహుశా అన్నిటికంటే ముఖ్యమైనది టెర్రరిస్టు చర్య నిర్వచనంలో ప్రభుత్వం చేయ తలపెట్టిన మార్పు.

చట్టబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఆయుధాల బలప్రయోగంతో లోబరుచుకోవడం అనే చర్యను టెర్రరిస్టు చర్య నిర్వచనం నుండి తీసేసి కేవలం ప్రజలను లేదా 'ప్రజలలో ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడం, భిన్న ప్రజావర్గాల మధ్య సామరస్యాన్ని భగ్నం చేయడం' అనే లక్ష్యాలు గల సాయుధ చర్యలకు; దేశ సమగ్రతను, భద్రతను, సార్వభౌమత్వాన్ని భగ్నం చేసే చర్యలకు టెర్రరిస్టు చర్య అన్న ప్రయోగాన్ని పరిమితం చేయాలని ప్రభుత్వం 1995లో తాను తయారుచేసిన బిల్లులో ప్రతిపాదించింది. దీని వల్ల కనీసం కొన్ని మిలిటెంట్ ఉద్యమాలపైనయినా 'టెర్రరిస్టు' ముద్ర భారం కొంత తగ్గేది. నక్సలైట్ ఉద్యమమయితే చాలావరకు ఆ నిర్వచనం నుండి పక్కకు పోయేది.

1999లో బిల్లును సవరించినప్పుడు కేంద్రప్రభుత్వం ఈ నిర్వచనాన్ని ఇంకొంచెం సడలించాలని ప్రయత్నం చేసింది. ప్రజలలో భిన్నవర్గాల మధ్య సామరస్యాన్ని భగ్నం చేసే సాయుధ చర్యలను కూడ టెర్రరిస్టు నిర్వచనం నుండి తీసేయాలని ప్రతిపాదించింది. దేశ ప్రజలలో ఏదైనా వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసే సాయుధ చర్యలు మాత్రమే టెర్రరిస్టు చర్యలుగా పరిగణింపబడాలని ప్రభుత్వం చేసిన సవరణ సూచించింది.

అయితే లా కమిషన్ 1995లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన బిల్లులోని సడలింపును, 1999లో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన రెండవ విడత సడలింపును కూడ తిరస్కరించింది. తీసేసిన రెండు అంశాలనూ తిరిగి చేర్చింది. దేశసమగ్రత వగైరాలను భగ్నంచేసే సాయుధ చర్యలు అనేవి 1995 బిల్లులో ప్రభుత్వమే చేసిన చేర్పు కాబట్టి ఇప్పుడు లా కమిషన్ ఆమోదముద్ర వేసిన కొత్త టాడా బిల్లులో టెర్రరిస్టు చర్యకు పాత టాడా చట్టంలో కంటే కఠినమైన నిర్వచనం ఉంది!

హక్కుల విషయంలో రాజకీయ పార్టీలనూ ప్రభుత్వ అధికారులనూ నమ్మకోలేము గానీ న్యాయమూర్తులనూ న్యాయస్థానాలనూ నమ్మకోవచ్చుననుకునే వారు చాలామంది ఉన్నారు కాబట్టి టాడా చరిత్ర వారికి కనువిప్పు కాగలదనుకుంటాము. 1995లో పార్లమెంటులోని అన్ని పార్టీలూ (ఒక్క బిజెపిని మినహాయించి) టాడాను ఇక పొడిగించవద్దని నిర్ణయించుకున్నాయని పైన చెప్పాము. అది అణచివేత స్వభావంగల చట్టం అన్న అభిప్రాయానికి వచ్చి ఈ నిర్ణయం తీసుకున్నాయి. అయితే అప్పటికి సరిగ్గా ఒక్క సంవత్సరం ముందు జస్టిస్ రత్నవేల్ పాండ్యన్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం టాడాలోని ఒక్కొక్క సెక్షన్‌ను వివరంగా చర్చించి ఒక్క చిన్న

విషయం మినహా తక్కినదంతా రాజ్యాంగబద్ధమేనని తీర్పు ఇచ్చింది! దాని అణచివేత స్వభావాన్ని గుర్తించి దానిని పొడిగించకూడదని నిర్ణయించుకోవడం రాజకీయ పార్టీల వంతయింది.

1995లో కొత్త టాడా బిల్లును తయారుచేసిన కేంద్ర ప్రభుత్వ అధికారులు టెర్రరిస్టు చర్య నిర్వచనాన్ని కొంత సడలించాలని చూశారు. తిరిగి 1999లో ప్రభుత్వ అధికారులే దానిని మరికొంత సడలించి లా కమిషన్‌కు అప్పగించారు. కానీ రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన జీవన్‌రెడ్డిగారి నేతృత్వంలోని లా కమిషన్ ఈ సడలింపులేవీ అక్కరలేదనింది. ఈ అభిప్రాయానికి లా కమిషన్ కారణాలు కూడ చెప్పలేదు. 'పాత టాడా చట్టంలో ఉన్నాయి కదా. ఇప్పుడెందుకు తీసేయాలి?' అంది. పాత టాడా చట్టం మీద వచ్చిన విమర్శ వల్లనే తీసేయవలసి వచ్చిందని గుర్తించలేని లా కమిషన్‌ను ఏమనాలి?

టాడాలాగే ఈ కొత్త బిల్లు కూడ టెర్రరిస్టు చర్య, విచ్ఛిన్నకర కార్యకలాపం అనే రెండు నేరాలను నిర్వచించింది. ఇందులో మొదటి దాని సంగతి పైన చూశాం. అది రాజకీయ సామాజిక మిలిటెన్సీని ఒక ప్రత్యేక నేరంగా – టెర్రరిజం అనే భయంకరమైన నేరంగా – నిర్వచిస్తుందని అభ్యంతరం తెలిపాము. విచ్ఛిన్నకర కార్యకలాపం అనేది అంతకంటే అభ్యంతరకరమైన నేర నిర్వచనం. ఇక్కడ హింసాత్మక చర్యల ప్రస్తావన సహితం లేదు. కేవలం రాజకీయ సామాజిక అభిప్రాయాల వ్యక్తీకరణనే అది నేరంగా నిర్వచిస్తుంది. దానికి యావజ్జీవ కారాగారం విధించాలంటుంది. పాత టాడా చట్టంలో విచ్ఛిన్నకర కార్యకలాపం నిర్వచనం ఈ విధంగా ఉండింది.

*భారతదేశ సమగ్రతనూ, సార్వభౌమత్వాన్నీ ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ ప్రశ్నించే ఉద్దేశ్యంతో లేక విచ్ఛిన్నం చేసే ఉద్దేశ్యంతో లేక దేశంలోని ఏదైనా ఒక భాగం దేశం నుండి వేరయే ప్రయత్నానికి గానీ, ఆ లక్ష్యానికి గానీ ప్రత్యక్షంగా లేక పరోక్షంగా సహకరించే ఉద్దేశ్యంతో చేతల ద్వారా గానీ, మాటల ద్వారా గానీ, వేరే ఏ ఇతర మాధ్యమం ద్వారా గానీ పాల్పడే చర్య.*

ఇక్కడ హింస ప్రస్తావన లేదు, ఆయుధాల ప్రస్తావన లేదు, భయోత్పాతం ప్రస్తావన లేదు. ఇది వట్టి అభిప్రాయాలపైన దాడి. ఇటువంటి విచ్ఛిన్నకర కార్యకలాపానికి పాల్పడినా లేక సహకరించినా, ప్రోత్సహించినా, సలహా ఇచ్చినా, కుట్రచేసినా, ఈ పనులలో ఏ ఒక్కటయినా చేయడానికి ప్రయత్నించినా జీవితఖైదు వేయాలని పాత

టాడా అనింది. ఫలితంగా కాశ్మీర్, నాగాలాండ్, అస్సాం, పంజాబు రాష్ట్రాలలో (తమిళనాడులో కూడ) వేలాదిమంది తమ భూభాగం ఇండియాలో భాగం కాదని రాసినందుకు, ఉపన్యాసాలు ఇచ్చినందుకు, కవితలు రాసినందుకు, పాటలు పాడినందుకు ఈ సెక్షన్ కింద జైలుపాలయ్యారు.

1995లో కేంద్రప్రభుత్వం రూపొందించిన కొత్త టాడా బిల్లులో కూడ ఈ సెక్షన్ ఇట్లానే ఉంది. అయితే 1999లో దాన్ని లా కమిషన్‌కు అప్పగించే ముందు కేంద్ర ప్రభుత్వం సారాంశంలో దాన్ని అట్లాగే ఉంచుతూ, చేతల ద్వారాగానీ మాటల ద్వారాగానీ వేరే ఏ ఇతర మాధ్యమం ద్వారాగానీ అన్న మాటలను మాత్రం తొలగించింది. దీని వల్ల సారాంశంలో పెద్దగా తేడా రాకపోవచ్చును. ఎందుకంటే ఫలానా లక్ష్యంతో పాల్పడే చర్య విచ్ఛిన్నకర కార్యకలాపం అవుతుందని అన్న తరువాత ఆ చర్య మాటల రూపంలో ఉన్నా, చేతల రూపంలో ఉన్నా, వేరే ఏ మాధ్యమం రూపంలో ఉన్నా అని వివరించడం పునరుక్తి మాత్రమే కాగలదు. అయితే ఆ వివరణ లేనట్టయితే ఉదార స్వభావం గల జడ్జి ఎవరైనా చర్య అన్నప్పుడు కవితలు, కార్టూన్లు దాని కిందికి రావనీ, శాసనకర్తల ఉద్దేశ్యం అది అయి ఉండదనీ వ్యాఖ్యానించే ప్రమాదం ఉంది కాబట్టి ఈ వివరణ తీసేయడం కోర్టులలో లేనిపోని గందరగోళానికి దారితీయగలదు అని లా కమిషన్ అభ్యంతరం తెలిపి ఆ సెక్షన్‌ను పాత రూపంలోనే ఉండనిమ్మని అనింది. కాబట్టి రేపు ఏ కాశ్మీరీ కవో, నాగా కళాకారుడో కొత్త టాడా కింద జైలుకు పోయినట్టయితే అది జీవన్‌రెడ్డిగారి నేతృత్వంలోని లా కమిషన్ చలవ వల్లే అవుతుంది.

ఇదంతా కొత్త టాడా బిల్లులోని నేర నిర్వచనానికి సంబంధించినది.

## నేర విచారణ పద్ధతి

ఇక నేర విచారణ పద్ధతి దగ్గరకు వస్తే అప్రజాస్వామికంగా నిర్వచించిన నేరాలను అన్యాయంగా విచారించడం టాడా స్వభావం. ఇక్కడ స్పష్టం చేయవలసిన విషయం ఏమిటంటే ఒకవేళ నేర నిర్వచనం న్యాయంగానే ఉన్నా నేర విచారణ పద్ధతి అప్రజాస్వామికంగా ఉంటే వ్యతిరేకించవలసిందే. సామాజిక రాజకీయ మిలిటెన్సీని మొత్తంగానే టెర్రరిజం అని నిర్వచించకుండా కేవలం భయానకమైన, హేయమైన హింసాత్మక చర్యలను మాత్రమే టెర్రరిజంగా నిర్వచించి ఉన్నా దానిని విచారించే

పద్ధతి అప్రజాస్వామికంగా ఉంటే ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించేవారే. ఇది భయోత్పాతం మీద ప్రేమ కొద్దీ కాదు, న్యాయవ్యవస్థ నిజంగా న్యాయంగా ఉండాలన్న ఆరాటం కొద్దీ. నేర విచారణ వ్యవస్థ అప్రజాస్వామికంగా ఉంటే నిజంగా నేరానికి పాల్పడిన వారిని మాత్రమే శిక్షిస్తుందా లేక అమాయకులను శిక్షిస్తుందా అనేది సందేహాస్పదం కాబట్టి ఎంత హేయమైన నేరాలయినా సహజ న్యాయసూత్రాలకు అనుగుణంగా మాత్రమే విచారించాలని హక్కుల ఉద్యమం అంటుంది. టాడాలోని నేరనిర్వచనం అన్యాయంగా ఉందన్న విషయం అటుంచి నేర విచారణ పద్ధతి కూడ చాలా అప్రజాస్వామికంగా ఉందనేది ఆ చట్టంపైన హక్కుల సంఘాల విమర్శ.

మానవ హక్కుల కోణం నుండి వచ్చిన ఈ విమర్శను దృష్టిలో పెట్టుకొని కొత్త టాడా బిల్లుకు మానవీయమైన హంగులు (హ్యూమన్ ఫేస్ అన్న ఆంగ్ల ప్రయోగానికి ఇంతకంటే సందర్భోచితమైన అనువాదం కనిపించడం లేదు) చేర్చామని లా కమిషన్ అంటుంది. ఇది ఎంత సత్యమో చూద్దాం.

1. పాత టాడా చట్టం కింద బెయిలు రావడం చాలా కష్టం. ముద్దాయి నేరం చేయలేదనీ, వదిలిపెడితే మళ్ళీ నేరం చేయడనీ కోర్టు నమ్మితేనే బెయిలు ఇవ్వాలి. కొత్త టాడా బిల్లులో రెండవ నియమాన్ని తీసేసి మొదటిది ఉంచారు. అంటే నిర్దోషి అని నమ్మితేనే ముద్దాయికి బెయిలు ఇవ్వాలి. బెయిలును అసాధ్యం చేయడానికి ఇది చాలును కాబట్టి రెండవ నియమం తీసేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు.

2. అరెస్టు చేసిన ముద్దాయిని పోలీసులు రిమాండు కోసం జ్యుడీషియల్ మేజిస్ట్రేటు దగ్గర కాక మండల రెవెన్యూ ఆఫీసర్ వంటి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ దగ్గర హాజరు పెట్టవచ్చునన్న పాత టాడా చట్టంలోని నియమాన్ని కొత్త టాడా బిల్లులో తీసేశారు.

3. మామూలు నేరాలలో రిమాండు గడువు 15 రోజులు కాగా పాత టాడా చట్టంలో 60 రోజులు. కొత్త టాడా బిల్లులో 30 రోజులు. పాత టాడాలో రిమాండును ఏడాది దాకా పొడిగించే అవకాశం ఉంటే కొత్త బిల్లులో దాన్ని 6 నెలలకు తగ్గించారు.

4. పాత టాడా చట్టంలో ముందస్తు బెయిలు లేదు. కొత్తదానిలోనూ లేదు.

5. పాత టాడా చట్టంలో నేర విచారణ బహిరంగంగా జరపనక్కరలేదు. రహస్యంగా (జైలు లోపల కూడా) జరపవచ్చు. కొత్త బిల్లులోనూ అంతే.

6. 'దుర్వినియోగాన్ని' నివారించడానికి పాత టాడా చట్టంలో ఎస్.పి అనుమతి లేకుండా టాడా కింద ఎఫ్ఐఆర్ బుక్ చేయడానికి వీలులేదని, ఐ.జి అనుమతి లేకుండా కోర్టు విచారణ చేపట్టడానికి వీలులేదని నియమం ఉండింది. కొత్త టాడా బిల్లులో ఎస్.పి స్థానంలో రాష్ట్ర డిజిపిని పెట్టారు. అంటే డిజిపి అనుమతి లేకుండా టాడా చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీలులేదని అర్థం. ఇది వ్యక్తిగత స్థాయిలో ఒక ఎస్ఐ చేసే దుర్వినియోగాన్ని ఆపుతుందేమో (డిజిపిలు నిజాయితీగా తమకిచ్చిన అధికారాన్ని వినియోగించినట్టయితే) కాని ప్రభుత్వం (లేక పోలీసు వ్యవస్థ) ఒక విధానంగా టాడా కిందికి తీసుకురావాలని నిర్ణయించుకున్న రాజకీయ ఉద్యమాలకు గానీ సామాజిక ఆందోళనలకు గానీ ఇదేమీ రక్షణ ఇవ్వదు. అయినా ఇది పూర్తిగా కొత్త విషయం కాదు. పాత టాడాలో చార్జిషీటుకు ఐ.జి అనుమతి కావాలి, కొత్త దానిలో ఎఫ్ఐఆర్‌కే కావాలి. అంతే తేడా.

7. పాత టాడాలో కేసు విచారణ మధ్యంతర దశలో ఎటువంటి అప్పీల్‌గానీ రివిజన్‌గానీ ఉండదు. అంతిమ తీర్పు మీద మాత్రమే ఉంటుంది, అది కూడ సుప్రీంకోర్టుకే తప్ప హైకోర్టుకు కాదు. కొత్త బిల్లులోనూ అంతే.

8. పాత టాడా చట్టంలో కొన్ని పరిస్థితులలో నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయి పైననే ఉంటుంది. కొత్త బిల్లులోనూ అంతే.

9. పాత టాడా చట్టంలో ముద్దాయి పోలీస్ కస్టడీలో ఉండగా ఎస్.పి ర్యాంకు పోలీస్ అధికారికి ఇచ్చే ఒప్పుకోలు కోర్టులో సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుంది. కొత్త బిల్లులోనూ అంతే. అయితే ముద్దాయికి బలవంతపు ఒప్పుకోలు నుండి రక్షణ కల్పించడం కోసమని చెప్పి కొత్త బిల్లులో ఒక జాగ్రత్తను చేర్చారు. ముద్దాయి ఒప్పుకోలును నమోదు చేసిన వెంటనే ఆ పోలీస్ అధికారి ఒప్పుకోలు పత్రంతో సహా ముద్దాయిని కూడా చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దగ్గరకు పంపించాలి. ముద్దాయి ఆ న్యాయాధికారికి ఏం చెప్పినా దానిని ఆ అధికారి నమోదు చేసుకోవాలి.

దీని లక్ష్యమేమిటంటే ఒకవేళ బలవంతంగా ఒప్పుకోలు తీసుకొని ఉంటే ఆ విషయాన్ని ముద్దాయి అప్పటికప్పుడే చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు చెప్పుకునే అవకాశం ఉండాలని. అయితే పోలీస్ కస్టడీ నుంచి న్యాయాధికారి దగ్గరకు పోయి తన గోడు స్వేచ్ఛగా చెప్పుకోగలగాలంటే అక్కడి నుండి తిరిగి పోలీస్ కస్టడీకి పోనన్న నమ్మకం ముద్దాయికి ఉండాలి. చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేటు ముద్దాయి చెప్పినది

రాసుకున్న తరువాత తప్పనిసరిగా ముద్దాయిని జైలుకు పంపించాలి. తిరిగి ముద్దాయిని ఆ కేసు ముగిసేవరకు పోలీస్ కస్టడీకి ఇయ్యకూడదన్న నియమం ఉండాలి. ఈ నియమం చేర్చకపోతే ముద్దాయి ఆ న్యాయాధికారి దగ్గర నిజం చెప్పుకోవడం అసాధ్యం. కొత్త బిల్లులో అటువంటి నియమమేదీ లేదు. అటువంటప్పుడు ఈ 'రక్షణ' నిజమైన రక్షణనియ్యకపోగా నష్టం చేయవచ్చును కూడ. ఒప్పుకోలు ఇయ్యగానే చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ దగ్గర హాజరు పెట్టినప్పుడు 'అది బలవంతం ఒప్పుకోలు' అని ఫిర్యాదు చేసుకోని ముద్దాయి ఆ తరువాత కేసు విచారణప్పుడు ఆ మాట అంటే 'నీకు మొట్టమొదట అవకాశం ఇచ్చినప్పుడు ఈ సంగతి చెప్పలేదు కాబట్టి ఇప్పుడు చెప్తే నమ్మలేం' అని కోర్టు అనవచ్చు.

10. మామూలు నేరస్మృతిలో చార్జిషీటుతోబాటే ముద్దాయికి సాక్షులందరి పేర్లు, వివరాలు తెలియజేస్తారు. వాళ్ళు ఏ విషయాన్ని గురించి వాంగ్మూలం ఇవ్వబోతారో చెప్తారు. ముద్దాయి తన 'డిఫెన్స్' తయారు చేసుకోవడానికి ఇది అత్యవసరం. పాత టాడా చట్టంలో చార్జిషీటుతోబాటు ముద్దాయికి సాక్షుల పేర్లుగానీ చిరునామాగానీ చెప్పనక్కరలేదన్న నియమం ఉండింది. సాక్షి బోను ఎక్కేంతవరకు అతను లేదా ఆమె పేరు, చెప్పబోయే సాక్ష్యం ముద్దాయికి తెలియవు. కొత్త బిల్లులోనూ ప్రభుత్వం అదే అంశాన్ని చేర్చింది. అయితే లా కమిషన్ దీనిని మరింత దిగజార్చుతూ, బోను ఎక్కిన తరువాత కూడ సాక్షి పేరు, చిరునామా, రూపురేఖలు సహితం ముద్దాయికి తెలియజేయనక్కరలేదని, ఒక స్క్రీన్ అడ్డంపెట్టి 'ఆకాశరామన్న' సాక్ష్యం నమోదు చేయవచ్చునన్న సవరణ చేర్చింది. ఇది అమలయితే టాడాలో మిగిలి ఉన్న ఆఖరి సహజ న్యాయసూత్రం కూడ లేకుండా పోతుంది. పోలీసులు ఏదైనా అభియోగం పెట్టి ఎవరో ఒకరిని పేరు చెప్పకుండా, ఊరు చెప్పకుండా బోనెక్కించి ముఖం కనబడకుండా సాక్ష్యం చెప్పించి ముద్దాయికి క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశం లేకుండా చేసేసి కేసును 'రుజువు' చేసేయవచ్చును. కేంద్ర హోంశాఖకు కూడ రాని ఈ ఆలోచన లా కమిషన్‌కు రావడం విశేషం!

లా కమిషన్ చొరవ తీసుకుని ప్రతిపాదిత బిల్లులో చేర్చిన అంశాలు మరి రెండున్నాయి.

ఒకటి, మిలిటెన్సీ ఉన్న ప్రాంతాలలో ప్రతి ఒక్కరూ ఇన్‌ఫార్మర్ కావాలి. అంటే టెర్రరిస్టు నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసి కూడ చెప్పకపోవడం

నేరం అవుతుంది. ఇది రెండు రకాలుగా అన్యాయం. ఆ మిలిటెంట్ల సామాజిక పునాదికి చెందిన ప్రజలపైన ఈ నియమాన్ని రుద్దడం వారి రాజకీయ విశ్వాసాలను హేళన చేయడం, ఆ విశ్వాసాల పైన దాడి చేయడం అవుతుంది. వారు తమ నాయకులుగా, తమ విముక్తికారులుగా తాము భావించే కార్యకర్తలను తామే పట్టియ్యాలి, లేదా జైలుకు పోవాలి. ఆ మిలిటెంట్ల అనుయాయులు కాని వారికయితే ఈ నియమం ప్రాణాంతకం కాగలదు. అన్ని మిలిటెంట్ ఉద్యమాలూ ఇన్‌ఫార్మర్ల పట్ల నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తాయనేది జగమెరిగిన సత్యం. ప్రజలను చట్టమే ఆ స్థితిలోకి నెట్టడం – పైగా లా కమిషన్ అటువంటి సూచన చేయడం – చాలా ఘోరం.

రెండవది, టెర్రరిస్టు చర్యల ద్వారా సంపాదించిన ఆస్తి అని భావించిన దానిని ప్రభుత్వం జప్తు చేసేసుకోవచ్చు. కేసు రుజువయితే అటువంటి ఆస్తిని కోర్టు జప్తు చేయవచ్చునన్న నియమం పాత టాడాలో కూడ ఉండింది. కానీ లా కమిషన్ ఇప్పుడు ప్రతిపాదించేది అది కాదు. నేరం రుజువు కాకుండా కూడ ప్రభుత్వం జప్తు చేసేసుకోవచ్చు. నేర పరిశోధన జరుపుతున్న పోలీసు అధికారికి ఆ పరిశోధన జరిపే క్రమంలో ఫలానా ఆస్తి టెర్రరిస్టు నేరాల ద్వారా సంపాదించింది అని అనుమానం వస్తే ఆ ఆస్తిని జప్తు చేసేయవచ్చు. దాని మీద విచారణ జరిపి జప్తు సక్రమమా కాదా అని (ముద్దాయిని విన్న మీదట) చెప్పేది మళ్ళీ ఒక ప్రభుత్వ అధికారే. ఇదంతా ఆ టెర్రరిస్టు నేరం కోర్టులో రుజువయిందా లేదా అన్న దానితో నిమిత్తం లేని ప్రక్రియ.

మిలిటెన్సీ ప్రభావం ఉన్న అనేక ప్రాంతాలలో పోలీసులు మిలిటెంట్ల బంధువుల ఇళ్ళు కూల్చేయడం, కాల్చేయడం ఇప్పుడు తరచుగా జరుగుతున్నది. ఇళ్ళల్లో ఉంటున్న బంధుమిత్రులను బయటకు తరిమేసి ఇంటిని ధ్వంసం చేస్తుంటారు. వారికి పొలాలేమైనా ఉంటే ఎవరూ దున్నడానికి వీలులేదని నిషేధం పెడుతుంటారు.

ఇప్పటిదాకా ఇది చట్టవిరుద్ధంగా జరుగుతున్న వ్యవహారం. ఇప్పుడు చట్టంలోనే ఈ ఆస్తుల జప్తుకు ఆస్కారం కల్పించాలని లా కమిషన్ ప్రతిపాదన. కేసు రుజువైనా కాకున్నా, కోర్టు విచారణతో నిమిత్తం లేకుండా పోలీసులు నేర పరిశోధనలో భాగంగా 'ఫలాన ఆస్తిని గురించి మాకు అనుమానంగా ఉంది' అని అనుమానిస్తే చాలు ఈ జప్తు కార్యక్రమం మొదలుపెట్టవచ్చు.

మిలిటెంట్ ఉద్యమకారులు బలవంతంగా డబ్బులు వసూలు చేయడం లేదని గానీ, ఒక్కొక్కసారి ఇవ్వలేని మొత్తాలను బలవంతంగా వసూలు చేసుకున్న ఉదంతాలు లేవని గానీ మా ఉద్దేశ్యం కాదు. ఉద్యమం పేరిట చేసిన వసూళ్ళు కొన్ని సందర్భాలలో స్వంత ఆస్తులుగా మారిన ఘటనలూ లేకపోలేదు. అయితే ఏ విషయం మీదనయినా నిర్దిష్టమైన అభియోగం ఉండాలి, న్యాయబద్ధమైన విచారణ ఉండాలి. ఏదో ఒక టెర్రరిస్టు నేరాన్ని పరిశోధించే క్రమంలో 'ఫలాన ఆస్తి టెర్రరిస్టు చర్యల ద్వారా సంపాదించింది' అని పోలీసులకు అనుమానం వస్తే దానిని జప్తు చేసుకోవచ్చుగానీ దానిపైన కోర్టు విచారణ కాక ఒక ప్రభుత్వ అధికారి విచారణ మాత్రమే జరుగుతుందని అంటే అది చాలా వేధింపులకు దారితీయగలదు.


మిలిటెన్సీని ఎదుర్కొనడానికి ప్రభుత్వాల దగ్గరున్నది ఒకే ఒక సాధనం. మిలిటెంట్ల సామాజిక పునాది అయిన ప్రజలను తీవ్రంగా వేధించి మిలిటెంట్ల నుండి వారిని దూరం చేయడం, ఆ విధంగా వేరుపడిన మిలిటెంట్లను ఏరివేయడం అనేది ఈ విధానం. ఇది ఇప్పటికే మిలిటెంట్ పోరాటాలు నడుస్తున్న ప్రాంతాలలో ప్రజలపైన చాలా హింసకు దారితీసింది. ఇప్పుడు లా కమిషన్ కొత్త టాడాలో చేర్చాలని సూచించిన ఈ ఆస్తుల జప్తు ఆ వేధింపును చాలా రెట్లు పెంచగలదు.

భారతదేశంలోని బుద్ధిజీవులలో ఉదార ప్రజాస్వామిక భావాలు, అభ్యుదయ భావాలు గల వర్గమొకటి కొంత బలంగానే ఉండింది నిన్న మొన్నటిదాక. దాని స్థానంలో ఇప్పుడు హక్కుల పట్ల వ్యతిరేకత, ప్రజాస్వామ్యం పట్ల అసహనం బుద్ధిజీవులలో క్రమంగా ముదురుతున్నాయనడానికి జీవన్‌రెడ్డి గారి కలం నుండి వెలువడిన ఈ కొత్త టాడా బిల్లు వర్కింగ్ పేపర్, వారు ప్రతిపాదించిన సవరణలు ఒక నిదర్శనం.

ఈ కొత్త బిల్లుకు త్వరగా చట్టరూపం ఇవ్వడానికి మన సంఘ్‌పరివార్ పాలకులు ఆరాటపడుతున్నారనడంలో సందేహం లేదు. ఆ ప్రయత్నాన్ని గట్టిగా అడ్డుకోవడానికి ప్రజాస్వామికవాదులు, ఉద్యమాలు చేయగల ప్రయత్నాలన్నీ చేయాలి.

*మానవహక్కుల వేదిక బులెటిన్-2లో వచ్చిన వ్యాసం*

***జూన్ 2000***



# సంఘటిత నేరాల చట్టం

## 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టాన్ని సంఘటితంగానే ఎదుర్కొందాం!

వేరే రాష్ట్రాల సంగతేమో గానీ మనకు సంబంధించినంత వరకూ 'టాడా' తిరిగి వచ్చేసింది. 'సంఘటిత నేరాల నియంత్రణ' అనే పేరుతో అది చాలా త్వరగా తిరిగి వచ్చేసింది.

నేరవిచారణ పద్ధతిలో న్యాయం లేకపోవడం 'టాడా' సారాంశం. నేరపరిశోధన జాగ్రత్తగా చేసి నేరాన్ని రుజువు చేసే ఓపిక లేని పోలీసు యంత్రాంగం అడ్డదార్లు కోరుకుంటూ ఉంది. ముద్దాయిని కొట్టి ఒప్పిస్తే సరిపోయే న్యాయవ్యవస్థ వారికి కావాలి. బెయిలు, బహిరంగ నేరవిచారణ, ప్రతి సాక్షినీ క్రాస్ ఎగ్జామినేషన్ చేసే హక్కు ఇవన్నీ తీసేయాలి.

అరెస్టయిన ముద్దాయిని విచారణ తంతు ముగిసేంత వరకు చీకటి కొట్లో బంధించి, కొట్టి నేరం ఒప్పించి, ముఖానికి ముసుగు వేసుకున్న సాక్షి చేత ఆ ఒప్పుకోలుకు వత్తాసు పలికించి జైలు లోపలే – బంధుమిత్రులకు, పత్రికా విలేఖరులకు ప్రవేశం నిరాకరించి – నేరవిచారణ ముగించి శిక్ష వేసేసే 'న్యాయ' వ్యవస్థ పోలీసుల చిరకాల మనోభీష్టం.

టాడా రూపంలో ఫలించిన ఈ కల చేయిజారిపోయిందని వారు అయిదేళ్ళుగా పడుతున్న బాధ వర్ణనాతీతం. ఇప్పుడు వారికి ఉపశమనం కలిగిస్తూ చంద్రబాబు 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టాన్ని చేశాడు.

నిజానికి 'టాడా'కు కొనసాగింపుగా 'పోటా' అనే బిల్లొకటి లా కమిషన్ ఆమోదం పొంది పార్లమెంటు ముందుకు పోవడానికి రెడీగా ఉంది. కానీ అస్థిరమైన కేంద్రప్రభుత్వం ఇప్పట్లో ఆ బిల్లుకు చట్టరూపం ఇచ్చేటట్టు కనబడడం లేదని చెప్పి రాష్ట్రాలు ఒక్కొక్కటిగా తమ టాడాలు తామే రూపొందించుకుంటున్నాయి. సంఘటిత నేరాల నియంత్రణ పేరుతో మహారాష్ట్ర, కర్ణాటకలు ఇప్పటికే చట్టాలు చేశాయి. మనది వాటి నమూనాయే. టెర్రరిజాన్ని అదుపుచేసే పేరిట మధ్యప్రదేశ్ 'పోటా' వంటి చట్టాన్ని జారీ చేసింది. మొత్తానికి నేర విచారణ వ్యవస్థలో చీకటి రాజ్యం స్థిరపడినట్టే భావించవచ్చు.

'సంఘటిత నేరాలను' అదుపు చేయనక్కరలేదా అని అడుగుతారేమో. రాష్ట్ర ప్రభుత్వం ఉదహరిస్తున్న సంఘటిత నేరాలు ఏవి?, వాటిలో పాలకుల అండ లేకుండా జరిగే సంఘటిత నేరాలు ఏవైనా ఉన్నాయా?, పోలీసుల లాలూచీ లేకుండా పనిచేసే సంఘటిత నేరస్తుల బృందాలు ఏవైనా ఉన్నాయా?... చూద్దాం.

అక్రమ మద్యం రవాణా ప్రభుత్వం పేర్కొనే సంఘటిత నేరాలలో ఒకటి. అది ఇప్పటికే ఎక్సైజ్ చట్టం కింద నేరం. మారుమూల గూడేలలో గుడుంబా కాసేవాళ్ళు ఈ నేరానికి అరెస్టవుతున్నారు, విచారణ ఎదుర్కొంటున్నారు. వాళ్ళకోసం కొత్త చట్టం అక్కరలేదు. చట్టానికి దొరకనిది ఘరానా ఎక్సైజ్ నేరస్తులు. వీరు చట్టానికి దొరకక పోవడానికి కారణం చట్టంలోని బలహీనత కాదు. పాలనా యంత్రాంగం అస్మదీయుల పట్ల చూపే ఆదరణ. ఘరానా మద్యం దొంగ రవాణాదారులంతా రాజకీయ ప్రాబల్యం కలవారే. ముఖ్యమంత్రి తమ్ముడి పేరు ఈ సందర్భంలో తరచూ వినపడుతుంటుంది. రాయలసీమ జిల్లాలలోనయితే ఎంఎల్ఏలలో సగంమందికి పైగా ఈ చీకటి వ్యాపారంలో పీకలదాకా కూరుకుపోయి ఉన్నారంటే అతిశయోక్తి కాదు. వారిని రాజకీయాల నుండి దూరంగా ఉంచే రాజకీయ సంస్కారం ప్రధాన పార్టీలలో దేనికీ లేదు. అది జరగనంత కాలం చట్టం వారిని అంటదు. పెద్దవాళ్ళను ముట్టుకునే సాహసం మన పోలీసులు చేయరు. అటువంటప్పుడు చట్టాన్ని మారిస్తే ఏమొస్తుంది? చిన్నవాళ్ళను మరింత సతాయించడం తప్ప ఏం ఒరుగుతుంది?

భూమి కబ్జాలు ప్రభుత్వం ఇస్తున్న మరొక ఉదాహరణ. ఇది మరీ విడ్డూరం. గుడుంబా వ్యవహారంలోనయినా చిన్న జనం – ప్రధానంగా షెడ్యూల్డు తెగలు –

కనిపిస్తారు గానీ భూమి కబ్జాదారులంతా 'పెద్దమనుషులే'. అందువల్లనే ఆ నేరానికి ఇప్పటికే ఒకటికి రెండు చట్టాలు, ప్రత్యేక కోర్టులు ఉన్నప్పటికీ భూమి కబ్జాలు మాత్రం సాగుతూనే ఉన్నాయి. నిలువనీడ లేక దొరికిన జాగాలో గుడిసెలేసుకునే పేదలు తప్ప వేరే ఏ కబ్జాదారులూ చట్టానికీ కోర్టులకూ దొరకడం లేదు. ఆ తప్పు చట్టానిది కాదు, దానిని నిష్పాక్షికంగా అమలు చేయని వంకర పాలనది. ఇప్పుడు చట్టాన్ని సవరిస్తే ఆ వంకర పోతుందా? చట్టాన్ని నిర్భీతిగా అమలుచేసే సంకల్పం వచ్చేస్తుందా? లేకపోతే గుడిసెవాసుల మెడల మీద మరొక కత్తిగా ఇది నిలబడుతుందా?

ఈ కొత్త చట్టానికి కారణంగా చెపుతున్న సంఘటిత నేరాలలో మరొకటి రాయలసీమ ఫ్యాక్షన్ ముఠాలు, వాటి దౌర్జన్యాలు. మరి భూమా నాగిరెడ్డికీ, బైరెడ్డి రాజశేఖరరెడ్డికీ, కె.ఇ. ప్రభాకర్‌కూ, పరిటాల రవీంద్రకూ టిక్కెట్లు ఇచ్చినప్పుడూ, పదవులిచ్చినప్పుడూ ఈ సంగతి తెలియలేదా? ఫ్యాక్షనిస్టుల దౌర్జన్యాలను ఆసరా చేసుకునే కదా రాయలసీమలో తెలుగుదేశమైనా కాంగ్రెసయినా ఎన్నికలలో పోటీచేస్తున్నది, గెలుస్తున్నది? ప్రజల మీద దుర్మార్గమైన చట్టాలు రుద్దడానికి ఫాక్షన్‌లను కారణంగా చూపించే బదులు, ముఠా నాయకులను రాజకీయంగా చేరదీయబోమని ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఒక నిర్ణయం తీసుకోవచ్చును కదా? వారిపైన చర్య తీసుకోకుండా పోలీసులకు అడ్డం రామని ఒక నిర్ణయం తీసుకోవచ్చును కదా? అప్పుడు కూడ వారి ఆటకట్టడానికి సాధారణ చట్టాలు సరిపోవని చంద్రబాబు అనగలడా?

రెండు నాల్కల రాజకీయాల పర్యవసానమయిన పాలనా దౌర్బల్యానికి పుట్టిన విషసంతానం ఈ 'సంఘటిత నేరాల నియంత్రణ చట్టం'. రాజకీయ ప్రాబల్యం ఉన్న వాళ్ళను మామూలు చట్టాలు ఏమీ చేయలేనట్టే ఈ చట్టమూ ఏమీ చేయబోదు. ఎందుకంటే అక్కడున్న సమస్య చట్టానికి సంబంధించింది కాదు.


మరి దీనికి ఎవరు బలి కాబోతారంటే గుడిసెవాసులూ, భూమి కోసం పోరాటం చేసే పేదలూ 'భూమి కబ్జాదారులు'గా రూపాంతరం చెంది బలికాబోతారు. చందాల మీద ఆధారపడక తప్పని అన్ని రకాల ఉద్యమకారులూ 'బలవంతపు డబ్బు వసూలు' చేసే నేరస్తులుగా ఈ చట్టం కింద బందీలు కాబోతారు. చారిత్రక కారణాల వల్ల బందిపోట్లుగా బతుకుతున్న కొన్ని పీడిత కులాల జనం 'సంఘటిత నేర బృందాలుగా' శాశ్వతంగా చీకటికొట్లలోకి పోబోతారు. మారుమూల తండాలలో బెల్లంతో సారాయి

కాచుకుని అమ్ముకొని బతికే గిరిజనులు 'దొంగ మద్యం సిండికేట్లు'గా ఈ చట్టానికి నైవేద్యం కాబోతారు. సంఘటిత బలప్రయోగంతో తప్ప ఈ వ్యవస్థను మార్చలేమన్న రాజకీయ విశ్వాసం గల నక్సలైట్లు 'సంఘటిత నేరబృందం'గా ఈ చట్టం వేటుకు గురికాబోతారు. హిందుత్వవాదుల పాలన పట్ల వ్యతిరేకత పెంచుకుని మిలిటెంట్ ముస్లిం సంస్థలతో సంబంధాలు పెట్టుకున్న ముస్లిం యువకులు కూడ దీని కాటుకు గురి అవుతారు.

పై జాబితాలోని కొందరి కార్యకలాపాలు సమాజానికి సమస్యాత్మకమైనవే కావచ్చు. కానీ ఇవేవీ ఒళ్ళు బలిసి చేసే నేరాలు కావు. వట్టి నేరాలుగా చూడదగినవి కావు. వట్టి నేరాలుగా చూడదగ్గ బలిసిన నేర ముఠాల నేరాలు ఈ చట్టానికి మాటవరసకు అందుతాయి గానీ వాస్తవంలో అందవు.

సామాజిక ఆర్థిక మూలాలు గల ఉద్యమాలనూ అల్లర్లనూ అలజడులనూ నేరాలనూ అన్యాయమైన చట్టాలను అడ్డం పెట్టుకొని క్రూరంగా అణచివేసే ఆలోచనను మనమంతా ఎందుకు ఆమోదించాలి? చంద్రబాబు అనుసరిస్తున్న గ్లోబలైజేషన్ విధానాలు పీడిత ప్రజలనే కాక ఇంతకాలం మధ్యతరగతిగా భావిస్తున్న వారిని సహితం 'సంఘటిత నేరాల నియంత్రణ' చట్టానికి గురయ్యే స్థితికి నెడుతున్నాయి. ఆ సంగతి అతనికి తెలుసును కాబట్టే ఇటువంటి చట్టం చేశాడు. దానిని అనుమతించి మన హక్కులకు మనమే గోరీ కట్టుకుని మన భవిష్యత్తును ఆవరిస్తున్న చీకట్లను ఎదిరించే స్వేచ్ఛను కోల్పోదామా? లేక ఆ స్వేచ్ఛను కాపాడుకోవడానికి ఇటువంటి నిర్బంధ చట్టాలను సంఘటితంగా ఎదుర్కొందామా?

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*
***8 ఏప్రిల్ 2001***



# ఆ 'నేరస్తుల' గురించి రాయడమూ నేరమే

మొన్న రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 'సంఘటిత నేరాల నియంత్రణ చట్టం' గురించి అసెంబ్లీలోనూ, బయటా కూడ కొంచెం గొడవ అయింది గానీ చాలామంది గమనించని అంశాలు అందులో కొన్ని ఉన్నాయి.

సంఘటిత నేరాలకు పాల్పడే గుంపులకు సంబంధించిన వార్తలు రాసే స్వేచ్ఛను పత్రికలకు నిరాకరించడం అందులో ముఖ్యమైనది. గతంలో ఇటువంటి అంశాలు ఏ చట్టంలో ఉన్నా పత్రికా రంగం బాగా అల్లరి చేసి, ఎవరి సంగతి ఎట్లాగున్నా మా స్వేచ్ఛకు మాత్రం హాని జరగడానికి వీలులేదని ఒత్తిడి పెట్టి ఆ మేరకు చట్టాన్ని సవరించేటట్టు చేయగలిగేది.

ఈసారి ఎందుకో పత్రికా రంగం నోరు మెదపకుండా కొత్త చట్టంలోని పత్రికా స్వేచ్ఛకు హానికరమైన అంశాలను 'పాస్' కానిచ్చింది. అలసిపోవడం వల్లనా? ఎప్పుడో ఒకప్పుడు జరిగేదే, ఎన్నాళ్ళు ఆపుతాం అన్న నిస్పృహ వల్లనా? సంఘటిత నేరాలను అదుపు చేసే బృహత్కార్యంలో తమ స్వేచ్ఛ సహితం ఒక సమిధ కావడానికి సిద్ధపడిన త్యాగబుద్ధి వల్లనా? లేక చంద్రబాబు సమ్మోహన శక్తి వల్లనా?

సంఘటిత నేర బృందాలకు తోడ్పడగల ఏ సమాచారాన్నయినా ప్రచురించడం సంఘటిత నేరాలకు తోడ్పడడంతో సమానమేనని కొత్త చట్టంలోని సెక్షన్ 2 (i) (a) (ii) అంటుంది. ఇంకా ఏమైనా అనుమానం మిగిలిపోతుందేమోనని దాని కిందే మరింత స్పష్టంగా 'సంఘటిత నేర బృందాలు ఇచ్చిన ఏ పత్రాన్ని గానీ ఏ సమాచారాన్ని గానీ ప్రచురించడం' వారికి తోడ్పడడం అనే నేరంతో సమానమంటుంది.

సంఘటిత నేర బృందాలు అనేది మనకు కొత్తమాట కాబట్టి అటువంటివి ఇక్కడేం లేవనుకునేరు. మన చుట్టూనే వున్నాయి. అవి ఉండడం మంచిది కావచ్చు, చెడ్డది కావచ్చు – కానీ అది వార్తే కాదంటే ఎట్లా? ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది గానీ బలప్రయోగంతో, బెదిరింపుతో నేరాలు మళ్ళీ మళ్ళీ చేస్తున్నట్టయితే వారిపైన మూడవసారి చార్జిషీటు పెట్టినప్పటి నుండి ఆ 'ఇద్దరు గానీ అంతకంటే ఎక్కువ మంది గానీ' ఒక సంఘటిత నేర బృందం అవుతారు. అటువంటివి మన చుట్టూ ఎన్ని లేవు?

బందిపోటు ముఠాలు, ఫ్యాక్షన్ ముఠాలు, ఏజెన్సీలో పదే పదే గిరిజనేతరుల భూములలోకి (కట్టెలతో, బరిసెలతో, బాణాలతో) దిగే ఆదివాసీ బృందాలు, నక్సలైట్లు, పట్టణ ప్రాంతాలలోని మాఫియా గ్యాంగులు, నంజుండస్వామి నమూనాలో బహుళ జాతి కంపెనీల అద్దాలు పగులగొట్టి ఫర్నిచర్ ధ్వంసం చేసే కార్యక్రమం పెట్టుకున్న రైతు సంఘాలు – ఇవన్నీ సంఘటిత నేర బృందాలే.

వీటిలో కొన్నిటి పట్ల మనకు సానుభూతి ఉంటుంది. కొన్నిటి పట్ల ఉండదు. కొన్నిటిని అసహ్యించుకుంటాం. కానీ ఈ బృందాల కార్యకలాపాల గురించి పోలీసుల కథనాలు తప్ప వేరే ఏ వార్త రాసినా అది వారికి 'తోడ్పడినట్లు' అవుతుందేమోనని పత్రికలు భయపడే పరిస్థితి ఉంటే ఎట్లా? వారి గురించి వారు చెప్పుకుంటూ ప్రచురించే కరపత్రాలను, వారు ఇచ్చే ప్రెస్‌నోట్లను ప్రచురించడం కూడ వారికి తోడ్పడడమే అవుతుందని ముద్రణాలయాలనూ, పత్రికలనూ బెదరిస్తే ఎట్లా?

నడుస్తున్న చరిత్రకు సంబంధించి దీన్‌దార్ అంజుమన్‌ను ఉదాహరణగా తీసుకోవచ్చు. ఆ సంస్థకు చెందిన వ్యక్తులు మన రాష్ట్రంలోనూ, కర్ణాటకలోనూ అనేక చర్చిలను ధ్వంసం చేశారన్న పోలీసుల అభియోగాన్ని ఆ సంస్థ సహితం అబద్ధమనలేదు. అంతమాత్రం చేత తమ సంస్థనే ఐఎస్ఐ ఏజెంటనడం న్యాయం కాదన్నారు. దానికి వత్తాసుగా వారు తమ ప్రచురణలను, తమ వ్యవస్థాపకుని ప్రవచనాల పుస్తకాలను పత్రికల వారికిచ్చారు. అన్ని పత్రికలూ కాకపోయినా కొన్ని తమంతట తాము ఈ వింత సంస్థపైన కొంత పరిశోధన జరిపి పోలీసుల చేతికి చిక్కిన వారు నేరస్తులే కావచ్చును గానీ దీన్‌దార్ అంజుమన్ పోలీసులు చెప్తున్నంత దుర్మార్గమైన సంస్థగా

కనిపించటం లేదని రాశాయి. హక్కుల సంఘాలు ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలను దాదాపు అన్ని పత్రికలూ ప్రచురించాయి.

ఇదంతా మనకు జ్ఞానదాయకం కాలేదా? దీనినంతా నిషేధించి పోలీసుల చార్జిషీట్ ఒక్కటే సత్యమని ప్రకటించే స్థితి రావడం మంచిదా? దీన్‌దార్ అంజుమన్ పైన కేసులు పెట్టిన నాటికి ఈ చట్టం లేదు గానీ ఉండి ఉంటే ఆ సంస్థ సభ్యులు మూడవ చర్చిని ధ్వంసం చేసిన క్షణం నుండి ఆ సంస్థ 'సంఘటిత నేర బృందం' అయి వుండేది. అప్పుడు తనను తాను బసవడి అంశగా భావించిన ప్రవక్త మహమ్మదు అనుచరుడయిన దీన్‌దార్ వ్యవస్థాపకుని గురించి మనకు తెలిసేది కాదు. ఏకకాలంలో సంస్కృత శ్లోకాలూ అరబ్బీ వాక్యాలూ ప్రవచించే వింత సంస్కారం గల దీన్‌దార్ ప్రచారకుల గురించి తెలిసేది కాదు. హిందూ, ముస్లిం అనేవి అనుల్లంఘనీయమైన సరిహద్దుకు చెరొక పక్కన ఉన్న శిబిరాలని అందరూ అనుకుంటున్న ఈ రోజులలో ఆ సరిహద్దుకు ఈ పక్కన ఒక కాలు ఆ పక్కన ఒక కాలు పెట్టి నిలబడ్డ ఈ వింత మనుషుల గురించి తెలిసేది కాదు.

ఈ విషయాలు తెలియడం వల్ల నష్టపోయామా? తెలియకపోవడం వల్ల నష్టపోయి ఉండేవాళ్ళమా?


నక్సలైట్ల వంటి రాజకీయ సంస్థల విషయంలో ఈ నిషేధం చాలా అన్యాయం చేస్తుందని ఇంత వివరంగా కూడ చెప్పనవసరం లేదు. వారి రాజకీయ స్వభావాన్ని నిరాకరించి, వారిని కేవలం హింసాత్మక బృందాలుగా చూపించడానికే మన ప్రభుత్వాలు మొదటి నుండి ప్రయత్నం చేస్తున్నాయి. పత్రికలు కూడ ఈ వైఖరిని కొంత మేరకు అవలంబించినప్పటికీ నక్సలైట్ల రాజకీయ స్వరాన్ని అవి పూర్తిగా నొక్కేయలేదు. వారి విధాన పత్రాలు ప్రచురిస్తున్నారు. వారి ప్రతినిధులతో వివరమయిన ఇంటర్వ్యూలు అచ్చువేస్తున్నారు. ఇక మీదట వేస్తే అది అయిదు సంవత్సరాల కనీస జైలు శిక్ష, అయిదు లక్షల రూపాయల కనీస జుర్మానా విధించగల నేరమవుతుంది.

చట్టంలో ఇవన్నీ రాసుకున్నా ప్రధాన పత్రికలపైన ప్రయోగించరు లెమ్మనుకునే వాళ్ళు ఉంటారు. ప్రయోగించకపోవచ్చు. కాని అదీ ప్రమాదకరమే. చిన్న పత్రికలపైన, స్వతంత్ర ప్రచురణలపైన, కరపత్రాలు అచ్చు వేసే ముద్రణాలయాలపైన ప్రయోగిస్తారు.

లేదా ప్రయోగిస్తారన్న భయం వారి నోరు నొక్కేస్తుంది. సత్యాన్ని ప్రవచించే హక్కు పోలీసులకు మాత్రమే ఉండడం నష్టకరమయినట్టే, పోలీసులకూ ప్రధాన పత్రికా రంగానికీ మాత్రమే ఉండడం కూడ నష్టకరమే. ఒకే మోతాదులో నష్టకరమని అతిశయోక్తికి పోయి అననక్కర లేదు. కానీ నష్టకరమే.

*ప్రజాతంత్ర వారపత్రిక*

***14 ఏప్రిల్ 2001***



# సంఘటిత నేరాలు–సహజ న్యాయసూత్రాలు

మన రాష్ట్ర అసెంబ్లీ ఈ మధ్యనే ఆమోదించిన 'ఆంధ్రప్రదేశ్ సంఘటిత నేరాల నియంత్రణ చట్టం' వల్ల ప్రజలు ఏ హక్కులు కోల్పోతారో తెలుసుకోవాలంటే ఆ చట్టంలోని సెక్షన్లు ఏకరువు పెట్టి ప్రయోజనం లేదు. చట్టాల పరిభాషకు సహజమైన సంక్లిష్టమైన పదబంధాల వల్ల వాటి భావం త్వరగా స్ఫురించదు. దానికి బదులు ఉదాహరణలు తీసుకొని వ్యాఖ్యానించుకోవడం ఉచితంగా ఉంటుంది.

## ఈ చట్టం ఎవరిని శిక్షిస్తుంది?

'కాంట్రాక్ట్ హత్యలు, బలవంతపు డబ్బు వసూళ్ళు, నిషిద్ధ వస్తువుల దొంగ రవాణా, గంజాయి వ్యాపారం, డబ్బుల కోసం కిడ్నాప్ చేయడం, నల్లధనాన్ని తెల్లదిగా మార్చడం, ఈ నేరాల నుండి పుట్టిన అక్రమమైన నల్లధనం' – ఇదీ ఈ చట్టం ఎదుర్కొనబోయే రుగ్మతలు అని దాని పీఠికలో అన్నారు. ఈ నేరాలకు పాల్పడే సంఘటిత నేరబృందాలు రాష్ట్రంలో ఉన్నాయనీ, వాటి దగ్గర పోలీసు యంత్రాంగం కంటే ఆధునికమైన ప్రసార సాధనాలూ సాంకేతిక ప్రక్రియలూ ఉన్నాయనీ, అవి ప్రజా జీవితంలో అభద్రతనూ, హింసనూ పెంచుతున్నాయనీ పీఠికలో అన్నారు.

ఇవేవీ లేనే లేవనీ, ఆ ఆందోళన కేవలం ఊహాజనితమనీ ఎవరూ అనరు. వీటిని ఎదుర్కొనడం అనవసరం అని కూడ అనరు. నిజానికి పెరుగుతున్న ఈ రకమైన నేరాల పట్ల సామాన్య ప్రజలలో చాలా వ్యతిరేకత

ఉంది. ఆ సంగతి ప్రభుత్వానికి తెలుసును కాబట్టే ఆ పేరు మీద ఒక చట్టం చేసేస్తే దాని లోతుపాతులు ఎవరూ చూడరనీ, దాని పర్యవసానాల గురించి ఎవరూ తర్కించరనీ ప్రభుత్వం ధైర్యం.

అందుకే మనం మరింత జాగ్రత్తగా ఈ చట్టాన్ని విశ్లేషించాలి. మొదట, ప్రభుత్వం చెప్పే 'సంఘటిత నేరాలు' సమాజానికి నిజంగా హానికరమయినవే కాని మన రాష్ట్ర పాలకులు ఆ నేరాలలో తమకు పాత్ర లేదా అన్న ప్రశ్న వేసుకోవాలి. పైన పేర్కొన్న నేరాల జాబితాను ఇంకొకసారి చదవండి. ఆ రకమైన నేరాలతో ప్రమేయమున్న ఎంఎల్ఏల గురించీ, తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నాయకుల గురించీ, పోలీసు, ఎక్సైజ్, సివిల్ సప్లైస్, అటవీ శాఖ అధికారుల గురించీ మనం ఎన్నిసార్లు వినలేదు? నిజం చెప్పాలంటే ఆ జాబితాలోని నేరాలు అధికారుల భాగస్వామ్యం లేదా తోడ్పాటు లేకుండా సాగించడం చాలా కష్టం. అటువంటప్పుడు ప్రభుత్వం అమాయకత్వం నటిస్తూ ఆ నేరాలను అరికట్టటానికి ఒక కొత్త చట్టం కావాలంటూ చట్ట సవరణకు పూనుకోవటం ఎందుకు? నిజానికి ఆ నేరాలకు పాల్పడే వారికి రాజకీయ నాయకుల, అధికారుల తోడ్పాటు ఉండబట్టే అవి వర్ధిల్లుతున్నాయి. ఈ తోడ్పాటును గుర్తించి దానిని తొలగించడానికి నిజాయితీగా కృషిచేసే బదులు చట్టాన్ని సవరించి నేరస్మృతిని అనాగరికంగా తయారు చేయడం ఎందుకు?

అంతేకాదు, పీఠికలో పేర్కొన్న జాబితాలోని నేరాలకే ఈ చట్టం పరిమితమయిందా అనేది కూడ చూడాలి. ఈ చట్టంలో సంఘటిత నేరాలకు ఇచ్చిన నిర్వచనం పీఠికలోని నేరాలకు మాత్రమే పరిమితమా? ఎంతమాత్రం కాదు. అనేక రకాల సంఘటిత రాజకీయ కార్యాచరణ సహితం – పెద్దగా హింసాత్మకం కాకపోయినా – ఈ చట్టం కింత 'సంఘటిత నేరం' అవుతుంది.

(i) హింసగానీ, బెదిరింపుగానీ, బలవంతంగానీ ఇతర చట్టవిరుద్ధ పద్ధతులేవైనా ఉపయోగించి

(ii) తనకు, లేక మరొకరికి ధనలాభం గానీ, ఆర్థిక ప్రయోజనం గానీ, ఇతర ప్రయోజనం గానీ పొందడం కోసం

(iii) ఒకరి కంటే ఎక్కువ వ్యక్తులు

(iv) ఒకటి కంటె ఎక్కువసార్లు

(v) 3 సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష పడగల నేరానికి పాల్పడినట్టు కోర్టులో ఛార్జిషీటు దాఖలయి కోర్టు దానిని 'కాగ్నైజన్స్' తీసుకున్నట్లయితే

ఆ వ్యక్తులను 'సంఘటిత నేర బృందం' అంటారు. అటువంటి సంఘటిత నేర బృందం సభ్యులుగా ఉంటూ చేసే నేరాలను, లేక దాని తరఫున చేసే నేరాలను 'సంఘటిత నేరాలు' అంటారు. ఇది పీఠికలో పేర్కొన్న నేరాల జాబితాను దాటి చాలా దూరం పోయే చాలా విస్తృతమైన నిర్వచనం అని విడమరచి చెప్పనవసరం లేదు.

ఈ చట్టాన్ని కొన్ని విషయాలలో టాడాతో పోలుస్తున్నాం. ఎందుకంటే నేర విచారణ రెండింటిలోనూ దాదాపు ఒకటే. అయితే నేర నిర్వచనం విషయంలో ఇది టాడా కంటే అన్యాయమయిన చట్టం. టాడా ప్రకారం ఒక నేరం టెర్రరిస్టు నేరంగా గుర్తింపు పొందడానికి తుపాకులు, బాంబులు వంటి ఆయుధాలు ఉపయోగించి ఉండాలి. బాణాలు, వేటకొడవళ్ళు, కట్టెలు ఉపయోగించి చేసే నేరాలు టెర్రరిస్టు నేరాలు కావు. కానీ ఈ చట్టంలో ఆయుధాల ప్రస్తావనే లేదు. బలప్రయోగం, బెదిరింపు ఏ రూపంలో ప్రయోగించినా అది సంఘటిత నేరం కాగలదు.

'సంఘటిత నేరం' నిర్వచనం ఎంత విస్తృతమయినదో చెప్పడానికి రెండు ఉదాహరణలు ఇచ్చుకోవచ్చు. పశ్చిమ గోదావరి ఏజెన్సీలో ఆదివాసులు నాలుగేళ్ళుగా ఎల్‌టిఆర్ చట్టం అమలు కోసం ఒక పోరాట రూపం అనుసరిస్తున్నారు. 'మేము లేవదీసిన వివాదానికి పరిష్కారం లభించేంతవరకు మీరు భూమి సాగు చేయడానికి వీలు లేదు' అని గిరిజనేతర రైతులను బెదిరిస్తున్నారు. అప్పుడప్పుడు బాణాలతోనో కట్టెలతోనో దేవుడిచ్చిన చేతులతోనో వారు కొట్టడం కూడ కద్దు. వాళ్ళు గుంపుగానే ఈ పని చేస్తున్నారు, పదే పదే చేస్తున్నారు. ఒక ప్రయోజనం కోసం చేస్తున్నారు. చట్టం కళ్ళలో వారు చేస్తున్నది హత్యాప్రయత్నం కాబట్టి ఇక మీదట సంఘటిత నేరం అవుతుంది.

అనేక ఫ్యాక్టరీలలో కార్మికులు చేసే ఆందోళనలు కూడ ఈ విధంగానే 'సంఘటిత నేరాలు' అవుతాయి. ఏవో డిమాండ్లతో కార్మికులు సమ్మె చేస్తారు. గుంపుగా చేస్తారు (సమ్మె ఒకరు చేయలేరు కదా). సమ్మె కాలంలో దినకూలీలను పెట్టి పని చేయించుకోవడానికి యాజమాన్యం ప్రయత్నిస్తే 'చంపుతాం' అని బెదిరిస్తారు. ఒకరిద్దరు

సూపర్‌వైజర్‌లనో సెక్యూరిటీ వారినో తన్నినా తంతారు. జీవితంలో ఒకసారి మాత్రమే ఈ దృశ్యాన్ని చూసే ఫ్యాక్టరీ ఏదీ ఉండదు కాబట్టి రెండవసారి జరిగినప్పటి నుండీ ఆ కార్మికుల ఆందోళన 'సంఘటిత నేరం' అవుతుంది.

అయితే ఏం? అని ఎవరయినా అడుగుతారు. ఇప్పుడు మాత్రం ఈ పోరాటాల పైన ఐపిసి కింద కేసులు పెట్టడం లేదా, అరెస్టు చేయడం లేదా? అని అడుగుతారు. కేసులు పెడుతున్న మాట, అరెస్టు చేస్తున్న మాట వాస్తవమేగానీ ప్రధానమైన తేడాలు వున్నాయి. ఒకటి, ఇప్పుడున్న చట్టంలో ఈ రకమైన ఆందోళనలపై పెట్టగల కేసులు తీవ్రమయినవి కావు. వాటికి శిక్షలు తక్కువ. బెయిలు పొందడం కష్టం కాదు. రెండు, ఇప్పుడున్న చట్టం నేరవిచారణ పద్ధతిలో సహజ న్యాయసూత్రాలకు సముచిత స్థానం ఉంది. పేదరికం వల్ల న్యాయ సహాయాన్ని 'కొనుక్కో'లేక కొంత, న్యాయస్థానాల ఆలోచనా రీతులపైన బలమైన ప్రభావమున్న తిరోగామి భావజాలం వల్ల కొంత ఈ సహజ న్యాయసూత్రాల ఫలితాన్ని బలహీన వర్గాలకు చెందిన వారు పూర్తిగా పొందలేక పోతున్నారు గానీ సూత్రప్రాయంగా నేర విచారణ పద్ధతి హేతుబద్ధమైనదే. మూడు, ఇప్పుడున్న చట్టంలో ఒక 'నేరానికి' ఉండే సామాజిక స్వభావాన్ని బట్టి (ఉదాహరణకు ఒక భౌతిక దాడి పేదవారి ఆందోళనలో భాగంగా జరిగిందా లేక వట్టి రౌడీయిజం కారణంగా జరిగిందా అని వివేచించి) శిక్ష ఎంత తక్కువయినా వేసే అవకాశం ఉంది. అంటే నేరాలకు గరిష్ట శిక్షే తప్ప కనీస శిక్ష సాధారణంగా ఉండదు.

ఈ మూడు విషయాలలోనూ కొత్త చట్టం అన్యాయమైనది. అందులో 'సంఘటిత నేర బృందాలు' చేసే చాలా నేరాలకు శిక్ష అయిదు సంవత్సరాల నుండి జీవితఖైదు దాకా ఉండగలదు. శిక్షాకాలం ఎక్కువ ఉండడమే కాక ప్రతి నేరానికీ భారీగా జుర్మానా కూడ నిర్దేశించారు. కొన్ని నేరాలకు ఒక లక్ష రూపాయలు వేయాలని నిర్దేశించగా కొన్నిటికి అయిదు లక్షల రూపాయలకు తక్కువ కాకుండ వేయాలని నిర్దేశించారు. ఖైదు కాలాన్నీ జుర్మానానూ కలుపుకుంటే 'సంఘటిత నేరాల'కు పాల్పడినట్టు రుజువయిన ముద్దాయి కనీసం అయిదు సంవత్సరాలు జైలుకు పోవాలి, కనీసం అయిదు లక్షల రూపాయల జుర్మానా కట్టాలి. సంఘటిత ప్రజాందోళనల పైన 'సంఘటిత నేరాలు' అంటూ కేసులు పెట్టినట్టయితే ఆందోళనకారులు ఇంత భారీగా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఇవి కనీస శిక్షలు కాబట్టి న్యాయమూర్తి ఒకవేళ సానుభూతి చూపించాలనుకున్నా దానికి ఈ చట్టం తావు లేకుండా చేసింది.

పోతే, నేర విచారణ పద్ధతి నుండి సహజ న్యాయసూత్రాలన్నిటినీ వెలివేశారు. వాటిని ఒక్కొక్కటే ఏకరువు పెట్టడం కంటే ఒక ఉదాహరణ తీసుకొని చెప్పుకుంటే బాగుంటుంది. ఒక ఫ్యాక్టరీ కార్మికులు సిబ్బంది కోతకు వ్యతిరేకంగా సమ్మె పిలుపు ఇచ్చారనుకోండి. సిబ్బందిని తగ్గిస్తే తప్ప ఫ్యాక్టరీ లాభదాయకంగా నడవదు కాబట్టి కోత పెట్టి తీరుతానని యాజమాన్యం అంటుంది. కార్మికులు సమ్మె చేస్తే కాంట్రాక్ట్ కార్మికులను పెట్టి పని చేయిస్తుంది. తమ సమ్మె విఫలం కాకుండా ఉండడానికి కార్మికులు ఆ కాంట్రాక్టర్‌ను హెచ్చరిస్తారు. ఒకడు ఎందుకొచ్చిన గొడవని తప్పుకుంటాడు. పట్టువదలని యాజమాన్యం ఇంకొక కాంట్రాక్టర్‌ను తీసుకొస్తుంది. కార్మికులు అతన్ని కూడ హెచ్చరించి తరిమేస్తారు. పై నిర్వచనాన్ని ఈ చర్యలకు అన్వయించుకుంటే ఇది సంఘటిత నేరమే అవుతుంది.

అప్పుడు కార్మికులపైన కొత్త చట్టం కింద పోలీసులు కేసుపెట్టి జైలులో పెడతారు. జరిగిన దానికి కొంచెం చేర్చి కొట్టారనీ, తన్నారనీ కూడ కేసుపెడతారు. కేసు సాధారణ శిక్షాస్మృతి కింద పెడితే బెయిలు దొరకడం పెద్ద కష్టం కాదు. సాక్షులయిన కాంట్రాక్టర్లు కార్మికుల కంటే బలవంతులు కాబట్టి బెయిలు యిస్తే వారిని కార్మికులు బెదిరించి విచారణను ఆటంకపరుస్తారని కోర్టు తటపటాయించనక్కర లేదు. పైగా ముద్దాయిలు వృత్తి నేరస్తులు కారు కాబట్టి న్యాయనిర్ణయానికి దొరకకుండా పోతారని భయపడనక్కర లేదు. అందువల్ల బెయిలు దొరకడం కష్టం కాదు.

కాని కొత్త చట్టం కింద కోర్టులు బెయిలు విషయంలో అనుసరించాల్సిన ప్రమాణం వేరు. నిందితులు కేవలం నేర విచారణను ఆటంకపరుస్తారా లేదా అన్నది వారికి ప్రమాణం కాదు. ముద్దాయి నిర్దోషి అనీ, విడిచి పెడితే మళ్ళీ నేరం చేయడనీ కోర్టు భావిస్తేనే బెయిలు ఇవ్వాలి. అంతటి విశ్వాసం ఖైదీపైన కోర్టుకు ఉండనక్కరలేదు కాబట్టి బెయిలు దొరకడం దాదాపు అసాధ్యం అవుతుంది.

ఇంకొక రకంగా చెప్పాలంటే నేరం రుజువయ్యేవరకు ముద్దాయి నిర్దోషేనన్నది సాధారణ నేరస్మృతి వైఖరి కాగా, నిర్దోషిత్వం రుజువయ్యే వరకు ముద్దాయి నేరస్తుడేననేది ఈ కొత్త చట్టం వైఖరి.

బెయిలు రాకుండా జైలులో ఉన్న కార్మికులను 'విచారణ' నిమిత్తం పోలీసులు తమ కస్టడీకి తీసుకుంటారు. ఎస్.పిగారి దగ్గరకు తీసుకుపోతారు. కాంట్రాక్టర్లను బెదిరించింది నిజమేనని ఒప్పుకోకపోతే ముడ్డిలోకి మూతి పగలగొట్టిన సీసాలు

ఎక్కిస్తామనీ, కరెంట్‌షాక్ పెడతామనీ బెదిరిస్తారు. అంత పనీ చేసి చూపిస్తారు కూడ. బతికుంటే బలుసాకు తినొచ్చునన్న మానవ సహజమైన భావనతో కార్మికులు నేరం ఒప్పేసుకుంటారు. పోలీసులు దానిని ఒక కాగితం పైన టైప్ చేసి తెస్తారు. కార్మికులు ఆ కాగితంపైన సంతకం చేస్తారు.

ఈ రకమైన 'ఒప్పుకోలు' మామూలుగా సాక్ష్యంగా చెల్లుబాటు కాదు. కాని కొత్త చట్టం కింద చెల్లుబాటవుతుంది. ఎవరి చేతా నేరం బలవంతంగా ఒప్పించడానికి వీలులేదన్న రాజ్యాంగ ప్రాథమిక హక్కుకి ఇది వ్యతిరేకం (సుప్రీంకోర్టు కాదన్నప్పటికీ).

ఆ తరువాత ఛార్జిషీటు పెడతారు. కాంట్రాక్టరును బెదిరించగా లేక కొట్టగా చూసిన వారు ఎవ్వరన్న విషయం అందులో ఉండదు. వారికొక సాక్షి నెంబరు ఇస్తారు గానీ వారి పేరు, పత్తా (చిరునామా) ముద్దాయిలకు చెప్పరు. అంటే వారి వాంగ్మూలం అసత్యమని రుజువు చేసే అవకాశం ముద్దాయికి ఉండదు.

పోను పోను విచారణ మొదలవుతుంది. కోర్టులో కాదు, జైలులోనే జరుగుతుంది. అంటే కోర్టే జైలులో వచ్చి కూర్చుంటుందని అర్థం. ముద్దాయిల బంధువులుగానీ విలేఖరులుగానీ ఇతర ప్రజలుగానీ విచారణ చూడలేరు. నెంబరు తప్ప పేరు లేని సాక్షులు ముఖానికి స్క్రీన్ అడ్డంపెట్టుకొని 'ఆకాశరామన్న' సాక్ష్యం చెప్తారు. ఆకాశరామన్నను క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం సాధ్యం కాదుగదా!

పోలీసులు కూడ తమ వంతు సాక్ష్యం ప్రవేశపెడతారు. ప్రవేశపెట్టే ముందు దానిని కల్పిస్తారు. జైలులో ఉన్న ముద్దాయిలను ప్రశ్నించే నిమిత్తమని చెప్పి పోలీసు కస్టడీకి తీసుకొని నేరం జరిగిన స్థలానికి తీసుకుపోయి అక్కడొక బండ మీదనో, చెట్టు మీదనో, కుర్చీ మీదనో వేలిముద్ర వేయిస్తారు. ఆ తరువాత ఆ వేలిముద్రకు సంబంధించిన సాక్ష్యం కోర్టులో ప్రవేశపెడతారు. మామూలుగానయితే అటువంటి సాక్ష్యానికి కోర్టులలో స్వతంత్రమైన విలువ ఏమీ ఉండదు. కాని ఈ చట్టంలోని సెక్షన్ 22(1)(6) ప్రకారం నేరస్థలంలో వేలిముద్రలు లభిస్తే ఇంక నేరం చేసినట్టే కోర్టు భావిస్తుంది. చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత ఆపైన ముద్దాయిలపైనే ఉంటుంది.


ఇవన్నీ కలుపుకుంటే మనం ఉదాహరణగా తీసుకున్న కార్మికులు శిక్ష తప్పించుకునే అవకాశం లేదని స్పష్టమవుతుంది. అయితే వాళ్ళు నేరం చేశారని జడ్జి

నమ్మినా ఆ నేరానికి ఉన్న సామాజిక స్వభావాన్ని బట్టి తక్కువ శిక్ష వేయాలని అనుకునే అవకాశం ఉంది. సాధారణ చట్టం కింద పెట్టిన కేసయితే జడ్జి ఆ పని చేయవచ్చు. మొదట్లో చెప్పినట్లు సాధారణ నేరస్మృతిలో నేరాలకు గరిష్ఠ శిక్ష తప్ప కనీస శిక్ష ఉండదు. కానీ ఈ కొత్త చట్టం కింద న్యాయమూర్తి ఏమనుకున్నా 5 సంవత్సరాల శిక్ష వేయవలసిందే. ఒక లక్ష రూ॥లకు తక్కువ కాకుండా జుర్మానా వేయవలసిందే.

ఈ అన్యాయాన్ని ఆ కార్మికులు పత్రికల ద్వారానయినా బయటపెట్టవచ్చునని అనుకుంటున్నారా? అంటే కోర్టులో స్వేచ్ఛ కోల్పోయినా ప్రజాభిప్రాయంలో సానుభూతి పొందవచ్చుననుకుంటున్నారా? కుదరదు. వారి ప్రకటనను ఏ పత్రికలూ ప్రచురించడానికి వీలులేదు. ఒకసారి ఆ కార్మికులు 'సంఘటిత నేర బృందం'గా గుర్తింపు పొందిన తరువాత (అంటే రెండవ కాంట్రాక్టర్‌ను బెదిరించి తరిమేసిన తరువాత) వారు ఇచ్చిన ప్రకటనను ప్రచురించడం వారి నేరాలకు సహకరించడమే అవుతుందని ఈ చట్టంలోని సెక్షన్ 2(i) (ఎ)(ii) అంటుంది. దానికి కూడ అయిదు సంవత్సరాల కనీస జైలుశిక్ష, లక్షరూపాయల కనీస జుర్మానా నిర్దేశించారు. దిక్కుమాలిన కార్మికుల కోసం – వారి గొంతు వినిపించడం కోసం – అంత శిక్ష భరించడానికి ఏ దినపత్రిక సిద్ధంగా ఉంటుంది?

*ప్రజాపంథా పక్షపత్రిక*

***1 జూన్ 2001***



# 'పోటో'ను ఇప్పుడే ఎందుకు జారీ చేశారు?

**త**మ దేశాలలో సంక్షోభాలనూ సంఘర్షణలనూ ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు 'సంయమనం పాటించమ'నీ 'ప్రజాస్వామికంగా పరిష్కరించుకొమ్మ'నీ 'మానవ హక్కులను గౌరవించమ'నీ పాశ్చాత్య ప్రభుత్వాల చేత నీతులు చెప్పించుకున్న మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలిప్పుడు చాలా సంతోషంగా ఉన్నాయి.

ప్రతీకారం అంతర్జాతీయ చట్టంలో సమర్థనీయమేనని అమెరికా రుజువు చేసిందని మన దేశ హోంమంత్రి అద్వానీ పదే పదే ప్రకటించడం వెనక ఉన్న భావం ఇదే. భారత పాకిస్తాన్‌లను కొట్లాడుకోవద్దనీ, యుద్ధం చేసుకోవద్దనీ అమెరికా ఇప్పటిదాకా హితవు చెపుతూ వచ్చింది. చర్చలు జరుపుకోమని చెప్పింది. ఇద్దరినీ బలవంతంగా ఆగ్రాలో కూర్చోపెట్టింది. కాశ్మీర్‌లో భారత సైన్యం చేస్తున్న మానవ హక్కుల అతిక్రమణ గురించి తన వార్షిక మానవహక్కుల నివేదికలలో ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చింది. భారత్‌ను అభిశంసించింది కూడ.

కాని తన దాకా వచ్చేసరికి అమెరికా ఇవన్నీ మరచిపోయింది. శాంతి, మానవ హక్కులు, చర్చలు మొదలయిన చాదస్తమంతా పక్కన పెట్టి అది నేరుగా ప్రతీకార దాడికి దిగటం అద్వానీ వంటి నాయకులకు చాలా ఆనందం కలిగిస్తున్నది. వాళ్ళు అమెరికా రెండు నాల్కల వైఖరిని అసహ్యించుకోవడం లేదు. తమకు ఎప్పటి నుండో సుపరిచితమైన 'సత్యాన్ని' అమెరికా ఇప్పటికయినా గ్రహించిందని చాలా సంతోషంగా

ఉన్నారు. స్వయంగా గుర్తించింది కాబట్టి ఇంక తమ బోటివారికి నీతులు చెప్పబోదని సంతృప్తిగా ఉన్నారు.

అందుకే సెప్టెంబర్ 11 తరువాత అద్వానీ 'కాశ్మీర్ సమస్య' గురించి చాలా దూకుడుగా మాట్లాడుతున్నాడు. అవసరమయితే పాకిస్తాన్ భూభాగంలోకి చొరబడి ఎదురుదాడులు చేస్తామనీ, అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో ఆ పనే చేస్తున్నది కాబట్టి ఆ ఆలోచనలో తప్పేమీ లేదని రుజువు అయిందనీ దబాయిస్తున్నాడు. రక్షణ మంత్రిగా రెండవసారి పదవి చేపట్టిన క్షణం నుండీ జార్జి ఫెర్నాండెజ్ కూడ ఇదే భాష మాట్లాడుతున్నాడు.

గతంలో పాశ్చాత్య దేశాలు మూడవ ప్రపంచ దేశాలను మానవ హక్కుల విషయంలో వారించడం, విమర్శించడం – వారి రాజకీయ ప్రయోజనం, ఉద్దేశ్యం ఏదైనా కానివ్వండి – వల్ల మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలపైన కొంత ఒత్తిడి ఉండింది. ఇప్పుడు 'నాకు అన్యాయం జరిగితే నేను ఏమైనా చేస్తాను' అని అమెరికా ప్రకటించడం (గతంలో ఆ దేశ ప్రభుత్వం అంతకంటే భిన్నంగా నడుచుకుందని కాదు), అన్ని పాశ్చాత్య దేశాలూ అమెరికాకు వంతపాడటం ఆ ఒత్తిడిని మొత్తంగానే తొలగించింది. అన్ని నీతులలాగా ప్రజాస్వామ్యం కూడ ఇతరులకు బోధించేదే తప్ప మనం ఆచరించేది కాదని ప్రజాస్వామ్యాన్ని పేటెంట్ చేసినట్టు ప్రకటించుకున్న రాజ్యాలే ఒప్పేసుకున్న తరువాత ఇంక ఇతరులకు దానిని గౌరవించాల్సిన అవసరం ఏముంటుంది?

దేశం లోపల పౌరహక్కుల విషయం కూడ అంతే. కొన్ని ప్రాథమికమైన హక్కులను 'నాన్ – నెగోషియబుల్' అని – అంటే ఎట్టి పరిస్థితిలోనూ తొలగించడానికి వీలులేనివని – మానవ హక్కుల భావన అంటుంది. ఆ ఆలోచనను ఆమోదించినట్టు ప్రకటించుకున్న పాశ్చాత్య రాజ్యాలిప్పుడు పునరాలోచనలో పడ్డాయి. అమెరికా భూభాగం మీద ఒక్క దాడి – అమెరికా చేసిన, చేయించిన దాడులతో పోలిస్తే చాలా చిన్న దాడి – జరిగేసరికి తమ దేశాలలో పౌరహక్కులను కుదించివేసే ఆలోచనలో అమెరికాతో సహా అన్ని పాశ్చాత్య దేశాలూ పడ్డాయి. భావ ప్రకటనా స్వేచ్ఛ నుండి దేశంలో ఎక్కడైనా సంచరించవచ్చుననే స్వేచ్ఛ దాకా అన్నిటిపైనా అమెరికా ప్రభుత్వం ఆంక్షలు పెట్టే ఆలోచన చేస్తున్నది. 'మనకు నీతులు చెప్పారు గానీ తీవ్రవాదం వాళ్ళ గుమ్మం

దగ్గరికొచ్చేసరికి అవన్నీ ఎంత సులభంగా మరచిపోయారు చూడండి' అని మన రాష్ట్ర డిజిపి దొరగారు సహితం అన్నారంటే, 'కఠినమైన చట్టాలు' అవసరం అని భావించే వారంతా ఎంతగా సంతోషిస్తున్నారో అర్థం అవుతుంది.

దేశానికి దసరా కానుకగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 'పోటో' (ప్రివెన్షన్ ఆఫ్ టెర్రరిస్టు ఆర్డినెన్స్) ఆర్డినెన్స్‌ను ఈ నేపథ్యంలో చూడాలి. 1995లో టాడా కాలధర్మం చెందిన నాటి  నుండి దాని స్థానంలో ఒక కొత్త టెర్రరిస్టు చట్టాన్ని రూపొందించే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తూనే ఉంది. ఒక బిల్లు తయారు చేసింది. దానిని లా కమిషన్‌కు చూపించి లా కమిషన్ సూచించిన సవరణలతో తిరగరాసింది. అయినప్పటికీ సంకీర్ణ ప్రభుత్వంలోని అన్ని పార్టీలూ ఒప్పుకుంటాయో ఒప్పుకోవో అన్న సందేహంతో కాబోలు దానిని పార్లమెంటులో పెట్టలేదు.

సెప్టెంబర్ 11 తరువాత అంతర్జాతీయంగా నెలకొన్న అప్రజాస్వామిక వాతావరణంలో, ఇంక తటపటాయింపు అక్కరలేదని కేంద్ర ప్రభుత్వం భావించినట్టుంది. అదను చూసుకొని తన చేతిలో ఉన్న నిర్బంధ అధికారాన్ని వీలయినంతగా పెంచుకోవాలన్న ఆరాటం తప్ప ఈ ఆర్డినెన్సు జారీకి వేరే కారణమేదీ లేదు. ఇప్పుడు 'టెర్రరిస్టు ప్రమాదం' అకస్మాత్తుగా ఏం పెరగలేదు. నాగా ఉద్యమకారులతో భారత ప్రభుత్వం కాల్పుల విరమణ ఒప్పందం చేసుకునింది. ఇరుపక్షాలూ దానిని గౌరవిస్తున్నాయి. కాశ్మీర్‌లోని పాకిస్తానీ, ఆఫ్ఘన్ మిలిటెంట్లు కొన్నాళ్ళపాటు అమెరికా దాడులు ఎదుర్కొనడంలో తాలిబన్లకు సహాయపడడానికి ఆఫ్ఘనిస్తాన్ పోవడానికి సిద్ధమవుతున్నారని వినికిడి. దేశంలోని వేరే ఏ మిలిటెంట్ పోరాటమూ ఈ మధ్య కాలంలో బలం పుంజుకున్న దాఖలాలు లేవు. కాబట్టి అకస్మాత్తుగా 'పోటో'ను జారీచేయవలసిన అగత్యం భారత ప్రభుత్వాకేం లేదు. ఈ అవకాశం జారవిడుచుకుంటే మళ్ళీ రాదన్న ఆరాటం తప్ప.

ఈ ఆర్డినెన్స్ కూడ టాడా వంటిదే కాబట్టి దీని స్వరూప స్వభావాల గురించి కొత్తగా చర్చించవలసిందేమీ లేదు. ఎటొచ్చీ, గతంలో కంటే మరింత విచ్చలవిడిగా దీనిని ప్రయోగించే ప్రమాదం మాత్రం ఉంది. ఇప్పుడు ప్రపంచదేశాల ప్రభుత్వాలన్నీ 'టెర్రరిజం మీద తుది పోరు'కు సమాయత్తమయ్యాయి. ఇది అన్నిటినీ మించిన

ప్రాముఖ్యం గల లక్ష్యమయింది. ఈ పేరు మీద ఇప్పుడు ఏ దేశమైనా ఏమైనా చేయగలదు. అమెరికా ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం చేస్తున్నదో చూస్తున్నాం. బిన్ లాడెన్ కోసం వేటాడుతున్నామన్న నటన సహితం అమెరికన్లు విడిచిపెట్టారు. ఆఫ్ఘనిస్తాన్‌ను మెత్తగా చితగ్గొట్టి తమకు అనుకూలమయిన ప్రభుత్వాన్ని అక్కడ పీఠం ఎక్కించాలన్నది అమెరికా లక్ష్యం.

అట్లాగే భారత పాలకులకు కూడ తమ స్వంత లక్ష్యాలు చాలా ఉన్నాయి. రాజ్యం చేతిలోకి మరిన్ని అధికారాలను చేర్చడం, తమ పాలనావసరాల కోసం వాటిని విచ్చలవిడిగా ప్రయోగించడం, ముస్లిలను మళ్ళీ నోరు తెరవకుండా నొక్కేయడం అనే మూడు లక్ష్యాలను సులభంగానే గుర్తించవచ్చు. 'పోటో' ఈ మూడు లక్ష్యాలకూ పనికొచ్చే సాధనం.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే 'టెర్రరిజంపై తుది పోరు' అన్న పేరుగల బహుళజాతి రాజకీయంలో మొట్టమొదటిసారిగా రాజ్యాలు బాధితులు. ప్రపంచంలోని అన్ని రాజ్యాలూ ఒక్కటై ప్రైవేటు సాయుధ బృందాల నుండి మానవ నాగరికతను కాపాడడానికి కంకణం కట్టుకున్న పోరాటమిది. ఇక్కడ టెర్రరిజం అంటే ఏమిటి, నాగరికత అంటే ఏమిటి, మంచి ఏమిటి, చెడు ఏమిటి అనే ప్రశ్నలకు రాజ్యాలే జవాబు చెప్తాయి. తామే ప్రపంచ మానవాళి లక్ష్యాన్ని నిర్దేశించి, తామే అందులోని అన్ని మాటలనూ నిర్వచించి, తామే తమ ఆయుధశక్తితో ఆ లక్ష్యాన్ని చేరుకునే యుద్ధాన్ని ప్రపంచ రాజ్యాలన్నీ చేపట్టాయి.

రాజ్యాధికారానికి ఇంతకంటే అనుకూలమైన వాతావరణం దొరకదన్న సంగతి ఎవరికి తెలియకున్నా అద్వానీ వంటి వారికి బాగా తెలుసును. అందుకే 'పోటో' ఇప్పుడు పుట్టింది.

ఇప్పుడది ఆర్డినెన్స్‌గా ఉనికిలోకి వచ్చింది. రేపు పార్లమెంటు ఏ రోజు సమావేశమయితే ఆ రోజు అది చట్టం రూపం తీసుకుంటుంది. మామూలు సందర్భాలలో వ్యతిరేకించే వారు సహితం ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితిలో వ్యతిరేకించరు, వ్యతిరేకించినా అది మొక్కుబడిగానే ఉండిపోతుంది.

మన రాష్ట్రానికి వచ్చేసరికి సరిగ్గా ఇదే సమయంలో సంఘటిత నేరాల నియంత్రణ చట్టం కూడ రాష్ట్రపతి అనుమతి పొందింది. చంద్రబాబు ప్రభుత్వం రెండు చేతులలో రెండు ఆయుధాలలాగ ఈ రెండు చట్టాలను పట్టుకొని ప్రజల మీద విరుచుకుపడగలదు.


ఒక విషయాన్ని ఎన్నిసార్లు చెప్పినా తక్కువే. టెర్రరిజం, సంఘటిత నేరాలు మొదలయిన మాటలు మన కళ్ళముందు ఒక జుగుప్సాకరమైన చిత్రాన్ని ఉంచుతాయి. అది అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్న దృశ్యం. నిరాయుధులు, నిస్సహాయులు అయిన వారి ప్రాణాలు తీసే హింస చాలా అభ్యంతరకరమైనది. టెర్రరిజం వంటి మాటలు ఆ రకమైన దృశ్యాన్ని మన కళ్ళముందు నిలబెడతాయి కాబట్టి ఆ దృశ్యాన్ని చూపించి ప్రభుత్వం ఏ చట్టం చేసినా మనం ఆమోదించే ప్రమాదం ఉంది. కాని ప్రభుత్వం చేసిన చట్టాలలో టెర్రరిజం, సంఘటిత నేరం అనే పదాలకు ఇచ్చిన నిర్వచనం ఆ దృశ్యం దగ్గర ఆగిపోదు. అది చాలా 'విశాల'మైన నిర్వచనం. అనేక రకాల సంఘటిత కార్యాచరణ ఆ నిర్వచనంలోకి వస్తుంది. ఇదొక పెద్ద ప్రమాదం.

అంతేకాక, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైన నేర విచారణ పద్ధతి ఈ చట్టాలలో ఉంది. కేవలం కొన్ని అభిప్రాయాలు కలిగి ఉన్నందుకు, కొన్ని ఉద్యమాలను సమర్థించినందుకు నేరస్తులుగా 'రుజువయి'పోయే ప్రమాదం ఉంది. ముస్లింలు కేవలం తమ అస్తిత్వాన్ని నిర్వచించుకోవడానికీ, కాపాడుకోవడానికీ చేసే ఏ ప్రయత్నమైనా ఈ చట్టాల పరిధిలోకి రాగలదు. సహజంగా రాకపోయినా పోలీసులు రప్పించగలరు.

వీటిని తిప్పికొట్టగల సంఘటిత శక్తి ఇప్పుడు ఏ ఉద్యమానికీ ఏ సామాజిక వర్గానికీ లేదు. అయితే 10 సంవత్సరాలు ప్రజలకు నరకం చూపించిన టాడా చివరికి బలమైన ప్రజాభిప్రాయం కారణంగానే రద్దయిందని జ్ఞాపకం చేసుకుంటే నిరాశకూ, నిస్పృహకూ లోను కానక్కరలేదని గ్రహించగలుగుతాం.

*ప్రజాపంథా పక్షపత్రిక*

***27 అక్టోబర్ 2001***



# ప్రశ్నించే హక్కును కాపాడుకుందాం

ప్రశ్నించే హక్కుకు చీకట్లు కమ్ముకుంటున్నాయంటే అతిశయోక్తిగా అనిపించవచ్చును గానీ అది అక్షరాలా సత్యం.

మీరు ఈ కరపత్రం ప్రచురించగలిగారు కదా అంటారేమో ఇంక ఎన్నాళ్ళు ప్రచురించగలుగుతామన్నది ప్రశ్న.

'పోటో'ను చట్టం కానివ్వమని వామపక్ష పార్టీలే కాకుండ కాంగ్రెస్ పార్టీ కూడ అంటున్నది. ఆ మాట మీద వారు నిలబడితే ప్రస్తుతానికి గండం పక్కకు పోవచ్చును గానీ పార్లమెంటు ఉభయ సభలలో మెజారిటీ లభించిన పార్టీ ఏ రోజు తలపెడితే ఆ రోజు 'పోటో' 'పోటా' కాగలదు. ఆర్డినెన్స్ చట్టం కాగలదు. ఆ ఘడియ ఎంతో దూరం లేకపోవచ్చును.

టెర్రరిజం మీద ఉక్కుపాదం మోపడానికని చట్టం చేస్తే మీరు ప్రశ్నించే హక్కు పోతున్నదంటారెందుకు?, ప్రశ్నించడమంటే తుపాకులతోననా మీ భావం? అని అడుగుతారేమో.

కాదు ప్రశ్నించడమంటే తుపాకులతోనని మా అభిప్రాయం కాదు. అయితే ప్రభుత్వం ఒక చట్టాన్ని ఎందుకోసం తీసుకొస్తున్నానని చెప్తుందో విని, అదే సత్యమనుకుంటే పెద్ద పొరపాటు.

చట్టంలో ఏమేమి రాశారో చూడాలి. దానిని ఎవరెవరి మీద ప్రయోగించగలరో చూడాలి. దానిని దుర్వినియోగం చేస్తే ఇంకెంతమంది మీద ప్రయోగించగలరో చూడాలి. దానిని అమలుపరిచే యంత్రాంగం

నైజమేమిటో చూడాలి. ఇవన్నీ చూస్తే తప్పు విషయం అర్థం కాదు. ఇవన్నీ చూసిన తరువాతే ప్రశ్నించే హక్కుకు చీకట్లు కమ్ముకుంటున్నాయంటున్నాము.

'టెర్రరిస్టులు' అని ఎవరినైతే ఈ పోటో చట్టం నిర్వచిస్తుందో, వారిని ఇంటర్వ్యూ చేసే పత్రికా విలేఖరులు వారెక్కడ వున్నదీ వెంటనే పోలీసులకు చెప్పాలి. లేకపోతే ఒక సంవత్సరం జైలుకు పోవాలి.

అంటే 'టెర్రరిస్టులు' అన్న ముద్ర ప్రభుత్వం న్యాయంగా వేస్తున్నదా అన్యాయంగా వేస్తున్నదా, దానికి ఆ 'టెర్రరిస్టులు' చెప్పే జవాబేమిటి, అందులో సత్యమెంత – ఇత్యాది విషయాలు పత్రికల ద్వారా తెలుసుకునే హక్కు, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించే హక్కు ప్రజలకు లేదు.

ఒక సంస్థను ప్రభుత్వం నిషేధించినట్టయితే ఆ సంస్థ లక్ష్యాలకు ఏ రూపంలోనైనా సహాయం చేయడం, సహకరించడం జీవిత ఖైదు వేయగల నేరం. ఉదాహరణకు అస్సాంకు చెందిన ఉల్ఫా ఒక నిషిద్ధ సంస్థ. భారతదేశంలో అంతర్భాగంగా వున్నంత కాలం అస్సామీలకు న్యాయం జరగదని ఉల్ఫా నమ్ముతుంది. కాబట్టి ఇప్పుడెవరైనా భారత ప్రభుత్వ పాలన వల్ల అస్సాంకు అన్యాయం జరిగిందని మాట్లాడితే అది 'ఉల్ఫా' లక్ష్యాలకు సహకరించినట్లు అవుతుంది. కాబట్టి ఆ అభిప్రాయం వ్యక్తం చేయడం జీవిత ఖైదు విధించగల నేరం అవుతుంది.

టెర్రరిస్టు సంస్థ అని ప్రభుత్వం ప్రకటించిన జాబితాలోని సంస్థల కార్యక్రమాలు కొనసాగించడానికి తోడ్పడే సమావేశం ఏర్పాటు చేసేందుకు ఎవరైనా సహకరించినట్టయితే వారిని 14 సంవత్సరాల దాకా ఖైదు చేయవచ్చు. ఇక్కడ సమావేశం అంటే బహిరంగ సభే కానక్కరలేదు. ఇద్దరి కంటే ఎక్కువ పాల్గొనే ఏ సమావేశమైనా దీని కిందికి వస్తుంది. ఇది టెర్రరిస్టు సంస్థ సభ్యులు మాత్రమే పాల్గొనే అంతర్గత సమావేశం కానక్కరలేదు. ఆ సంస్థ సభ్యులు, లేక సభ్యునిగా చెప్పుకునే వ్యక్తి తన అభిప్రాయాలు చెప్పుకోవడానికి అవకాశం కల్పించడం కోసం ఇద్దరి కంటే ఎక్కువ మందితో మీటింగ్ ఎవరైనా ఏర్పాటుచేస్తే వారికి కూడ శిక్ష వర్తిస్తుంది.

ఉదాహరణకు రేపు మన రాష్ట్రంలోని నక్సలైట్ సంస్థలను ఈ జాబితాలో చేర్చారనుకోండి. (చేర్చలేదని తెలుగు ప్రభువులు కినుక వహించి ఉన్నారు.) అప్పుడు

వారి భావాలు కరెక్టేనని చెప్పే కవి చేత గానీ, కళాకారుడి చేత గానీ 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం ఏర్పాటుచేసినా, పదిమందిని పిలిచి చర్చావేదిక నిర్వహించినా అది 14 సంవత్సరాల జైలు శిక్షకు అర్హమైన నేరం.

కాశ్మీర్‌లో తిరుగుబాటుదారులు ఏం కోరుకుంటున్నారో దేశంలోని ఇతర ప్రాంతవాసులకు చెప్పడం కోసం హురియత్ కాన్ఫరెన్స్ ప్రతినిధులు ఆ మధ్య దేశమంతా పర్యటించారు. వారి అభిప్రాయాలు స్థానిక ప్రజలు వినగలందుకు హక్కుల సంఘాలు దేశవ్యాప్తంగా సమావేశాలు నిర్వహించాయి. అప్పటికి ఈ చట్టం లేదు గానీ వుంటే ఈ హక్కుల సంఘాలన్నీ 14 సంవత్సరాల జైలుశిక్ష వేయగల నేరం చేసినట్టు అయి వుండేది. గద్దర్‌ను ఇంటర్వ్యూ చేసిన 'శుభోదయం' (తేజ టివి) వారికి కూడ ఇది వర్తిస్తుంది.

తమ లక్ష్యాల సాధన కోసం ప్రజాస్వామ్యాన్ని భయోత్పాతానికి గురిచేసే హింసకు పాల్పడడాన్ని టెర్రరిజం అనదలచుకున్నట్టయితే ఆ టెర్రరిజాన్ని ఎవ్వరూ హర్షించరు. దానిని అరికట్టవలసిందేనని అందరూ ఒప్పుకుంటారు. అయితే 'పోటో' వంటి చట్టాలలో టెర్రరిజం నిర్వచనం అక్కడితో ఆగిపోలేదన్న సంగతి అటుంచినా, మనం హేయమైనదిగా భావించే విచ్చలవిడి హింసాకాండకు కూడ దాని వెనుక కొన్ని సామాజిక వాస్తవాలున్నాయి, ఏదో ఒక ప్రజావర్గంలోని అసంతృప్తి, నిరసన వున్నాయి. విచ్చలవిడి హింసాకాండను మాన్పించడం ఎంత ముఖ్యమో ఈ నిరసననూ, అసంతృప్తినీ చర్చించడం, దాని గొంతు వినడం, న్యాయబద్ధంగా స్పందించడం కూడ అంతే ముఖ్యం. బహుశా అంతకంటే ముఖ్యం. దీని గొంతు నొక్కేస్తే ఇదొక కాన్సర్ వంటి పుండై సమాజం మూల్లులను పీల్చేస్తుంది. ఏ సామాజిక వర్గంలో ఆ అసంతృప్తి, నిరసన వున్నాయో ఆ వర్గం విపరీతమైన హింసకూ పరాయీకరణకూ గురవుతుంది.

కాగా, పోటో వంటి చట్టాలు దుర్వినియోగానికి కూడ చాలా అవకాశం ఇస్తాయి. ఏదో ఒక మీటింగ్‌లో ఎవరైనా దేశంలోని ముస్లిం యువతలో సకారణమైన అసంతృప్తి, అసహనం వున్నాయని మాట్లాడితే అతను 'సిమి' భావజాలాన్ని ప్రచారం చేస్తున్నాడని ఆ మీటింగ్ నిర్వాహకులను మొత్తంగా పద్నాలుగేళ్ళు జైలుకు పంపించవచ్చు. టెర్రరిజం అని పిలవబడే దానికి సామాజిక మూలాలు వున్నాయి అనే భావం వచ్చేటట్టు ఎవరు మాట్లాడినా దానిని ఈ రకంగా వక్రీకరించి గొంతు నొక్కేయొచ్చు. 'టెర్రరిజం' అనే


దాన్ని ఎదుర్కొనడానికి ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్ల వంటి చట్ట విరుద్ధ సాధనాలను ఉపయోగించడం అన్యాయం అన్నా అంతే.

'పోటో' ఇంకా రాకుండానే దేశవ్యాప్తంగా ముస్లింలపైన, తెలంగాణ వంటి ప్రాంతాలలో పేద ప్రజలపైన నిర్బంధం తీవ్రస్థాయిలో అమలవుతున్నది. తెలంగాణకు అన్యాయం జరిగిందని నవంబర్ 1న వరంగల్‌లో నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు 'మీరంతా నక్సలైట్లు' అని నిందించడం, అది అన్యాయం అని అభ్యంతరం చెప్పిన మానవహక్కుల వేదిక బాధ్యుడు డా॥ బుర్ర రాములుపై హన్మకొండ సి.ఐ చేయి చేసుకొనడం, అరెస్టుచేసి ఆనాటి ప్రజాస్వామిక కార్యక్రమానికి అడ్డు తగిలింది కాక డా॥ రాములే పోలీసుల విధి నిర్వహణకు అడ్డు తగిలాడని అతనిపైన కేసు పెట్టడం వరంగల్ ప్రజలకు తెలిసిన సంగతే.

చట్టాన్నీ, ప్రజల హక్కులనూ గౌరవించే పోలీసు వ్యవస్థ వున్న చోట కూడ 'పోటో' వంటి చట్టాలను వ్యతిరేకించవలసిందే. కానీ హక్కులంటే ఏ మాత్రం గౌరవం లేని పోలీసు సంస్కృతి రాజ్యంచేసే చోట పోటో వంటి చట్టాలను ఉనికిలోకి రానిస్తే పాలక పార్టీకి, వారి పోలీసులకు తప్ప వేరే ఎవ్వరికీ మాట్లాడే హక్కు మిగలదు.

ప్రస్తుతానికి ప్రతిపక్ష పార్టీల వ్యతిరేకత కారణంగా 'పోటో' చట్టం కాలేకపోవచ్చు. కానీ ఈ పరిస్థితి ఎప్పటికీ వుండబోయేది కాదు కాబట్టి ఈ ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయొద్దు, నిరసిద్దాం రండి.

***మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది***
***17 నవంబరు 2001***



# అభిప్రాయ స్వేచ్ఛపైన దాడి 'పోటో'

అన్ని నేరచట్టాల లాగా పోటోలో కూడ రెండు అంశాలున్నాయి. ఒకటి నేరాల నిర్వచనం, వాటికి విధించగల శిక్షలు. రెండు, నేర విచారణ పద్ధతి. రెండవ దానిలో అంటే నేరాన్ని విచారించే పద్ధతిలో పోటోకు, టాడాకు పెద్దగా తేడా లేదు. అందువల్ల దానిని చివరిలో క్లుప్తంగా చర్చించుకోవచ్చు.

ఈ చట్టం చేసే నేరాల నిర్వచనాన్ని అంటే మనుషులు చేసే ఏ పనులను ఇది నేరాలుగా భావిస్తుందన్న విషయాన్ని ముందుగా చర్చించుకుందాం. మనుషులు చేసే ఏ పనీ స్వతహాగా నేరం కాదు. అత్యధిక భాగం సమాజాలు నేరాలుగా భావించేవి కొన్ని ఉన్నాయి గానీ అన్ని సమాజాలూ, అన్ని సందర్భాలలోనూ నేరంగా భావించే చర్య ఏదీ లేదు – హత్యతో సహా. కాబట్టి ఒక చట్టం దేనిని నేరంగా నిర్వచిస్తుందనేది ఆ చట్టాన్ని చేసిన వారిని గురించి, అప్పటి సామాజిక పరిస్థితుల గురించి చాలా చెప్తుంది.

బాంబులు, డైనమైట్లు తదితర పేలుడు పదార్థాలు లేక తుపాకులు లేక రసాయన పదార్థాలు, విషవాయువులు, జీవ పదార్థాలు లేక ఏ యితర సాధనాలనయినా ప్రయోగించి కొన్ని చర్యలకు పాల్పడినట్టయితే అది ఈ చట్టం ప్రకారం టెర్రరిస్టు చర్య అవుతుంది.

ఆ చర్యలేమిటంటే దేశ సార్వభౌమత్వానికీ లేక సమగ్రతకూ భంగం కలిగించే లక్ష్యంతో గానీ, ప్రజలనూ లేక ప్రజలలో ఒక వర్గాన్నీ భయానికి గురిచేసే లక్ష్యంతో గానీ ప్రాణాలు తీయడం, గాయపరచడం, ఆస్తిని

ధ్వంసం చేయడం, సమాజ జీవితానికి అవసరమైన సేవలనూ లేక సరఫరాలను ఆటంకపరచడం, దేశరక్షణకు సంబంధించిన సాధనాలను ధ్వంసం చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకూ వారి సంస్థలకూ సంబంధించిన వస్తువులను నష్టపరచడం, లేదా ఎవరినైనా నిర్బంధించి ప్రభుత్వం ఫలానా పనిచేస్తేనో, చేయకుంటేనో వారికి హాని కలిగిస్తామని బెదిరించడం.

చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం కింద నిషేధించబడిన సంస్థ కార్యకలాపాలకు సహకరించే క్రమంలో పైన పేర్కొన్న చర్యలకు, పైన పేర్కొన్న ఆయుధాలతో పాల్పడినా కూడ అది టెర్రరిస్టు చర్య అవుతుంది.

నిర్వచనం అక్కడితో ఆగిపోలేదు. టెర్రరిస్టు చర్యల కోసం నిధులు సేకరించడం కూడ టెర్రరిస్టు చర్యే.

నిర్వచనం ప్రకారమే టెర్రరిస్టు చర్య అనేదానిలో రాజకీయ లేక సామాజిక పోరాట లక్ష్యం, హింస కలిసి ఉన్నాయి. ఈ ప్రాథమిక లక్షణాన్ని గుర్తుంచుకుంటేనే ఈ చట్టం ఎంత అన్యాయమైనదో అర్థం అవుతుంది. ఆ రాజకీయ లేక సామాజిక లక్ష్యాలంటే మీకు ఇష్టం లేకపోవచ్చు. కానీ వాటిని ఇష్టపడే వాళ్ళు ఉంటారు. ఏ లక్ష్యంతోనైనా సరే, హింసకు పాల్పడడం నేరమేనంటే అర్థం ఉంది కానీ ఆ లక్ష్యాల కోసం నిధులు సేకరించే వారిని హింసాత్మక చర్యల కోసం నిధులు సేకరిస్తున్నారనే నిందమోపి జీవిత కాలం జైలులో వేయగల చట్టాన్ని చేయడం రాజకీయ స్వేచ్ఛపైన దాడి కాదా?

నిధులు సేకరించడం టెర్రరిస్టు చర్య అయితే ఇతరత్రా టెర్రరిస్టు చర్యలకు పాల్పడడం – అంటే వాటిని ప్రోత్సహించినా, ప్రచారం చేసినా, రెచ్చగొట్టినా, సహకరించినా కూడ అది 'టెర్రరిస్టు చర్యకు పాల్పడడానికి ప్రయత్నం చేయడం' అనే నేరంతో సమానం. దీనికి అయిదేళ్ళ నుండి జీవిత ఖైదుదాకా శిక్షవేయవచ్చు.

ప్రోత్సహించడం, ప్రచారం చేయడం అంటే దేనిని? హింసనయితే అది నేరమే. కానీ హింస, రాజకీయ భావాలు కలగలసిన 'టెర్రరిజం' అనే దానిని 'ప్రోత్సహించడం, ప్రచారం చేయడం' నేరం అంటే అది భావప్రకటనా స్వేచ్ఛపైన దాడి కాగలదు. 'దేశ సమగ్రతకు, సమైక్యతకు' భంగకరమైన హింసాత్మక కార్యకలాపాలకు కాశ్మీర్‌లో హిజ్బుల్ ముజాహిదీన్ పాల్పడుతుంటుంది. అదే కాశ్మీర్‌లో ఒక రచయిత, ఒక

సామాజిక పరిశీలకుడు కాశ్మీర్ నుండి వేరుపడడం న్యాయమేనంటాడు. అది హిజ్బుల్ ముజాహిదీన్ చేసే 'టెర్రరిస్టు' చర్యలను ప్రోత్సహించడమేనని ఈ చట్టం అంటుంది. కనీసం అయిదేళ్ళు జైలులో వేస్తుంది.

ఒక టెర్రరిస్టు చర్యకు పాల్పడిన వ్యక్తికి తెలిసీ ఆశ్రయం ఇవ్వడం, కాపాడడం, దాచిపెట్టడం చేస్తే మూడేళ్ళ నుండి జీవిత ఖైదుదాకా శిక్షవేయొచ్చు. 'టెర్రరిస్టులు' అని ఈ చట్టం ఇచ్చిన నిర్వచనంలోకి వచ్చేవాళ్ళు ఏదో ఒక రకమైన రాజకీయ కార్యకర్తలు అని గుర్తుంచుకుంటే (ఆ రాజకీయమంటే మీకు ఇష్టమా లేదా అన్నది అప్రస్తుతమని మరొకసారి నొక్కి చెప్పాలి) వారిని తమ విముక్తికారులుగా, నాయకులుగా భావించే ప్రజలు ఉంటారు. ఆ ప్రజలలో ఎవరైనా తమ నాయకులుగా తాము భావించే ఈ 'టెర్రరిస్టు'లకు ఇంట్లో ఆశ్రయం ఇయ్యవచ్చు.

అందుకు వారిని శిక్షించడం న్యాయమా? శిక్ష తప్పించుకోవాలంటే తమ నాయకులుగా భావించేవారిని తరిమేసి పోలీసులకు పట్టియ్యాలనడం న్యాయమా?

'టెర్రరిస్టు సంస్థ'లో సభ్యులయిన వారికి జీవిత ఖైదు విధించవచ్చునని కూడ ఈ చట్టం అంటుంది. టెర్రరిస్టు సంస్థ అనేదానికి స్పష్టమైన నిర్వచనం లేదు. టెర్రరిస్టు చర్యలకు పాల్పడే సంస్థ, లేక టెర్రరిస్టు చర్యలతో సంబంధం ఉన్న సంస్థ అన్నారు. పాల్పడడం అంటే సరేననుకుందాము గానీ 'సంబంధం' ఉండడం అంటే ఏమిటి? ఇంత అస్పష్టమైన నిర్వచనంతో జీవిత ఖైదును శిక్షగా పెట్టడం సబబేనా? టెర్రరిజం అనే భావనలోనే రాజకీయ, సామాజిక విశ్వాసాలూ హింసాత్మక చర్యలూ విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయని గుర్తించినట్టయితే ఈ అస్పష్టత విశ్వాసాల మీద దాడికి దారితీయదా?

టెర్రరిస్టు చర్యను నిరోధించడానికి గానీ, టెర్రరిస్టును పట్టుకోవడానికి గానీ ఉపయోగపడే సమాచారం తెలిసిన వ్యక్తులు దానిని వీలయినంత త్వరగా పోలీసులకు తెలియజేయని పక్షంలో వారికి ఒక సంవత్సరం జైలు శిక్ష వేయవచ్చునని ఈ చట్టం అంటుంది. దీనికి ఒక మినహాయింపు ఇచ్చారు. అదేమిటంటే టెర్రరిస్టు కేసులో ముద్దాయి అయిన వ్యక్తికి న్యాయవాదిగా వ్యవహరిస్తున్న వ్యక్తి తన క్లయింటు ఆచూకీ గానీ, ఇతర విషయాలు గానీ పోలీసులకు చెప్పనక్కరలేదు అని.

**పోటో కింద నిషేధిత సంస్థలు**

1. బబ్బార్‌ఖల్సా ఇంటర్నేషనల్
2. ఖలిస్తాన్ కమెండో ఫోర్స్
3. ఖలిస్తాన్ జిందాబాద్ ఫోర్స్
4. ఇంటర్నేషనల్ సిఖ్ యూత్ ఫెడరేషన్
5. లష్కర్ – ఎ – తోయిబా / వస్బాస్ – ఎ – అహ్లెహదీస్
6. జైష్ – ఎ – మొహమ్మద్ / తహరిక్ – ఎ – పురాఖన్
7. హర్కత్ – ఉల్ – ముజాహిదీన్ / హర్కార్ – ఉల్ – అన్సార్ / కర్కత్ – ఉల్ – జిహాద్ – ఎ – ఇస్లామి
8. హిజ్బ్ – ఉల్ – ముజాహిదీన్ / హిజ్బ్ – ఉల్ – ముజాహిదీన్ పీర్ పంజాల్ రెజిమెంట్.
9. అల్ – ఉమర్ – ముజాహిదీన్
10. జమ్ము అండ్ కాశ్మీర్ ఇస్లామిక్ ఫ్రంట్
11. యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఉల్ఫా)
12. నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్ ఆఫ్ బోడోలాండ్
13. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పిఎల్‌పి)
14. యునైటెడ్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (యుఎన్ఎల్ఎఫ్)
15. పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాంగ్లెయిపాక్ (ప్రిపాక్)
16. కాంగ్లెయిపాక్ కమ్యూనిస్టు పార్టీ (కెసిపి)
17. కాంగ్లెయి యావల్ కన్నలుప్ (కెవైకెఎల్)
18. మణిపూర్ పీపుల్స్ లిబరేషన్ ఫ్రంట్ (ఎంపిఎల్ఎఫ్)
19. ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్
20. నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర
21. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం (ఎల్‌టిటిఇ)
22. స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)
23. దీన్‌దార్ అంజుమన్

ఒక మినహాయింపునే ప్రత్యేకంగా పేర్కొన్నారంటే అర్థం వేరే మినహాయింపులు లేవని. జర్నలిస్టులు 'టెర్రరిస్టులను' కలిసి ఇంటర్వ్యూ చేసినట్టయితే వారి ఆచూకీ

పోలీసులకు తెలియజేయాలి. అంటే జర్నలిస్టులు వారిని ఇంటర్వ్యూ చేయరాదని అర్థం. 'పౌరస్పందన వేదిక' వంటి సంస్థలు వారిని కలిసి మాట్లాడడం, వారికీ ప్రభుత్వానికీ మధ్య చర్చల కోసం ప్రయత్నించడం కూడ ఇకపై సాధ్యం కాదు. వారు కూడ ఇన్‌ఫార్మర్లుగా మారవలసి ఉంటుంది.

'టెర్రరిజం' అనేదానికి సామాజిక పరిష్కారం వెతకాలని ప్రజాస్వామికవాదులు అందరూ వాదిస్తుండగా 'టెర్రరిజం'కు పాల్పడే వారిని సమాజం నుండి మొత్తంగా వెలివేయాలని ఈ చట్టం చూస్తుంది. వారి గొంతు ఎవరూ వినకూడదు. వారితో ఎవరూ మాట్లాడకూడదు. వారిని వట్టి తుపాకీ తూటాలుగా చూడాలి. తుపాకీ తూటాలతోనే ఎదుర్కొనాలి. వారి లక్ష్యాలు సాహిత్యంలోగానీ, సామాజిక పరిశోధనలో గానీ వ్యక్తం కాకూడదు. వ్యక్తమయినట్టయితే అది 'టెర్రరిజం'కు సహకరించడం అని చెప్పి అణచివేయాలి. ఇదీ ఈ చట్టానికి ఉండే దృష్టికోణం. ఇది అన్ని రకాలుగానూ నష్టకరం అని వేరే చెప్పనవసరం లేదు.

ఒకచోట టెర్రరిస్టు సంస్థ అనే దానికి అస్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఈ చట్టం, మూడవ అధ్యాయానికి 'టెర్రరిస్టు సంస్థలు' అన్న పేరుపెట్టి అక్కడ వేరే నిర్వచనం ఇచ్చింది. ఈ 'నిర్వచనం' ఏమిటంటే – దేనినయితే కేంద్ర ప్రభుత్వం 'టెర్రరిస్టు చర్యలలో పాల్గొంటున్నదని భావించి, టెర్రరిస్టు సంస్థ అని ప్రకటిస్తుందో' అది టెర్రరిస్టు సంస్థ. బాగుంది కదూ?

ఈ రకంగా నిర్వచించిన టెర్రరిస్టు సంస్థలో ఎవరైనా సభ్యులుగా ఉన్నా లేక ఉన్నట్టు చెప్పుకున్నా ఆ వ్యక్తికి 10 సంవత్సరాల జైలుశిక్ష.

టెర్రరిస్టు సంస్థకు మద్దతు ఇమ్మని కోరడం, టెర్రరిస్టు సంస్థకు మద్దతుగా గానీ దాని కార్యకలాపాల నిర్వహణ కోసం గానీ ఒక సమావేశం ఏర్పాటు చేయడం 10 సంవత్సరాల జైలు శిక్ష వేయగల నేరాలు. టెర్రరిస్టు సంస్థకు చెందిన వ్యక్తి చేత, లేక చెందినట్టు చెప్పుకునే వ్యక్తి చేత మాట్లాడించడానికి ఒక సమావేశం ఏర్పాటు చేసినా కూడ అంతే. ఇక్కడ సమావేశం అంటే బహిరంగసభ అనుకునేరు. ముగ్గురు గానీ అంతకంటే ఎక్కువమంది గానీ ఒక రూంలో కూర్చొని ముచ్చటించుకునే సమావేశానికి కూడ ఈ సెక్షన్ వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక టెర్రరిస్టు పత్రికా విలేఖరులతో గానీ సామాజిక పరిశోధకులతో గానీ మాట్లాడడానికి మీరు సమావేశం

ఏర్పాటు చేశారనుకోండి – మీకు 10 సంవత్సరాల జైలుశిక్ష పడగలదు. వాళ్ళు ఏం చెప్తున్నారో విందామన్న ప్రజాస్వామిక ఆరాటాన్ని ఈ చట్టం నేరం అంటుంది.

'టెర్రరిజం' అనే దానిని సామాజిక సమస్యగానూ, 'టెర్రరిస్టులు' అనే వాళ్ళను మనుషులుగానూ చూడడానికి నిరాకరించే ప్రభుత్వం తన తప్పుడు వైఖరిని సవరించుకోకపోగా, వేరే ఎవ్వరూ కూడ వారిని మనుషులుగా చూడకుండా కట్టుదిట్టం చేయడానికి ఈ చట్టం చేసింది. వాళ్ళను చూస్తేనే మందులేని అంటురోగాన్ని చూసినట్టు అందరూ భయపడి దూరం పరుగెత్తిపోవాలి. వాళ్ళ ఆయుధాల వెనకవున్న సామాజిక సమస్యలూ, సంక్షోభాలూ ఎవరికీ కనిపించవు, వినిపించవు. వారి గురించి ప్రభుత్వం గొంతు తప్ప వారి గొంతు ఎవరూ వినడానికి వీల్లేదు. వారిని జంతువులను చంపినట్టు ప్రభుత్వం వేటాడి చంపుతుంటే అందరూ చూస్తూ ఊరుకోవాలి.

టెర్రరిస్టు చర్యలనూ, వాటికి అనుబంధమైన పై నేరాలనూ ఈ విధంగా నిర్వచించిన చట్టం వాటి విచారణకు 'టాడా' నమూనా నేరవిచారణ పద్ధతిని నిర్దేశిస్తోంది. ఇవి సుపరిచితమైనవే కాబట్టి ఎక్కువ వివరాలలోకి పోనక్కరలేదు.

రిమాండు రెండు వారాలు కాక నెలరోజులు ఇయ్యవచ్చు. చార్జిషీటు పెట్టక పోయినా రిమాండును 6 నెలలదాకా పొడిగిస్తూ పోవచ్చు. మొదట కోర్టులో హాజరు పెట్టినప్పుడే కాక ఆ తరువాత కూడ ఎప్పుడయినా ముద్దాయిని జైలు నుండి పోలీస్ కస్టడీకి తీసుకోవచ్చు. పోలీసు కస్టడీలో ముద్దాయి ఎస్.పి. ర్యాంకు పోలీసు అధికారికి ఇచ్చే ఒప్పుకోలు నేర విచారణలో సాక్ష్యంగా చెల్లుబాటు అవుతుంది. బెయిలు మీద విడుదల కావడం దాదాపు అసాధ్యం. (ముద్దాయి నిర్దోషి అని కోర్టు నమ్మితేనే బెయిలు ఇవ్వాలి.) ముందస్తు బెయిలు ప్రసక్తే లేదు. నేరం చేయడానికి ఉపయోగించిన ఆయుధాలను లేక పేలుడు పదార్థాలను పోలినవి ముద్దాయి దగ్గర దొరికినా, ముద్దాయి వేలిముద్రలు నేరస్థలం దగ్గరగానీ, నేరంలో ఉపయోగించిన ఆయుధాలు లేక వాహనాలపైన దొరికినా అతను నేరం చేసి ఉంటాడని కోర్టు భావిస్తుంది. టెర్రరిస్టు నేరం చేసిన, లేక చేసినట్టు అనుమానిస్తున్న వ్యక్తికి ఎవరైనా డబ్బులు ఇచ్చినట్టయితే ఆ నేరాలు చేయడం కోసమే ఇచ్చినట్టు కోర్టు భావిస్తుంది. నేర విచారణ రహస్య స్థలంలో జరపవచ్చు. నేర విచారణ పరాయి రాష్ట్రంలో జరపవచ్చు. ఒక సాక్షి గాని తన ప్రాణానికి అపాయం ఉందని చెప్పినట్టయితే ఆ సాక్షి పేరు, చిరునామా తదితర


వివరాలను రహస్యంగా ఉంచడానికి తగు చర్యలు తీసుకోవచ్చు. ముద్దాయి గానీ అతని వకీలు గానీ లేకుండా కూడ సాక్ష్యాలు నమోదు చేసుకోవచ్చు. ఈ రకమైన నేర విచారణ వ్యవస్థ ఎక్కువ మందికి శిక్షలు వేస్తుందేమో గానీ దోషులకు మాత్రమే వేస్తుందన్న గ్యారంటీ లేదు.

'టెర్రరిజం' ద్వారా సేకరించిన ఆస్తులుగా భావించే వాటిని జప్తు చేసుకోవడం కోసం ప్రభుత్వానికి ఈ చట్టం విపరీతమైన అధికారాలు ఇస్తుంది. సమగ్రమైన విచారణ జరిపి నేరాన్ని పూర్తిగా రుజువు చేసిన తరువాత స్వాధీనం చేసుకోవడం వేరు. అదేమీ లేకుండా అనుమానం మీద జప్తు చేసుకొని ఆ తరువాత ఏ కోర్టులోనూ కాక సెక్రటరీ స్థాయి ప్రభుత్వ అధికారి ఎదుట విచారణ జరిపిస్తుంది ఈ చట్టం. 'టెర్రరిస్టుల' రాజకీయ లక్ష్యాల గురించి ఏమైనా మాట్లాడితే ఉన్న కొంచెం ఆస్తీ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందేమోనని భయపడి అందరూ నోరు మూసుకోవాలి.

అందుకే ఇది విచక్షణారహితమైన హింసను అరికట్టే చట్టం కాదు. అభిప్రాయ స్వేచ్ఛనూ, భావప్రకటనా స్వేచ్ఛనూ అణచివేసే చట్టం. హింస వెనక ఉన్న సామాజిక సమస్యలపైన చర్చనూ, విశ్లేషణనూ, పరిష్కారాల అన్వేషణనూ అసాధ్యం చేసే చట్టం.

*ప్రజాపంథా పక్షపత్రిక*

***1 డిసెంబర్ 2001***



# రాజకీయ స్వేచ్ఛ పత్రికలకు వుంటే చాలునా?

**ము**ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వంతో వున్న సాన్నిహిత్యం వల్ల ఉపయోగకరమయినవి ఎన్ని రాష్ట్రానికి సాధించి పెట్టాడో తెలీదు గానీ నిరర్థకమైనవీ నష్టకరమైనవీ మాత్రం సాధించుకొస్తున్నాడు.

పీపుల్స్‌వార్‌ను 'పోటో'లోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో చేర్చడం వాటిలో ఒకటి. పోటోకు చట్టరూపం ఇవ్వడం త్వరలో సాధ్యమవుతుందో లేదో కేంద్ర ప్రభుత్వానికి తెలియకపోయినప్పటికీ చంద్రబాబు అలక తీర్చడానికి పీపుల్స్‌వార్‌ను ఆ చట్టం కింద టెర్రరిస్టు సంస్థగా ప్రకటించడానికి సిద్ధపడిందంటే ఢిల్లీపైన సైబరాబాద్ పట్టు ఎంతటితో, ఎంత నిరర్థకమైనదో కూడ ఏక సమయంలో అందరికీ అర్థం అయి వుండాలి.

చంద్రబాబుకు పీపుల్స్‌వార్ కూడ శక్తివంచన లేకుండా సహకరించిన మాట వాస్తవమేననుకోండి. ఈ మధ్య కాలంలో వారిద్దరూ కలిసి సాధించిన ఒకే ఒక ఘనకార్యం ఇదనుకుంటాను. పీపుల్స్‌వార్‌ను టెర్రరిస్టు సంస్థల జాబితాలో ఎందుకు చేర్చలేదని చంద్రబాబు అలక ప్రకటించగా, ఎట్లా చేర్చకుండా వుంటారో చూస్తామన్నట్టు పీపుల్స్‌వార్ దళాలు రాష్ట్రంలో వరసబెట్టి వీటినీ వాటినీ పేల్చి తమ పంతం నెగ్గించుకున్నారు.

ప్రజాస్వామ్య అవకాశాలను వీలైనంత వరకు కాపాడుకోవాలన్న స్పృహ ఆ పార్టీకి ఎన్నడూ లేదు. అవి ఎంత తొందరగా అదృశ్యమయితే

అంత మంచిదనుకుంటారన్న అనుమానానికి కూడ వారి నడవడిక ఆస్కారం కలిగిస్తుంది.

ఇది వారి సమస్య మాత్రమే అయితే వారి ఇష్టమని వదిలేయొచ్చు. కానీ పీపుల్స్‌వార్ చాలా ప్రభావం వున్న రాజకీయ పార్టీ. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో అన్ని రాజకీయ పక్షాలలోనికీ ప్రభావం రీత్యా అత్యంత బలమైంది. అయితే ఆ ప్రభావంలో వున్న వారందరూ సాయుధులై రాజ్యాన్ని కూలదోయడానికి సిద్ధంగా వున్నారనుకుంటే పొరబాటు. ఎక్కువమందిని ప్రభావితం చేసేది ఆ పార్టీ సామాజిక అజెండాయే తప్ప దాని రాజకీయ అజెండా కాదు.

ఆ ప్రజల మీద పీపుల్స్‌వార్‌ను పోటోలోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో చేర్చడం చాలా తీవ్ర దుష్ప్రభావాన్ని వేస్తుంది. టెర్రరిస్టు సంస్థలో సభ్యులుగా వున్నా, వున్నట్టు చెప్పుకున్నా, దానికి మద్దతు ఆహ్వానించినా, దానికి సంబంధించిన ఏదైనా సమావేశాన్ని ఏర్పాటుచేసినా, ఏర్పాటు చేయడానికి సహకరించినా (ఇక్కడ సమావేశం అంటే బహిరంగ సభే కాదు, ఇద్దరు కలిసి మాట్లాడుకునే సమావేశానికి కూడ ఇది వర్తిసుంది), వారికి సహకారం అందియ్యమని ప్రజలను ప్రోత్సహించే సభలో పాల్గొన్నా పది సంవత్సరాలు జైలుకు పోవచ్చు.

ఇవి ఏ సందర్భంలోనైనా చాలా అస్పష్టమైన మాటలు. అయితే పీపుల్స్‌వార్ వంటి ఒక రాజకీయ సంస్థ విషయంలో ఈ అస్పష్టత మరింత తీవ్ర పరిణామాలకు దారితీయగలదు. పీపుల్స్‌వార్ నిర్మాణంలో భాగం కానివారు, ఆ పార్టీ పద్ధతులనూ రాజకీయ అవగాహననూ ఆమోదించని వారు కూడ ఆ పార్టీ సామాజిక లక్ష్యాలతో ఏకీభవించవచ్చు. ఏకీభవించిన మేరకు వారిరువురి కార్యకలాపాలలో సాన్నిహిత్యం వుండవచ్చు. ఒకే ప్రాంతంలో ఒకే రకమైన లక్ష్యం కోసం పనిచేసే వారి మార్గాలు ఒకసారి కాకపోతే ఒకసారి ఒకదానినొకటి తాకకుండా వుండవు. స్వతంత్రంగా తమకంటూ కార్యరంగం లేనివారు పీపుల్స్‌వార్ తోడ్పాటు వున్న సంస్థల సహాయం, వ్యక్తుల సహకారం తీసుకోవచ్చు. హింస అంటే ఏ మాత్రం ఇష్టంలేని వారు కూడ ఈ రకంగా పీపుల్స్‌వార్ కార్యకలాపాలకు తోడ్పాటు ఇస్తున్నారనీ మద్దతు ఇస్తున్నారనీ సహకరిస్తున్నారనీ నింద వేయించుకునే పరిస్థితి రావచ్చు. రాకూడదంటే – పది

సంవత్సరాలు జైలుకు పోకూడదంటే – వారు మొత్తంగా తమ కార్యకలాపాలకు గుడ్‌బై చెప్పి చేతులు కట్టుకుని కూర్చోవాలి.

విచిత్రమైన విషయం ఏమిటంటే రాజకీయ ఉద్యమాలు హింసాత్మక రూపం తీసుకుంటున్నాయని చెప్పి ఈ రకమైన చట్టాలు చేస్తున్నారు కానీ వీటి ప్రభావం ఫలితంగా హింస ఒక్కటే మిగులుతుంది. తక్కినదంతా పోతుంది.

బహుశా మన పాలకులకు అదే కావాలేమో! అధికారం తనను తాను తుపాకీగా భావించుకునే దశ వచ్చాక అది తుపాకీని మాత్రమే ప్రత్యర్థిగా ఇష్టపడుతుంది. అప్పుడు ఇబ్బందికరమైన ప్రశ్నలకు జవాబు చెప్పనక్కరలేదు. హేతుబద్ధమైన సంవాదంలో పాల్గొననక్కరలేదు. సంస్కరణాత్మక చర్యల ఊసే అక్కరలేదు.

హింస పట్లే అభ్యంతరం అంటారు కాని వాళ్ళకు నిజానికి హింస పట్ల మాత్రమే అభ్యంతరం లేదు. ఒక స్వరం ముందు మరొక స్వరం నైతికంగా తలవంచుకోవాల్సి రావచ్చును గానీ తుపాకులకు ఆ చింత లేదు. సమస్యల నుండి, అణచివేత నుండి, అసంతృప్తి నుండి, వైమనస్యం నుండి సాయుధ రాజకీయాలు పుడుతున్నాయని గుర్తించమని అడిగితే, అవేవీ కనబడకుండ కేవలం తుపాకులు మాత్రం కన్పించేటట్టు కట్టుదిట్టం చేస్తాం, ఇంక ఏం చేస్తారో చెప్పండి అని మన పాలకులు అంటున్నారు.

అందుకే 'పోటో' ప్రధానంగా భావస్వేచ్ఛపైన దాడి అంటున్నాం. మన దౌర్భాగ్యం ఏమిటంటే అది పత్రికా స్వేచ్ఛపైన దాడి అని మాత్రమే గుర్తించడానికి మన తెల్లబట్టల జాతి సిద్ధంగా వుంది. పత్రికలకు మాత్రమే భావస్వేచ్ఛ ఉంటే సరిపోతుందని ఎవ్వరూ అనరు గానీ 'పోటో' పైన జరుగుతున్న చర్చ వింటుంటే ఆ అనుమానం కలుగుతుంది.

ఒక సంస్థను టెర్రరిస్టు సంస్థ అనీ, ఒక కార్యకలాపాన్ని టెర్రరిజం అనీ ప్రభుత్వం ప్రకటించినట్టయితే ఇంక ఆపైన దాని మంచిచెడుల గురించి చర్చ, దాని మూలాల గురించి వ్యాఖ్య, దాని స్వభావాన్ని గురించి నిష్పాక్షికమైన విశ్లేషణ – ఇవేవీ సమాజంలో జరగడానికి వీలులేదని 'పోటో' అంటుంది. ఆ నిషేధం కేవలం పత్రికల పైన కాదు, అందరి మీదా పనిచేస్తుంది. ప్రభుత్వం పేర్కొన్న టెర్రరిస్టులు చచ్చినప్పుడో

చంపినప్పుడో వార్తలకెక్కుతారు. కాని వారి మాటలు, వారి అభిప్రాయాలు వార్తలు కావు. వారి గురించి ప్రభుత్వం వ్యక్తంచేసే అభిప్రాయాలు మాత్రం వార్తలే. అవి చాలా ప్రముఖ వార్తలు. వాటిని బట్టి ఆ టెర్రరిస్టుల ఆకృతిని ఊహించుకొని, వాళ్ళ శవాల ఫోటోలు పత్రికలలో చూసినప్పుడు ఒక లిప్తకాలం వాళ్ళు కూడ మనుషులేనని గుర్తించి, ఆ గుర్తింపుకు వాక్యరూపం ఇస్తే జైలుకు పోతామేమోనని భయపడి నోరు నొక్కుకుని సమాజం బతకాలి.

అందుకే 'పోటో' పెట్టే నిషేధం నుండి పత్రికలకు మినహాయింపు ఇవ్వాలన్న డిమాండ్ సరిపోదు. ఆ డిమాండ్‌కు ఒప్పుకుంటే చాలు, ఆపై 'పోటో' వచ్చినా పర్వాలేదన్న వైఖరి గుడ్డిది. అయినా, పత్రికా యజమానుల అండదండలు లేకుండా రాజకీయాలు చేయజాలని చంద్రబాబుకు ఆ ఒక్క సవరణయినా అవసరం అనిపించవచ్చును గానీ భజరంగ్‌దళ్ వీరుల అండదండలున్న సంఘ్ పరివార్ రాజకీయాలకు పత్రికలతో ఏం పని? సత్యాన్ని నిర్దేశించడానికి 'పాంచజన్యం' వుంది. శాసించడానికి త్రిశూలం మూకలున్నాయి. చంద్రబాబు పత్రికలకిచ్చే హామీని వారెందుకు ఖాతరు చేస్తారు? చేస్తే మాత్రం ప్రజలు ఆ మినహాయింపులోనే తమ రాజకీయ స్వేచ్ఛను చూసుకుంటూ బతకడానికి ఎందుకు ఒప్పుకోవాలి?

*ప్రజాతంత్ర వారపత్రిక*

***9 డిసెంబర్ 2001***



# ఊహాత్మక ఆందోళన కాదు

టాడాను అత్యుత్సాహంగా అమలుచేసిన మన రాష్ట్ర పోలీసులు పోటాను అమలు చేసే విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్టు నిన్నటిదాకా అనిపించింది.

ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో పోటాను చాలా ఎక్కువగా వినియోగిస్తున్నట్టు వార్తలు వస్తుండగా, తెలుగు పోలీసులు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నారని అనుకున్నాము. ఒకసారి చెయ్యి కాల్చుకున్నవాడు రెండవసారి కొంచెం మెలకువగా వ్యవహరించడం సహజమే. ఆ మాత్రమైనా అనుభవం నుండి నేర్చుకోడానికి సిద్ధంగా ఉండడం ఆ మేరకు గౌరవించదగ్గ విషయమేనని భావించాము.

అది నిజం కాకపోవచ్చునేమోనని ప్రకాశం జిల్లా విప్లవ రచయితల సంఘం కన్వీనర్ అరవిందకుమార్ అరెస్టు సూచిస్తున్నది. అతని మీద రాసిన అంత పొడుగు ఎఫ్ఐఆర్‌లో ఉన్నదంతా ఏమిటంటే అతని దగ్గర విప్లవ సాహిత్యం ఆడియో వీడియో కేసెట్లు దొరికాయని!

దొరికాయునే అనుకుందాం. అయితేనేం? వాటిని ఉపయోగించుకొని ఆయన పీపుల్స్‌వార్ వైపు యువతను ఆకర్షించడానికి కృషిచేస్తున్నాడనీ, అందుకోసమే తన ఊరు విడిచిపెట్టి ఒంగోలుకు వచ్చి ఉంటున్నాడనీ పోలీసులు అంటున్నారు. ఈ సంగతులన్నీ మీకెట్లా తెలుసునంటే అరెస్టు చేయగానే అతనే ఒప్పేసుకున్నాడని అంటున్నారు (అటువంటి ఒప్పుకోళ్ళను సాక్ష్యంగా కోర్టులో ప్రవేశపెట్టగలగడమే కదా పోటాలోని గొప్ప సదుపాయం. ఇంక అరవింద్ ఒప్పుకోక తప్పేదెట్లా).

అది కూడ నిజమనే ఒప్పుకుందాం. అయితే ఏం?

హింసవైపు యువతను ఆకర్షించడం తప్పు కాదా అంటూ దయచేసి ఆవేశ పడొద్దు. ఇక్కడే పోటా వంటి చట్టాలలోని ఒక ముఖ్యమైన లోపాన్ని గుర్తించాలి. అవి హింసను అరికట్టే పేరుమీద రాజకీయ భావాలను అణచివేస్తాయి.

అరవింద్ అనే ఆ వ్యక్తి హింసవైపు యువతను ఆకర్షిస్తున్నాడని పోలీసులు అనలేదు. ఆ పనిచేస్తే అతనిని అరెస్టు చేయటానికి పోటా అక్కరలేదు. మామూలు చట్టాలు చాలు. అతను సిపిఐ(ఎం.ఎల్) పీపుల్స్‌వార్ రాజకీయాలు యువతలో వ్యాపింప చేస్తున్నాడని మాత్రమే పోలీసులు అన్నారు. అది నేరమెందుకు కావాలి?

అవి సాయుధ పోరాట రాజకీయాలు కావా? అంటారేమో. అవును. సాయుధ వర్గపోరాటం వల్ల తప్ప ఇంకొకరకంగా ఈ సమాజం బాగుపడదు అని ఆ రాజకీయాలు అంటాయి. అది సత్యమనుకోండి. తెలివితక్కువతనం అనుకోండి. మీ ఇష్టం. కాని ఒక అభిప్రాయం వల్ల ఎవరికీ ప్రత్యక్షంగా ప్రాణహాని లేనప్పుడు దానిని నేరంగా భావించడం సబబు కాదు. తక్షణమే తుపాకి తీసుకుని ఫలానా సుబ్బారావును చంపండి అని కరపత్రం అచ్చువేసి పంచడానికీ, ప్రజలు తుపాకులు తీసుకుని రాజ్యాధికారం సంపాదించుకోనిదే ఈ ప్రపంచం మారదు అని ప్రచారం చేయడానికీ తేడా ఉందని గుర్తించలేని నేరస్మృతి నేరస్మృతే కాదు.

అంతేకాక, పీపుల్స్‌వార్ రాజకీయాలు కేవలం సాయుధ పోరాట రాజకీయాలు కావు. భూమి పంపిణీ రాజకీయాలు, సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయాలు, వగైరా వగైరా. మొదటిదాని పేరు చెప్పి మిగిలిన వాటినన్నిటినీ నిషేధించడం భావ్యమేనా? పోటా వంటి చట్టాలలో ఉన్న ముఖ్యమైన లోపం ఇదే. అవి దేనినయితే టెర్రరిజం అని నిర్వచిస్తాయో అందులో రాజకీయాలు, హింస, సామాజిక ఆలోచనారీతులు సన్నిహితంగా కలగలిసి ఉంటాయి. ఆ రాజకీయాలు, ఆలోచనారీతులు అధికభాగం పీడిత ప్రజలకు, మైనారిటీలకు సంబంధించినవి అయుంటాయి. హింస పేరుతో వాటన్నిటి గొంతు నొక్కేయడం పోటా వంటి చట్టం లక్షణం.

ఒక మంచి లక్ష్యం కోసమైనా సరే ఆయుధాలు పట్టుకోవడంలో సమస్యలేమీ లేవని నా ఉద్దేశ్యం కాదు. సాయుధ పోరాటం అనే మాటను అలవోకగా ప్రయోగించే వాళ్ళ విజ్ఞత పట్ల నాకు సందేహం లేకపోలేదు. ఆయుధాలైనా, పోలీసుల ప్రయోగమైనా


నైతికంగా తటస్థమైన సాధనం మాత్రమేననీ, దానిని ప్రయోగించే లక్ష్యాన్ని బట్టి దాని మంచిచెడులు ఉంటాయనీ నమ్మే అమాయకత్వానికి ప్రపంచంలో ఇంకా చోటు ఉందని నేను అనుకోవడం లేదు.

అయినప్పటికీ హింస పేరు మీద రాజకీయ అభిప్రాయాల గొంతు నొక్కేయడం సమాజానికి చాలా నష్టం చేస్తుంది. ఆ రాజకీయాలు పీడిత ప్రజా వర్గాలకు, మైనారిటీలకు న్యాయం చేయడానికి పూనుకున్నవయితే మరీ నష్టం చేస్తుంది. ఇది ఆ రాజకీయాల సత్యాసత్యాలతోనూ విజ్ఞతతోనూ నిమిత్తంలేని విషయం.

హక్కుల ఉద్యమం పోటాను వ్యతిరేకించడానికి గల ప్రధాన కారణం ఇదే. నేర విచారణలో సహజ న్యాయసూత్రాలు కొరవడతాయన్న అభ్యంతరం కంటే ఇదే ప్రధానమైన అభ్యంతరం. ఇది ఊహాత్మకమైన ఆందోళన కాదన్న సంగతి విరసం సభ్యుడు అరవింద్ అరెస్టుతో మరొక్కసారి రుజువయింది.

*ప్రజాతంత్ర వారపత్రిక*

***24 ఫిబ్రవరి 2003***



# 'పోటా' రద్దు కోసం ఉద్యమిద్దాం రండి

పోటా చట్టానికి ఒక సంవత్సరం నిండింది. ఈ సంవత్సర కాలంలో ఆ చట్టం కింద దేశంలో ఎంతమందిని అరెస్టు చేశారో కచ్చితంగా తెలియదు గానీ కొన్ని వందల మందిని చేశారనేది వాస్తవం.

ఈ చట్టం పార్లమెంటు ముందు ఉండగా దానిని వ్యతిరేకించిన వాళ్ళు ఏయే కారణాలు చెప్పారో అన్నీ సహేతుకమయినవేనని ఈ సంవత్సర కాలంలో రుజువు అయింది.

టెర్రరిస్టుల పేరుచెప్పి చట్టం తీసుకొస్తున్నారుగానీ ప్రతిపక్ష పార్టీలపై ప్రయోగించే ప్రమాదం ఉందని కొంతమంది హెచ్చరించారు. తమిళనాడులో 'వైగో'ను జయలలిత ప్రభుత్వం పోటా చట్టం కింద అరెస్టు చేసి ఈ ఆందోళనలో అతిశయోక్తి లేదని రుజువు చేసింది.

టెర్రరిస్టు చర్యలకు మద్దతు ఇవ్వడం, ప్రోత్సహించడం, సహకరించడం, సహాయం చేయడం వగైరాలు కూడ జీవిత ఖైదు వేయగల నేరాలని చెప్పే పోటా చట్టం అమాయకులను బలిచేయగలదని కొందరు హెచ్చరించారు. నక్సలైట్లకు వైద్యం చేసిన ఒక డాక్టరును, బట్టలు కుట్టిన ఒక టైలర్‌ను పోటా కింద అరెస్టు చేసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నక్సలైట్లకు కొరియర్‌గా పనిచేశాడని ఒక పన్నెండేళ్ళ పిల్లవాడిని పోటా కింద అరెస్టు చేసిన జార్ఖండ్ ప్రభుత్వం ఆ ఆందోళనలోనూ అతిశయోక్తి లేదని రుజువు చేశాయి.

పోలీసులకు ఇచ్చిన 'ఒప్పుకోలు'ను సాక్ష్యంగా అంగీకరించే పోటా చట్టం చిత్రహింసలను చట్టబద్ధం చేసే ప్రమాదం ఉందని ఇంకొందరు హెచ్చరించారు. డిసెంబర్ 13న జరిగిన 'పార్లమెంటుపైన దాడి' కేసులో ఢిల్లీలోని పాటియాల కోర్టు వేసిన శిక్షలను చూస్తే ఇది కూడ రుజువయినట్టేననుకోవాలి. ఆ దాడికి పాల్పడిన వారు ఆ రోజే ఎదురు కాల్పులలో చనిపోగా, వారికి ఇళ్ళు అద్దెకు ఇప్పించిన వాళ్ళు, మోటార్ సైకిల్ కొనిపెట్టినవాళ్ళు, దాడి జరిగిన తరువాత లారీలో నగరం దాటించిన వాళ్ళు పోలీసులకు చిక్కారు. వీళ్ళు తెలిసి సహాయం చేశారా, తెలియక చేశారా అనే దానికి రుజువేమీ లేకపోయినా, పోలీసుల దగ్గర తామంతా 'కుట్రదారులమని' వారు ఒప్పేసుకున్నారని చెప్పి ఆ ఒప్పుకోలును రుజువుగా భావించి వారికి ఉరిశిక్ష వేసేసింది కోర్టు.

ముస్లింలు తమ సమస్యల గురించి నోరెత్తితే ఐ.ఎస్.ఐ. పేరు చెప్పి, సిమీ పేరుచెప్పి, లష్కర్-ఎ-తొయిబా పేరు చెప్పి పోటా కింద ఖైదు చేయబోతారని మరి కొంతమంది ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంవత్సర కాలంలో ముంబాయి నుండి కోయంబత్తూరు దాకా పోటా కింద అరెస్టయిన వందలాది ముస్లింల వివరాలు తీసుకున్నట్టయితే ఇది సహితం రుజువవుతుంది. నిజానికి అరెస్టుల దాకా పోనక్కర లేదు. ఏమైనా మాట్లాడితే తీవ్రవాది అన్న ముద్ర వేస్తారేమోనని భయపడి నోరు నొక్కుకొని బతుకుతున్న ముస్లిం యువకుల మౌనం కంటే వేరే రుజువు అక్కరలేదు.

పోనీ సమాజాన్ని 'టెర్రరైజ్' చేసి బతుకుతున్న వారందరి మీదా నిష్పక్షపాతంగా పోటా కేసులు పెడుతున్నారా అంటే ఆదీ లేదు. గడచిన సంవత్సర కాలంలో నిజంగా ఒక ప్రజావర్గాన్ని భయభ్రాంతులు చేసిన సామూహిక హింసాకాండ ఎక్కడయినా జరిగిందంటే అది గుజరాత్‌లో. రెండువేల మందిని అతి క్రూరంగా చంపి వేలాదిగా స్త్రీలను లైంగికంగా హింసించి ఇళ్ళూ, షాపులు వేల సంఖ్యలో లూటీచేసి దహనం చేసిన కాషాయమూకలు పోటాలోని 'టెర్రరిస్టు' నిర్వచనానికి సరిగ్గా అతుకుతారు. కాని వాళ్ళమీద పోటా కేసులు పెట్టలేదు సరికదా, పెట్టకూడదా అని అడగడం కూడ అవివేకం అని భావించే దశ వచ్చింది దేశానికి.

అయితే పోటా చట్టాన్ని నిష్పక్షపాతంగా ప్రయోగించాలన్నది మా డిమాండ్ కాదు. దానిని రద్దు చేయాలనే డిమాండు చేస్తున్నాం. మన సంఘ్‌పరివార్ పాలకుల

రెండు నాల్కల ధోరణిని ఎత్తి చూపడం కోసం మాత్రమే గుజరాత్ హింసాకాండ ప్రస్తావన చేశాం.

పోటాను వ్యతిరేకించడమంటే టెర్రరిస్టుల హింసను సమర్థించడమేనని ఎల్.కె. అద్వానీ ఆనాడు అన్నాడు. బహుశా ఈనాడు కూడ అంటాడు. దబాయించి నోరు మూయించే ఈ ఎత్తుగడలకు మేము భయపడదలచుకోలేదు. అన్యాయమయిన చట్టాలను వ్యతిరేకించడమంటే హింసనూ, నేరాలనూ సమర్థించడమని అర్థం కాదు. న్యాయాన్యాయ విచక్షణ కోల్పోయిన చట్టాలు నాగరికతకే మచ్చ. టెర్రరిజం అని పిలవబడే రాజకీయ మిలిటెన్సీ వెనక లోతయిన సామాజిక రాజకీయ కారణాలు ఉంటాయనేది ఎవరూ కాదనలేని సత్యం. ఈ సత్యాన్ని ప్రకటించడం హింసను సమర్థించడమేననడం అవివేకం. ఈ కారణాలను అర్థం చేసుకొని పరిష్కరించే ఓపిక, సంసిద్ధత లేని ప్రభుత్వాలు వాటిని క్రూరమైన చట్టాలతో ఎదుర్కొనే ప్రయత్నం చేస్తాయి. దానికి బలయ్యేది ప్రజల హక్కులు, నిష్పాక్షికత, ప్రజాస్వామ్య రాజకీయ సంస్కృతి. ముద్దాయికి సహజ న్యాయసూత్రాల ఆసరా ఇవ్వని న్యాయవ్యవస్థ న్యాయవ్యవస్థే కాదు. అభిప్రాయ స్వేచ్ఛను నేరంగా నిర్వచించే నేరస్మృతి నేరస్మృతే కాదు. ఈ రెండు అవలక్షణాలూ ఉన్న పోటాను అందుకే నాగరికతకు మచ్చ అన్నాం.

టాడాతో ఒకసారి చేయి కాల్చుకున్న మన రాజకీయ వ్యవస్థ పోటాను గట్టిగానే ప్రతిఘటించింది. అయినప్పటికీ ఉభయసభల ఉమ్మడి సమావేశం నిర్వహించి దానిని జారీచేసింది ఎన్‌డిఏ ప్రభుత్వం. ప్రతిపక్ష పార్టీలు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాలలో పోటాను అమలు చేయబోమని హామీ ఇచ్చాయి. ఇప్పటిదాకా ఆ హామీని నిలుపుకున్నాయి.

అయితే చట్టాన్ని ఉండనిచ్చి అమలు చేయొద్దని ఈ పార్టీని, ఆ పార్టీని అభ్యర్థించడంలో అర్థం లేదు. పోటా రద్దు కోసమే ఉద్యమించాలి.

పోటాకు ఒక సంవత్సరం నిండిన సందర్భంగా పోటా వ్యతిరేక ఉద్యమానికి ఊపిరి పోయడానికి ఆంధ్రప్రదేశ్‌లో పనిచేస్తున్న నాలుగు హక్కుల సంఘాలు కలిసి 'పోటా వ్యతిరేక కమిటీ'గా ఏర్పడి రెండు రోజుల సెమినార్ నిర్వహించ తలపెట్టాయి. జాతీయ స్థాయిలో జరిగే ఈ సెమినార్‌లో దేశం నలుమూలల నుండి వచ్చే వక్తలు ప్రసంగిస్తారు. వివిధ రాష్ట్రాలకు చెందిన హక్కుల సంఘాలు కూడ పాల్గొంటాయి.

పోటాలోని సూత్రప్రాయంగా అభ్యంతరకరమైన అంశాల గురించి, దాని అమలులోని అన్యాయాన్ని గురించి, దాని దుర్వినియోగం గురించి – అన్నిటి గురించి వక్తలు మాట్లాడతారు. సెమినార్ ముగింపుగా పోటా రద్దు ఉద్యమాన్ని దేశవ్యాప్త ఉద్యమంగా నిర్వహించడానికి అవసరమయిన నిర్ణయాలు తీసుకొని విధాన రూపకల్పన చేసుకోవడం జరుగుతుంది.

మనందరి ప్రజాస్వామ్య హక్కుల రక్షణ కోసం జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా అందరినీ కోరుతున్నాం.

***పోటా వ్యతిరేక కమిటీ కరపత్రంగా వచ్చింది***

***మార్చి 2003***

# 'పోటా' రద్దు ఉద్యమం – దాని కర్తవ్యాలు

'పోటా' రద్దు కావడానికి సులభమైన మార్గమేమిటంటే జయలలితకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం అని తమిళనాడుకు చెందిన హక్కుల ఉద్యమకారులు అంటున్నారు.

జోక్‌గా ఉద్దేశించిన ఈ కామెంట్ వెనక కొంత వాస్తవం ఉంది. 'పోటా' అయినా, దాని పూర్వరూపం అయిన 'టాడా' అయినా సూత్రరీత్యానే అన్యాయమైన చట్టాలు. అయితే 'టాడా'ను విపరీతంగా దుర్వినియోగం చేసిన తరువాతే దాని పట్ల సమాజంలో వ్యతిరేకత పెరిగింది. చివరికి దుర్వినియోగం కారణంగానే దానికి కాలం చెల్లే పరిస్థితి వచ్చింది.

అందుకే తెలివైన పాలక రాజకీయవేత్తలు 'పోటా' దుర్వినియోగాన్ని అరికట్టగలిగితే ఆ చట్టాన్ని బతికించుకోవచ్చునని భావిస్తున్నారు. రాష్ట్రాలను పరిపాలిస్తున్న అన్ని పార్టీలూ సహకరించినట్టయితే ఈ ఎత్తుగడ సఫలం కాగలిగేదేమో. 'పోటా' సూత్రప్రాయంగానే ఒక అనాగరిక చట్టం అని ప్రజాతంత్రవాదులు ఎంత మొత్తుకున్నా, దానిని ఆచితూచి నిజమైన సాయుధ పోరాటకారుల మీదనే ప్రయోగించినట్టయితే సమాజంలో దాని పట్ల వ్యతిరేకత రాకుండ చూడడం పాలకులకు సాధ్యమేననేది ఒక చేదు వాస్తవం.

ఈ ఎత్తుగడను జయలలిత సాగనివ్వడం లేదు. ఆమె చేతికి 'పోటా' వంటి చట్టాన్ని ఇచ్చి దానిని ఉపయోగించవద్దంటే చిన్న పిల్లవాడికి చాక్‌లెట్ ఇచ్చి తినవద్దని అన్నట్టు. మన దేశ పాలక రాజకీయవేత్తలలో

ప్రజాస్వామికవాదులు దుర్భిణీ పెట్టి వెతికినా దొరకకపోవచ్చునేమోగాని, వారి నియంతృత్వ పోకడలలోనూ హెచ్చుతగ్గులున్నాయి. అందులో అగ్రభాగాన నిలబడ్డవారిలో జయలలిత ఒకరు. ఆమె ప్రభుత్వం తమిళనాడులో పత్రికల వారిపైన డజన్ల సంఖ్యలో పెడుతున్న పరువు నష్టం కేసులు దీనికొక ఉదాహరణ. పత్రికలు ప్రభుత్వాలను తీవ్ర పదజాలంతో విమర్శించడం అన్ని రాష్ట్రాలలోనూ జరిగేదే. ఒక్కొక్కసారి మంచి కారణాల వల్ల, ఒక్కొక్కసారి సంకుచిత కారణాల వల్ల చేస్తుంటారు. అయితే పాలకులు ఈ విమర్శకు కోపగించుకున్నా, రుసరుసలాడైనా సరే రాజకీయకేళిలో దానిని భాగంగా తీసుకుంటారే తప్ప తొందరపడి కోర్టుకెక్కరు. కాని జయలలిత ప్రభుత్వం 'ది హిందూ' దినపత్రికతో సహా అన్ని పత్రికల పైనా పరువు నష్టం దావాలు వేసింది.

కాబట్టి జయలలితను ఇదే మార్గంలో ఇంకొన్నాళ్ళు కొనసాగనిస్తే, ఆమె వైగో, నెడుమారన్, నక్కీరన్ గోపాల్‌ల బాటలో స్టాలిన్‌నూ, అతని తండ్రినీ కూడ 'పోటా' కింద ఖైదు చేసే రోజు వచ్చేస్తుంది కాబట్టి, 'పోటా' కథకు ముగింపు ఆమె పుణ్యాన త్వరలోనే సిద్ధిస్తుందని జోక్‌గానయినా అనుకోడానికి ఆస్కారం లేకపోలేదు.

అయితే ప్రజాస్వామిక దృక్పథానికి ప్రధాన విషయం ఏమిటంటే పోటా 'దుర్వినియోగం', 'సద్వినియోగం' వేరు వేరు విషయాలు కావు. అసలు విషయం ఏమిటంటే 'పోటా'లోని నేర నిర్వచనంలోనే విపరీత వ్యాఖ్యలకు తావు ఇచ్చే అవకాశం పుష్కలంగా ఉంది. రాజకీయ విశ్వాసాలనూ అభిప్రాయాలనూ టెర్రరిస్టు నేరాలుగా భావించే అవకాశం 'పోటా'లోనే ఉంది. దానిని వాడుకోవాలనే ఉద్దేశ్యంతో కాకపోతే ఏ ఉద్దేశ్యంతో పెట్టినట్టు? వాడుకున్నప్పుడు ఏ గొడవ జరగకపోతే అది సద్వినియోగం కిందనే చలామణి అవుతుంది. గొడవ జరిగితే 'దుర్వినియోగం' జరిగిపోయిందనీ, దానిని ఇకపైన అరికడతామనీ అంటుంటారు.

వరంగల్‌లో కొండా సురేఖ, మురళిల విషయమే తీసుకోండి. కొండా మురళి రౌడీ అని, గూండా అని వరంగల్‌లో ఎవరినడిగినా చెబుతారు. అతని వ్యవహారాలలో అతని భార్య సురేఖకు ఎంత పాత్ర ఉందనేది తెలీదుగానీ మురళి విషయంలో ఎవరికీ సందేహం లేదు. అతని మీద కేసు పెట్టదలచుకుంటే పీపుల్స్‌వార్‌తో సంబంధాలు ఉన్నాయన్న నెపంతో కేసు పెట్టనక్కరలేదు. అతని స్వంత వ్యవహారాలే నేరమయం అయినవి. దానికి ఇక 'పోటా' ఎందుకు? అతని స్థాయి రౌడీలు తెలుగుదేశం, కాంగ్రెస్

పార్టీలలో చాలామంది ఉన్నారు. వారిపైన పెట్టనిది అతనిపైన మాత్రమే ఎందుకు 'పోటా' కేసు పెట్టాలి?

గొడవ జరగకపోతే ఈ ప్రశ్నలు ఎవరూ అడగకపోదురు, జవాబు ఎవరూ చెప్పకపోదురు. గొడవ జరిగేసరికి 'పోటా' దుర్వినియోగం జరిగిందని (కనీసం సురేఖ మీద కూడ కేసు పెట్టిన మేరకు) ముఖ్యమంత్రి 'గుర్తించి'నట్టు ప్రకటించాడు. ప్రతిపక్షాలపైన 'పోటా' ప్రయోగించడం జరగదని హామీ ఇచ్చాడు. గొడవ అక్కడితో సద్దుమణిగింది గానీ నిజానికి అప్పుడే ఎక్కువ కావలసింది. 'పోటా'ను ప్రతిపక్షాలపైన ప్రయోగించబోమని హామీ ఇవ్వడంలో అర్థమేమిటి? పాలకపార్టీ, ప్రతిపక్ష పార్టీలు ఒకటై ఒకరిపైన ఒకరు 'పోటా' కేసులు పెట్టుకోబోమని హామీలు ఇచ్చుకుని ఇద్దరూ కలిసి ప్రజలపైన 'పోటా' కేసులు పెడతారనా దీని అర్థం?

దుర్వినియోగానికి తిరిగి వస్తే 'పోటా'తో సమస్య ఏమిటంటే టెర్రరిస్టు సంస్థలుగా ఆ చట్టం గుర్తించిన సంస్థలతో భావసారూప్యత ఉన్నా కూడ అది జీవిత ఖైదు వేస్తుంది. వట్టి భావసారూప్యత ఉంటే చాలు, వేరే ఏమీ చేయకున్నా జీవిత ఖైదే. తమిళనాడులో వైగో చేసిన 'నేరం' అదే. శ్రీలంకలో తమిళులకు ఎల్.టి.టి.ఇ మార్గమే ఉచితం అనీ, ఎల్.టి.టి.ఇ నాయకత్వమే సరయినదనీ వైగో ఒక బహిరంగ సభలో ప్రకటించాడు. అదే అతనిపైన అభియోగం. దానికతనిని 'పోటా' కింద జైలులో పెట్టారు. ఇందులో దుర్వినియోగం ఏమీ లేదు. 'పోటా'లోనే దీనికి అవకాశం ఉంది. ఒక టెర్రరిస్టు సంస్థ కార్యకలాపాలకు సహకరించడానికి లేక వెసులుబాటు కల్పించడానికి సభ లేక సమావేశం నిర్వహించినట్టయితే అది నేరం అని సెక్షన్ 21 అంటుంది.

సెక్షన్ 21 ని సవాలు చేయాలని వైగో నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. సుప్రీంకోర్టులో 'పోటా'ను ఈ మేరకు సవాలు చేశాడు కూడ. కానీ సెక్షన్ 21లోనే కాదు, 'టెర్రరిస్టు చర్య' నిర్వచనంలోనే ఈ గుణం ఉంది. బాంబుల వంటి ఆయుధాలతో హింసాత్మక చర్యలకు పాల్పడడమే కాదు, అటువంటి చర్యలకు సహాయం చేయడం, సహకరించడం, వెసులుబాటు కల్పించడం, ప్రోత్సహించడం, మద్దతు ఇవ్వడం కూడ టెర్రరిస్టు చర్యలే. అంతే కాదు, 'పోటా'లో టెర్రరిస్టు సంస్థలుగా గుర్తించిన వాటి

కార్యకలాపాలకు సహాయం చేయడం, సహకరించడం, వెసులుబాటు కల్పించడం, మద్దతు ఇవ్వడం వగైరాలు కూడ టెర్రరిస్టు చర్యలే.

హింసకు సహకరించడం నేరమే కదా అంటారేమో. హింసాకాండకు సహకరించడం నేరమే. కానీ సమస్య ఏమిటంటే టెర్రరిజం అనేది కేవలం హింస కాదు. అది రాజకీయ హింస. అందులో హింసతోపాటు రాజకీయం కూడ ఉంటుంది.

సహకరిస్తున్నారు, సహాయం చేస్తున్నారు, మద్దతు ఇస్తున్నారు అనే వాళ్ళు దేనికి సహాయం చేస్తున్నారు, దేనికి మద్దతు ఇస్తున్నారు? రాజకీయాలకా, హింసకా? వీటిని వేరు చేసి చూడగల సున్నితత్వం 'పోటా'లోనూ లేదు, పోలీసు వ్యవస్థలోనూ లేదు, నేర విచారణ వ్యవస్థలో అసలే లేదు.

టెర్రరిజం అని పిలవబడే రాజకీయ హింసకు ఏదో ఒక మేరకు సామాజిక పునాది ఉంటుంది. ఆ సామాజిక పునాదికి చెందిన వర్గాలు దానికి మద్దతు ఇవ్వడానికి సామాజిక కారణాలూ ఉంటాయి. ఉదాహరణకు : 'పోటా'లో టెర్రరిస్టు సంస్థలుగా ప్రకటించిన 25 సంస్థలలో అన్నీ మైనారిటీలు, ఆదివాసీ జాతులు, గ్రామీణ పేదలలో పునాది ఉన్న సంస్థలే. వాటి కార్యకలాపాలకు – హింసాత్మకమయినవైనా కాకున్నా – ఆ పునాది వర్గాలలో ఎంతో కొంత మద్దతు ఉంటుంది. అప్పుడు ఆ ప్రజలంతా 'పోటా' కింద టెర్రరిస్టులవుతారు.

ఇదంతా సెక్షన్ 21 లేకున్నా జరుగుతుంది. ఇది పోవాలంటే 'పోటా' మొత్తంగా రద్దు కావలసిందే. సెక్షన్ 21ని రద్దుచేస్తే చాలదు. కానీ 'పోటా' రద్దు కావాలంటే రాజకీయ పార్టీలలో ఇప్పుడు దాని పట్ల ఉన్న విముఖత సరిపోదు. దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ 'పోటా'ను వ్యతిరేకిస్తున్నది గానీ, ఆ పార్టీలో ఆ విషయంలో మీది నుండి కింది దాకా ఒకే అభిప్రాయం లేదు. ప్రజలలో 'పోటా' పట్ల పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చినప్పుడే దానిని అరకొరగా వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాల సంకల్పం బలపడుతుంది. గతంలో 'టాడా' విషయంలో ప్రజాభిప్రాయమే చివరికి రాజకీయ పార్టీలను దాని ఉపసంహరణ వైపు నెట్టింది. 'పోటా' విషయంలోనూ అంతే వ్యతిరేకత కలిగించిన నాడే 'పోటా' రద్దు సాధ్యం అవుతుంది.

దీనికి ప్రధాన ప్రతిబంధకం టెర్రరిస్టు చర్యలుగా ప్రజలు గుర్తించే వాటి పట్ల ప్రజాసామాన్యంలో ఉన్న వ్యతిరేకత, భయం, అసహ్యం. దేశంలోని వివిధ ప్రాంతాలలో


సాయుధ మిలిటెంట్లు సాధారణ ప్రజలను, పిల్లలను, స్త్రీలను ఊచకోతకు గురి చేయడం, రైలు పట్టాలు పేల్చేసి ప్రయాణీకులను చంపడం, ఇతర రూపాలలో సామాన్య ప్రజలనూ అమాయకులనూ హింసకు గురిచేయడం జరుగుతున్నది. ఇవి నిర్ద్వంద్వంగా వ్యతిరేకించవలసిన చర్యలు. వీటి పట్ల ప్రజలలో ఉన్న అసహ్యాన్ని గౌరవించవలసిన అవసరం ఉంది. ప్రజలలో ఉన్న భయాన్ని వాస్తవికమయినదిగా స్వీకరించవలసి ఉంది. దీనికి ప్రజాతంత్రవాదులు సిద్ధంగా లేకపోతే 'పోటా' పూర్తి రద్దు కోసం చేసే ప్రయత్నం విఫలం కాక తప్పదు.

ప్రజలలో ఉన్న ఈ భయం, వ్యతిరేకత వాస్తవికమయినదే అయినప్పటికీ 'పోటా' దానికి జవాబు కాదని ప్రజలను నమ్మింపజేయడం సాధ్యమేననుకుంటాను. నేరం ఎంత హేయమయినదయినా దానిని విచారించే పద్ధతి న్యాయబద్ధంగా ఉండాలి. లేకపోతే మిలిటెంట్ల తప్పుడు చర్యలు అమాయకులను ఎంతగా హింసకు గురిచేస్తాయో నేరవిచారణ వ్యవస్థ అంతగానూ నిర్దోషులను, అమాయకులను శిక్షించే అవకాశం ఉంది. 'పోటా'లోని నేరవిచారణ వ్యవస్థ సహజ న్యాయసూత్రాలకు తావులేని వ్యవస్థ. టెర్రరిస్టు హింస ఎంత ఘోరమైనదో ఈ నేర విచారణ వ్యవస్థ కూడ అంతే ఘోరమైనది. అది రాజకీయ టెర్రరిజమైతే ఇది శాసన టెర్రరిజం. అంతేకాక కేవలం భావసారూప్యత ఉన్నందుకు, సామాజిక కారణాల వల్ల మిలిటెంట్ల పట్ల సానుభూతి ఉన్నందుకు అమాయకులనూ, నిర్దోషులనూ శిక్షించే ప్రమాదం ఉంది.

ఈ కోణం నుండి 'పోటా'ను విశ్లేషించి ప్రజల ముందు పెట్టినట్టయితే విచ్చలవిడి హింసాకాండ పట్ల నిర్ద్వంద్వమైన వైఖరి తీసుకుంటూ కూడ 'పోటా' పూర్తి రద్దుకు ప్రజల మద్దతు కూడగట్టడం సాధ్యమే. అయితే ఈ పని సమర్థంగా చేయాలంటే హక్కుల ఉద్యమకారులు గాలిలో సాము విడిచి ప్రజల భావాలను వాస్తవికంగా అర్థం చేసుకుని వాస్తవికమైన విశ్లేషణ ద్వారా వారి ఆలోచనలను మలచడానికి కృషిచేయాలి. హక్కుల ఉద్యమ లక్ష్యాల పట్ల నిమగ్నత లేకుండ లాంఛనంగా ఉపన్యాసాలు దంచే ధోరణి విడిచిపెట్టి, హక్కుల ఉద్యమం అజెండాలను సీరియస్‌గా తీసుకొని దాని సాధన కోసం నిబద్ధతతో మార్గాలు అన్వేషించడం నేర్చుకోవాలి.

*ప్రజాపంథా పక్షపత్రిక*

***1 మే 2003***



# సైనిక చట్టమే కాదు సైనిక పాలనా పోవాలి

అది చాలా చిన్న చట్టం. పుస్తకంలో రెండు పేజీలు మాత్రమే ఉంటుంది. అందులో 7 సెక్షన్లు మాత్రమే ఉన్నాయి. అధికారం ఇచ్చేవాళ్ళకు కొంత అధికారం ఇస్తూ, దానిని భరించేవారికి కొంత రక్షణ కల్పించే చట్టమయితే పెద్దదిగా ఉండాలి, ఎక్కువ సెక్షన్లుండాలి, మినహాయింపులతో షరతులతో సంక్లిష్టంగా ఉండాలిగానీ క్రూరమైన అధికారాన్ని కట్టబెట్టే చట్టం చిన్నగానూ చిన్నపిల్లలకు సహితం అర్థమయ్యేంత సరళంగానూ ఎందుకుండకూడదు?

దాని పేరు సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం. అది అస్సాం, మణిపూర్‌లలో మాత్రమే ఉందనుకునేరు. 1958లో ఆ చట్టాన్ని చేసినప్పుడు ప్రస్తుత నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, మిజోరం, మేఘాలయ, త్రిపురలు 'అస్సాం' అనే రాష్ట్రంలో భాగంగా ఉండేవి. ఈ రాష్ట్రాలు వేరుపడిన తరువాత 1972లో ఆ చట్టాన్ని సవరించి పేరు మార్చకుండానే ఆ రాష్ట్రాలన్నిటికీ వర్తింపజేశారు. తరువాతి కాలంలో జమ్ము-కాశ్మీర్‌కు కూడ అదే నమూనాలో ఒక చట్టం చేశారు.

ఈ చట్టాన్ని రద్దుచేయాలని మణిపూర్‌లో ఈరోజు విస్తృతమైన ప్రజా ఉద్యమం నడుస్తున్నది. ఇటువంటి ఉద్యమాలూ, ఆందోళనలూ ఈశాన్య భారతంలో చాలా జరిగాయి. వాటిని ఇక్కడి పత్రికలు గానీ, ప్రజలు గానీ ఎప్పుడూ పట్టించుకోలేదు. కలకత్తాకు తూర్పున భారత భూభాగమేదీ లేనట్లే తక్కిన దేశం బతుకుతుంటుంది. (అయితే ఆ భూభాగం వేరయిపోతానంటే మాత్రం విపరీతంగా ఆవేశపడుతుంటుంది.)

ఈసారి మరి దేశమంతా పట్టించుకోవడానికి కారణం 11 మంది మణిపురీ స్త్రీలు తీసుకున్న సాహసవంతమైన నిర్ణయం. జూలై 15న వాళ్ళు మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ (ఒక పారా మిలిటరీ బలగం) కేంద్రం ఎదుట 'భారత సైనికులారా మమ్మల్నీ రేప్ చేయండి' అని బ్యానర్ పట్టుకొని నగ్న ప్రదర్శన నిర్వహించారు. మగవాళ్ళు అర్ధనగ్న ప్రదర్శనలు చేయడం దేశం చూసింది గానీ స్త్రీలు నగ్న ప్రదర్శన చేయడం చూడలేదు. ఎన్నడూ ఊహించలేదు. చెప్పుతో చెంపమీద కొట్టినట్టు దేశం లేచి కూర్చుంది. మణిపూర్‌లో ఏం జరుగుతున్నది? అని అడగసాగింది.

అంతకు ముందు ఒక ఘటన జరిగింది. జూలై 10వ తేదీ రాత్రి తంగ్‌జాం మనోరమాదేవి అనే 32 సంవత్సరాల స్త్రీని అస్సాం రైఫిల్స్ జవాన్లు ఇంఫాల్‌లోని ఆమె ఇంటి నుండి నిద్రలేపి బాగా కొట్టి తీసుకుపోయారు. చాలా చట్టబద్ధంగా అరెస్టు మెమో రాసి ఆమె సంతకం కూడ తీసుకొని ఆమె తల్లిదండ్రులకు ఇచ్చారు. ఆమె వద్ద నిషిద్ధ సామగ్రి ఏమీ దొరకలేదని కూడ అందులో రాశారు.

మరుసటిరోజు తెల్లవారి పట్టణం బయట చేలలో మనోరమ శవం దొరికింది. శవంలో ఎనిమిది తూటాలు దిగి ఉన్నాయి. ఇంటరాగేషన్ చేస్తుండగా ఆమె తప్పించుకొని పారిపోబోయిందనీ, అప్పుడు కాల్చామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అన్నారు. వారి పరిశోధనలో ఆమె పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అనే వేర్పాటువాద సంస్థ కార్యకర్త అని తేలిందన్నారు. ఆమె ఇంట్లో సింగపూర్‌లో తయారైన రేడియో సెట్ ఒకటి, చైనాలో తయారైన గ్రెనేడ్ ఒకటి దొరికాయని కూడ అన్నారు. ఆ మేరకు ఒక 'మెమో' తయారుచేసి దానిపైన మనోరమ సంతకం తీసుకొని ఉంచుకున్నారు. ఇంటివద్ద రాసిన అరెస్టు 'మెమో'లో ఆమె వద్ద నిషిద్ధ వస్తువేదీ దొరకలేదని రాసిన సంగతి, దానిపైన కూడ మనోరమ సంతకం చేసిన సంగతి పైన చెప్పాము. రెండవ మెమోపైన ఆమె ఏ పరిస్థితిలో సంతకం చేసి ఉంటుందో ఊహించడం కష్టం కాదు.

అరెస్టు చేసినప్పుడు మనోరమ మణిపురీ స్త్రీలు సాధారణంగా ధరించే బిగువయిన లుంగీ వంటి వస్త్రం ధరించి ఉందనీ, రబ్బర్ చెప్పులు వేసుకొని ఉందనీ – ఆమె పొలాల వెంబడి పారిపోయే ప్రయత్నం చేయడమేమిటని ప్రజలు వేసిన ప్రశ్నకు అస్సాం రైఫిల్స్ ఏ జవాబూ ఇవ్వలేదు. ఒకవేళ పారిపోయే ప్రయత్నం చేసినా వెంటపడి పట్టుకోవడం అస్సాం రైఫిల్స్ వీరజవాన్లకు సాధ్యం కాలేదా అన్న ప్రశ్నకూ

వారు జవాబివ్వలేదు. ఆమెను అస్సాం రైఫిల్స్ వీరజవాన్లు రేప్ చేసి చంపారని మణిపూర్ ప్రజల అభియోగం. ఆమె శరీరం మీద ఉన్న గాయాలను బట్టి వారు ఆ నిర్ధారణకు వచ్చారు.

అయితే మణిపూర్ ప్రజలు ప్రశ్నలడుగుతూ కూర్చోలేదు. మణిపూర్ రాష్ట్రం మైదాన ప్రాంతంలోని ప్రధాన తెగ అయిన మీయ్‌తీల పౌర సమాజంలో మొదటి నుండీ స్త్రీలదే చురుకయిన పాత్ర. అక్కడి మహిళా సామాజిక కార్యకర్తలను 'మీయ్‌రా పైబీ'లు అంటారు. 11 మంది మీయ్‌రాపైబీలు జూలై 15న అసాధారణమైన నిరసన చేపట్టి విస్తృతమైన నిరసన ఉద్యమానికి నాంది పలికారు. ఆనాటి నుండి ఈనాటి వరకు మణిపూర్‌లో సాధారణ స్థితి తిరిగి రాలేదు.

సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఉపసంహరించాలన్నది వారి డిమాండు. ఆ చట్టం పోతే అణచివేత పోతుందని నమ్మేంత అమాయకులు కారు వారు. నిర్బంధ చట్టాలు నిర్బంధానికొక వికృతమైన 'చట్టబద్ధత' మాత్రమే కల్పిస్తాయి. అవి నిర్బంధానికి కారణం కాదు. నిర్బంధ చట్టాలు లేకపోతే నిర్బంధం లేకుండ పోదు. మణిపూర్‌తో సహా ఈశాన్య భారత ప్రాంత ప్రజలంతా కోరుకునేది సైనిక పాలన పోవాలని. దానికి చట్టబద్ధత కల్పించే ఈ చట్టం సైనిక పాలనకొక సంకేతం మాత్రమే.

విచ్చలవిడి బలప్రయోగాన్ని ఆమోదించడం ఈ చట్టం లక్ష్యం. ఒక వ్యక్తి నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తున్నట్లయితే అతనిని నివారించడానికి తుపాకీతోనయినా, వేరే ఏ రకంగానైనా - ప్రాణం తీసేంత బలప్రయోగమయినా సరే - సైనికులు చేయవచ్చునని ఈ చట్టంలోని సెక్షన్ 4(ఎ) అంటుంది. సాయుధ దాడులు చేయడానికి, లేక ఆయుధాలు దాచుకోడానికి, లేక మిలిటెంట్లకు తర్ఫీదు ఇవ్వడానికి ఉపయోగ పడుతుందని భావించే ఏ నిర్మాణాన్నయినా సైనికులు పూర్తిగా ధ్వంసం చేయవచ్చునని 4(బి) అంటుంది. ఒక నేరం చేసిన లేక చేయబోతున్న వ్యక్తిని అరెస్టు చేయడానికి సైనికులు ఎంత అవసరమనుకుంటే అంత బలప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(సి) అంటుంది. ఏ నివాసాన్నయినా వ్యక్తుల కోసం, వస్తువుల కోసం వారంట్ కూడ లేకుండ సైనికులు సోదా చేయవచ్చునని, ఆ క్రమంలో ఎంత అవసరమనుకుంటే అంత బలప్రయోగం చేయవచ్చునని సెక్షన్ 4(డి) అంటుంది.

## మరొక స్త్రీ సాహసం

ఈ రోజు మణిపూర్ రాష్ట్ర ప్రజలంతా రోడ్డెక్కేసరికి వారి ఆందోళన బయటి ప్రపంచం దృష్టిని ఆకర్షించింది గానీ నాలుగు సంవత్సరాలుగా ఒక స్త్రీ ఇదే డిమాండుతో ఆమరణదీక్ష చేస్తున్నది. కవి, మానవహక్కుల కార్యకర్త అయిన ఇరోం షర్మిల సాయుధ బలాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేయాలంటూ 2000 సంవత్సరం నవంబర్ 2న ఆమరణ దీక్షకు కూర్చునింది. ప్రభుత్వం ఆదేశం మేరకు డాక్టర్లు రబ్బర్ గొట్టాల ద్వారా ఎక్కిస్తున్న 'ఆహారం' తప్ప ఆమె ఏమీ తీసుకోవడం లేదు. పూర్తిగా శుష్కించి ఎముకలూ చర్మం తప్ప ఏమీ మిగలకుండా పోయినా షర్మిల తన పట్టుదల వీడడం లేదు. మానవహక్కుల ఉద్యమకారులు, శ్రేయోభిలాషులు ఆమె చేత ఈ దీక్ష విరమింపజేయాలని ప్రయత్నిస్తే మీరు నా చేత మాన్పిస్తారుగానీ చట్టాన్ని రద్దు చేయించలేరు కదా అని తిరస్కరిస్తుంది.

ఈ అధికారం చలాయించే క్రమంలో సైనికులు పాల్పడే ఏ చర్య మీదనయినా కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ఎటువంటి కేసూ పెట్టడానికి వీలులేదని సెక్షన్ 6 అంటుంది.

మామూలు చట్టాలు పోలీసులకు బలప్రయోగం చేసే అధికారం ఇచ్చినచోట 'కనీస బలప్రయోగం' మాత్రమే చేయాలని నొక్కి చెప్తాయి. కాని ఈ చట్టం మాత్రం 'నీకు అవసరమనిపించినంత చేసుకో' అంటుంది. అందుకే ఇటువంటి చట్టాలను అణచివేత చట్టాలు, నిర్బంధ చట్టాలు అంటాం.

దాదాపు 50 ఏళ్ళుగా ఈశాన్య రాష్ట్రాలను ఏలుతున్న సైనిక పాలన తొలగిపోవాలని కోరుకునే ఆ ప్రాంత ప్రజలు ఈ చట్టాన్ని రద్దుచేయాలన్న డిమాండ్‌ను తమ ఆందోళనకు కేంద్రం చేసుకోవడం సహజం. ఈ ఆందోళనను అండర్‌గ్రౌండ్ మిలిటెంట్ సంస్థలు రెచ్చగొడుతున్నాయని ఎప్పటిలాగే భారత సైన్యం ఆరోపిస్తున్నది. కానీ నిజానికి చేతిలో తుపాకి పట్టుకొని ప్రభుత్వంపైన యుద్ధం చేస్తున్న వారికి ఇటువంటి చట్టాల వల్ల ప్రత్యేకంగా వచ్చే సమస్య ఏమీ లేదు. వాటి క్రూరత్వాన్ని అనుభవించేది ఆ మిలిటెంట్ సంస్థల పట్ల రాజకీయంగా, సామాజికంగా ఎంతో కొంత సంబంధాలు, సానుభూతి ఉండే మామూలు జనమే. ఈశాన్య భారత రాష్ట్రాలలో

నడుస్తున్న పోరాటాలన్నీ అక్కడి వివిధ ప్రజా సమూహాలు తమ జాతి ఉనికినీ స్వాతంత్ర్యాన్నీ కాపాడుకోవడానికి చేస్తున్న పోరాటాలు కాబట్టి ఆయా జాతులకు చెందిన ప్రజలకు ఆ పోరాటాల పట్ల ఎంతో కొంత సానుభూతి, సంబంధాలు ఉండడం సహజం. అందువల్ల ఆ ప్రజానీకమంతా ఇటువంటి చట్టాల క్రూరత్వానికి బలి కావడం, వాటి రద్దును కోరుకోవడం సహజం. ఈ రోజు మణిపూర్ గురించి

## మణిపూర్ ప్రజలకు ఏం కావాలి?

మణిపూర్‌లో రకరకాల పేర్లతో పనిచేస్తున్న 32 సాయుధ పోరాట సంస్థలు ఉన్నాయని అంచనా.

మణిపూర్‌కు ఒక స్వతంత్ర రాజ్యంగా కనీసం వెయ్యి సంవత్సరాల చరిత్ర ఉందని ఈ పోరాటంలో ప్రధాన పాత్ర వహిస్తున్న మీయ్‌తీ జాతి ప్రజల భావన. వారి రాజ్యాన్ని మొగల్ పాదుషాలు సహితం జయించలేదు. 1891లో బ్రిటిష్ వాళ్ళు వారి రాజును లోబరచుకొని సామంతుడిని చేసుకోవడం వారి ప్రథమ పరాజయం. బ్రిటిష్ వాళ్ళ వల్ల పోయిన స్వాతంత్ర్యం బ్రిటిష్ వాళ్ళ నిష్క్రమణతో తిరిగి వచ్చిందని, కాని భారత పాలకుల నిర్బంధ విధానాల వల్ల అది తమకు దక్కకుండ పోయిందని వారి ఫిర్యాదు.

ఇది క్రిస్టియన్ మిషనరీల కుట్ర అనడానికి నాగాలలాగ వీరు క్రిస్టియన్లు కారు. ఐఎస్ఐ కుట్ర అనడానికి కాశ్మీరీలలాగ ముస్లింలు కారు. మీయ్‌తీలు హిందువులు. వైష్ణవ మతావలంబులు. అయితే వారి భాష, జీవన సంస్కృతి, రూపురేఖలు సాధారణ భారతీయుల కంటే చాలా భిన్నమయినవి. వెయ్యి సంవత్సరాల అవిచ్ఛిన్నమయిన తమ స్వతంత్ర అస్తిత్వం వదులుకోవడం వారికి ఇష్టం లేదు.

1947లో వారి రాజు బోధాచంద్ర సింగ్ భారత్ ఒత్తిడి ఫలితంగా కేంద్ర ప్రభుత్వానికి రక్షణ, విదేశీ వ్యవహారాలు, ప్రసార సాధనాలు అనే మూడు విషయాలలో మాత్రమే అధికారం ఉండే షరతు మీద మణిపూర్‌ను భారత్‌లో విలీనం చేశాడు. అయితే రెండేళ్ళు తిరగకముందే నెహ్రూ – పటేళ్ళ ప్రభుత్వం అతని మీద బాగా ఒత్తిడి పెట్టి పూర్తిగా విలీనం చేసేసుకున్నారు. అది కుట్ర అని ప్రజల అభియోగం.


వింటున్నాంగానీ ఇదే స్థితి మిజోరంలో, త్రిపురలో, అస్సాంలో, నాగాలాండ్‌లో 50 ఏళ్ళుగా ఉంది. నాగాలాండ్‌లో ప్రస్తుతం ప్రభుత్వానికీ మిలిటెంట్లకూ మధ్య కాల్పుల విరమణ అమలులో ఉందిగానీ లేకుంటే అక్కడి అన్ని రాష్ట్రాల కంటే నాగాలాండే ఎక్కువ నిర్బంధాన్ని చవిచూసింది.

అందువల్ల మణిపూర్ ప్రజల పోరాటానికి మనందరి మద్దతూ అవసరం. ప్రజలు ఒక్కసారి ఉవ్వెత్తున లేచేసరికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇబోబిసింగ్ కాంగ్రెస్ సంస్కృతికి సహజమైన సర్దుబాటు ధోరణిలో ఒక్క ఇంఫాల్ పట్టణంలో ఆ చట్టం అమలును ఉపసంహరించాడు. అంటే ఇంఫాల్‌లో పట్టుకున్న వారిని బయటికి తీసుకుపోయి కాల్చేస్తే సరిపోతుందని కాబోలు!

తంగ్‌జాం మనోరమాదేవి హత్యపైన రెండు మూడు విచారణలు మొదలయ్యాయి. అయితే విచారణలు రహస్యంగా (ఇన్ కెమెరా) జరగాలనీ, విచారణాధికారి తమ కేంద్ర కార్యాలయానికే వచ్చి తమను ప్రశ్నించాలనీ, అట్లాగయితేనే తాము విచారణలో పాల్గొంటామనీ అస్సాం రైఫిల్స్ అధికారులు అంటున్నారు. వాళ్ళను 'నఖ్రాలు' చేయొద్దని శాసించే ఉద్దేశ్యం భారత సర్కార్‌కు లేదు. ఆ రాష్ట్రంలో ప్రజలంతా తీవ్ర ఆవేదనకు గురయినా ఫరవాలేదు, భారత్‌ను మరింత ద్వేషించినా ఫరవాలేదు, నేరం చేసిన సైనికులను కాపాడడమే ప్రధానం భారత సర్కార్‌కు. ఇంఫాల్ పట్టణంలో మాత్రమే ఆ నిర్బంధ చట్టం అమలును నిలుపుదల చేయడం హాస్యాస్పదమని సాధారణ మానవులకు అనిపిస్తుండగా, ఆ మాత్రం స్వతంత్రించినందుకు ఇబోబిసింగ్‌పైన కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేశాడంట. 'మా పార్టీవాడయితేనేం? మాకు చాలా కోపంగా ఉంది' అని విలేఖర్లతో అన్నాడంట.

శివరాజ్ పాటిల్ కన్నెర్ర చేస్తే చేయవచ్చునుగానీ మణిపూర్ ప్రజల భావాలను పట్టించుకోకుండ ఉండడానికి ఇబోబిసింగ్ బయటివాడు కాదు కదా. రాజీ రాజకీయాల పరిధిలోనయినా ఏదో ఒకటి చేయక తప్పదు. అయితే అతను చేసింది చాలదు. సైనికుల చేతిలో విధ్వంసక అధికారాలు పెట్టే ఆ చట్టాన్ని మొత్తంగా ఎత్తివేయాలి. అంతేకాదు, ఈశాన్య భారతంలో సైనిక పాలనను ఎత్తివేయాలి.

*మానవహక్కుల వేదిక కరపత్రంగా వచ్చింది*



***23 ఆగస్టు 2004***

# అఫ్స్పా : జీవన్‌రెడ్డి కమిటీ నివేదికలో ఏముంది?

సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంలోని వివిధ అంశాలను సమీక్షించి, వాటిని మానవహక్కుల పరిరక్షణ బాధ్యత వెలుగులో సవరించడమా లేక ఆ చట్టం స్థానంలో మరింత మానవీయమైన చట్టాన్ని ప్రవేశపెట్టడమా, ఏం చేయడం ఉచితంగా ఉంటుందో సలహా ఇమ్మని కేంద్ర ప్రభుత్వం అయిదుగురు సభ్యులు గల ఒక కమిటీని నియమించింది. దాని అధ్యక్షుడు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన బి.పి. జీవన్‌రెడ్డి కాగా ఇతర సభ్యులు డా. ఎస్.బి. నకాడె అనే మాజీ వైస్ ఛాన్సలర్, పి. శ్రీవాత్సవ అనే మాజీ కేంద్ర హోంశాఖ కార్యదర్శి, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వి.ఆర్. రాఘవన్, పత్రికా విలేఖరి సంజయ్ హజారికా.

సైనిక బలగాలకు విపరీత అధికారాలు కల్పిస్తున్నదని విమర్శకు లోనైన చట్టాన్ని సమీక్షించే కమిటీలో ఒక రిటైర్డ్ సైనిక అధికారిని సభ్యుడ్ని చేయడం అనుచితం అని కేంద్ర ప్రభుత్వానికి తోచినట్టు లేదు. కమిటీ ప్రజలతో మాట్లాడి ప్రజాభిప్రాయం సేకరించినట్టే సైనిక దళాలతోనూ మాట్లాడి వారి అభిప్రాయాలూ తీసుకోవాలనడం వేరు, సైన్యానికి చెందిన మాజీ అధికారిని ఆ కమిటీలో సభ్యుడిని చేయడం వేరు. అది న్యాయమే అనేటట్టయితే, ఈ చట్టానికి బాధితులైన వ్యక్తుల ప్రతినిధి ఒకరిని కూడ కమిటీలో వేయడం న్యాయం అనిపించుకోదా? ప్రజల తరఫున ఉన్నాడు అని చెప్పదగ్గ వ్యక్తి పత్రికా విలేఖరి అయిన సంజయ్ హజారికా ఒకడే. అతను అస్సాంకు చెందిన వాడు, ప్రజల హక్కుల గురించి ఆవేదన చెందే పాత్రికేయుడు. అయినప్పటికీ అతనిని బాధితుల ప్రతినిధి

అనడానికి వీలు లేదు. కమిటీ అధ్యక్షుని పేరు మీద 'జీవన్‌రెడ్డి కమిటీ'గా పేరుపొందిన ఈ విచారణ సంఘం నవంబర్ 2004లో తన పని మొదలుపెట్టి 2005 జూన్ 6 నాటికి తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. రెండేళ్ళయినా కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయకుండా కూర్చుంది. వారి నివేదికను ఆమోదించనూ లేదు, తిరస్కరించనూ లేదు, బహుశా చర్చించనే లేదు.

ఇట్లా ఎంత కాలమైనా కొనసాగి ఉండవచ్చు. కొనసాగిన సందర్భాలు లేకపోలేదు. అయితే 'ది హిందూ' దినపత్రిక ఆ నివేదిక ప్రతిని సంపాదించి దానిని బహిర్గతం చేసింది. జీవన్‌రెడ్డి కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దు చేయవలసిందిగా సిఫారసు చేసిందన్న అభిప్రాయం 'ది హిందూ' కల్పించేసరికి కొంత సంచలనం కలిగింది. జీవన్‌రెడ్డి కమిటీ ఆ చట్టాన్ని (క్లుప్తంగా దానిని సాయుధ బలగాల చట్టం అందాం) రద్దు చేయమని చెప్పిన మాట నిజమే గానీ, అందులోని అనేక అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చమని చెప్పింది కూడ. వెరసి జీవన్‌రెడ్డి కమిటీ ఏమందో, దానిలోని మంచి చెడులేమిటో తెలుసుకోవడం అవసరం.

సైనిక బలగాలు ప్రాణాన్నీ, స్వేచ్ఛనూ హరిస్తాయి కాబట్టి వాటి కార్యకలాపాలను, నడవడికను నియంత్రించడానికి నియమాలుండడం అవసరం. సైన్యం కార్యకలాపాలు యుద్ధానికే పరిమితమైనట్టయితే అంతర్జాతీయ యుద్ధ నియమాలు సైనిక బలగాల నడవడికను నియంత్రిస్తాయి. అయితే పౌర సమాజంలో సైన్యాన్ని ప్రయోగించేటట్టయితే దాని కార్యకలాపాలను నియంత్రించడానికి ఒక చట్టం అవసరం. ఎందుకంటే ఎవరి ప్రాణాన్ని గానీ, స్వేచ్ఛను గానీ చట్టం నిర్దేశించే పద్ధతిలో తప్ప ఇతరత్రా తీసేయడానికి వీలు లేదనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటి.

సైనిక బలగాలను పౌర సమాజంలో ప్రయోగించనే వద్దని నిర్ణయించుకుంటే ఈ సమస్య రాదు. అయితే సాధారణ చట్టం కూడ సైనిక బలగాలు దొమ్మీలను అదుపుచేసే కర్తవ్యం నిర్వర్తించే పరిస్థితి రావచ్చునని భావిస్తుంది. ఒక దొమ్మీని అదుపు చేయడం కోసం సైనిక బలగాల సహాయం అవసరం అని భావిస్తే ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేటు హోదా గల అధికారి ఆ సహాయం కోరవచ్చునని సిఆర్‌పిసిలోని సెక్షన్ 130 అంటుంది. అప్పుడు సైన్యం ఆ అధికారి అదుపులో పనిచేస్తుంది. పోలీసులకు సిఆర్‌పిసిలో వర్తించే అన్ని నియమాలూ ఆ సందర్భంలో సైన్యానికీ వర్తిస్తాయి.

మరైతే ఒక ప్రత్యేకమైన సైనిక బలగాల చట్టం ఎందుకు అవసరమైంది? ఎందుకంటే సిఆర్‌పిసి సైన్యానికి కేవలం దొమ్మీలను అదుపుచేసే సందర్భంలో మాత్రమే ఒక సహాయక పాత్రను నిర్దేశించింది. దానిని ఆ ఘటనకే పరిమితం చేసింది. అంటే ఆ దొమ్మీ చెదిరిపోగానే సైనిక బలాలు వెనక్కి వెళ్ళిపోవాలి. కాని దానికి ఆ పాత్ర చాలదనుకోవడం వల్లనే ప్రత్యేక చట్టం అవసరం అయింది. సాయుధ పోరాట రాజకీయాలు తలెత్తిన ప్రాంతాలలోనే ఈ అవసరం పాలకులకు తోచింది.

సాయుధ పోరాటాలు ప్రజా సమూహాల ఉమ్మడి చర్యల రూపంలో మాత్రమే జరగవు. (చట్టం వీటిని దొమ్మీలు అంటుంది.) ఆయుధాలు ధరించి తిరిగే కొద్దిమంది మిలిటెంట్ల హింసాత్మక చర్యలూ ఉంటాయి. తరచుగా అవే ఎక్కువ ఉంటాయి. ఈ మిలిటెంట్లను భౌతికంగా ఏరివేయడం, వారికి ఆశ్రయం ఇచ్చే నివాసాలను ధ్వంసం చేయడం అనే రెండు కర్తవ్యాలను సైన్యం నిర్వర్తించడం అవసరం అని పాలకులు భావించారు. ఆ రెండు కర్తవ్యాలూ పోలీసులే చేయలేరా అంటే రెండు సమస్యలున్నాయి. అంతటి శిక్షణ పోలీసులకు ఉండదన్నది ఒకటి. రెండవది, పైకి చెప్పడానికి సిగ్గుపడేది, ఏమిటంటే సాయుధ పోరాట రాజకీయాలను మొట్టమొదట ఆశ్రయించింది జాతి ఉద్యమాలు. నాగాలు, మిజోలు, మీయ్‌తీలు, కాశ్మీరీలు, సిక్కులు వగైరా. ఆ ప్రాంతాలలో పనిచేసే పోలీసులు కూడ ఈ జాతులకే చెంది ఉంటారు కాబట్టి వాళ్ళను నమ్మడం కష్టం అన్నది రెండవ కారణం. ఈ రెండు కారణాల వల్ల మిలిటెంట్ రాజకీయాలపైన ప్రయోగించడానికి సైనిక బలగాలను దించడం అవసరం అని పాలకులు భావించారు. కేవలం ఒక్కొక్క ఘటనకు పరిమితం కాకుండా నిరంతరాయంగా సైన్యం పనిచేయడం అవసరం అని భావించారు. దానితో అది నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు చట్టపరమైన ఆమోదం (లేక ఆచ్ఛాదన) కల్పించడానికి ఒక కొత్త చట్టం అవసరం అయింది. సాయుధ బలగాల చట్టానికి మూలం ఇక్కడుంది.

ఇదంతా జీవన్‌రెడ్డి కమిటీ గుర్తించిందన్న అభిప్రాయం నేను కలిగించి ఉంటే పొరపాటే. ఈ వాస్తవాలను చూసి ఉంటే కమిటీ సూచనలు ఇంకా మెరుగ్గా ఉండేవి. కానీ జీవన్‌రెడ్డి కమిటీ వీటిని చూడలేదు. పోలీసుల బలం చాలదు, సైనిక బలగాలను ప్రయోగించడం అవసరం అని, సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర సరిపోదు అని ప్రకటించి ప్రత్యేక చట్టం అవసరం అన్న అభిప్రాయానికి వచ్చేసింది. పోలీసుల

బలం ఎందుకు చాలదో చెప్పలేదు గానీ, సిఆర్‌పిసి వారికి నిర్దేశించిన పాత్ర ఎందుకు చాలదంటే దొమ్మీలు రాజ్యాధికారాన్నీ, రాజ్యం భద్రతనూ సవాలు చేయవనీ, రాజ్యం భద్రతను సాయుధంగా సవాలు చేసే సందర్భం వచ్చినప్పుడు ఆ చట్టం నిర్దేశించే పాత్ర చాలదనీ జీవన్‌రెడ్డి కమిటీ అంటుంది. ఈ విశ్లేషణకూ సాయుధ బలగాల చట్టం సైనిక బలగాలకిచ్చే విశేష అధికారాలకూ పొంతన ఏమిటి? రాజ్యం భద్రతను పరిరక్షించడానికి వ్యక్తులను కాల్చి చంపడం, నివాసాలను కూల్చడం అనే అధికారాలున్న బలగం అవసరమనే నిర్ధారణకు ఏ విధంగా వచ్చారు?

ఏ విధంగానైతేనేం వచ్చారు.

మిగిలిన విషయాలు చూసే ముందు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం చరిత్ర కొంచెం చూద్దాం. ఈ పేరుతో ఈశాన్య భారత రాష్ట్రాల కోసం ఒక చట్టం, జమ్మూ కాశ్మీర్ కోసం ఒక చట్టం ఉన్నాయి. రెండింటి మధ్య స్వల్పమైన తేడాలు మాత్రమే ఉన్నాయి. మొట్టమొదట వచ్చింది సాయుధ బలగాల (అస్సాం, మణిపూర్) ప్రత్యేక అధికారాల చట్టం, 1958. పేరులో అస్సాం, మణిపూర్ అని ఉన్నా ఈ చట్టం రావడానికి కారణం నాగాల జాతి పోరాటం. అప్పటికి నాగాలాండ్ అనే రాష్ట్రం లేదు. 'నాగా కొండల ప్రాంతం' అస్సాం రాష్ట్రంలో ఉండేది. మణిపూర్ (అప్పుడూ, ఇప్పుడూ) ఉత్తర భాగంలో నాగాలు నివసించే జిల్లాలు ఉన్నాయి. 1947లో నాగాలు మీ ఇండియాతో మాకేం సంబంధం లేదు, మాపాటికి మమ్మల్ని బతకనివ్వండి అని అంటే పదేళ్ళు ఇండియాలో ఉండి చూడండి, ఆ తరువాత మీ భవితవ్యాన్ని మీరే నిర్ణయించుకుందురని హామీ ఇచ్చి, పదేళ్ళు గడిచిన తరువాత సైన్యాన్ని దించి సాయుధ బలగాల చట్టాన్ని చేశారు మన పాలకులు.

ఇది చాలా చిన్న చట్టం. కాగితానికి రెండువైపులా అచ్చువేసినట్టయితే ఒకే కాగితంలో ఇముడుతుంది. అధికారాన్నీ హక్కులనూ సమన్వయపరచి, హక్కుల రక్షణ కోసం అధికారానికి పరిమితులు పెట్టి, మరీ అవసరమనుకున్నచోట దానికి షరతులు పెట్టి, వీటిని అతిక్రమించినట్టయితే దానిపైన విచారణ జరిపే వ్యవస్థను రూపొందించి – ఇవన్నీ ఉన్నట్లయితే చట్టం పెద్దదిగా ఉంటుంది, క్లిష్టంగా ఉంటుంది. కాని అధికారాన్ని కట్టబెట్టడమే లక్ష్యం అయిన చట్టం పెద్దదిగా ఎందుకుండాలి?

అందుకే ఇది చాలా చిన్నది. ఈ చట్టం వర్తించే రాష్ట్రాలను మొత్తంగా గానీ, అందులో ఒక భాగాన్ని గానీ కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి కూడ ఉంది. ఎప్పుడు ప్రకటించవచ్చునంటే ఆ ప్రాంతంలో పౌర పాలనకు సహాయంగా సాయుధ బలగాలను దించడం అక్కడ నెలకొన్న కల్లోలం లేక ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా అవసరం అనుకున్నప్పుడు. ఆ వెనువెంటనే సాయుధ బలగాలు రంగంలోకి దిగుతాయి. వారికి ప్రధానంగా ఉండే అధికారాలు నాలుగు. నిషేధాజ్ఞలను అతిక్రమిస్తున్న వ్యక్తిపైన కాల్పులు జరపవచ్చు, ప్రాణం సైతం తీయవచ్చు. సాయుధ మిలిటెంట్లకు గానీ నేరారోపితులకు గానీ ఆశ్రయం ఇవ్వడానికి ఉపయోగించే నిర్మాణాలను, సాయుధ దాడులు చేయడానికి ఉపయోగించే నిర్మాణాలను, ఆయుధాగారాలుగా ఉపయోగించే, లేక ఉపయోగించగల నిర్మాణాలను ధ్వంసం చేయవచ్చును. నేరంలో నిందితుడైన వ్యక్తిని లేక నేరం చేశాడన్న సందేహం ఉన్న వ్యక్తిని లేక నేరం చేయబోతాడన్న సందేహం ఉన్న వ్యక్తిని అరెస్టు చేయవచ్చు. అరెస్టు చేయడానికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు. ఆయుధాలను గానీ, దొంగిలించిన వస్తువులను గానీ, అపహరించిన వ్యక్తిని గానీ దాచి ఉంచారని సహేతుకంగా భావించే ఏ ప్రదేశంలోకైనా ఎటువంటి వారంట్ లేకుండా ప్రవేశించవచ్చు, సోదా చేయవచ్చు, అరెస్టు చేయవచ్చు. దీనికి ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చు.

ఆయుధాలు పట్టుకొని ఒక రాజకీయ లక్ష్యంతో పోరాటం చేసేవాళ్ళను, అందులో భాగంగా తమ లక్ష్యానికి అడ్డంవచ్చే వాళ్ళను హింసకు గురిచేయడానికి సందేహించని వాళ్ళను ప్రభుత్వం ఉపేక్షించాలా, ఏ ప్రభుత్వమైనా ఉపేక్షించగలదా అని అడుగుతారేమో? ఉపేక్షించాలని గానీ, ఏ ప్రభుత్వమైనా ఉపేక్షించగలదని గానీ ఎవరూ అనరు. అయితే దీని కోసం ప్రభుత్వ బలగాలకిచ్చే అధికారం విచ్చలవిడి హింసకు దారితీసే అవకాశం లేకుండా కట్టడిచేసే ఆంక్షలు ఆ అధికారాన్ని కల్పించే చట్టంలో అంతర్భాగంగా ఉండడం అవసరం. సాధారణ చట్టం కూడ హింసను అదుపు చేసే అధికారం పోలీసులకు ఇస్తుంది గానీ దాని కోసం కనీస బలప్రయోగం – అంటే అదుపు చేయడానికి ఏ మేరకు అవసరమో ఆ మేరకు మాత్రమే – చేయాలని పలు రూపాలలో నొక్కి చెపుతుంది. నిజంగా పోలీసులు బలప్రయోగానికి పాల్పడినప్పుడు అది ఆ సందర్భంలో కనీసమైన బలప్రయోగమేనా అని నిర్ణయించే నిష్పాక్షికమైన

వ్యవస్థ ఏదీ లేకపోవడం వల్ల తరచుగా గరిష్ఠ బలప్రయోగాన్నే సరైనదిగా పోలీసులు చలామణి చేయగలుగుతున్నారు గానీ, హేతుబద్ధమైన పరిమితులతో కూడిన బలప్రయోగ అధికారం ఉండడం దానంతటది ఆక్షేపణీయం కాదు. సాయుధ బలగాల చట్టం అన్ని పరిమితులనూ తీసేసి, 'ఎంత అవసరమైతే అంత బలప్రయోగం చేయవచ్చును' అంటుంది.

దీని పర్యవసానాన్ని వివరించాలంటే ఆనాటి నుంచి ఈనాటి దాకా ఈ చట్టం కల్పించిన ఆచ్ఛాదనను వాడుకొని వివిధ సాయుధ బలగాలు ఎంత విచ్చలవిడి హింసకు పాల్పడ్డాయో చెప్పవలసి ఉంటుంది. ఒక్క ఈశాన్య భారత రాష్ట్రాలలోనే కాదు, జమ్ము-కాశ్మీర్‌లో కూడ. ఎందుకంటే ఈ చట్టం నమూనాలోనే ఆ రాష్ట్రానికి వర్తించే ఒక సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని జారీచేసి దాని కింద లక్షల సంఖ్యలో సైన్యాన్నీ పారామిలిటరీని అక్కడ దించారు.

ఈ విచ్చలవిడితనం పట్ల నిరసనే జీవన్‌రెడ్డి కమిటీ ఆవిర్భావానికి కారణం. అందులో చివరి ఘట్టాన్ని కమిటీ తన రిపోర్టులో కూడ ప్రస్తావించింది. 2004 జూలై 10-11 తేదీల మధ్య రాత్రి అస్సాం రైఫిల్స్ బలగాలు తంగ్‌జాం మనోరమాదేవి అనే మహిళను తన ఇంటి నుంచి తీసుకుపోయి కాల్చి చంపారు. చంపే ముందు ఆమెపైన లైంగిక అత్యాచారానికి పాల్పడ్డారన్న అనుమానం కూడ ఉంది. ఈ హత్యకు నిరసనగా పెద్దఎత్తున ప్రజలు కదిలారు. 12 మంది స్త్రీలు ఇంఫాల్‌లోని అస్సాం రైఫిల్స్ కార్యాలయం వద్ద తమను తాము వివస్త్రలు చేసుకొని 'భారత సైనికులారా, మమ్మల్ని కూడ రేప్ చేయండి' అని నినదించడం యావద్దేశానికి షాక్ ఇచ్చింది. ఆ తరువాత కొనసాగిన నిరసన ఫలితంగా కేంద్ర హోంమంత్రి మణిపూర్‌కు పోవడం, అక్కడి ప్రజా సంఘాలు ఆయనను కలిసి సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయమని డిమాండ్ చేయడం ఈ కమిటీ ఆవిర్భావానికి కారణం.

అయితే మనోరమాదేవి హత్య కంటే చాలా ముందు నుంచే ఇరోం చాను షర్మిల అనే స్త్రీ సాయుధ బలగాల చట్టాన్ని రద్దు చేయాలన్న డిమాండ్‌తో నిరాహారదీక్ష చేస్తున్నది. 2000 సంవత్సరం నవంబర్ 2వ తేదీన మణిపూర్ రాజధాని ఇంఫాల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఒక బస్‌స్టాండ్‌లో నిలబడ్డ జనంపై అస్సాం రైఫిల్స్ జవాన్లు కాల్పులు జరిపి 10 మందిని చంపిన ఘటనకు నిరసనగా మొదలుపెట్టిన నిరాహార

దీక్షను ఆమె ఈనాటికీ కొనసాగిస్తున్నది. ప్రభుత్వ వైద్యులు బలవంతంగా గొట్టాల ద్వారా ఎక్కిస్తున్న ద్రవ పదార్థం తప్ప వేరే ఏ ఆహారమూ తీసుకోవడం లేదు.

ఈ నేపథ్యంలో ఏర్పడిన కమిటీ ఒక వ్యక్తిని నేరుగా కాల్చి చంపడానికి సాయుధ బలగాల చట్టం సైనిక బలగాల సిబ్బందికి ఇచ్చిన అధికారం ఎంతవరకు సబబు అన్న ప్రశ్న ప్రధానంగా వేసుకోవలసి ఉండింది. వేసుకోకుండా, రాజ్యం ఉనికినే ప్రశ్నించే ఉద్యమాలు నడుస్తున్నచోట సిఆర్‌పిసి సైనిక బలగాలకు కల్పించే పాత్ర, ఇచ్చే అధికారాలు చాలవనీ, సాయుధ బలగాల చట్టం ఇచ్చే విశేష అధికారాలు అవసరమనీ నిర్ణయించడం (ఎంత మర్యాదగా చెప్పాలన్నా) విచారకరం అనక తప్పదు. ఈ నిర్ణయం చేసిన సందర్భంలో కమిటీ ఇచ్చిన ఉదాహరణ నుంచి వారి ఆలోచనా రీతిని ఊహించవచ్చునేమో. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం ఢిల్లీలో జరిగిన సిక్కుల ఊచకోతను ప్రస్తావిస్తూ, అటువంటి సందర్భాలలో సైనిక బలగాలు సాధారణ చట్టం అదుపులో పనిచేసినా ఫరవాలేదు గానీ, రాజ్యం ఉనికికి, భద్రతకు ముప్పుతెచ్చే అశాంతి చెలరేగినప్పుడు ఆ అధికారాలు చాలవన్నారు. ఇది మామూలు మనుషులకు ఆశ్చర్యం కలిగించే అభిప్రాయం. అమాయకులైన సిక్కు ప్రజానీకంపైన పనిగట్టుకొని గుంపులను రెచ్చగొట్టిన కాంగ్రెస్ నాయకులను అదుపు చేయడానికి సిఆర్‌పిసిలోని సమతుల్యమైన అధికారాలు సరిపోతాయి గానీ తమ భూభాగాన్ని అన్యాయంగా భారత్‌లో కలిపారని చారిత్రక ఆధారాలతో సహా పోరాటం చేస్తున్నవారిని ఎదుర్కొనడానికి విపరీత అధికారాలు కావాలనడం – జీవన్‌రెడ్డి గారు క్షమిస్తే – వికృతమైన ఆలోచన అనక తప్పదు.

నిజమే, ఆ విపరీత అధికారాలను సుప్రీంకోర్టు తీర్పు పరిధిలోకి కుదించి అర్థం చేసుకోవాలని ఈ రిపోర్టు అంటుంది. వారు అన్నా, అనకపోయినా అది తప్పనిసరి. ఎందుకంటే ఒక చట్టానికి హైకోర్టు లేక సుప్రీంకోర్టు చేసే వ్యాఖ్య ఆ చట్టంలో భాగంగా పరిగణించబడుతుంది. ఆ వ్యాఖ్య వెలుగులోనే ఆ చట్టాన్ని అర్థం చేసుకోవలసి ఉంటుంది.

సాయుధ బలగాల చట్టం చెల్లదంటూ నాగా ప్రజల మానవ హక్కుల ఉద్యమం సుప్రీంకోర్టులో వేసిన కేసులో (ఎన్.పి.ఎం.హెచ్.ఆర్ వర్సస్ యూనియన్ ఆఫ్ ఇండియా) తుది తీర్పు 1997లో వచ్చింది. ఆ చట్టం రాజ్యాంగ విరుద్ధం అని కొట్టివేయవలసింది పోయి, దానిని తగు రీతిలో కుదించి వ్యాఖ్యానించినట్టయితే

రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు అంది. కుదింపుకు సుప్రీంకోర్టు ఉపయోగించిన ప్రమాణాలలో కొన్ని ఆ చట్టంలోనే ఉన్నాయి. కొన్ని రాజ్యాంగం నుంచి వచ్చాయి.

**అవేమిటంటే –**

1. సాయుధ బలగాలు స్థానిక అధికార యంత్రాంగానికి అండగా పనిచేస్తాయే తప్ప దానిని పక్కన పెట్టి దాని పని తామే చేయవు. ఇద్దరూ పరస్పర సహకారంతో శాంతిస్థాపన కోసం కృషిచేయాలి.

2. సాయుధ బలగాలు ఎవరినైనా అరెస్టు చేస్తే వారిని వెంటనే స్థానిక పోలీసులకు అప్పగించాలి. వారు వెంటనే కోర్టులో హాజరుపెట్టాలి. మొత్తం కలిసి 24 గంటలు మించకూడదు. అదే విధంగా సోదా చేసిన క్రమంలో స్వాధీనం చేసుకున్న వస్తువులను కూడ స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలి.

3. సాయుధ బలగాలు సోదా చేసేటప్పుడు సాధారణ చట్టం ప్రకారం పోలీసులు చేసే సోదాలకు వర్తించే నియమాలనే పాటించాలి.

4. నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తున్న వ్యక్తిపైన సైనిక బలగాలు నేరుగా కాల్పులు జరపవచ్చుననీ, ప్రాణం సైతం తీయవచ్చుననీ చెప్పే సెక్షన్ రాజ్యాంగ విరుద్ధమేం కాదనీ, అది చెల్లుబాటు అవుతుందనీ అంటూ, అదే సమయంలో 'కనీస బలప్రయోగం మాత్రమే చేయాల'ని సుప్రీంకోర్టు అంది. పరస్పర విరుద్ధంగా కనిపించే ఈ రెండు అభిప్రాయాలనూ కలిపితే ఫలితం గందరగోళం తప్ప వేరే ఏమీ కాదు. కనీసం కంటే ఎక్కువ బలప్రయోగం చేసి ప్రాణం తీశారని మనం విమర్శిస్తే సుప్రీంకోర్టు ప్రాణం తీయవచ్చునన్న చట్టం రాజ్యంగ బద్ధమేననింది కాబట్టి తప్పేమీ లేదని సైనిక బలగాలు దబాయించగలవు. మహా అయితే అది పొరబాటు కాగలదు గానీ నేరం కాదనగలవు. కాబట్టి, 'కనీస బలప్రయోగం' అని సుప్రీంకోర్టు చేర్చిన షరతుకు పెద్దగా అర్థం లేదు.

5. సాయుధ బలగాలపైన అధికార దుర్వినియోగానికి సంబంధించిన ఫిర్యాదు ఎవరైనా చేసినట్టయితే దానిపైన క్షుణ్ణంగా విచారణ జరపాలి. ఫిర్యాదు నిజమని తేలితే బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి, ఘటనకు పాల్పడిన వారిని ప్రాసిక్యూట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. అయితే

'క్షుణ్ణంగా' ఎవరు విచారణ జరపాలో, ఏ విధంగా జరపాలో చెప్పనంత కాలం ఇటువంటి ఆదేశాలకు ఆచరణాత్మకమైన అర్థమేమీ లేదు. అయినా, సుప్రీంకోర్టు 'అధికార దుర్వినియోగం' అన్న డొంకతిరుగుడు ప్రయోగం చేసింది గానీ సాయుధ బలగాలపైన వచ్చే అభియోగాలన్నీ వారు ఏదో ఒక నేరానికి పాల్పడ్డారనే. అది హత్య కావచ్చు, అక్రమ నిర్బంధం కావచ్చు, బలవంతపు అపహరణ కావచ్చు, లైంగిక హింస కావచ్చు – అన్నీ నేరాలే తప్ప కేవలం 'అధికార దుర్వినియోగం' కాదు. వీటిమీద స్థానిక పోలీసులు కేసు రిజిస్టర్ చేయాలనీ, నిష్పక్షపాతంగా నేర పరిశోధన జరపాలనీ, కోర్టులో నేర విచారణ జరగాలనీ, సైనిక బలగాలు ఆ నేర విచారణతో పూర్తిగా సహకరించాలనీ అనకుండా ఫిర్యాదుల పైన క్షుణ్ణంగా విచారణ జరిపి (ఎవరు జరపాలో!) ఫిర్యాదు నిజమని తేలితే నష్టపరిహారం ఇవ్వాలి, ప్రాసిక్యూషన్ చేపట్టాలి అనడంలో పెద్దగా అర్థం లేదు.

సుప్రీంకోర్టు తీర్పు మీద ఇప్పుడు ఈ వ్యాఖ్యలెందుకంటే, సైన్యానికి ఇచ్చే అధికారం ఆ తీర్పుకు లోబడి ఉంటే చాలుననేది జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయం. అదనంగా ఇంకొకటి కూడ ఈ కమిటీ చేర్చింది. కాల్పులు జరిపేటప్పుడు శరీరం పైభాగాన కాక కింది భాగానికి గురిపెట్టమన్నారు. ఇది సైతం వారి స్వంత ఆలోచన కాదు. సైనిక అధికార యంత్రాంగమే సాయుధ బలగాల చట్టం చాటున విధులు నిర్వర్తిస్తున్న జవాన్లకు జారీచేసిన నియమావళిలో ఈ సూక్తి ఉంది. ఎవరు చేస్తే ఏమిలే, మంచిదే కదా అంటారేమో. సమస్య ఎక్కడొస్తుందంటే, 'అనుమానితుల మీద నేరుగా కాల్పులు జరపవచ్చు', 'ప్రాణం తీయవచ్చు' అని చట్టం ఇచ్చిన అధికారం చెల్లుతుందని చెప్పిన తరువాత శరీరం కింది భాగానికి గురిపెట్టి కాల్చాలి అన్న ఆదేశానికి అర్థం ఏముంది? కింది భాగానికే గురిపెట్టి కాల్చాను గానీ పొరబాటున పైకి వెళ్ళి అతని ప్రాణం పోయిందంటాడు. ప్రాణం తీసేట్టుగా కాల్పులు జరిపే అధికారం చట్టమే ఇచ్చింది కాబట్టి అతనిని చట్టం ఏమని తప్పుపట్టగలదు?

మొత్తానికి, సైనిక బలగాలను ప్రయోగించే సందర్భాన్ని గురించి, వాటికి ఉండగల అధికారాల గురించి సాధారణ చట్టం చెప్పేది సరిపోదనీ, సైనిక బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం ఇచ్చే అధికారాలు, ఆ చట్టం పరిధి అవసరమేననీ అంటూ ఆ అధికారానికి ఇప్పటికే సుప్రీంకోర్టు విధించిన పరిమితులూ, సైనిక అధికారులే

స్వయంగా విధించిన పరిమితులు కూడ అవసరమనీ, అందులో అంతర్భాగమనీ జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. వాటిని చట్టంలో రాయడం అవసరం అనింది.

జీవన్‌రెడ్డి కమిటీ చెప్పింది ఇదే అయితే పెద్దగా చర్చ జరిగేది కాదు. సాయుధ బలగాల చట్టం రాజ్యాంగబద్ధమేనని సుప్రీంకోర్టు ఎప్పుడో చెప్పింది. సాధారణ చట్టాలు సరిపోవని కూడ సుప్రీంకోర్టు చెప్పింది. అలాగే ప్రత్యేక అధికారాలు ఏ పరిమితికి లోబడి ఉండాలో కూడ చెప్పింది. సుప్రీంకోర్టు విధించిన పరిమితులు చట్టంలో ఉన్నట్టే లెక్క. అయితే చట్టంలో స్పష్టంగా రాసిన వాటినే గౌరవించడం కష్టమైనప్పుడు అంతర్లీనంగా ఉన్న వాటిని ఏం గౌరవిస్తారు? కాబట్టి అంతర్లీనంగా ఉన్న దానిని చట్టంలో స్పష్టంగా రాసేయడం అవసరం అని జీవన్‌రెడ్డి కమిటీ అభిప్రాయపడింది. అంతవరకు బాగానే ఉందిగానీ ఈ మాటలు చెప్పడానికే అయితే 147 పేజీల రిపోర్టు రాయవలసిన అవసరం లేదు. అయిదు పేజీల రిపోర్టు సరిపోయేది.

అయితే జీవన్‌రెడ్డి గారి దృష్టి వేరే చోట ఉంది. ఆయుధాలు పట్టుకొని రాజ్యాన్నీ, దాని అధికారాన్నీ సవాలుచేసే ఉద్యమాలను ఎదుర్కొనడానికి వేరు వేరు చట్టాలుండడం మంచిది కాదనీ, ఒక చట్టం ఉంటేనే సమర్థంగా ఎదుర్కోవడం సాధ్యం అవుతుందనీ ఆయన అభిప్రాయం. ఒకే సమగ్ర శాసనం తయారుచేసే ప్రయత్నం 'పోటా'ను ఉపసంహరించుకున్న మరునాడే మొదలైంది. అప్పుడు కూడ ఒకే చట్టం రూపొందించ వలసిన 'అవసరాన్ని' ప్రతిపాదించిన వారిలో – ఒక దశలో భారత లా కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న – జీవన్‌రెడ్డి గారొకరు. ఇప్పుడు ఈ నివేదికను గాని ప్రభుత్వం అమలు చేస్తే అది పూర్తవుతుంది.

మిలిటెంట్ ఉద్యమాలపై నిషేధం ప్రయోగించడానికి అధికారం ఇచ్చే చట్టాలు, వారు చేసే హింసాత్మక చర్యలను మరింత 'సమర్థంగా' విచారించే ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ, వారిని ఎదుర్కొనడానికి సాయుధ బలగాలకు విశేష అధికారాలిచ్చే చట్టాలు ఈ మూడూ వేరువేరుగా ఉంటూ వచ్చాయి. ఇందులో మూడవ కోవకు చెందిన చట్టాలు దేశంలో కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. నిషేధ అవసరాలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం, 1967 ఉంది. వివిధ రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి చట్టాలు (ఉదాహరణకు ఆం.ప్ర. పబ్లిక్ సెక్యూరిటీ చట్టం) ఉన్నాయి. రెండవ అవసరానికి టాడా, పోటా వంటి చట్టాలు, రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ సంఘటిత

నేరాల నియంత్రణ చట్టం వంటివి ఉండేవి (కొన్ని ఇంకా ఉన్నాయి). మూడవ అవసరానికి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాలు (ఈశాన్య రాష్ట్రాలకొకటి, జమ్మూ కాశ్మీర్‌కు ఒకటి), కల్లోలిత ప్రాంతాల చట్టాలు (పంజాబ్‌లో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి) ఉన్నాయి.

మిలిటెంట్ ఉద్యమాలను నిషేధించే అధికారం, వారి హింసాత్మక చర్యలను సమర్థంగా విచారించి కఠినంగా శిక్షించే అధికారం, వారిని వేటాడి ఏరివేసే అధికారం అనే మూడూ ఒకే చట్టంలో ఉంటే మరింత బలంగా ఉంటుందని వాదించిన, వాదిస్తున్న వారు నిజానికి చాలామంది ఉన్నారు. న్యాయమూర్తులుగా ఉన్న, లేక ఉండిన వారు ఎక్కువగా ఈ వాదనవైపు మొగ్గు చూపుతున్నారు. పైగా ఆ చట్టాలు ఒక ప్రాంతానికో, ఒక సందర్భానికో పరిమితం కాకుండా రాజ్యాంగ యంత్రం చేతిలో ఒక సార్వత్రిక ఆయుధంగా ఉండాలని వారు వాదిస్తున్నారు. 'పోటా'ను రద్దుచేసిన తరువాత ఆ చట్టంలోని ప్రధాన అంశాలను చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేర్చడం ద్వారా ఈ పని సగం పూర్తిచేశారు (అయితే 'పోటా'లోని అత్యంత అభ్యంతరకరమైన అంశాన్ని, అంటే ముద్దాయి పోలీసులకిచ్చిన ఒప్పుకోలును సాక్ష్యంగా స్వీకరించ వచ్చునన్న నియమాన్ని తొలగించారు). ఇప్పుడు సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు ఆదేశించిన పరిమితుల మేరకు సవరించి) అదే చట్టంలో అయిదవ అధ్యాయంగా చేర్చాలన్నది జీవన్‌రెడ్డి కమిటీ సూచన. ఆ పని చేసినట్టయితే చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం భారత రాజ్యం ఉనికినీ, అధికారాన్నీ, స్వరూపాన్నీ సవాలు చేసే అన్ని మిలిటెంట్ ఉద్యమాలనూ ఎదుర్కొనడానికి ప్రభుత్వానికి విశేష అధికారాలిచ్చే సమగ్ర శాసనం అవుతుంది. ఏ ఒక్క ప్రాంతానికో, సందర్భానికో పరిమితం కాని సార్వత్రిక శాసనం అవుతుంది. ఈ ప్రతిపాదన జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టులోని ప్రధాన అంశం అని భావించవలసి ఉంటుంది. నిర్బంధ చట్టాలకు ఆ విధంగా సమగ్రత కల్పిస్తే ఏం జరుగుతుందంటే విడివిడిగా ఒక్కొక్క చట్టంలోనూ ఉన్న అణచివేత అధికారాలకుండే లక్షణాలు ఒక దానికొకటి తోడై అన్నీ మరింత నిర్బంధ పూర్వకంగా తయారవుతాయి.

నక్సలైట్ ఉద్యమాన్ని ఒక ఉదాహరణగా తీసుకొని ఈ 'సమగ్రత' పర్యవసానాలను వివరించవచ్చు. కేంద్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం

కింద నక్సలైట్ ఉద్యమాన్ని ఎప్పుడూ నిషేధించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వంత చట్టాన్ని చేసుకొని తన సరిహద్దుల పరిధిలో మావోయిస్టు పార్టీని మాత్రం నిషేధించింది. అయితే 'పోటా'లోని టెర్రరిస్టు సంస్థల జాబితాలో మావోయిస్టు పార్టీని కేంద్ర ప్రభుత్వం చేర్చింది. దాని వల్ల 'పోటా'లోని ప్రత్యేక నేర విచారణ వ్యవస్థ ఆ పార్టీకి వర్తించింది. అయితే 'పోటా'ను రద్దుచేసి అందులోని ప్రధానమైన అంశాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో (కొన్ని ఆహ్వానించదగ్గ సవరణలతో) రాసిన తరువాత ఏం జరిగిందంటే ఈ చట్టం కల్పించే నిషేధ అధికారాలు దేశవ్యాపితంగా మావోయిస్టు పార్టీకి వర్తించడం మొదలయింది. అంటే ఆ మేరకు మావోయిస్టు పార్టీ పైన దేశవ్యాపిత నిషేధం వచ్చింది. ఇప్పుడు జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టును అనుసరించి సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేసి అందులోని ప్రధాన అంశాలను (సుప్రీంకోర్టు సూచించిన పరిమితులను కలుపుకొని) చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టంలో చేరిస్తే ఏం జరుగుతుందంటే మావోయిస్టు ఉద్యమంపైన సైనిక బలగాలను విశేష అధికారాలతో మోహరించవచ్చు. ప్రస్తుతం మావోయిస్టుల పైన సైన్యాన్ని మోహరించినట్టయితే అది సాధారణ చట్టాల పరిధిలో ఉండాలి తప్ప విశేష అధికారాలిచ్చే చట్టం ప్రకారం కాదు. బహుశా అందుకేనేమో వాళ్ళ పైన సైన్యాన్ని ఇప్పటిదాకా దించలేదు. జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులు అమలుచేస్తే సైన్యానికి విశేష అధికారాలిచ్చి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో దించవచ్చు. మావోయిస్టు ఉద్యమంలో ప్రధానంగా పేద వర్గాలు, దళిత ఆదివాసీ ప్రజానీకం భాగస్వాములనేది తెలిసిన సంగతే. పోలీసు చర్యలు వారికి ఎంతటి హాని కలిగించాయో హక్కుల సంఘాలు నివేదికలు పదే పదే బయటపెట్టాయి. జీవన్‌రెడ్డి కమిటీ పుణ్యాన సైన్యం రంగంలోకి దిగినట్టయితే ఏం జరగగలదో ఊహించాలంటేనే భయం వేస్తుంది.

జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు గురించి ఇంకొక్క విషయం కూడ చెప్పాలి. అదేమిటంటే కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించే విషయంలో ఈ రిపోర్టు సూచించే సవరణ పూర్తిగా ఏకపక్ష అధికారాన్ని కట్టబెడుతుంది.

తొలినాడు ఈ చట్టంలో ఒక ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిది మాత్రమే. రాష్ట్రంలో ఒక ప్రాంతంలో కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితులు ఏర్పడి, పౌరపాలన చేయిదాటి పోయేంతగా విషమించిందనీ, పౌరపాలనకు అండగా సైన్యాన్ని దింపితేనే

పాలన సాధ్యమనీ రాష్ట్ర ప్రభుత్వం భావించినట్టయితే ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైన్యాన్ని పంపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరవచ్చును. 1972లో ఈ చట్టాన్ని సవరించి, రాష్ట్ర ప్రభుత్వం కోరకున్నా కేంద్ర ప్రభుత్వమే ఆ నిర్ణయం తీసుకో వచ్చునన్నారు. అయితే సైన్యం మోహరింపుకు ప్రమాణం మాత్రం అదే. మోహరించబోయే ప్రాంతంలో కల్లోలం, లేక ప్రమాదకర పరిస్థితులు ఎంతగా విషమించి ఉండాలంటే పౌరపాలనకు అండగా సైన్యాన్ని దించనిదే పాలన సాగదనిపించేంతగా. అ అభిప్రాయానికి రాష్ట్ర ప్రభుత్వం రాకున్నా కేంద్ర ప్రభుత్వమే రావచ్చునన్నది 1972లో చేసిన సవరణ సారాంశం. 'ప్రాంతీయ' అస్తిత్వం ప్రాతిపదికగా గల సాయుధ పోరాట ఉద్యమాల పట్ల 'ప్రాంతీయ' ప్రభుత్వాలు (కాంగ్రెస్ పార్టీకి చెందినవే అయినా) మెతక వైఖరి ప్రదర్శిస్తున్నాయన్న అనుమానంతో వారు కోరకున్నా తానే సైన్యాన్ని పంపే అధికారం కేంద్రానికి ఉండాలని భావించి ఈ సవరణ చేశారు.


జీవన్‌రెడ్డి కమిటీ ఆ అధికారాన్ని ఇంకా విస్తృతం చేసింది. పైన చెప్పినట్టు రాష్ట్రం కోరుకోవాలన్నా, కేంద్రం తానే పంపాలన్నా రెండు పరిస్థితులు ఉండాలి. ఒకటి – ఆ ప్రాంతంలో కల్లోలం లేక ప్రమాదకర స్థితి ఉండాలి. రెండు – దానిని ఎదుర్కోడానికి పౌర ప్రభుత్వానికి సైనిక బలగాల సహాయం అవసరమన్న అభిప్రాయానికి ప్రభుత్వం రావాలి. కల్లోలిత ప్రాంతాల ప్రకటనను ఎవరైనా కోర్టులో సవాలుచేస్తే ఈ రెండు పరిస్థితులూ ఉన్నాయనడానికి ప్రాథమిక ఆధారాలు ఆ ప్రభుత్వం చూపించవలసి ఉంటుంది. జీవన్‌రెడ్డి కమిటీ ఈ రెండు పరిస్థితులు ఉన్నప్పుడే కాకుండా 'ఒక రాష్ట్రంలో లేక ఒక ప్రాంతంలో ఆంతరంగిక కల్లోలాన్ని అణచడానికి సైనిక బలగాలను దింపడం అవసరం అని కేంద్ర ప్రభుత్వం భావించినట్టయితే' ఆ రాష్ట్రాన్ని, లేక ఆ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించి సైనిక బలగాలను పంపించవచ్చునంది. అంటే ఆంతరంగిక కల్లోలం ఉంటే చాలు. దానిని రాష్ట్ర పౌర పాలనా యంత్రాంగం ఎదుర్కోగలదా లేదా అన్న ప్రశ్నతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వం సైన్యాన్ని దించవచ్చు. ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒకవేళ 'నేను అదుపు చేయగలను. మీ సహాయం అక్కరలేదు' అన్నా, అదుపు చేయగల సామర్థ్యం ఉందని రుజువు చేసినా కూడ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా సైన్యాన్ని పంపించవచ్చు. పైగా ఇది సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టంలాగ ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాలకే కాదు, దేశమంతటికీ వర్తిస్తుంది. దీని ఫలితంగా ఎప్పుడైనా, ఎక్కడైనా

ఆంతరంగిక కల్లోలం ఉందని చెప్పి ఏకపక్షంగా సైన్యాన్ని దించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది.

ఇది అవాంఛనీయమైన కేంద్రీకరణ అనడంలో సందేహం లేదు. దానికి గల కారణం కోసం ఎంతో దూరం వెతకనక్కరలేదు. 'జాతి భద్రత అన్నిటి కంటే ప్రధానమైన కర్తవ్యం' అన్న కమిటీ అభిప్రాయమే ఇంతటి కేంద్రీకరణను సూచించడానికి గల ప్రత్యక్ష కారణం. పైగా జాతి భద్రత అనే ప్రయోగానికి వారిచ్చిన వివరణను గమనిస్తే ఇది జాతి ప్రజల జీవితాలకు భద్రత కాదు, రాజ్యం భద్రత అని సులభంగా అర్థం అవుతుంది. రాజ్యం భద్రత అత్యంత ప్రధానమైన పాలనా లక్ష్యం అనీ, ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన మొదలైన ఇతర పాలనా విలువలు, లక్ష్యాలు దాని తరువాతేననీ కమిటీ రిపోర్టు స్పష్టంగా అంటుంది. ఈ ప్రాధాన్యతను తలకిందులు చేసి ప్రజల ప్రాథమిక హక్కులు, ప్రజాస్వామ్య పాలన అన్నిటికంటే ప్రధాన లక్ష్యాలని ప్రతిపాదించినట్టయితే నిర్బంధ చట్టాల గురించి కలిగే అభిప్రాయం కూడ తలకిందులు అవుతుంది.

ఇదీ జీవన్‌రెడ్డి కమిటీ రిపోర్టు అసలు స్వరూపం కాగా ఆ కమిటీ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టం రద్దును సిఫారసు చేసిందంటూ పెద్దఎత్తున ప్రచారం జరిగింది. కేంద్ర ప్రభుత్వమేమో ఆ పని చేయబోవడం లేదని ప్రకటించేసింది. ఫలితమేమిటంటే ప్రజలు – ముఖ్యంగా మణిపూర్‌లో – మళ్ళీ రోడ్లమీదికొచ్చి సాయుధ బలగాల చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఉద్యమిస్తున్నారు. అర్థమయ్యీ కాక జీవన్‌రెడ్డి కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్న వారూ ఉన్నారు. అర్థమైన వారి మీద కూడ జీవన్‌రెడ్డి కమిటీ చేసిన ఒక విచిత్రమైన వాదన ప్రభావం ఉన్నట్టుంది. ఆ వాదన – నిర్బంధ అధికారాలను ఒక ప్రాంతానికే పరిమితం చేస్తే అది తమ ప్రాంతం పట్ల చిన్నచూపు లేక వివక్ష అని ఆ ప్రాంతం వారు భావించే అవకాశం ఉంది. అలా కాకుండా వాటిని దేశానికంతా వర్తింపజేస్తే ఈ వివక్ష అనే భావన పోతుంది అనేది!!

*మానవహక్కుల వేదిక బులెటిన్-8లో వచ్చిన వ్యాసం*
***మే 2007***



# డా॥ హనీఫ్ ఉదంతం నుండి అయినా టెర్రరిస్టు చట్టాల చేటును గుర్తిస్తామా?

'టెర్రరిజం'ను ఎదుర్కోవడానికి 'కఠినమైన' చట్టాలు కావాలని ఉపన్యాసాలు దంచే వాళ్ళకు డా॥ మహమ్మద్ హనీఫ్ ఉదంతం కనువిప్పు కావాలి. అతను తెలిసి ఏ నేరమూ చేయలేదు. చేశాడని ఆస్ట్రేలియా పోలీసులూ అనడం లేదు. అతని సమీప బంధువులైన అహమ్మద్ సోదరులిద్దరూ గ్లాస్గో విమానాశ్రయం పైన జరిగిన దాడి కేసులో నిందితులు. వారికి హనీఫ్ తన సిమ్ కార్డు ఇచ్చాడని ఆస్ట్రేలియా పోలీసుల అభియోగం. ఆ నేరంలో ఆ సిమ్ కార్డును ఉపయోగించారని అనలేదుగానీ, నిందితుల వద్ద స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్‌లో ఆ సిమ్ కార్డు దొరికిందని అన్నారు. (అది నిజం కాదనీ, వారిద్దరి నివాసాలను సోదా చేసినప్పుడు అక్కడ దొరికిందే తప్ప నిందితుల వద్ద ఉన్న మొబైల్‌లో దొరకలేదని ఒక ఆస్ట్రేలియా దినపత్రిక రాసిందనుకోండి – అది కొంచెంసేపు పక్కన పెడదాం.)

దీనిని 'టెర్రరిజం విషయంలో అజాగ్రత్తగా ఉండడం' అనే నేరం కిందికి ఆస్ట్రేలియా పోలీసులు తీసుకొచ్చారు. దీనికి ఆస్ట్రేలియాలో అమలులో వున్న టెర్రరిస్టు చట్టం కింద 15 సంవత్సరాల జైలుశిక్ష పడగలదు. ఆ ఇద్దరూ ఫలానా హింసాత్మక నేరానికి పాల్పడుతున్నారని తెలిసీ ఆ నేరంలో ఉపయోగించడానికి సిమ్ కార్డు ఇచ్చి వుంటే అది నేరానికి ప్రత్యక్షంగా సహకరించడమే అవుతుంది. కాని డా॥ హనీఫ్

మీద అభియోగం అది కాదు. అతను సహకరించాడన్న అభియోగం లేదు. అజాగ్రత్తగా వ్యవహరించాడనే అభియోగమే ఉంది. దీనికి నాలుగు అర్థాలు ఉండగలవు. వాళ్ళిద్దరూ గ్లాస్గో విమానాశ్రయాన్ని పేల్చివేయడానికి కుట్ర పన్నుతున్నారని డా॥ హనీఫ్‌కు తెలుసు. అయితే ఆ కుట్ర వివరాలు తెలీవు. వాళ్ళొచ్చి నీ సిమ్ కార్డు ఇయ్యవా, రెండు రోజుల తరువాత ఇచ్చేస్తాం అంటే ఎందుకని అడగకుండా ఇచ్చాడన్నది ఒక అర్థం కాగలదు. లేదా వాళ్ళు ఫలానా చర్యకు పాల్పడుతున్నారని తెలీకపోయినా హింసాత్మక చర్యల ద్వారా ఇంగ్లండ్‌ను భీతిల్లచేసే అజెండా వారికున్నదని డా॥ హనీఫ్‌కు తెలిసి కూడ వాళ్ళొచ్చి సిమ్‌కార్డు అడిగితే ఇచ్చాడన్నది రెండవ అర్థం కాగలదు. లేదా వాళ్ళ హింసాత్మక లక్ష్యాల గురించి ఏమీ తెలీకున్నా వారికి మతపరమైన తీవ్రవాద భావాలున్నాయని డా॥ హనీఫ్‌కు తెలుసు. అయినా వాళ్ళు సిమ్ కార్డు అడిగితే ఇచ్చాడన్నది మూడో అర్థం కాగలదు. లేదా ప్రస్తుత పరిస్థితులలో ముస్లిం లెవరయినా టెర్రరిస్టులు కాగలరు అని గుర్తుంచుకోకుండా వారిద్దరూ అడగగానే సిమ్ కార్డు ఇచ్చేశాడనేది నాలుగో అర్థం కాగలదు. (ఇందులో నాలుగవది కూడ ఆస్ట్రేలియా టెర్రరిస్టు చట్టంలోని 'టెర్రరిజం విషయంలో అజాగ్రత్తగా వ్యవహరించడం' అనే నేరం కిందికి వస్తుంది. 'కఠినమైన' చట్టమంటే అట్లాగుండాలి మరి!)

ఈ నాలుగర్థాలలో చివరి రెండింటిలో ఒకటి డా॥ మహమ్మద్ హనీఫ్ చర్యకు వర్తిస్తుందని ఆస్ట్రేలియా పోలీసుల అభియోగం. గ్లాస్గో ముద్దాయిల కార్యకలాపాల గురించి గానీ, ఆనాటి దాడి గురించి గానీ ఇతనికి తెలుసునని ఆస్ట్రేలియా పోలీసులూ అనడం లేదు. వారికి సన్నిహితుడు కాబట్టి వారి తాత్విక, రాజకీయ భావాలు ఎరిగే ఉంటాడు. అటువంటి భావాలు గలవారికి సిమ్ కార్డు ఇవ్వడం టెర్రరిజం విషయంలో అజాగ్రత్తగా వ్యవహరించడం కిందకే వస్తుంది. అధమపక్షం, ముస్లింలు ఇవాళ కాకపోతే రేపయినా టెర్రరిస్టులు కాగలరని బుద్ధిగల వారెవరైనా ఎరిగి ఉండాలి. అయినప్పటికీ కేవలం బంధుప్రీతితో సిమ్‌కార్డు ఇచ్చేయడం అజాగ్రత్త అవదా మరి!

డా॥ హనీఫ్‌పైన పోలీసుల అభియోగం సాధారణ న్యాయ దృష్టికి అర్థరహితంగా తోస్తుంది కాబట్టే అతనిని కోర్టులో హాజరుపరచగానే మేజిస్ట్రేటు బెయిలు ఇచ్చేసింది. మిగిలిన విషయాలు అటుంచి, అతని సిమ్ కార్డుకు నేరంలో ఏ పాత్రా ఉందని పోలీసులు అనడం లేదు కాబట్టి ఒకవేళ అతను అన్నీ తెలిసి వారికి సిమ్ కార్డు ఇచ్చి

వున్నా అందులో నేరం ఏముందని ఆమె ప్రశ్నించారట. (ఈ రకంగా తర్కించడం కూడ టెర్రరిజం విషయంలో 'అజాగ్రత్తగా వ్యవహరించడం' కిందికి వస్తుందని ఆస్ట్రేలియా పోలీసులు భావిస్తారేమో మరి!)

అతను విడుదల కాగానే ఆస్ట్రేలియా ప్రభుత్వం మరో అరెస్టు వారెంటు జారీ చేసింది అతని వ్యక్తిత్వం గురించి సందేహాలున్నాయని. (మన దగ్గర కూడ ఒక నేర అభియోగంలో బెయిలు దొరకగానే పిడి చట్టం లేదా నాసా చట్టం కింద వారెంట్లు జారీ చేస్తుంటారు కదా – అట్లాగే.) అతని వ్యక్తిత్వం పైన సందేహానికి కారణం ఏమిటి? మళ్ళీ అదే సిమ్ కార్డే.

అందుకే ఆ అరెస్టు వారెంట్‌ను సవాలు చేస్తూ డా॥ హనీఫ్ కోర్టులో కేసు వేయగా, ప్రభుత్వ అభియోగపత్రం చూసిన న్యాయమూర్తి 'ఇట్లయితే నేను కూడ నేరస్తుడినే. నేను కూడ నేరాలు చేసిన నా స్నేహితులకు ఇవీ అవీ ఇచ్చి ఉన్నాను' అని అన్నాడంట. ఆ న్యాయమూర్తికి ప్రభుత్వ న్యాయవాది ఇచ్చిన జవాబు గమనార్హం. 'మీరు విదేశీయులయితే తప్పక అది నేరమే అయి ఉండేది సార్' అన్నాడంట! అక్కడి కొచ్చింది ప్రఖ్యాతమైన పాశ్చాత్య ప్రజాస్వామ్యం. అయినా అతను 'విదేశీయుడు' అన్నాడు గానీ 'ముస్లిం' అనేది అక్కడ సరయిన ప్రయోగం అయి వుండేది. విదేశీయులే అయినా ఏ చైనీయులో క్రైస్తవులో లేక బెంగుళూరులో అహ్మద్ సోదరులతో చిన్నప్పుడు స్కూలులో కలిసి చదువుకున్న హిందువులో వారికి ఆ సిమ్ కార్డు ఇచ్చి వుంటే దానినొక వేళ నేరంలో ఉపయోగించి ఉన్నా అది ఇవ్వడం నేరం అయి ఉండేదా?

టెర్రరిస్టు చట్టాలను ప్రజాతంత్రవాదులు ఎందుకు వ్యతిరేకిస్తారన్నది ఈ ఉదంతం నుండైనా అర్థం అవుతుందని ఆశిస్తాను. విచ్చలవిడి హింస ద్వారా సమాజాన్నీ ప్రభుత్వ యంత్రాంగాన్నీ భీతిల్లజేసే చర్యలను టెర్రరిజం అనేటట్టయితే మానవత్వం ఉన్న వారెవ్వరూ వాటిని సమర్థించరు. భీతావహమైన హింసాకాండ వల్ల దానితో ఏ సంబంధం లేని ప్రజల ప్రాణాలు పోవడం ఒక దుర్మార్గమైతే, భయంతో సమాజం ఆలోచనాశక్తి మొద్దుబారిపోవడం అంతే తీవ్రమైన నష్టం. అది ఫాసిజానికీ అనాగరికమైన ప్రశాసనాలకూ దారి సుగమం చేస్తుంది. అయితే ఈ టెర్రరిజాన్ని ఎదుర్కోవడానికి ఎంతటి అనాగరికమైన మార్గాలయినా ఎంచుకుంటామని పాలకులు అంటే మాత్రం అంగీకరించడానికి వీలు లేదు. అది కూడ ఏ సంబంధం లేని వారి

ప్రాణాలనూ స్వేచ్ఛనూ హరిస్తుంది. 'టెర్రరిజం' అనేది ఉనికిలోకి రావడానికీ వర్ధిల్లడానికీ గల కారణాలను కప్పిపెట్టడం ద్వారా ఏ సమస్యల నుండి అది ఆవిర్భవించిందో ఆ సమస్యలను విస్మరించడమే కాక విచ్చలవిడి బలప్రయోగం కారణంగా మరింత జటిలం చేస్తుంది.

ఈ 'మూల కారణాల' విశ్లేషణ చాలామందికి చిరాకు కలిగిస్తుంది. 'టెర్రరిజం' మీద గొప్ప పోరాటం చేసిన యోధుడిగా అబద్ధపు ప్రతిష్ట పొందిన ఐపిఎస్ అధికారి, అత్యంత అనాగరికుడు అయిన కెపిఎస్ గిల్ హింసకు గల 'మూలకారణాల'ను విశ్లేషించే ఉదారవాదుల మీద పెద్దెత్తున దుమ్మెత్తి పోస్తున్నాడు. ఈ దాడి వెనుక ఒక తెలివైన ఆలోచన ఉంది. హింసకు గల మూల కారణాలను తర్కబద్ధంగా విశ్లేషించకపోతే, మన మనసులకు నచ్చిన కారణాలే గోప్యంగా మన విశ్లేషణలోకి వచ్చి చేరుతాయి. అవి సాధారణంగా పొరుగువారి గురించి అల్పమైన అభిప్రాయాలతో, కుశంకతో కూడినవి అయి వుంటాయి కాబట్టి సామాజిక ఆలోచనలో అలాంటివి చలామణి కావడమే గిల్ వంటి పోలీసు అధికారులకు కావాలి. ఇస్లాం పేరు మీద జరుగుతున్న హింసాకాండకు గల మూలాన్ని చారిత్రకంగా విశ్లేషించకపోతే, అది ఇస్లాంలోనే ఉంది అన్న అభిప్రాయమే అంతర్లీనంగా ఉండిపోతుంది. అది మరింత ద్వేషానికి దారి తీస్తుంది. పోలీసులే ముస్లిమేతరులను కాపాడాలి, అందుకు వారికి విశేష అధికారాలు ఇవ్వాలి అన్న అభిప్రాయం బలపడుతుంది. గిల్ పోలీసు బుద్ధికి అదే కావాలి.


ఇస్లాంను బలప్రయోగంతో ప్రపంచమంతటా నెలకొల్పే కర్తవ్యం ముస్లింల మీద ఉందన్న అభిప్రాయం ముస్లిం సమాజంలో ఉన్నమాట వాస్తవమే. దానికి భిన్నంగా ఇస్లాం శాంతిని బోధించే మతం అన్న అభిప్రాయమూ ఉంది. ఇందులో మొదటిది ఏనాడూ మెజారిటీ అభిప్రాయం కాదు. (మనుషులందరూ హింస చేయగలరు గానీ హింసనొక విధానంగా మెజారిటీ ఎప్పుడూ ఆమోదించదు.) కొన్ని ప్రత్యేకమైన చారిత్రక పరిస్థితులలోనే అది ఉద్యమ రూపం తీసుకోగలదు. ఈ చారిత్రక పరిస్థితులు ఇస్లాం నుండి పుట్టినవి కావు. ఇస్లాం 'నైజం' నుండి పుట్టినవి కావు. ఆధునిక కాలంలో ముస్లిం సమాజాలకు అన్యాయం జరుగుతున్నదన్న అభిప్రాయం చాలా కారణాల వల్ల బలపడింది. అవన్నీ చారిత్రకంగా సహేతుకమైన కారణాలే. అయితే దానికి స్పందన మొట్టమొదట మతవాదం రూపంలో రాలేదు. పాలస్తీనాలో పాలస్తీనా లిబరేషన్

ఆర్గనైజేషన్ (పిఎల్ఓ), కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, ఆ తరువాత జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్, అరబ్బు దేశాలలో బాత్ పార్టీ, అన్నీ కూడ సెక్యులర్, ప్రజాతంత్ర, వామపక్ష ప్రాపంచిక దృక్పథం గల సంస్థలే. వాటిని తృణీకరించి, అణచివేసి, చులకన చేసిన క్రమంలోనే ఇస్లామిక్ మతవాదం బలపడింది. అందులో ఒక పాయ ఆయా ప్రజల ఆకాంక్షలను మత భావజాలం రూపంలో వ్యక్తం చేయడానికి పరిమితం కాగా, మరొక పాయ ప్రపంచమంతటా ఇస్లామిక్ రాజ్యాన్ని నెలకొల్పినప్పుడే అన్ని అన్యాయాలూ అంతమవుతాయన్న దృక్పథం వైపు మొగ్గు చూపింది. అత్యంత బలహీనమైన ఆఫ్ఘనిస్తాన్ నుండి సోవియట్ రష్యాను తొలగించడానికి అవసరమైన కరుడుగట్టిన మొండితనం ఈ 'ఇస్లామిజం'లోనే ఉందని భావించిన అమెరికా దానిని పనిగట్టుకొని పెంచి తాలిబన్‌ను తయారుచేసింది.

తాలిబాన్ మాత్రమే కాదు, లష్కర్-ఇ-తొయిబా, జైష్-ఇ-మహమ్మద్, చివరికి అల్‌ఖైదా సహితం ఈ చారిత్రక నేపథ్యంలోనే ఆవిర్భవించాయన్నది ఎవ్వరూ కాదనలేని వాస్తవం. ఈ సంస్థలు ఏ పరిమితులూ ఎరుగని హింసకు పాల్పడటం కూడ ఎవ్వరూ కాదనలేని వాస్తవం. దీనికి జవాబంతా 'కఠినమైన' టెర్రరిస్టు చట్టాలలో వెతికితే సాధించేదేమిటి? సామాజిక నేపథ్యం ఉన్న హింసను కేవలం నేరస్మృతి కళ్ళతో చూస్తే ఒక ప్రజావర్గానికి చెందిన వాళ్ళంతా నేరస్తులుగానే తేలుతారు. స్నేహితుడు అడిగితే సిగరెట్ పెట్టో సిమ్ కార్డో ఏం చేస్తావని అడగకుండా ఇచ్చే సాధారణ మానవ గుణం నేరం అవుతుంది. బంధువు ఇంటికొస్తే ఎందుకని ప్రశ్నించకుండ రెండు రోజులు ఉండనిచ్చే సాధారణ మర్యాద నేరం అవుతుంది. డా॥ హనీఫ్ విషయంలో అదే జరిగిందని స్పష్టం అవుతున్నది. ఇది చూసి మరికొందరు యువకులు ప్రపంచమంతటా ఇస్లామిక్ రాజ్యం నెలకొల్పడం తప్ప న్యాయానికి మరొక మార్గం లేదన్న నిర్ణయానికొస్తే దానికెవరు బాధ్యులు?

*ప్రజాతంత్ర వారపత్రిక*

***22 జూలై 2007***



# టెర్రరిజంకు చట్టాలే పరిష్కారమా?

**ముం**బయిలో జరిగిన దాడుల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఒక చట్ట సవరణ చేసింది. మరో కొత్త చట్టం తెచ్చింది. విచిత్రమేమిటంటే ఇదే సమయంలో సాధారణ నేరాల విషయంలో పోలీసుల అధికారాలను తగ్గించే సవరణలను కూడ అదే ప్రభుత్వం చేపట్టింది. టెర్రరిజం పేరు మీద ప్రభుత్వం గతంలో చేపట్టిన చట్టాలన్నీ రాజ్యాంగ బద్ధమేనని సమర్థించిన న్యాయస్థానాలే, సాధారణ నేరాల విషయంలో పోలీసులకు అనవసరమయిన అధికారాలు కట్టబెట్టడం రాజ్యాంగ స్ఫూర్తికీ అంతర్జాతీయ మానవ హక్కుల నియమాల స్ఫూర్తికీ విరుద్ధం అని కొంతకాలంగా అంటూ వచ్చాయి. న్యాయస్థానాలు పెట్టిన ఒత్తిడి వల్లే ఈ సవరణలను ప్రభుత్వం చేపట్టింది. ఇక్కడ 'సాధారణ నేరాలు' అంటే అర్థం సాధారణ నేరస్మృతి వర్తించే నేరాలనే తప్ప అందులో అనైతికమైనవీ అసాంఘికమైనవీ లేవని కాదు. 7 సంవత్సరాల కంటే తక్కువ జైలు శిక్ష పడగల నేరాలలో కేసు నమోదు చేసినంత మాత్రాన అరెస్టు చేయనక్కరలేదనీ, అరెస్టు చేయకుండానే పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకుని విచారించి పంపించవచ్చనీ వీటిలో ఒక చట్ట సవరణ అంటుంది. 7 సంవత్సరాల కంటే తక్కువ శిక్ష పడగల నేరాలలో అంటరానితనం, గృహహింసల నుంచి (వివిధ రకాల) చీటింగ్ దాకా హేయమైన నేరాలనేకం ఉన్నాయి.

నేరం అసాంఘికమైనదా కాదా అన్న విచక్షణ నుంచి చూద్దాం.

నేరం అసాంఘికమైనదా కాదా అన్న విచక్షణ లేకుండా నేరపరిశోధనలో అనవసరమైన కాఠిన్యం ఉండొద్దనడం వెనక ఒక ఆలోచన ఉంది. నాగరికం అనిపించుకోదలచుకున్న సమాజం అన్ని విషయాలలోను నాగరికంగా నడుచుకోవాలి. నేరం అనాగరికం కావచ్చును గానీ నేర విచారణ అనాగరికంగా ఉండడానికి వీలు లేదు. అంతా సజావుగా ఉన్నప్పుడు నాగరికంగా నడుచుకుంటాము గానీ సంక్షోభం వచ్చినప్పుడు విచ్చలవిడిగా అణచివేత ప్రయోగిస్తామనేది కేవలం విలువలలో ద్వంద్వ వైఖరే కాదు, నాగరికత నిజమైన అర్థాన్ని గ్రహించని వైఖరి. అది సమస్యలను తొక్కిపెడుతుందే తప్ప పరిష్కరించదు. ప్రజాస్వామ్యమే క్లిష్టమైన సామాజిక సమస్యలకు సహితం సరయిన పరిష్కారమార్గం అన్న అవగాహన కొరవడిన కారణంగానే బాంబులు పేలుతున్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని గురించి, ప్రజాస్వామిక విలువల గురించి మాట్లాడొద్దు అనే వింత వాదన ముందుకొస్తున్నది.

ఇప్పుడు కొత్తగా వచ్చిన చట్టం, చట్ట సవరణ ప్రజాస్వామికమయినవి అనగలమా? అవి వంద ప్రాణాలను కాపాడడానికి ఇద్దరి స్వేచ్ఛను హరించే చట్టాలై వుంటే ఈ ప్రశ్నకూ, దాని నుంచి పుట్టగల చర్యకూ కనీసం అర్థం వుంది. (అయినప్పటికీ జవాబు సులభం కాకపోవచ్చుననేది వేరే సంగతి.) కానీ అవి చాలామంది స్వేచ్ఛను హరించేవే గాని ఎవరి ప్రాణాలనూ కాపాడతాయన్న భరోసా లేదు. నేరానికి సంబంధించిన సత్యాన్ని కనుక్కోవడానికి కావలసిన నేర్పును ఈ చట్టాలు పెంచవని ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. దానికి కావలసిన పరిశోధనా పరికరాలను కూడ కొత్తగా ఇయ్యవు. సత్యం కనుక్కోలేని పోలీసులు తమ అనుమానం నిరాధారం అని రుజువు చేసుకొనే బాధ్యతను అనేక రూపాలలో ముద్దాయిపైనే పెట్టడం ఈ చట్టాలలోని ఒక ముఖ్య విషయం. నేరానికి ఉపయోగించిన వస్తువు ఒకరి దగ్గర దొరికితే ఆ వ్యక్తే నేరం చేశాడని చట్టం భావిస్తుందనీ, చేయలేదని తానే రుజువు చేసుకోవాలనీ అంటే అదొక రకం. కానీ 'ఆ కోవకు చెందిన వస్తువు' లేక 'అటువంటి ఆయుధం' ఒక వ్యక్తి దగ్గర దొరికినా నేరం అతనే చేశాడని కోర్టు భావిస్తుందంటే ఏమర్థం? హత్య గొడ్డలితో చేసినట్టయితే గొడ్డలి గల ఏ వ్యక్తినయినా తీసుకొచ్చి నేరం నువ్వు చేయలేదని రుజువు చేసుకొమ్మని చెప్పడమన్నమాట. నేరస్థలంలో గానీ, నేర ప్రక్రియకు సంబంధించిన ఏ వస్తువుపైన గానీ ఒక వ్యక్తికి సంబంధించిన ఏ చిహ్నం లభించినా ఇక అతనే నేరం చేసినట్టు కోర్టు భావిస్తుందట. నేరం చేయలేదని ఇక అతనే రుజువు

చేసుకోవాలి. అనుమానితుడి జేబురుమాలును నేర స్థలం దగ్గర పడేసి నేరం నువ్వు చేయలేదని రుజువు చేసుకొమ్మనడానికి ఇక ఆటంకం ఏముంది? సాధారణ నేరస్మృతిలో ముద్దాయిని మొదటిసారి రెండు వారాల కోసం రిమాండు చేసినప్పుడు మాత్రమే ఆ రెండు వారాలలో ఎప్పుడయినా పోలీస్ కస్టడీకి అప్పగించవచ్చు. ఆ తరువాత జైలుకే తప్ప పోలీస్ కస్టడీకి ఇవ్వడానికి వీలు లేదు. కాబట్టి పోలీస్ కస్టడీలో చిత్రహింసలు పెట్టినా కూడ తట్టుకోవచ్చు, తట్టుకొని రెండవసారి రిమాండు పొడిగింపు కోసం కోర్టులో హాజరుపెట్టినప్పుడు కోర్టుకు ఫిర్యాదు చేయవచ్చు. ప్రస్తుత చట్టసవరణ ప్రకారం ముద్దాయిని రిమాండులో ఉన్న కాలంలో ఎప్పుడయినా పోలీస్ కస్టడీకి ఇయ్యవచ్చు. ఎన్నిసార్లయినా ఇయ్యవచ్చు. దీనివల్ల ఇక ముద్దాయి చిత్రహింసల గురించి కోర్టులో ధైర్యంగా ఫిర్యాదు చేయడు. ఎందుకంటే మళ్ళీ ఎప్పుడయినా అతనిని పోలీస్ కస్టడీకి పంపించవచ్చును కాబట్టి. పోనీ రిమాండు త్వరగా అయిపోతుందా అంటే అదేం లేదు. చార్జిషీటు 180 రోజుల దాకా దాఖలు చేయనక్కరలేదు. బెయిలంటారా ముద్దాయి నిర్దోషి అని కోర్టు భావిస్తే తప్ప బెయిలు ఇవ్వడానికి వీలు లేదు. ముద్దాయి దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన విదేశీయుడయితే అప్పుడసలే ఇవ్వడానికి వీలులేదు – ఏమైనా ప్రత్యేక పరిస్థితులు ఉంటే తప్ప. ముంబాయి దాడిలో పట్టుబడ్డ మహ్మద్ అజ్మల్ కసబ్‌ను తలచుకొని 'అతనికి బెయిల్ రాకపోతే ఏమిలే' అనొద్దు. ఇది అతనికే కాదు, 2007లో హైదరాబాద్‌లోని టప్పాచబుత్రాలో అరెస్టయిన స్కూల్ బ్యాగులు కుట్టి అమ్ముకొని బతికే బంగ్లాదేశీలకూ వర్తిస్తుంది. వాళ్ళనప్పుడు సాధారణ చట్టాల కింద అరెస్టు చేశారు కాబట్టి వారికి కొంత కాలానికి బెయిలు దొరికింది. ఈ చట్ట సవరణలు ఉండి ఉంటే వారికిప్పటికీ బెయిలు దొరికి ఉండేది కాదు. వారి పిల్లలు కార్వాన్ వీధుల్లో అడుక్కుంటుండేవారు.

ఇవి చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (యు.ఎ.పి.ఎ – 'ఉపా')లో కొత్తగా వచ్చిన సవరణలు. కొత్తగా చేసిన చట్టం పేరు జాతీయ నేరపరిశోధక సంస్థ చట్టం. టెర్రరిస్టు నేరాలు ఒక రాష్ట్రానికి పరిమితమైనవి కావు కాబట్టి వాటి పరిశోధనకు కేంద్ర ప్రభుత్వ సంస్థను నెలకొల్పడం ఈ చట్టం ఉద్దేశ్యం అని చెప్పారు. ఇది ఎవరికైనా హేతుబద్ధంగానే తోస్తుంది. అయితే ఒక కొత్త పోలీసు వ్యవస్థను ఉనికిలోకి తెస్తూ ఆ పోలీసు వ్యవస్థ పరిశోధించే నేరాల విచారణ ఏ విధంగా జరగాలన్న నియమాలను కూడ అదే చట్టంలో చేర్చడం ఏమిటి? పోలీసు చట్టంలోనే నేర విచారణ విధానాన్ని

నిర్దేశించడం కొత్త ప్రయోగం. ఇదివరకెప్పుడూ జరగలేదు. విమర్శకుల దృష్టి 'ఉపా'లోని సవరణలపైనే ఉంటుందనీ, ఈ చట్టం మీదికి రాదనీ అనుకున్నారేమో తెలీదు. లేదా ఈ కొత్త పోలీసు యంత్రాంగం పరిశోధించేది కేవలం టెర్రరిస్టు నేరాలనే కాదు కాబట్టి ఈ పద్ధతిలో నేర విచారణ ప్రక్రియ పతనాన్ని మరింత విస్తృతం చేయవచ్చునని భావించారేమో తెలీదు. దీని సారాంశం ఏమిటంటే నేర విచారణ ప్రక్రియ బహిరంగంగా జరగాలి, ముద్దాయి సమక్షంలో జరగాలి అన్న సహజ న్యాయసూత్రాన్ని విడనాడి, బయటి ప్రపంచం నుంచే కాదు, కొంతమేరకు ముద్దాయి నుంచి కూడ దానిని రహస్యంగా ఉంచే విధానాన్ని ప్రవేశపెట్టడం. ఇవి మన భద్రతను పెంచుతాయా? నేరాలను అరికట్టడంలో పోలీసుల సామర్థ్యాన్ని పెంచుతాయా? అంటే అదేమీ లేదనేది స్పష్టమే. నేరం చేశారో లేదో స్పష్టంగా రుజువు కాని వ్యక్తులకు గుట్టుచప్పుడు కాకుండా శిక్ష వేసేసి కేసులు మూసేయడం మాత్రం జరుగుతుంది. మళ్ళీ ఇంకొక మారణకాండ జరిగిననాడు ఇది ఏపాటి భద్రత కల్పించిందో అర్థం అవుతుంది.

మరేం చేయాలి అని ఆవేశపడనవసరం లేదు. టెర్రరిజానికి సంబంధించిన చర్చ యావత్తూ చట్టాల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగినంత కాలం కఠినమైన చట్టాలు కాక వేరే ఏం పరిష్కారముందనే అనిపిస్తుంది. కాని నేరాలు చట్టం లేమి నుంచి పుట్టలేదు, చట్టం ఉనికి వల్ల ఆగిపోవు. దానికి కావలసింది వేరే కృషి. మొదట టెర్రరిజం అనే దానిలో ఉన్మాదం తప్ప వేరే ఏమీ లేదనే వెర్రి విడనాడాలి. అమాయకులను హతమార్చడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని ఎంత నిస్సంకోచంగా అందరం అంటున్నామో, అంతే స్పష్టంగా పరిష్కారం దొరకని సమస్యలు, పరిహారం దొరకని అన్యాయం సమాజంలో చాలా వుందని గుర్తించడం అవసరం. ఆ గుర్తింపును బహిరంగంగా ప్రకటించి, అయినప్పటికీ విచ్చలవిడి హింసాకాండ వైపు పోవద్దని బాధితులకు పిలుపునివ్వడం అవసరం. కాని ఈ బాధ్యతను సమాజం నిర్వర్తించడానికి సిద్ధంగా ఉందా? ఒక్క ముస్లిం మత పెద్దలు మాత్రం ఇటీవల తమ బాధ్యతను గుర్తించారు. గడచిన సంవత్సర కాలంలో రెండు మూడుసార్లు పెద్ద స్థాయిలో సదస్సులు నిర్వహించి ఇస్లాం పేరు మీద జరుగుతున్న హింస ఇస్లాంకు వ్యతిరేకమని తీర్మానాలు చేశారు. విలేఖరులడిగితే మొహమాటానికి ఖండించడం కాదు, తామే సదస్సులు నిర్వహించి ఆ పని చేశారు. కాగా హిందువుల ప్రతినిధులుగా తమను తాము చెప్పుకొనే

ఏ శంకరాచార్యుల వారూ గుజరాత్ మారణకాండ గురించి గానీ, ఈ మధ్య ఒరిస్సాలో, కర్ణాటకలో జరిగిన మారణకాండ గురించి గానీ అన్యాయం అనగా మనం వినలేదు. అనకపోగా ఈ స్వాములు కొందరు ఆ మారణకాండలను నిర్వహించిన విశ్వహిందూ పరిషత్, తదితర సంఘ్‌పరివార్ సంస్థల వేదికలెక్కి మాట్లాడుతుంటారు. అయితే స్వాములూ, ఉలేమాలే కాదు, అందరం స్పందించాలి. కేవలం మత హింస గురించే కాదు, అన్ని రకాల సంఘటిత హింసాకాండలోనూ దాని సామాజిక స్వభావాన్ని నిర్మొహమాటంగా గుర్తించడం, అందులో అన్యాయం ఉంటే దాని పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునివ్వడం, దానితోపాటు ఎవ్వరూ విచ్చలవిడి హింసాకాండకు పాల్పడవద్దని వారించడం అవసరం. ఇది చాటుమాటున కాదు, బహిరంగంగా జరగాలి. ఒక కార్యక్రమంగా జరగాలి. అప్పుడు నేరస్మృతిని వికృతంగా తయారుచేసే ప్రయోగాల అవసరం లేకుండా సమస్యను పరిష్కరించుకోగలుగుతాం.

*ఆంధ్రజ్యోతి దినపత్రిక*

***28 జనవరి 2009***

## మానవహక్కుల వేదిక ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1 | శివమెత్తిన సేన | జనవరి 1999 |
| 2 | ఎండమావి 2020 | మే 1999 |
| 3 | మానవ హక్కులు–1999 (బులెటిన్ –1) | నవంబర్ 1999 |
| 4 | మానవ హక్కులు–2000 (బులెటిన్ –2) | జూన్ 2000 |
| 5 | మానవ హక్కులు–2001 (బులెటిన్ –3) | మార్చి 2001 |
| 6 | యుద్ధ సత్యాలు (బులెటిన్–4) | నవంబర్ 2001 |
| 7 | మానవ హక్కులు–2002 (బులెటిన్ –5) | ఏప్రిల్ 2002 |
| 8 | గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం | జూన్ 2002 |
| 9 | ఎవరిదీ అడవి? | ఫిబ్రవరి 2003 |
| 10 | మానవ హక్కులు–2004 (బులెటిన్ –6) | ఫిబ్రవరి 2004 |
| 11 | మణిపూర్ : ఎందుకింత ఆగ్రహం | డిసెంబర్ 2004 |
| 12 | ఆరుగాలం కరువు | మే 2005 |
| 13 | మానవ హక్కులు–2005 (బులెటిన్ –7) | మే 2005 |
| 14 | Death, Displacement & Deprivation: The War in Dantewara: A Report | డిసెంబర్ 2006 |
| 15 | మానవ హక్కులు–2007 (బులెటిన్ –8) | మే 2007 |
| 16 | ఆదివాసీ సమాజంలో అంతర్యుద్ధం | మే 2007 |
| 17 | మానవ హక్కులు–2008 (బులెటిన్ –9) | డిసెంబర్ 2008 |
| 18 | Kashmir: Will The Pain Never End? | డిసెంబర్ 2008 |
| 19 | మానవ హక్కులు–2009 (బులెటిన్ –10) | జూన్ 2009 |
| 20 | సచార్ చెప్పిన సత్యాలు | జూలై 2009 |
| 21 | కంధమాల్ నుండి కరావళి దాకా: ప్రజాస్వామ్యం పైన సంఘ్ పరివార్ దాడి | అక్టోబర్ 2009 |
| 22 | హక్కుల ఉద్యమం–తాత్విక దృక్పథం, కె.బాలగోపాల్ | అక్టోబర్, 2010 |
| 23 | మా బాలగోపాల్ (బులెటిన్ –11) | అక్టోబర్ 2010 |
| 24 | మానవ హక్కులు–2011 (బులెటిన్ –12) | అక్టోబర్ 2011 |

25 హక్కుల బాటసారి : బుర్ర రాములు రచనలు అక్టోబర్ 2011
26 ఆ శిక్షే ఒక నేరం, కె.బాలగోపాల్ ఏప్రిల్,2012
27 Of capital and other punishments, K. Balagopal అక్టోబర్, 2012
28 The Terrible Cost of an Inhuman
Counter-Insurgency అక్టోబర్ 2013
29 మానవ హక్కులు–2013 (బులెటిన్ –13) అక్టోబర్ 2013
30 ముస్లిం ఐడెంటిటీ–హిందూత్వ రాజకీయాలు, కె.బాలగోపాల్ 6 డిసెంబర్ 2013
31 చుండూరు: ఒక మారణకాండ తరువాత అక్టోబర్ 2014
32 Tsunduru: An Atrocity and Its aftermath అక్టోబర్ 2014
33 నక్సలిజంపై రాజ్యం అణచివేత :
మూల్యం చెల్లిస్తున్న ఆదివాసులు అక్టోబర్ 2014
34 పాలస్తీనా ప్రజాపోరాటం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2014
35 ఆదివాసులు:ఛత్తీస్‌గఢ్, కంధమాల్ పై వ్యాసాలు, నివేదికలు
కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
36 అభివృద్ధి–విధ్వంసం: భూమి, భావజాలం, కోర్టులు,
కోస్టల్ కారిడార్, కె.బాలగోపాల్ అక్టోబర్ 2015
37 విస్థాపన–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2016
38 మానవ హక్కులు–2015 (బులెటిన్ –14) అక్టోబర్ 2015
39 విశాఖకు 7వ నెంబరు కాలుష్య హెచ్చరిక అక్టోబర్ 2016
41 సరళీకరణ–విధ్వంసం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
40 ఎన్నికలు–ప్రజాస్వామ్యం, కె.బాలగోపాల్ అక్టోబర్ 2017
42 మానవ హక్కులు–2017 ( బులెటిన్–15) అక్టోబర్ 2017
43 అణుశక్తి–విధ్వంసం, కె.బాలగోపాల్ సెప్టెంబర్ 2018
44 హిందూ మత జాతీయవాద రాజకీయాలు,
జి.శివ నాగేశ్వరరావు సెప్టెంబర్ 2018
45 కరువు – వ్యవసాయ సంబంధాలు, కె.బాలగోపాల్ అక్టోబర్ 2018
46. విజన్ – విధ్వంసం, కె. బాలగోపాల్ అక్టోబర్ 2019

అణచివేత - అణచివేత చట్టాలు



"ప్రతి సమాజంలోనూ ఒక ప్రధాన స్రవంతి ఉంటుంది. దానిని వర్గం, కులం, జెండర్, మతం, జాతి, భాష మొదలయినవి నిర్వచిస్తాయి. ఆ సమాజ భావజాలంలో అదే 'సమాజం'గా చలామణీ అవుతుంది. ఆ ప్రధాన స్రవంతి వల్ల జరిగే హింస ఆ భావజాలంలో దుస్సహమైనదిగా కనిపించదు. అవాంఛనీయమైనదిగా కనిపించవచ్చు గాక! కాని ఆ హింస 'సమాజం'తో సమానార్థకమైన ప్రధాన స్రవంతికి నష్టం కలిగించదు. నష్టం కలిగించకపోగా దానికి మరింత బలం చేకూర్చవచ్చును కూడ. కానీ ప్రధాన స్రవంతికి ఏదో ఒక కోణం నుండి వ్యతిరేకంగా జరిగే హింస 'సమాజాన్ని' కుదిపేస్తుంది కాబట్టి అది మాత్రం సహించరానిదిగా కనిపిస్తుంది. ఒక హింస ఒకే మోతాదులో ఒకే పద్ధతిలో ప్రయోగించబడినా అది ప్రధాన స్రవంతికి లోపల ఉందా, వెలుపల ఉందా అనేదాన్ని బట్టి మన కళ్ళకు వేరుగా కనిపిస్తుంది.

ఇదంతా ఆ హింసను సమర్థించడం కోసం అంటున్నది కాదు. హింస ఏ మూలం నుండి పుట్టినా దాని వల్ల అనేక హక్కుల సమస్యలు వస్తాయి. ఆ విషయం గుర్తించడానికి నిరాకరించే హక్కుల దృక్పథం హక్కుల దృక్పథమే కాదు. అయితే హింసాకాండను అర్థం చేసుకునేటప్పుడు ప్రధాన స్రవంతి భావజాలంలో పడి కొట్టుకుపోకుండా ఉండడం అవసరం. ఇప్పటిదాకా టెర్రరిజానికి ఉండే నిర్వచనం ఆ భావజాలంతో సన్నిహితంగా ముడిపడి ఉందని లా కమిషన్ గుర్తించలేకపోవడం బాధాకరమే కాక హక్కులకు చాలా నష్టకరం కూడ. అందుకే లా కమిషన్‌కు దావూద్ ఇబ్రహీం కనిపిస్తాడు గానీ బాల్‌థాకరే కనిపించడు, అల్‌ఉమ్మా కనిపిస్తుంది గానీ హిందు మున్నాని కనిపించదు. బొంబాయి స్టాక్ ఎక్స్‌ఛేంజి బిల్డింగ్ పేల్చివేత కనిపిస్తుంది గానీ బాబ్రీమసీదు కూల్చివేత కనిపించదు."

■

